౮

# అడివి బాపిరాజు రచనలు -7



# నరుడు ◆ జాజిమల్లి

## సాంఘిక నవలలు

Blank Page

# అడివి బాపిరాజు రచనలు

## 7

# నరుడు ♦ జాజిమల్లి

• సాంఘిక నవలలు •

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 01.

*ADIVI BAPI RAJU RACHANALU vol - 7*
**NARUDU, JAJIMALLI *(Social Novels)***

ప్రచురణ నెం. : 2350/252

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2010

© కె. బాపిరాజు

**వెల : రూ. 100**

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,**
విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : 24744580/24735905
**E-mail : visalaandhraph@yahoo.com,**
www.visalandra.vcomnet.co.in

**విశాలాంధ్ర బుక్ హౌస్,**
అబిడ్స్ & సుల్తాన్ బజార్ - హైదరాబాదు, విజయవాడ,
అనంతపురం, విశాఖపట్నం, హన్మకొండ, గుంటూరు,
తిరుపతి, కాకినాడ, కరీంనగర్, ఒంగోలు, శ్రీకాకుళం.

**హెచ్చరిక:** ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంతగానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణకర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా, కాపీరైట్ చట్టరీత్యా నేరం. - **ప్రచురణకర్తలు**

ముద్రణ : **శ్రీ కళాంజలి గ్రాఫిక్స్**, హైదరాబాద్

# నరుడు

• సాంఘిక నవల •

# అంకితము

ప్రియ మిత్రుడు

ఉత్తమ పురుషుడు

## శ్రీ చెన్నాప్రగడ వెంకట సుబ్బారావు

# నరుడు

• సాంఘిక నవల •

## మొదటి భాగం

ఆ యువకుడు అలా ఎన్నిసార్లు కుళ్ళిపోయాడో చిన్నతనాన్నుంచీ అనంతమయిన ఆవేదనలతోనే అతని జీవితము ప్రవహించి వచ్చింది. వాళ్ళ ఊరి పురోహితుడు గారు "చదవడం మంచిదేరా ఎల్లమందా! కానీ నీ కులం సంగతి మరిచిపోకు," అన్నారు.

ఆ పురోహితుడు సుబ్రహ్మణ్యం అవధానులుగారి దగ్గర వాళ్ళ తండ్రి పాలేరు. ఆ కుటుంబానికీ, ఈ కుటుంబానికీ ఎన్ని తరాలనుంచి సంబంధం ఉందో!

చంద్రయ్య మాదిగ కొడుకును చదువుకు పంపించాడు. చదువుకుందామని ఎల్లమందకు బుద్ధి కలగనేలేదు. చంద్రయ్యకూ కొడుకుకు చదువు చెప్పించాలని ఉద్దేశం మొదటలేదు.

చంద్రయ్య సాధారణ మాదిగకులం మనుష్యుడే అయినా అవధానులుగారి వేదాంత వాక్యాలు ఎప్పుడూ వింటూ ఉండేవాడు. ఉత్తమ వాక్యాలు వినగా వినగా రాయికన్నా సంస్కారం కలుగుతుంది. అవధానులుగారు అసలు వేదాంతం చంద్రిగాడికి చెప్పాడా? ఆయనకు వేదాంతం మాట్లాడడం అలవాటు. అవి ఆచరణలో పెడదామన్న భావానికీ, వేదాంత వాక్యాలు అంటూ ఉండడానికీ సంబంధం ఏమిటి? అవసరం వచ్చినప్పుడు ఏవో ముక్కలు అంటాం. అంతే వాని ఉపయోగం.

అయినా చంద్రయ్య మనస్సు నీటిని కోరే భూమిలా ఉన్నది. ఒక్క చుక్క నీరు పడినా, ఆ నేల ఆ చుక్కను పీల్చి దాచుకుంటూ ఉంది. అవధాన్లుగారు తెల్లవారగట్ల లేచి స్నానాదికాలు నిర్వర్తించి, సంధ్యావందనం పూర్తిచేసుకొని, పెద్ద గొంతుకలో ప్రాతస్మరామి శ్లోకాలు చదువుకుంటూ పనులు చేసుకుంటూ ఉండేవాడు. చంద్రయ్యకు ఆ శ్లోకాలన్నీ కంఠతా వచ్చాయి.

ఇంటికి వచ్చిన వారితో, అవసరమున్న వారితో, అవసరం లేనివారితో, పొలానికి వచ్చినప్పుడు పాలేళ్ళతో, పక్క పొలం కమ్మవారి వెంకటరెడ్డితో వేదాంతం మాట్లాడుతూనే ఉంటారు అవధాన్లుగారు.

"సంసారం సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త!"

"విద్య యొసగును వినయంబు! వినయమునను బడయుఁ బాత్రత!"

"జీవితం ఒక స్వప్నం వంటిదయ్యా!"

"జ్ఞానం లేని మనుష్యుడు పశువుతో సమానం!"

ఈలాంటి రత్నాలు అవధాన్లుగారి నోట ఎన్ని వస్తూ ఉండేవో! ఇవన్నీ మాదిగ చంద్రయ్య జీవితంలో అంకితమయిపోయాయి.

అందుకునే చంద్రయ్య కొడుకును ఊళ్ళో ఉన్న కిరస్తానీ బడికి పంపాడు. కిరస్తానీ బడుల ముఖ్యోద్దేశము కిరస్తానీ మతాన్ని కన్నీరుగా లోకంపై చల్లడమే. ఏది ఉద్దేశమయితేనేమి విద్య ఏదో రకంగా ప్రవహిస్తోంది. ఆ ప్రవాహం నీరు స్పష్టమయిన జలం కానేకాదు. ఏ పాఠశాలలో నయినా నిర్మల విద్యానీరాలు ప్రవహిస్తున్నాయి గనుకనా! స్థానిక ప్రభుత్వ సంస్థలు నెలకొల్పిన ప్రాథమిక పాఠశాలలోనూ అంతే, వీధులలోనూ అంతే!

పిపాసార్తునకు ఏజలమయినా అమృతమే! చదువుకుందామని బాలబాలికలకు ఉండనిమాట నిజమే! కాని వారి జీవితాలు వారికి తెలియకుండానే చదువుకోసం చేతులు చాచి ఉంటాయి. బడులకు పోయే బాలబాలికలు పాఠశాలలంటే కారాగృహాలన్నట్లు బెదిరిపోతారు. అయినా వారి మెదడులు ప్రతి జ్ఞాన లేశాన్నీ దాచుకుంటూనే ఉంటాయి.

మన ఎల్లమంద కిరస్తానీ పాఠశాలకు చిన్న మేకపిల్లలా వెళ్ళేవాడు. రోజురోజూ వాణ్ణి వాళ్ళమ్మ బడికి పంపించడం గండంగా ఉండేది. సోమమ్మకు ఎందుకు ఈ చదువో అర్థంకాలేదు. "సతుకులు సతికి ఎదవనాయాళ్ళూ కిరస్తానం అయిపోతారు." అని ఆమె గోల. అందులో కుర్రవాణ్ణి పంపే బడి కిరస్తానీ బడి.

"కిరస్తానం అయితే ఏంటే!" అని క్రిష్టియన్ టీచరు గ్రేసమ్మ దెబ్బలాడేది. గ్రేసమ్మకు సోమమ్మకు హోరా హోరీ వాదన!

"మీరు పశువుల్లోంటి వోళ్లు! సచ్చిన గొడ్డుమాంసం తినే రాబందులు!"

"ఓసి! ఏడిశావులే! బ్రతికినదాని పేనం కసుక్కున నరికేసి తినే నక్కలు కారేంటి మీరు?"

ఎలాగయితే నేమి, ఎల్లమంద పాఠశాలలో చదువుతున్నాడు. ఆ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు నలుగురు. ప్రధానోపాధ్యాయుడు జీవానందం కరుణార్ద్ర హృదయుడు. నిజమయిన క్రిష్టియన్ మూర్తి. దయాంతఃకరణ ప్రవృత్తితో తన తోటి ఉపాధ్యాయులను, విద్యార్థులను తన బిడ్డలుగా చూచుకుంటాడు. అతడు క్రైస్తవగాథలు, బోధలు మహాభక్తుడై పులకలూరిపోతూ చెబుతాడు. అతడొక్కడే వేల కొలది మాలమాదిగలు అనబడే కులాల వారికి క్రైస్తవ మతదీక్ష ఇచ్చాడు. ఆయన ధర్మంలో ఎవరికీ బలవంతంగా మతదీక్ష ఇవ్వకూడదనీ, తిరిగి హిందూ మతంలోకి వెళ్ళదలచుకొన్న వారికి అడ్డం పెట్టకూడదనీ!

చదువుకు కులం తేడాలు లేవు దారిలోపడితే ఆ చదువుల తల్లి అందరినీ సమాన ప్రేమతోనే చూస్తుంది. అసలు చదువువచ్చే ఘటం వేరు. కొందరు చదువుకుంటే వచ్చితీరే వారున్నారు. కొందరికి చదువుకుంటే, కష్టపడితే చదువు వస్తుంది. కొందరు కష్టపడి చదవకపోయినా ఆ మాయ చదువు ఎలా వస్తుందో వస్తుంది. కొందరు కష్టపడినా చదువు వస్తే వస్తుంది, రాకపోతే రాకపోవనూ వచ్చును. కాని కొందరు చదివేది, కుంభకోణ యోగం చేసేది, పుస్తకాల కంఠతా పట్టేది, చదువు చిరుదూరం దగ్గిరకన్నా రాదు.

ఎల్లమంద కష్టపడితే చదువు వచ్చే జాతివాడు. అలా కష్టపడుతున్నాడు, చదువు వస్తోంది.

వాళ్ళ ఊరయిన భీమవరం తాలూకా జక్కరం గ్రామం వదిలి భీమవరం మిషన్ హైస్కూలుకు వచ్చి చేరాడు. అక్కడ కొందరుపాధ్యాయులయిన క్రైస్తవమత ప్రచారకులున్నారు. వారు క్రైస్తవులు. కాని మాల మాదిగ కులాలవారు ఎలా చదువుతారు? వారికి చదువెందుకు? అని వాదించుకుంటూ ఉంటారు. కాని ప్రధానాచార్యులవారు మాత్రం "ఎవరయితేనేమి, ఇదివరకు చదువెరుగని కులాల వారందరూ చదువుకొనడం దేశాభ్యుదయ సూచన." అని ఆనందం పడతారు.

ఎల్లమందను ప్రధానోపాధ్యాయులు అతి ప్రేమతో చూచి, అతనికి జిల్లా మునసబుగారు మొదలయిన వారిచేత సహాయం చేయించేవారు.

ఆ ఊళ్ళో ఉన్న బ్రహ్మసమాజంవారు, సత్సంగులు, కాంగ్రెసువారు ఎల్లమందకు ఎన్నో విధాల సహాయం చేశారు. ఆరేళ్ళు కష్టపడి చక్కని మార్కులు సంపాదించుకొని ఎల్లమంద 1930 సంవత్సరంలో స్కూలుఫైనలు పరీక్ష నెగ్గినాడు.

అంతవరకు ఎల్లమందకు ఏమీ విచారంలేదు. రోజూ జక్కరం నుంచి నడిచి వచ్చేవాడు. సాయంకాలం నడిచే జక్కరం మాదిగగూడెం వెళ్ళిపోయేవాడు. తన గూడెంలో తానే చదువుకొనేవాడు.

అలా చదివి, చదివి, చివరకు తన పదునెనిమిదవ ఏటనే ఎల్లమంద స్కూలుఫైనలు నెగ్గినాడు. తనవాడలో తానే చదువుకొనేవాడు. క్రైస్తవులలో ముగ్గురో నలుగురో చదువుకొనే బాలురూ, అయిదుగురో ఆరుగురో బాలికలూ ఉండేవారు.

ఆ బాలురూ, బాలికలూ మాల క్రైస్తవులు, మాదిగ క్రైస్తవులూ, కులాలు లేని మతమయినా - క్రైస్తవమతంలో కులాలు, జాతులు, రంగుల తేడాలు ఉన్నాయి. ఆ తేడాలేవీ ఎల్లమంద కంతగా తెలవవు. అతడు కష్టపడేవాడు, చదువుకునేవాడు.

ఒకరు బట్టలు కొని యిచ్చేవారు. ఒకరు హరికేన్ లాంతరు కొని ఇచ్చారు. చందాలవల్ల పుస్తకాలు వచ్చేయి. సగం జీతం. చందాల డబ్బు తండ్రి సంపాదనకు చన్నీళ్ళు వేన్నీళ్ళు కాగా, ఇంటిల్లపాదీ కొంచెం మంచిగుడ్డలు కట్టుకొని. కొంచెం శుభ్రమయిన తిండి తినగలుగుతున్నారు.

ఎల్లమందకు మంచి మార్కులు రావడంవల్ల రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ఇంటరు తరగతిలో సీటు దొరికింది. విద్యార్థి వేతనమూ దొరికింది.

కళాశాల విద్య ప్రారంభించిన నాటనుండీ ఎల్లమందకు వేదన ప్రారంభించింది.

ఎల్లమంద అన్న పేరును అనేకులు విద్యార్థులు హేళన చేశేవారు.

"ఎక్కడిదిరా ఈ మంద?" "ఎల్లాం మందాం?" "ఏలరా ఈ మందా! చాలురా ఈ కందా!" ఈలా ఈలా అంటూ కొందరు విద్యార్థులు అతణ్ణి వేళాకోళాలు చేసేవారు.

అవి అంత అనిపించలేదు!

కాని ఒక బాలుడు ఒక రోజున, మీరే వర్ణస్థులండీ అని అడిగాడు.

"మేము మాదిగలం!" అని ఎల్లమంద జవాబు.

"మాదిగలా? అంటే, మాలవాళ్ళు కారూ? మాదిగలే!" అని ఆ బాలకుడు, కొంచెం దూరంగా జరిగాడు.

ఎల్లమంద హృదయం కుంగిపోయింది.

## (2)

ఎల్లమంద రాజమండ్రి కాలేజీలో చేరిన అయిదు నెలల వరకు, ఒకరితో మాట్లాడలేదు. తన చదువేదో, తన కాలేజీ ఏదో! అతనికి అసలు ఉండడానికి స్థలం ఏది అన్న సమస్య ఆ బాలునికీ వచ్చింది. ఆ బాలుని చేర్పించడానికి వచ్చిన ఒక కాంగ్రెసు పెద్దకూ వచ్చింది.

ఉండేందుకు గది, భోజనానికి వసతి, ఈ రెండూ పెద్ద సమస్యలయినవి. డబ్బుకు చూడకుండా ఆ బాలకుణ్ణి హాస్టలులో ప్రవేశపెట్టినాడా పెద్ద మనుష్యుడు.

హాస్టలులో ఈ బాలునికి ఒక విడి గది ఏర్పాటు చేశారు. హాస్టలులో విడిగదులూ ఉన్నాయి, ఇద్దరు ముగ్గురు ఉండే గదులూ ఉన్నాయి.

ఎల్లమందకు తానొక్కడే ప్రపంచంలో ఒంటిగా ఉన్నట్లనిపించింది. బ్రాహ్మణ బాలురు, బ్రాహ్మణేతర బాలురు, క్రైస్తవ బాలురు అందరూ ఈతణ్ణి ఒంటిగా వదిలినారు. అతడు అందుకు తగినట్లు ఒంటరితనమే అలవాటు చేసుకున్నాడు.

కాని అతని ఒంటరితనానికి భంగం ఇంటరులో చేరిన ఆరు నెలలకు వచ్చింది. భీమవరం హైస్కూలులో ఎల్లమంద ఫుట్‌బాల్ ఆటలో గండరగండడు. అతడు ఎడమవైపు ఫార్వర్డు. ఎడమ కాలితో అతడు తన్నితే బంతి ఒక టన్ను బాంబులా వచ్చి గోలులోనో, గోలు దగ్గిరో పడుతుంది. కండ పుష్టి, బలంగల బాలుడవడం చేత ఏమీ అలసట లేకుండా ఎన్ని గంటలయినా సునాయాసంగా పరుగెత్తుతాడు. పరుగు పందెంలోనూ, ఎల్లమంద పిట్టపిడుగు. ఎల్లమందకు కాలిబంతి తన్నడంలోనూ, పరుగు పందేలలోను, కాలిబంతి ఆటలలోనూ రెండు డజన్లపైగా బహుమతులు వచ్చాయి. కప్పులు, షీల్డులు, మెడల్సు, అతని దేవదారు చెక్క పెట్టెనిండా ఉన్నాయి.

ఎల్లమంద వాటిని పూజిస్తాడు. ఎందుకంటే వాటివల్లనే ఇతర బాలురు తన దగ్గిర మూగుతారు. తన్ను గౌరవం చేస్తారు. కాలేజీ ఆటల ఉపాధ్యాయుడు, ఎల్లమందను ఏమి ఆటలలోనూ పాల్గొనటం లేదేమని అడిగినాడు. ఆ ఉపాధ్యాయుడు ఆరు నెలల వరకూ ఎల్లమందను ఆ ప్రశ్నే వేయకపోవడానికి కారణం అతడు మాదిగ కులస్థుడని తెలవడమే!

అయినా తన విద్యుక్తధర్మం కాబట్టి ఆరు నెలలకన్నా అడక్క తప్పింది కాదు. అదయినా ఏదో అడిగేసి నాకేమీ రావని అతనిచేత అనిపించుకొని, ఏ కసరత్తు తరగతిలోనో పేరు చేర్చి వదిలివేద్దామని ఆ ఉపాధ్యాయుని ఉద్దేశం.

ఆ ఉద్దేశం ఎల్లమంద గ్రహించాడు. ఎప్పుడూ ఎవ్వరి జోలికీ, సొంఠికీ వెళ్ళని ఎల్లమందకు ఆ ఉపాధ్యాయుణ్ణి ఏడిపించాలని కయ్యాళి బుద్ధి పుట్టింది.

**ఎల్ల:** నేను ఫుట్‌బాల్ ఆడతానండి. భీమవరం హైస్కూలు "బెల్సు" కప్పు పట్టుకువచ్చిన జట్టులో నేనున్నానండి.

**ఉపా:** ఏమిటీ! నువ్వు ఫుట్‌బాల్ ఆడతావా! నాకు తెలియదే?

**ఎల్ల:** ఇవి చూస్తారా అండీ? (అతడు తన దేవదారు చెక్క పెట్టెలోనుంచి తన కప్పులు, మెడల్సు, షీల్డులు తీసి చూపించాడు.)

**ఉపా:** ఇ-ఇ-ఇ-ఇవన్నీ ఏ-ఏమిటి?

ఆ ఉపాధ్యాయుడు అన్నీ చూచాడు. ఇవి పరుగుపందేలవి; ఇవి ఒక మైలు పందెంవి; ఇవి అరమైలు పందెంవి; ఇది నాలుగు వందల గజాలు; ఇది వంద గజాలువి; ఇవి కాలిబంతి తన్నినందుకు. ఇవి కాలిబంతి ఆటకు; అంటూ. అవన్నీ తెల్లబోతూ చూచాడు; అతని కళ్ళు చెదరిపోయాయి. ఆ ఉపాధ్యాయుని హృదయంలో ఉడుకుబోతుతనం కూడా వచ్చింది.

అయినా ఏదో మహానిధిని తాను కనిపెట్టినట్లు ఉప్పొంగిపోయాడు. ఈ మాదిగ కుర్రవానికి ఇవన్నీ రావడం ఏమిటి? ఇవన్నీ తనకే వచ్చి ఉండాలి అని భావించుకొన్నాడు. ఈ రహస్యం ఎవరికీ చెప్పకుండా తాను గమ్మత్తు చేయాలనుకున్నాడు.

ఇంకో వారం రోజులలో ఫుట్‌బాల్ పందెం ఒకటి ఉంది. కాలేజిలో "ఏ" జట్టువారికీ "బి" జట్టు వారికీ ఆ పందెం. చూచి చూచి ఆటల ఉపాధ్యాయుడు ఎల్లమందను "ఏ" జట్టులో వేయలేకపోయాడు. అతణ్ణి "బి" జట్టు పేరులలో చేర్చినట్లున్ను ఎవరికీ తెలియ చేయలేదు. అమలాపురం హైస్కూలు నుంచి వచ్చిన ఒక బాలకుణ్ణి "ఏ" జట్టులో ఎడమ ఫార్వర్డుగా వేసినాడు.

రెండు జట్టులలో ఉన్నవారు చాలమంది - నిరుటి వారే అయినా కొంతమంది కొత్త వారున్నారు. ఇతర కాలేజీలలోంచి వచ్చి. బి.ఏ.లో, బి.ఎస్‌సి.లో చేరిన బాలురను కొంతమందిని రెండు జట్టులలో చేర్చినాడు. వారున్నూ ఇదివరకున్న వారున్నూ రోజూ కాలిబంతి ఆట ఆడుతూ ఉండటం చేత ఒకరి కొకరికి బాగా ఎరుక అయింది. స్నేహాలు కుదిరినాయి.

కాని ఎల్లమంద ఆడతాడని ఎవరికీ తెలియదు. అతనికి అన్ని బహుమానాలు వచ్చాయనిగాని, మంచి పరుగు పందెం వాడనిగాని ఎవ్వరికీ తెలియదు.

వారం రోజులు గడచినవి. ఆటరోజు వచ్చింది. ఆఖరి క్షణంలో ఎల్లమందకు జూనియర్ జట్టువేషం వేసి, ఆ ఆటల ఉపాధ్యాయుడు తీసుకువచ్చి శ్రేణిలో నిలుచుండబెట్టాడు.

"ఇదేమిటి ఈ జంతువును తీసుకువచ్చాడు? ఈ పక్షీంద్రుడు వచ్చాడేమిటి? ఈ మగ గేదిగారు రంగస్థలంలోకి దిగాడేమిటిరా?"

"మన మాష్టారుగారికి మతిపోయింది. రోయ్!" ఈలా ఈలా గుసగుసలు ఇకిలింపులు.

ఆట ప్రారంభం అయింది. ఎల్లమందకు బంతిని అందివ్వ లేదు తక్కిన ఆటగాళ్ళు. తక్కిన నలుగురు ఫార్వర్డులే ఒకరికొకరు అందించుకోవడమూ, వారే బంతి తీసుకువెళ్ళడం, సీనియర్ జట్టు వాళ్ళలో హాఫ్‌కాక్‌లు నిముషంలో వారి దగ్గిరనుండి బంతి తప్పించడం, తమ ఫార్వర్డులకు అందివ్వడం అది వారు గద్దలులా ఎగతన్నుకుపోవడం, అక్కడ జూనియర్ జట్టువారి బాక్‌లు హాఫ్‌బాక్‌లు ఆ బంతిని వెనక్కు నెట్టివెయ్యాలని విశ్వప్రయత్నం చేయడం, వారికి జూనియర్ జట్టు ఫార్వర్డులు కూడా వెనక్కుపోయి సహాయం చేయడం, చావు తప్పి కన్ను లొట్టపోయి ఎల్లాగయితేనేం బంతిని వెనక్కు నెట్టడం ఈలా జరుగుతోంది నాటకం.

బంతి మొదటి అరగంటా జూనియర్ జట్టు గోలు దగ్గిరే ఉంది. సీనియర్ వాళ్ళు నాలుగు గోలులు చేశారు జూనియర్ గోలు కీపరు దిట్టమయిన వాడవడంవల్ల గాని లేకపోతే ఏ డజను గోలులో అయి తీరవలసిందే.

అరగంట ఆఖరు కావలసిందే ఇదంతా చెక్కు చెదరకుండా, తన స్థానం కదలకుండా, విస్తుపోయి చూస్తున్నాడు ఎల్లమంద. ఇంతసేపటివరకూ తన్ను ఒంటరిగా వదిలారని ఎల్లమంద హృదయం కుంగిపోయింది. ఎన్నిసారులు ప్రయత్నం చేసినా, బంతి ఎల్లమంద దగ్గిరకు మైలుదూరానికన్నా తక్కినవాళ్ళు పంపిస్తేనా!

అరగంట ఈల అయిదు నిమిషాలకు మధ్యవర్తి (రిఫరీ) వేస్తాడనగా సీనియర్ జట్టు హాఫ్‌బాక్ ఒకడు బంతిని తన ఫార్వర్డుకు అందివ్వడంలో మోడులా తన స్థానంలో నిలుచుండి ఉన్న ఎల్లమంద దగ్గరకు పొరబాటున పంపాడు.

నిద్రపోతూ ఉన్న మనుష్యునిలా ఉన్న ఎల్లమంద కాలి దగ్గరకు ఆ బంతి వచ్చింది. ఆ బంతితో పోటీగా ఆ హాఫ్‌బాక్ పరుగున వచ్చాడు. కాని ఎల్లమంద ఒక్క నిమిషంలో మారిపోయాడు. అతడు ఆటంబాంబో, టార్పెడో, రెక్కల బాంబో, తుపాకీ గుండో! ఆ బంతీ అతడు అమిత వేగంతో తుపాకీ గుండులా ఆ హాఫ్‌బాక్‌ను తప్పించి ఝులఝుల, ధళధళ, ఫెళఫెళ వేగంగా ముందుకు పోయాడు. బాక్‌ను తప్పించాడు. గోలుముందర గోలుకీపరు పది అడుగుల ఇవతలగా తుపాకీ గుండులా నెట్టులోకి వెళ్ళిపోయింది బంతి. "గోల్" అని ఆ ఆటస్థలంలో ఉన్న సర్వజనులు సముద్రపు హోరులా అరిచారు. కాని ఎల్లమందను హస్త స్పర్శ చేయడంగాని, అతనికి కృతజ్ఞత తెల్పడంగాని అందరూ మరిచారు.

ఫార్వర్డులు సెంటరుకు వచ్చారు. అరగంటకి రెండు నిమిషాలు ఉంది. సీనియర్ జట్టువారు అందిచ్చుకుంటూ ముందుకు పోయారు. ఎల్లమంద ఆ బంతిని తన కాలికి తీసుకుని స్వయంగా ప్రేక్షకులు కూడా గమనించని వేగంతో బయలుదేరాడు. ఎదుటి ఫార్వర్డులను తప్పుకున్నాడు. హాఫ్‌బాక్‌లను తప్పుకున్నాడు అక్కడనుంచి గోలు ఏభై గజాలుందనగా ఎడం కాలితో బంతిని తన్నాడు. ఆ బంతి పక్షిలా వెళ్ళింది. ఒక మూలనుంచి, గోలుకీపరు ఎగిరి చాపిన చేతులను తప్పుకుని, గోలులో వాలింది.

అయ్యో! ఇక ఆ ఆటస్థలంలో బయలుదేరిన గగ్గోలు, అల్లరి హంగామా నవీన కవులందరూ కలిసి ఏక కంఠంతో వర్ణించినా చాలని పరవళ్ళెత్తి ఉప్పొంగిపోయింది. ఈ పట్టు జూనియర్‌లు ఎల్లమందను భుజాలమీద ఎత్తుకొని జయజయ ధ్వానాలు చేస్తూ మధ్యకు తీసుకువచ్చారు. ఆటస్థలం అంతా హుర్రాలు, బ్రేవోలు! ఇంతలో రిఫరీ ఈల వేశాడు.

ఆ అల్లరి ఇంకా పదివేలరెట్లు ఎక్కువయిపోయింది. ఎల్లమందని ప్రజలంతా సర్కసు జంతువును చూచినట్లే!

"ఏ వూరండి మీది?"

"ఇదవరకు ఎక్కడ ఆడారండి?"

"మీరు ఏమిటండి?"

ఎల్లమంద ఒక ప్రశ్నకూ జవాబు చెప్పలేదు. ఊరికే చిరునవ్వు! నవ్వులోనే అన్నివేల కోట్ల ప్రశ్నలకు జవాబు! అతడు అన్నిటికీ జవాబు చెప్పినట్లే అందరికీ తోచింది.

ఒక బాలుడు సోడా తీసుకు వచ్చాడు.

ఇంకో బాలుడు నిమ్మకాయ పట్టుకు వచ్చాడు.

మరొక బాలుడు తన జేబులో ఉపయోగించకుండా దాచుకొని ఉన్న జేబురుమాలు పెట్టి స్వయంగా ఎల్లమంద మొగం తుడిచాడు.

ఇంతలో రిఫరీ ఈల వేశాడు.

గబగబ జనం ఆటస్థలం వదిలారు. ఈ పక్క జట్టు ఆ పక్కకు ఆ పక్క జట్టు ఈ పక్కకు మారినారు.

సీనియర్ జట్టువారు బాగా ఆలోచించుకుని వారి ఆట పథకం నిశ్చయం చేసుకున్నారు. జూనియర్‌వారు కలుసుకున్నది ఆనందం కోసమే! ఇంక వారి పథకం ఒక్కటే ఉన్నది, ఎల్లమందకు సీనియర్ జట్టువారు ఇవ్వబోయే ఒత్తిడి తగ్గించడము. బ్రహ్మప్రళయ మయినా చేసి ఎల్లమందకు బంతి అందిస్తూ ఉండడము. ఈ విధానము కలిసి అనుకోకుండానే గోల్‌కీపర్ దగ్గర్నుంచి సెంటరు ఫార్వర్డు వరకు బంతి అందివ్వడమే వ్రతంగా పెట్టుకున్నట్టయింది.

ఇకనేమి? ఎల్లమంద చుట్టూ సీనియర్ జట్టు హాఫ్‌బాక్‌లు ముగ్గురూ ఉన్నారు. ఎల్లమందకు బంతి రానివ్వరు. ఈ గొడవలో ఆటంతకూ కీలకం అయ్యాడు ఎల్లమంద. ఎల్లమంద ఈలాంటి కాలిబంతి యుద్ధాలలో ఆరితేరిన సరుకాయెను. అతను గబగబ బంతి దగ్గర లేనిదే పరుగు పందెంలా ఈ చివరనుంచి ఆ చివరకు ఆ మూడుసారులు వరసగా పరుగెత్తినట్లు పరుగెత్తినాడు. ఆ మహావేగం అతనికే చెల్లు. అతనితో సీనియర్ జట్టులోని హాఫ్‌బాక్‌లు ఏం పరుగెత్తగలరు? అలసటపడి ఊరుకున్నారు.

ఎల్లమంద నాలుగో పరుగులో బంతి అందుకున్నాడు. ఇంక అతను యెవ్వరికీ అందలేదు. బంతితోనే గోలులోనికి వెళ్ళిపోయాడు. ప్రభూ! ఆ సమయంలో ఆ ఆటస్థలం ఒక తుఫాను, ఒక గోదావరి వరద అయి చక్కాపోయింది.

సీనియర్లు పదకొండుగురూ ఎల్లమంద చుట్టూ మకాం వేస్తారా ఏమిటి చెప్మా? అతని చుట్టూ ఇనుపగోడ కడతారా? అతని చేతులు కాళ్ళూ కట్టి పారవేస్తారా? అలాగే ప్రయత్నం చేశారు వాళ్ళు. అయినా ఎల్లా తప్పుకున్నాడో రెండుసార్లు, ఆ రెండూసార్లూ రెండు గోలులు చేసినాడు.

అక్కడనుంచి, ఫుట్‌బాల్ ఆట స్వరూపమే పోయింది. ఎల్లమందని అధర్మంగా సీనియర్ ఆటగాళ్ళు ఫౌల్ చేశారు. ఒకసారి మోకాలు కొట్టుకుపోయి రక్తం కొల్లయింది. ఐనా ఏదో గుడ్డ చుట్ట బెట్టుకు ఆడాడు. అతడు ఉగ్రుడై పోయాడు. బంతిని ఒక్క నిమిషం వదలడు. తానే వెళ్ళి బంతి అందుకుంటాడు. వేగంగా వెళ్ళిపోతాడు. అడ్డం వచ్చిన వాళ్ళను జెలగలా తప్పుకుంటాడు. ఆ సమయంలో నలుగురో అయిదుగురో సీనియర్ జట్టువాళ్ళు అడ్డంపడతారు. అతన్ని కుమ్ములు, గుద్దులు తన్నులు అయినా

పళ్ళు బిగించి ఎలా వెళ్ళినాడో ముందుకు ఆరవగోలు చేయడానికి. అప్పుడు సీనియర్ బాక్ ఒకడు అతన్ని కాలు అడ్డంబెట్టి పడదోసి డొక్కలో పొడిచాడు. ఎల్లమంద పడిపోయాడు. అందరూ గొల్లుమన్నారు. రిఫరీ మండిపోయి, ఈలవేసి ఆట ఆపుచేసి పెనాల్టీ (శిక్షగా గోలుకు అడ్డం లేకుండా ఎదురుగుండా బంతి తన్నుట) ఇచ్చినాడు. సీనియర్ ఆటగాళ్ళు ఆ ఫుట్‌బాల్‌ను నాచుతిట్లు తిట్టుకున్నారు.

ఆ అధర్మపు దెబ్బలకు ఎల్లమంద కొంత బాధపడిన మాట నిజమే, కాని లేచి ఒక్కసారి ఒళ్ళు దులుపుకొని నుంచున్నాడు. తన జట్టు నాయకుడయిన సెంటర్ హాఫ్‌బాక్‌వద్ద తానే ఆ బంతి తన్నుటకు అనుమతి పొంది ఈల వేయగానే ఆ బంతి పిడుగు వేగంతో సరిగ్గా మూలనుంచి వెళ్ళేటట్లు తన్నినాడు. అది గోలయి ఊరుకుంది.

## (3)

ఆ మరునాడు నుంచి ఎల్లమంద కళాశాలకంతకూ నాయకుడు, కాలిబంతి ఆట మాంత్రికుడు అయ్యాడు. ఆటల ఉపాధ్యాయుడు ఎల్లమందను తాను సృష్టించినట్లు ఛాతీ విప్పుకు తిరిగాడు. ప్రతీ విద్యార్థి సయద్ అహమ్మద్, భద్రుడు, ముష్టి లక్ష్మీనారాయణ, సూరయ్య, తటవర్తి బుచ్చిరాజు అందరూ కలిసి ఇతనిలో ప్రత్యక్షమయ్యారు కాబోలు ననుకొన్నారు.

సీనియరు జట్టువాళ్ళు, ఎల్లమంద మాకు కావాలన్నారు. ఎల్లమంద తాను ఆ జట్టులోనికి వెళ్ళనని ఆటల ఉపాధ్యాయునితో అన్నాడు.

కాలేజీ ప్రధానాచార్యులవారు ఎల్లమందకు కబురు పంపి, "ఏమయ్యా నువ్వు సీనియర్ జట్టుకు వెళ్ళనన్నావుట ఏమిటి?" అని అడిగాడు.

**ఎల్లమంద:** వాళ్ళు ఆ రోజున నన్ను చేసిన ఫౌల్సు నా జన్మలో ఎప్పుడూ ఏ ఆటలోనూ పొందలేదు. నా మనస్సు ఆ జట్టుతో కలియలేదండి.

**ప్రధానాచార్యులు:** (ఎల్లమంద ముఖము తేరిపార చూచి, ఆ బాలకుని స్వచ్ఛహృదయము, అవమాన తప్తమైన అతని మనస్సు గ్రహించాడు.) ఏమయ్యా మన కాలేజీ జట్టు ఇతర కాలేజీలతో ఆడవలసి వస్తే నువ్వు కాలేజీ జట్టుతో ఆడకపోతే యెల్లాగు?

**ఎల్ల:** చిత్తమండి, మన కాలేజీ ఎవరితో ఆడవలసి వచ్చినా నేను తప్పక కాలేజీ జట్టులో ఆడి తీరుతానండి.

ప్రిన్సి: కృతజ్ఞుణ్ణి!

ఎల్లమంద హాస్టలుకి వెళ్ళిపోయాడు. అతనికి చాలా గౌరవం సంభవించింది. కాని అతన్ని హృదయంలోనికి తీసుకునేదెవరు? లోతులేని హృదయం కలవారికి అతని స్థితి అర్థంకాదు. హాస్టలు విద్యార్థులు మాత్రం అతన్ని దగ్గిరగా తీసుకుంటారా? అతనితో కడుపునిండా మాట్లాడుతారా?

ఆలోచనా శక్తి గలవారికే బాధలన్నీ? ఎల్లమందవల్లనే కాలేజీకి కాలిబంతి ఆట బహుమానాలు వచ్చాయి. ఎల్లమందకు ఆయా సమయాలలో చూపించే గౌరవం ఇంతింతని కాదు. ఆ తర్వాత అతని మొఖం చూచేవారు ఒక్కరూ లేరు.

పుట్టుకచేత ఒక జట్టు మనుష్యులు లోకంలో ఎప్పుడూ అధోగతిపాలేనా? వారి జీవితాలకు మెట్లులేవా? ఎవరు ఈ శిక్ష విధించింది? బలవంతులు.

అమలాపురంనుంచి వచ్చిన ఒక బి.ఏ. సీనియర్ వెలనాటి విద్యార్థికీ, కాకినాడకు చెందిన ఇంకో తెలగాణ్య బ్రాహ్మణ బ్రహ్మసమాజం విద్యార్థికీ ఎల్లమందను గురించి హోరా హోరీ వాదన వచ్చింది. ఆ వాదనలో హాస్టలులోని విద్యార్థులందరూ పాల్గొన్నారు.

**రామం** (వెలనాటి) ఒరే! వెంకటేశ్వరరావూ, శిక్షలనేవి లోకంలో ఉన్నాయా?

**వెంకటే:** ఉన్నాయి. అవి నిర్మాణం చేసింది సంఘం.

**రామ:** ఆయా తప్పులనుబట్టి ఆయా శిక్షలు వచ్చాయి. జన్మశిక్ష, చావుశిక్ష, పదేళ్ళశిక్ష! అలాగే ఈ దేశంలో చచ్చిన గొడ్డుమాంసం తింటూ ప్రజలను చంపి కాల్చుకుతింటూ ఉన్న నరమాంసాశనులయిన వారికి ఆర్యులు సంఘ బాహ్యులుగా శిక్ష విధించారు.

**వెంకటే:** శిక్ష విధించినవారు ఏదైనా మహత్తర కారణం ఉంటే ఆ శిక్ష తీసివేస్తారా? వెయ్యరా? ఉరిశిక్ష కూడా తగ్గిస్తారు; ప్రభుత్వంవారు జన్మశిక్షలు తగ్గించి వదలి వేసిన సాక్ష్యాలున్నాయి. వెనక ఆర్యులు శిక్ష విధించారే అనుకో! ఇప్పుడు ఆలోచించి ఆ శిక్ష తగ్గించవచ్చునుకాదా?

**ఒక విద్యార్థి:** ఒరే! ఇప్పుడు మనదేశం అంతకూ ఆంగ్లేయులు శిక్ష విధించారు కాదట్రా!

**రామ:** అప్పటి ఆర్యులు ఈ శిక్ష ఎప్పటికీ తగ్గించకుండా ఉండే నిబంధన కూడా ఆ శిక్షలోనే విధించారు. అందుకని ఈ మాల మాదిగలు ఎల్లకాలం అల్లా ఉండవలసిందే!

**ఇంకో విద్యార్థి:** మనకు మెలిమొగుళ్ళయిన ఇంగ్లీషువాళ్ళు ఈ హరిజనులకు శిక్ష తగ్గించి, వాళ్ళను మనకు ప్రభువులను చేసి ఆ ప్రభుత్వం సాగేందుకు తమ సైన్యం అంతా మద్దతు చేస్తే ఏమి చేస్తారురా మీరు?

**మరో విద్యార్థి:** మన దేశంలో మార్పులు మనమే తీసుకురావాలి! ఈ తెల్లనాయాళ్ళు ఎవరురా?

**రామ:** అలాంటి మార్పులు ఎవరు తీసుకు రాబోయినా లోకం అంతా కొల్లేరయి చక్కాబోతుంది.

**వెంక:** ఓయి వెర్రికాయా! వట్టి మాష్టారూ! ఇంగ్లీషువాళ్ళు మూడువందల సంవత్సరాల నుంచి ఈ బాపనోళ్ళను గొడ్డుతోళ్ళ బూట్లతో నెత్తిన తంతున్నారు. ఈ ఎదవాయలు వంగి వంగి దణ్ణాలెడుతూ, దీర్ఘాయుష్మాన్ భవ అని ఎదురు ఆశీర్వదిస్తున్నారోయి.

**రామ:** అందుకనే ఒకనాడు ఇంగ్లండు యావత్తూ నాశనం అయి అట్లాంటిక్ మహాసముద్రంలో కలిసిపోతుంది.

**ఒక విద్యార్థి:** అప్పుడు ఈ బాపనోళ్ళంతా, ఈ పెద్ద కులాల బ్రాహ్మణేతరులు వాళ్ళంతా ఏ పురుగులో, ఏ నల్లులో అయి చక్కాబోతారు.

ఈలాంటి చర్చలు ఎన్నో ఎల్లమంద వింటూనే ఉన్నాడు. ఎల్లమందకు చర్చ లెప్పుడూ తృప్తి కలిగించలేదు. అతడు ఎక్కువగా చర్చలలో పాల్గొననూలేదు.

ఒక్క స్నేహితుడూ ఎల్లమందను తనింటికి భోజనానికిగాని, ఆఖరికి సరదాగా గాని పిలవలేదు. మాలవారూ, మాదిగవారూ, క్రైస్తవులయినవారు హిందూ పెద్ద కులాల వారింటికి కాఫీ వగయిరాదులకు వెడుతూ ఉండేవారు.

ఎల్లమందకు ఎప్పుడూ తన యిల్లు, తన గూడెం, తన వాళ్ళు జ్ఞాపకం వస్తూ ఉండేవారు. అవి ఇళ్ళు కావు. ఒక్కటే పాక, చిన్న పాక. అంత అసహ్యకరమయిన ఇళ్ళు ప్రపంచములో ఇంకోచోట ఉంటాయా?

గూడేనికి వీధులు లేవు. గూడెంలో శుభ్రతలేదు. గూడెం ఆ మోస్తరుగా ఉంటే, చచ్చిన గొడ్డు మాంసం అందరూ తింటారు. బుధవారం సంతనాడు అమ్మిన నల్లపంది మాంసం తింటారు.

ఎప్పుడుపడితే అప్పుడు మొగం కడుక్కుంటారు. పొద్దున్నే కడుక్కోవడం అవసరం లేదు. కడుక్కోనివారూ ఉన్నారు. స్నానం చెయ్యడం విధికృత్యం కాదు. ఉడుకు నీళ్లు పెట్టుకొని పగలల్లా చేసిన పనివల్ల వచ్చిన శ్రమ పోవడానికి నాలుగు కొబ్బరి డొక్కెలు పోసుకుంటారు.

గుడ్డలు ఉతకడం ఉండవచ్చును; లేకపోవచ్చును. అసలు గుడ్డలేవీ ఉతకడానికి? చిరిగిన గుడ్డలు ఏ రెండు మూడో ఉండవచ్చును. చిరిగితే తమ మొగాల యజమానులు పారవేసిన గుడ్డలు. ఏడాదికోసారి సంక్రాంతి పండుగలకు కామందు తమ కుటుంబం వారికి తలో బండపాత ఇస్తే, అవి అతి సంతోషంతో, అతి ప్రేమతో ధరించుకోవడం. ఇంక బట్టలు ఉతకడం ఆరవేయడం ఏనాడు ప్రభూ?

ధనం ఎప్పుడూ ఉండదు. యజమాని గింజలు కొలుస్తాడు. అవీ ఏడాదికోసారి ఆ గింజలు తన అమ్మో, తన నాయనమ్మో దంచడం, కొన్ని గింజలు అమ్ముకోడం, గంజితప్ప అన్నమే మెరుగు తన కుటుంబం? కూరలులేవు, పచ్చళ్ళు లేవు, పిండివంటలు తెలియవు, నెయ్యి మజ్జిగ రూపు రేఖా విలాసాలే లేవు, మేక మాంసం, కోడిమాంసం మొదలయిన వాటితో పలావులు, కురమాలు తమ జగత్తులో తమ వారు ఎరుగరు.

కాఫీ హోటళ్ళేమిటో మాదిగవారి కేమి తెలుసును? బుధవారం సంతనాడు ఒక కానీపెట్టి సోడాకొని తాగడం తానెరుగును. ఆ సోడా అయినా ఒక మహమ్మదీయునిది. పెద్ద కులాలవారు పెట్టిన దుకాణాలలో ఎవరయ్యా తమకు సోడా ఇచ్చేది? ఏ బ్రతికి చెడ్డవాని దుకాణంలోనో, ఇవి దొరికితే, ఆ కొట్టులో ఇతరులు ఎవ్వరూ కొనరు.

హోస్టలులో ఇడ్డెనులు, పెసరట్లు, అట్లు, పకోడీలు, గారెలు, ఆవడలు, పూరీలు, బజ్జీలు, బొబ్బట్లు, ఫేణీలు, కాఫీలు చేస్తూనే ఉన్నారు. ఎన్ని రకాల కూరలు, పులుసులు, చారులు, పచ్చళ్ళు, కమ్మటి నేయి, పెరుగు.

ఇవన్నీ తింటూ ఎల్లమంద తన వారినీ, తన జాతినీ, భారతదేశంలో ఉన్న బీదవారినీ, ముష్టివారినీ తలచుకోని రోజు లేదు.

ఇవన్నీ భగవంతుని చిద్విలాసాలా? భగవంతునికి సంబంధం లేదా? భగవంతు డున్నాడా? ఉంటే ఈ తేడా లేమిటి? మనుష్యుని కర్మ అన్నారు. కర్మ ఏమిటి? ఈ భావాలు ఈ వేదాంతాలు ఈ విచారణ ఎల్లమందకు ఏమి తెలుస్తాయి.

## (4)

ఒక్కడూ గోదావరి గట్టున కూర్చునేవాడు. దూరంగా గోదావరి. ఒకనాడు వరదలై ప్రవహించింది. ఒకనాడు నిర్మల నీలజాలై ప్రవహించింది. ఒకనాడు ఇసుకలు, ఇంకొకనాడు అంతా జలమయం. ఈ రెండు భావాలకూ మధ్య ఎన్నో తేడాలు. అన్ని

నీళ్ళూ సముద్రంలో కలవవు; అన్ని నీళ్ళూ బట్టలు ఉతకవు. అన్ని నీళ్ళూ మనుష్యుల దాహం తీర్చవు. అన్ని నీళ్ళూ మనుష్యుల ఈత ఆనందం తీర్చవు.

ఈత అంటే మొదట ఎల్లమంద భయపడ్డాడు. గోదావరి ఏడాదికో విద్యార్థిని బలిపుచ్చుకుంటూ ఉంటుంది.

**ఒక స్నేహితుడు:** ఎల్లమందా రావోయీ ఈత నేర్చుకోపోతే జన్మలో ఒక ఆనందం మనకి తప్పిపోయిందన్న మాట.

**ఎల్లమంద:** గోదావరిలో దిగటమే?

**స్నేహి:** గోదావరి మనకు విరోధంట్రా?

**ఎల్ల:** అదికాదురా, నాబోటి దద్దమ్మలే గోదావరికి బలి అవడం!

**స్నేహి:** ఒరే ఫుట్‌బాల్ ఆటలో అందరినీ మించి పోయినవాడవు నీకు ఈత రాకపోతే, పెద్ద అవమానం కాదుట్రా? రా నేను నేర్పుతాను. బలయ్యేవాళ్ళు, ఎప్పుడూ ఎందులో పడితే అందులోనే బలి అవుతారు.

ఆ నాటినుండి ఎల్లమంద పట్టుదలగా ఈత నేర్చుకోవడం సాగించాడు. ఒంటిగా తనకడకు వచ్చినప్పుడల్లా గోదావరి తల్లి ఎల్లమందతో ఎప్పుడూ మాట్లాడుతూనే ఉండేది. అలాంటి దేవి ఇప్పుడు చేతులుచాచే అతన్ని పిలిచింది. హృదయానికి అదుముకుంది. అతనితో తనివితీరా మాట్లాడేది. మాటలాడేటప్పుడు ఆమె వాక్యాలు హృదయానికి వినబడేవి. అతని హృదయం ఆమెతో మాటలాడేది.

నెల రోజులలో భయం పోయింది. మూడు నెలలలో ఈత రకాలన్నీ వచ్చాయి. నాలుగు నెలలలో దమ్ముపట్టడం వచ్చింది. అయిదు నెలలలో దూరం వెళ్ళడం వచ్చింది. ఆరు నెలలలో ఈతలో అందె వేసిన చేయి అయ్యాడు.

ఇంత చక్కగా అతనికి ఈత రావడానికి ఎక్కువ కారణం గోదావరిదేవే!

గోదావరి కొందరిని ప్రేమిస్తుంది. వారిని ఆభరణంలా తన హృదయంలో ధరిస్తుంది. తల్లి, చిట్టి తనయునకు తప్పటడుగులు నేర్పినట్లు, గోదావరి ఆ బాలుని తేల్చివేత, కుక్క ఈత, చిట్టిచేప ఈత, బాద ఈత, పక్క ఈత, నిలువు ఈత నేర్పుతుంది. చివరకు తన హృదయంపై వెల్లకిలా పరుండి కాళ్ళూ చేతులూ కదపకుండా తేలిపోవడం నేర్పుతుంది.

ఎల్లమంద గోదావరితోనే మాటలాడుతూ ఉండేవాడు. అతని అనుమానాలన్నీ ఆ మహానదీమ తల్లే తీర్చేది.

**ఎల్లమంద:** నీఈడు ఎంత తల్లీ?

**గోదావరి:** నేను అనాది దేవిని. నా జననం గంగకు పూర్వమే. ఈ దక్కను పీఠభూమి ఆదికచ్ఛపము వీపు. అప్పుడే నేనూ ఉద్భవించాను తండ్రీ.

**ఎల్లమంద:** తల్లి, ఈ మాలమాదిగలకు మోక్షం లేదా? వాళ్ళు ఏమి తప్పుచేస్తే ఈలాంటి శిక్షపడింది అమ్మా.

**గోదావరి:** నాయనా! ఒక జాతియొక్క పొగరు కారణం. ఒక జాతి ఎక్కువ బలమయినది. ఎక్కువ నాగరకత కలది. ఆ జాతి ఈ జాతిని ఓడిస్తుంది. ఓడిపోయిన జాతితో

విజయమందిన జాతి ఏ సంబంధమూ కలుగజేసుకోడానికి ఇష్టపడదు. వాళ్ళచేత అడ్డమైన చాకిరీలు చేయించుకొంటుంది.

**ఎల్లమంద:** మేము మొదటనుంచీ ఈ రాజ్యాలు ఆక్రమించుకొని ఉన్నవాళ్ళమా?

**గోదావరి:** అవునయ్యా అవును, ఈ ప్రపంచంలో మొదట ఉద్భవించింది మీరు. మిమ్ము రాక్షసులనీ, నిశాచరులనీ, నరమాంసాశనులనీ పేరుపెట్టారు. మీలో నరమాంసాశనులూ ఉండేవారు, నిశాచరులూ ఉండేవారు. మీరూ, మాలలూ ఆ అనాది జాతికి రాజకులాలవారు.

ఈలా గోదావరితో తన ఆవేదనను వెళ్ళబోసుకునేవాడు. తాను రాజునన్న మహాభావం అతనికి కలిగింది.

ఎవరి జన్మకు మెట్లు కట్టుకుంటారో వారు పైకి వెళ్తారు. లేనివారు వేసినచోట ఉంటారు. అన్న ఒక జాతీయ నాయకుని మాటలు ఎల్లమందకు ఆశయ వాక్యాలయ్యాయి.

అన్ని పరీక్షలూ నెగ్గాడు. అతని చదువే అతనికి స్నేహితుడు. అతనికి గోదావరి స్నేహితురాలు. అతని బంతి ఆట అతనికి ప్రియురాలు.

## 5

మాదిగ ఎల్లమంద బి.ఏ ప్యాసయి వచ్చాడని జక్కరం మారు మ్రోగింది. జక్కరం మాదిగపల్లిలోని వాళ్ళంతా ఎల్లమందను చూడటానికి వచ్చారు. అందరితోనూ నవ్వుతూ మాటలాడాడు, గుడిసెముందు నులక మంచంమీద కూర్చుని.

**వెంకన్న:** ఏంటిరా ఎల్లమందయ్యా, మరిగంటే అదేటి బి.ఏ. పాసు అయినావు గంద. మరి ఏంటి ఉద్యోగం సేత్తావు?

**సుబ్బి:** ఆడు కలటేరు సేత్తాడు.

**పాపాయి:** కలకటేరే! అది తెళ్ళోళ్ళకే గాందంటే.

**లచ్చన్న:** ఓస్ ఈ మద్దెనే నళ్ళోళ్ళకీ ఇత్తుండారు. ఆళ్ళూ తెల్లదొరల ఏసాలే ఏసి పెద్ద కలకటేరుపనే సేత్తుండారు కాదేంటి?

ఏమి చెయ్యాలి. ఎల్లమంద? ఒక పక్కన ప్రభుత్వ ఉద్యోగం చెయ్యాలని ఉంది. ఒక వైపున ప్రభుత్వోద్యోగం జీవితం కాక ఏదో మహత్తర కార్యం చేయాలని ఉంది. కలక్టరు పని చేస్తాడు. అంటే కష్టపడితే ఏకంగా ఏ డిప్యూటీ తాసిల్‌దారు పనో ప్రభుత్వంవారు ఇస్తారు. అక్కడనుంచి నెమ్మదిగా తాసీల్‌దారు పని, ఆ తరవాత డిప్యూటీ కలెక్టరు పని ఉపకార వేతనకాలం వచ్చేసరికి ఏ సెలక్షనుగ్రేడో వచ్చి జిల్లా కలెక్టరు, రెవిన్యూ బోర్డు సభ్యుడూచేసి, ఉపకార వేతనం పుచ్చుకోడం!

తనకూ, తన కుటుంబానికీ ధనం, మంచి యిల్లు, బంట్రోతులు, మంచి బట్టలు, కారు, నగలు వస్తాయి; తనకూ సంఘంలో గౌరవం. ఇప్పుడు తనకు ఇరవై ఏళ్ళున్నాయి. ముప్పది నలుబది ఏళ్ళు ఈ మెట్లు ఎక్కుతూ ఉంటాడు. అంతకన్న ఏం కావాలి.

ఈలోగా అమెరికన్ ఫాదిరీ ఒకడు, ఇంగ్లీషు ఫాదిరీ ఒకడూ కొందరు తెలుగు ఫాదరీలు తన్ను క్రైస్తవమతం పుచ్చుకోమని పోరు పెడుతున్నారు. తమ శక్తివల్ల అతనికి మంచి ఉద్యోగం వేయిస్తారుట. తమ మతం మంచిదట!

**అమెరికన్ మిషనరీదొర:** ఏమయ్యా! నీ పేరు ఏమి బాగుంది? పేరు మంచిది ఈయలేని మతం ఓ మతమేనా?

**ఎల్లమంద:** మీరేమి పేరు యిస్తారు? నెతానియేలు, దానిఏలు, జార్జి, ఎడ్వర్డ్లు, ఇసాఏలు, ఈశయ్య, మోసేయి, సామ్యుయేలు, కృపాదానం, దేవదానం, సత్యానందం ఈలా ఈలా ఉంటాయి. ఎల్లమంద కోటప్పకొండకు మా తలితండ్రులు బిడ్డలు పుట్టక మొక్కుకుని వెళ్ళారు. అక్కడ నుంచి వచ్చాక నేను కడుపున పడ్డాను. నా పేరు ఎల్లమంద అని పెట్టాడు మా తండ్రి. మీకు మైకేలు ఎంతో మాకు ఎల్లమందా అంతే.

**ఆమె:** పేరు సంగతి అల్లా ఉంచు. మీ వాళ్ళు రాళ్ళూ రప్పలకు మొక్కుతారు. జంతువుల్ని పూజిస్తారు. మా వాళ్ళు యేకేశ్వరుడయిన భగవంతునే పూజిస్తారు.

**ఎల్ల:** అయ్యా నా స్నేహితులు నాకు ఎల్లమందమూర్తి అని పేరు పెట్టినారు. అప్పట్నించీ మూర్తి అనే పేరు నిశ్చయమయిపోయింది. రూఢి అయింది. ఇక అనేక మంది దేవుళ్ళనీ, రాళ్ళకూ రప్పలకూ మొక్కుతామనీ మీ మిషనరీలు మావాళ్ళనంటారే. మీరు చర్చీలకు వెడతారు. మావాళ్ళు దేవాలయాలకు వెళతారు. మీకు జెహోవా, క్రైస్తు, మేరీ, హోలీఘోస్టూ మీకు ఏంజెల్సు, మాకు దేవతలు, మీకు అపోసిల్సు. మాకు మతకర్తలు, మీకు సెయింట్సు, మాకు ఋషులు, శాంతులు. మా మతం అఖండమయినది. రాధాకృష్ణనుగారు చెప్పినట్లు జీవిత విచారణ చేసే వారు మాలో ఎక్కువమంది, కాబట్టి మాకు లక్షల కొలది వేదాంతులు.

**మిష:** నువ్వు రాధాకృష్ణుని గ్రంథాలు చదివావా!

**ఎల్ల:** చదివాను. కాని చాలా భాగాలు అర్థం కాలేదు. అప్పటికీ మా వేదాంతం ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటూ ఉండేవాడిని.

**మిష:** సరే ఆలోచించుకో!

**ఎల్ల:** ప్రాపంచకంగా మొదటి రోజులలో మీ మతములో కలిసినవారికి లాభం ఎక్కువ ఉండేది. ఇప్పుడు మీ మతంలో కలిసిన వారంతా చదువుకుంటున్నారు. అనేకులు బి.ఏ.లో విజయం పొందారు. వారందరికీ ఉద్యోగాలు లేవు. కాబట్టి అనేకులు మీరు పెట్టిన పాఠశాలలోనే ఉపాధ్యాయులవుతున్నారు. కొంతమంది ప్రచారకులవుతున్నారు. మాలో చదువుకున్నవారు తక్కువ. అందుకని ప్రాపంచకంగా మాకే ఎక్కువ లాభాలు కలిగే వీళ్ళున్నాయి, కాదా అయ్యా!

ఎల్లమంద మూర్తి లేక మూర్తికి మనస్సు పరిపరివిధాల ప్రవహిస్తోంది. ఏదీ తోచదు. బి.ఏ తో తన చదువు పూర్తా?

తర్వాత ఏమి చేయాలి? ఎవ్వరు తనకు తర్వాత చదువు చెప్పించేది? ఏమిటి చదువుతాడు? బి.యే.లో ఫిజిక్సు పుచ్చుకొన్నాడు, తర్వాత?

తన జాతికి ఎలా సహాయం చేయడం? మహాత్మాగాంధీ నిజంగా అవతారమూర్తి! హరిజనులని పేరుపెట్టి తమ జాతిని తక్కిన కులాలతోపాటు సమం చెయ్యాలని తమ పవిత్ర జీవితం అంకితం చేసుకున్నారు. తన దేశంలోనివారే ఆయన దివ్యాశయాలకు అడ్డం వస్తున్నారు. ఇంతకూ ఈ కాలేజీ చదువు తమ వారందరూ చదవాలి. బాలురూ

బాలికలూ కూలిపని మానివేసి చదవాలి. ఉద్యోగాలివ్వడంలో ప్రభుత్వంవారే హరిజనుల వంతు ఎక్కువ చెయ్యాలి.

అంబేద్కరుగారు ఇతర మతం పుచ్చుకొంటే కొంత నయిం అని తక్కిన కులాలవారిమీద కోపంతో అన్నారు. తమ మాల మాదిగ, పెరియా దోబీ, మాలార్ మొదలగు కులాల వారందరూ ఇతర మతాలు పుచ్చుకొంటే ఈ సమస్యా పరిష్కారం దొడ్డిదారే అవుతుంది. క్రైస్తవులైతే మాత్రం పాశ్చాత్యులతో సమానం ఔతారా? ముస్లింలు ఔతే నవాబులతో, కోటీశ్వరులతో సమానం ఔతారా?

అమెరికాలో నీగ్రోలందరూ క్రైస్తవమతం పుచ్చుకున్నారు. అంతమాత్రాన వారి విషమ సమస్య తీరిందా! కులాలు లేవనుకొన్న జాతులలో కులం ఇంకోరీతిగా పరిణమిస్తుంది. అన్నిటికన్నా రష్యా నయం. రష్యాలో ప్రతి మనుష్యుడూ పైకి వెళ్ళడానికి వీలుంది. అందరూ ఒక్కటే అక్కడ. ఆ మహత్తు బోల్సివిజంలో ఉంది కాబోలు. అయినా అక్కడ కులతత్వం ఇంకోరీతిగా తలెత్తుతుంది. బోల్షివిక్కులు కాని వారిని వారు మాదిగవారితో సమానంగా చూస్తారు. ఒక్కొక్కరకం పనిచేసేవారు ఒక్కొక్క రకం కులం అవుతారు. కులతత్వం మానవజాతిలోనే ఉంది కాబోలు.

ఎల్లమందకు తన గుడిసెలో నిదురపట్టదు. తనొక్కడూ పెద్ద ఉద్యోగానికి ప్రయత్నం చేసినంత మాత్రాన ఈ గూడెం అల్లావుద్దీను మాయ సెమ్మా తిప్పితే మారినట్లు లండను పికాడెల్లీ సర్కసు అవుతుందా?

రాజమండ్రి హాస్టలు భోజనాలు తన ఇంటి దగ్గర ఏవి? అతదు రహస్యంగా కంటినీరు కుక్కుకున్నాడు.

తనకు నాల్గేళ్ళపాటైనా భోజనాలు దొరికాయి. తన వారికేవి? తన గూడెంవారి కేవి ఆ భోజనాలు? తను హాస్టలులో ఉన్నంతకాలం హరిజన సంఘంవారు తనకు కొని ఇచ్చిన కాంపు కాటుమీద, పరుపుమీదా పందుకొనేవాడు. ఇంటిదగ్గిర తన వాళ్ళెవ్వరికీ లేని భోగాలు తనకెందుకు?

మహాత్మాగాంధీ తన జాతికోసం ఎన్నిసార్లు నిరసన వ్రతం చేసినారో! తక్కిన హిందువుల హృదయంలోంచి, వారి భావనలోంచి, వీరు అంటరానివారు, చూడరానివారు అనే భావం తీసివేయగలరా?

తమకు దేవాలయ ప్రవేశం లేదు. దేవాలయంలోనే దేవుడుండి, ఇంకోచోట లేడనా? కావలసిన వారికి భగవంతుడు ఎక్కడ బడితే అక్కడే వున్నాడు. అసలు ఉన్నాడో లేడో? ఇంతకూ నువ్వు దేవాలయంలోనికి రాకూడదు అని ఒక కులాన్ని అరికట్టడంలో ఉన్న అగౌరవం అనంతం.

దేవాలయం ఇవతల భగవంతుడు తమ్ము అంటుకుంటే మైల బడిపోతాడా! మంత్రాలు పాడు నోళ్ళల్లోనే ఉంటాయా? మంత్రం కూడా భగవంతుని రూపం కదా అదీ సర్వత్ర నిండి ఉండవలసింది కదా!

ఎవరు తనకు సలహా చెప్పేది? ఎవరు తనకు దారి చూపేది. కాంగ్రెసు వారి నడిగితే, దేశసేవ చేయమంటారు. ఇతరులను అడిగితే ప్రభుత్వోద్యోగం చేయమంటారు.

అతడు భీమవరంలో వున్న దేశ నాయకుడైన దండు నారాయణరాజుగారి కడకు పోయాడు. నారాయణరాజుగారు అతనికి అనేక విధాల సహాయం చేస్తూ ఉండేవారు.

**నారా:** నువ్వు బి.ఏ. ప్యాసయినంత మాత్రాన ఊరుకొంటే లాభం లేదు ఎల్లమందా.

**ఎల్ల:** పై చదువులు చదవడం ఎలా అండి.

**నారా:** నీ జన్మలో నీకు మెట్లు వుండాలి. మెట్లు ఉండడం మూడు రకాలు. భగవంతుడే ఏర్పరచిన మెట్లు; ఇతర మనుషులు - చుట్టాలో, స్నేహితులో, దయ గలవారో - ఏర్పరచిన మెట్లు; తనకు తానే ఏర్పరచుకొన్న మెట్లు. ఈ చివరరకం మెట్లే ఉత్తమమయినవి.

**ఎల్లమంద:** అవునండి, ఏం ఏర్పరచుకోను నేను, నేను నిర్మించుకొనే మెట్లూ రెండు రకాలు ఉంటాయండి. నాకోసం మెట్లు కట్టుకొని నేను ఎక్కవచ్చును. నా జాతి కోసం నా దేశంకోసం మెట్లు కట్టుకుని నేను ఎక్కుతూ నాతోపాటు ఇతరులనూ ఎక్కించవచ్చును.

**నారా:** నీ మాట ఎంతో సమంజసముగా వుంది. నీ కొరకే నువ్వు మెట్లు కట్టుకుంటే, భారతీయ కేంద్ర ప్రభుత్వ సభ్యుడుగా కావచ్చును. నీ జాతి పేరును వాడుకుంటూ, నీ జాతివారినే నీకు మెట్లు చేసుకోవచ్చును. అలాంటి పెద్దలున్నారు. అనేకమయిన పార్టీలు అలాంటివి ఉన్నాయి.

**ఎల్లమంద:** అవునండి, చివరకు జాతీయ సంస్థ అయి, మహోత్తమమూ, పవిత్రమూ అయిన కాంగ్రెసునే తమకు మెట్లుగా ఉపయోగించుకొనే పెద్దలున్నారు కాదా అండి?

**నారా:** బాగా అన్నావు ఎల్లమందా! కనక నువ్వు నీచస్థితిలోని నీ జాతిని పైకి తీసుకు వెళ్ళడమా, లేక నీకు నువ్వు బాగుపడడమా నువ్వే ఆలోచించుకోవాలి.

ఎల్లమంద ఇంటికి వెళ్ళినాడు. ఒక రాత్రల్లా నిద్రలేదు. పక్కమీద దొర్లాడు. లేచి వీధిలోకి వచ్చాడు. కుక్కలు అరుస్తున్నాయి. చెడువాసన ప్రపంచమే నిండి వున్నట్లుగా అవుతున్నది.

ఇంట్లో తనవారి చెడు వాసన, చెడు బట్టల వాసన, నీచస్థితి వాసన.

ఆ దుర్గంధం ఏనాటికయినా తన జాతిని వదలదా? తనజాతి నిదురించే ఈ పల్లెపయిన ప్రసరించే చంద్రకిరణాలు సుగంధాల జల్లుతూ ప్రతిఫలించే దినాలు రానేరావా? ఈ దేశానికి సుగతి లేదా?

# రెండవ భాగం

# వైద్య విద్యార్థిని

ఆ బాలిక వైద్య విద్యార్థిని. మూడవ సంవత్సరం చదువుతోంది. అసలయిన యురేషియను జాతికి చెందిన ఉత్తమ వంశీకురాలు.

క్లైవు పరిపాలించిన రోజులలో ఇంగ్లండునుంచి దిగిన బ్రిటిషు యుద్ధ భటులు కర్కోటకులు. వారి నాయకులు కొంచెం పెద్ద కుటుంబాల వారైనా, ఇంగ్లండులో ఎందుకూ పనికిరాక, తమ కుటుంబాలకు వేరుపురుగులుగా పరిగణింపబడి, చుట్టాల అభిమానం, వాని పలుకుబడులవల్ల హిందూ దేశానికి వెళ్ళే యుద్ధ సైనికులకు నాయకులుగా వచ్చిన పిట్టపిడుగులు.

ఆ పిట్టపిడుగులకు నాయకుడు క్లైవు. క్లైవుకు కుడి భుజం మేజరు రిచ్చర్డు కార్లయిలు. మేజరు రిచ్చర్డ్ కార్లయిలు ముష్టియుద్ధంలో అందెవేసిన చేయి. ఆనాటి ఇంగ్లండులో అయిదు కౌంటీలకు ఏకైక విజయంగా బహుమానాలు పొందినవాడు. అతని పేరు అతని తలిదండ్రులు, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు, దగ్గిర చుట్టాలు ఎవ్వరూ ఉచ్చరించేవారు కారు.

మేజరు రిచ్చర్డ్ మందతప్పిన గొర్రెకాడు. గొర్రెల్లో చీంబోతు. విజయ విలియంరాజు కాలంనాటి నుంచీ ఇంగ్లండులో ప్రసిద్ధి కెక్కిన మధ్య కౌంటీల రైతు కామందుల కుటుంబాలకు అపఖ్యాతి తెచ్చిన నల్లగొర్రె చీంబోతు. రైతు ఖామందులు (ఇయోమెన్) ఇంగ్లీషు జాతికి వెన్నెముకలు. అలాంటి మేజరు రిచ్చర్డ్ కెప్టానుగా హిందూ దేశానికి వచ్చాడు. ఆర్కాటు వగయిరా యుద్ధాల్లో నిరుపమానమైన విక్రమం చూపించాడు. ఒక ఉత్తమ ముస్లిం రాజకుటుంబంలోని బాలికను పెండ్లాడి హిందూదేశంలోనే ఆస్తి సంపాదించుకొని ఉండిపోయాడు.

ఆ వంశంవారు ఉత్తమ యూరేషియన్ జాతి వారయ్యారు. ఈ వంశంలోని బాలికలు కొందరు అసలు ఇంగ్లీషు భర్తలను చేసుకొని ఇంగ్లండు కూడా వెళ్ళారు. పురుషులు హిందువులలో క్రైస్తవమతం పుచ్చుకొన్న ఉత్తమ కుటుంబాలవారి బాలికలను చేసుకొంటూ వర్తకము, ప్రభుత్వోద్యోగాలు, రైల్వే ఉద్యోగాలు చేస్తూ మంచి చదువులు చదువుకుంటూ పేరు పొందారు.

వారికి హిందువులకన్న, ముస్లింలకన్న భారతీయ క్రైస్తవులకన్న భారతదేశం అంటే ఎక్కువ ప్రేమ. మదరాసులో వారికి పదిమేడ లున్నాయి. చాలా చోట్ల భూములు, తోటలూ ఉన్నాయి.

ఆ వంశంలో రైల్వే ఇంజనీయరు ఎడ్వర్డు కార్లయిలు గారి కుమార్తె జెన్నిఫర్ కార్లయిలు ఎంతో అందమయిన బాలిక. ఆంగ్లేయులకన్న స్వచ్ఛమైన తెలుపు కాకపోయినా జెన్నిఫర్ దేహచ్ఛాయ బంగారు సూర్యకిరణాలు హిమాలయ శృంగాలపైన ప్రసరించిన

దివ్యక్షణంనాటి పరమ మధుర వర్ణం! జెన్నిఫర్ తండ్రి ఎడ్వర్డు కార్లయిలుగారు బి.యి. పరీక్షలో మొదటి తరగతిలో విజయమంది ఎం.ఎస్.ఎం రైల్వే ఇంజనీయరు అయి, ఇప్పుడు చీఫ్ ఇంజనీయరుగా వున్నారు.

జెన్నిఫర్ – ఎడ్వర్డు కార్లయిలుగారి ముగ్గురి బిడ్డలలో కడసారిది. మొదటి ఇద్దరూ మొగవారు. పెద్దకొడుకు రిచ్చర్డ్ కార్లయిలు బి.యే. కాగానే భారతీయ సైనిక దళ నాయకుడు కావడానికి నిశ్చయించుకొన్నాడు. అందుకై డెహరాడూన్ సైనిక కళాశాలలో చేరి విజయమంది ఇప్పుడు మేజరై పెషావరు శిబిరంలో ఉన్నాడు. అతడు ఉత్తరాది యూరేషియన్ బాలికతో వివాహమై ఇద్దరుబిడ్డల తండ్రి అయినాడు.

రెండవ కొమరుడు ఇరవైయొక్క సంవత్సరాల ఈడున్న రోజులలో మదరాసు లయోలా కాలేజీలో బి.ఏ.లో కృతార్థుడై ఇంగ్లండులో విద్యుత్ ఇంజనీయరు విద్య నేర్చుకోడానికి సంకల్పించారు. అతని పేరు లయొనెల్.

అతడు 1933వ సంవత్సరం మే నెలలో ఇంగ్లండు వెళ్ళే పి అండ్ కో. ఓడ 'రావల్పిండి'లో రెండవ తరగతిలో ప్రయాణం చేసే ఎల్లమందమూర్తిని కలుసుకొన్నాడు. లయొనెల్‌కు, ఎల్లమందకు ఒకరు రాజమహేంద్రవరంలో, ఒకరు మద్రాసులో ఉన్నా మొదటినుంచీ ఎందుకో విద్యుత్ శక్తి అంటే అభిమానం పుట్టి ఇంగ్లండు వెళ్ళి ఇంజనీర్లు అవుదామని వారికి గాఢవాంఛలు గలిగినాయి. వారిద్దరూ కలిసే ఇంగ్లండు చేరినారు. లండనులోనూ ఇద్దరూ కలిసి బస కుదుర్చుకున్నారు.

నారాయణరాజుగారి సహాయంవల్ల హరిజన నిధినుండి మొట్టమొదట వేయి; తర్వాత నెలకు ఏభై రూపాయల వేతనం మూర్తికి వాగ్దానం అయింది. ఆంధ్ర జమీందారులలో ఉత్తములు శ్రీపురం జమీందారులు నెలకు ఏభై చొప్పున ఇచ్చుటకు మూడు ఏండ్లకు అయ్యే పద్దెనిమిది వందల రూపాయలు మూర్తికి యీయ వాగ్దానం చేశారు.

నారాయణరాజుగారి సహాయంవల్ల భీమవరం తాలూకాలోని ధనవంతులయిన క్షత్రియులు, తటవర్తివారు, కోరుకొల్లు కరణంగారు రెండువేల రూపాయలు వసూలుచేసి ఇచ్చినారు. ఈ మూడేళ్ళలో ఇంకొక వేయి రూపాయలు వసూలుచేసి పంపుతామని మాట యిచ్చారు.

అలా చిన్నన్నగారు ఇంగ్లండులో చదివే రోజులలో పద్దెనిమిదేళ్ళ ఈడు బాలిక జెన్నిఫర్ మదరాసు వైద్య కళాశాలలో చేరింది. కార్లయిలు వంశంలో వైద్య విశారదలైన స్త్రీలు ఎంతమందో తరతరాలనుంచి ప్రసిద్ధి పొందారు. వారు నర్సు పని నేర్చుకొని రెడ్‌క్రాసులో పనిచేస్తుండేవారు.

ఈనాడు ప్రసిద్ధ వైద్యురాలయి, మదరాసు ఘోషా ఆస్పత్రికి ముఖ్య వైద్యురాలయిన మేనత్త డాక్టరు గ్రేస్ టెంపిల్టనులా ఆమెకు కూడా వైద్యురాలు కా సంకల్పించి జెన్నిఫర్ వైద్యకళాశాలలో చేరింది. డాక్టరు గ్రేస్ వారి భర్త డాక్టరు టెంపిల్టను కలకత్తా యూరోషియనులలో ఉత్తమ కుటుంబీకుడు.

జెన్నిఫర్ వైద్య కళాశాలలో మూడవతరగతి చదువుతూ అందరి బాలికలతో ఆనందంగా మెలుగుతూ, టెన్నిస్ ఆడుతూ, భారతీయ రాజకీయాలను గూర్చి, తన జాతి

భవిష్యత్తుగూర్చి, ప్రపంచ రాజకీయాలుగూర్చి, వైద్య విద్య సహాయము - మానవుడు అనే అఖండ విషయాన్ని గూర్చి తన వారితోను, తోటి బాలురతోను చర్చిస్తూ ఉండేది.

**జెన్నీ:** యూరేషియను జాతి చివరకు గబ్బిలంలా తేలింది. భారతీయులకు ఆ జాతి అంటే గౌరవంలేదు. తమ తక్కువ కులంకన్నా అధ్వాన్నంగా చూస్తారు.

**మార్థా:** (దూరపుచుట్టం) అవును జెన్నీ! ఇంగ్లీషు వారు మనకీ వారికీ సంబంధమున్నట్టే ఆలోచించరు.

**హెన్రీ:** (మార్థాభర్త) అవును మార్థీ వాళ్ళ దృష్టిలో మన ఆడవాళ్ళు, వాళ్ళ సైనికులు భారతదేశంలో ఉన్నప్పుడు వాళ్ళ గాఢపురుషత్వ రాక్షసకామం తీర్చడానికి ఏర్పాటయిన, ఒక వీలయిన, ఫరవాలేని, చక్కని సేఫ్టివ్వాలని!

**జెన్నీ:** అందుకు ముందర తయారు మన యూరేషియనుజాతి ఆడముండలేగా! భారతదేశంలో, బర్మాలో, జావాలో, మలయాలో, ఇండోచైనాలో, చైనాలో, అమెరికాలో, ఆఫ్రికాలో మనజాతి ఉద్భవించి ఎక్కడా ఉత్తమస్థితి సంపాదించుకోలేక ఎన్ని నీచత్వాలు అనుభవిస్తోందో!

**హెన్రీ:** రెండు జాతులు కలుస్తాయి. ఈ జాతి పురుషులు ఆ జాతి స్త్రీలను వాంఛిస్తారు, ప్రేమిస్తారు. కాని నల్లజాతి వాళ్ళలో, రంగుల జాతి వాళ్ళలో పురుషులు తెల్లజాతి పురుషుల్ని ప్రేమించకూడదు. కలియకూడదు.

**మార్థా:** వాళ్ళ పురుషులు తమ కక్కుర్తులు రంగుల జాతి స్త్రీలతో తీర్చుకొన వచ్చును.

**జెన్నీ:** అవును మార్థీ! నాకు బాధ వచ్చేది ఎక్కడంటే, తమ పురుషుల పశుత్వంవల్ల దేశదేశాలలోనూ ఎవరికీ అక్కరలేని ఒక సంకరజాతి ఉద్భవిస్తే వారిని గురించి ఆ తెల్లజాతివాళ్ళు ఒక్క పిసరు ఆలోచించి వారికి తగిన మార్గం చూపిస్తేనా?

**హెన్రీ:** ఇందులో నాకు నచ్చింది ఒక్క ముస్లిం సంఘంవారు, ఏ జాతినయినా తమలో కలుపుకుంటారు. ఏ యింటి మిశ్రమాలయినా ఆ మహాసంఘంలో కలిసిపోతాయి. తెల్ల ముస్లింలున్నారు, బంగారు ముస్లింలున్నారు. నల్ల ముస్లింలున్నారు. చీనా ముస్లింలు, జావా ముస్లింలు, నీగ్రో ముస్లింలు భారతీయులు, ఆర్మీనియనులు వగైరా వగైరా అందరూ ఒక బ్రహ్మాండమైన సంఘం.

**మార్థా:** అవును హెన్రీప్రియా! కాని మన క్రైస్తవ మహాసంఘంలో హిందువులలో ఉన్నట్లు కులాలు కులాలు!!

ఈలాంటి సంభాషణలు ఆ జాతిలో కాస్త చదువుకున్నవారు ఎప్పుడూ చేసుకుంటూ వుంటారు.

వైద్య కళాశాలకు పెందలకడనే వెళ్ళవలసి వున్నది. కాబట్టి జెన్నిఫరు తెల్లవారగట్లనే లేచి, కొంచెంసేపు ఏవో ఆలోచనలతో పక్కలో దొర్లుతుంటుంది. ఆ సమయంలోనే యౌవనస్నాతయై అప్పుడే వికసించు గులాబి పూవై ఉదయించు ఉషాబాలయైన జెన్నిఫరుకు యౌవనపు గుబాళింపు కాంక్షలు ఉద్భవిస్తాయి. ఒళ్ళు జల్లుమంటుంది.

ఉప్పొంగే వక్షాలను అదుముకొని సంబాళించుకుంటుంది. ఆమె వివశ అవుతుంది. ఎవరెవరో తన్నెరిగి తనతో చనువుగా మెలిగే యువకులను తలపోసుకుంటుంది. వారితో

సంపర్కము ఊహించుకుంటుంది. ఆ భావము ఆమెకు తృప్తి ఇవ్వదు. తన్ను గూర్చి విరాళి పొందే కోడెగాళ్ళు జ్ఞప్తికి వస్తారు. తన యూరేషియను జాతివాళ్ళు, తన తరగతి బాలురు, తనతో నాట్యం చేసిన తన దూరపు దగ్గిర చుట్టాల; బాలురు, తన్ను దగ్గిరగా తీసుకొనేవాళ్ళు, కాంక్షతో గొంతుకు బిగుసుకుపోగా అస్పష్టస్వరంతో మాటలాడేవారు అందరూ జ్ఞాపకం వస్తారు. ఒళ్ళు వేడెక్కుతుంది. కాని ఏదో ఒక అతిదూరపు అతిదగ్గిర కోర్కె, అతి స్వచ్ఛమైన వాంఛ, అవ్యక్తమైన ఆశ తన్ను ఆపుచేస్తుంది.

ఒకసారి గాఢ బాలికావాంఛ తీర్చుకున్న మాత్రాన ఆమె ఏదో యమలోకంలో పడిపోతుందని జెన్నిఫర్ నమ్మదు. కాని, ఒక స్వచ్ఛమైన జీవితం తన అనుభవానికి అనాఘ్రాతమై రావాలి. తానా జీవితాన్ని పొదివికొనడానికి అనాఘ్రాతమై ఉండాలి. ఈ అతి ఎత్తైన కాంక్షను అనుభవించడానికి ఎదురు చూస్తోంది.

ఆ కాంక్షాదినాల్లో, అతిచదువు దినాల్లో, రోగాలను గూర్చి తెలుసుకొనే దినాల్లో, మనస్తత్వాన్ని గూర్చి విచారణ చేసే దినాల్లో ఇంగ్లండులో లండను మహానగరంలో నివసించే లయొనెల్ దగ్గిర నుండి చెల్లెలు జెన్నిఫర్‌కు ఉత్తరం వచ్చింది.

ఇదివరకే అనేక ఉత్తరాలు వచ్చినాయి. కాని ఈ ఉత్తరంలో ఒక ముఖ్య విషయం వ్రాశాడు.

భారతీయ అస్సోసియేట్ ఛాంబర్సు,<br>2వ అంతస్తు, 75వ వార్డు స్ట్రీటు సోహో<br>6 అక్టోబరు, 1934.

ప్రియమైన జెన్నీ!

నా కీ ఉదయం ఒక మహత్తరమైన సన్నివేశం జరిగింది. నా జీవితంలో అది ఎంతో మహత్తరమైన మార్పు తీసుకొని వచ్చేది.

మన ఇంటిపేరున్న ఒక చితికిపోయిన పెద్ద కుటుంబపు అమ్మాయి ఇక్కడ ఒక కంపెనీలో మేనేజింగ్ డైరెక్టరుకు ఆంతరంగిక కార్యదర్శిగా ఉంది. ఆ అమ్మాయికి నాకు ప్రథమ పరిచయం మేము కాపురమున్న మేడలోనే జరిగింది.

ఈ మేడలో రెండవ అంతస్తులో ఆమె చుట్టాలు ఉన్నారు. ఆమె తరచుగా ఇక్కడకు వస్తూ వుంటుంది. ఇప్పటికి మూడు నెలల క్రితం ఆమె నేను, తారసిల్లడం విచిత్రంగానే! ఆమెను నేను ఓ మోటారు బారి నుండి రక్షించాను. అక్కడనుంచి మా స్నేహం వృద్ధి పొందింది. మా స్నేహం గాఢమై ప్రేమ పరిణామం పొందింది.

మా మా కుటుంబాల సంగతులు తెలుసుకోడంలో మన పూర్వీకుడయిన మేజరు అన్నగారే ఈ కుటుంబానికీ పూర్వీకుడు.

అతి సంతోషంతో ఆ పూర్వపు చుట్టరికం తలుచుకుంటూ ఎలాగో కాలక్షేపం చేస్తూ గౌరవంగా బ్రతుకుతున్న నా ప్రాణప్రియ ఎలిజబెత్ తల్లితండ్రులకడకు మేము ఇద్దరం వెళ్ళాం.

వాళ్ళు నన్నెంతో గౌరవం చేశారు. కాని నా, ఎలిజబెత్తుల వివాహానికి ఒప్పుకోలేదు. ఎలిజబెత్తు అన్నగారు బాగా విముఖుడయ్యాడు. సంపూర్ణ భారతీయుణ్ణి తన చెల్లెలు చేసుకోడానికి ఒప్పుకుంటాడట గాని, యూరేషియనును చేసుకోడానికి ఒప్పుకోడట.

అక్కడనుంచి విజ్జీకి, ఆమె కుటుంబానికీ విడాకులు సంభవించినంతయింది. చివరకు పార్సెన్ (ఒక మతోద్యోగి) అయిన ఆ బాలిక తండ్రే మా వివాహానికి ఒప్పుకున్నాడు.

చెల్లీ! నేనిప్పుడు ఏడవ ఆనంద స్వర్గంలో ఉన్నాను. తండ్రిగారికి, అమ్మగారికి కూడా ఉత్తరాలు రాశాను.

కాబోయే నా మామగారిని ఒప్పించింది, మూర్తి! మూర్తి అంటే ఎవరనుకున్నావు? అంత తక్కువజాతి హిందువుడైనా, అంత పెద్దజాతి యువకుడు ఇంకోడు లేడు. అతడు అమృతం. అతడు పనిలో ఒక పెద్ద డైనమో! ఎప్పుడూ ఆలోచనే! ప్రతి విషయాన్ని గురించీ తర్కించుకుంటాడు. ఆలోచిస్తాడు. అర్థమై, అవగాహనమై పూర్తిగా అతని మెదడు సొత్తు అయినవరకూ ఆ విషయాన్ని గురించి తెలుసుకోవడం మానడు. ప్రతిజ్ఞచేత ప్రతిభ సంపాదించుకునే మహాతపస్వి. ఈ దేశంలో ఉన్న విద్యుచ్ఛక్తి కర్మాగారాలకు వెడ్తాడు. నన్ను తనతో లాక్కుపోతాడు. అతడు చదువుతూ నాకు వినిపిస్తాడు, నన్ను చదివిస్తాడు, నా చేత తనతోపాటు లెక్కలన్నీ చేయిస్తాడు.

ఇంక మూర్తి గుణగణాల్ని గురించి నేను వర్ణించలేను. ఎవరో షేక్సుపియరో, బెర్నార్డుషా ఓ రావాలి! అంత నీచస్థితిలో ఉన్న సంఘంలోనుంచి అలాంటి మహోత్తముడు ఎలా వచ్చాడు!

నీ కీ తపస్సుకు కారణం ఏమిటంటే, "మహాత్మాగాంధీ ముఖ్యంగా!" అంటాడు. "ఈనాటి కాలం రెండు" అంటాడు.

మూర్తి మా కాబోయే మామగారితో మహాత్మునిలా మాట్లాడాడు. అతని మనస్సు తిప్పినాడు. మూర్తి వేదాంతమే వేరు; గాంధీని గురించి మా యిద్దరకూ కొన్ని నెలలు వాదనలు జరిగాయి.

చేతి పరిశ్రమలు మానవకృషి అట! అవి దివ్యోన్ముఖాలట! యంత్ర పరిశ్రమ రాక్షసమట (సాటానెస్క్యు)! సైతానును మనం లోబరచుకుంటే రాక్షసత్వాన్ని బానిసగా చేసుకున్నట్లు మాత్రమట! సైతానును భగవతోన్ముఖం చేస్తే, సైతాను అప్పుడు తనలోని దేవత్వం తిరిగి పొంది మనలను కూడా దేవతా మానవులుగా మారుస్తాడట!

రష్యా బోల్షివిజము రాక్షసత్వాన్ని బానిసగా చేసుకున్నదట. ఇంగ్లండు అమెరికాలు రాక్షసత్వానికే బానిసలట. రష్యాబోల్షివిజంతో గాంధీతత్వం రంగరిస్తే ప్రపంచ సమస్యలు సిమెంటుదారులు కావుగదా, వజ్రాలదారులవుతాయట.

హిందూ సంఘంలో తామెంత నీచస్థితిలో ఉన్నారో, మనమూ, తెల్లజాతిలో అంతకన్న నీచస్థితిలో ఉన్నామట. ఆ స్థితిని తీసివేసుకునే శక్తి మనలోనే ఉందంటాడు. దానికి ముఖ్య మార్గం మనం సంపూర్ణంగా భారతీయుల మనుకోవాలట. భారతీయులు తమ అభ్యుదయం కోసం, తమ స్వాతంత్ర్యంకోసం ఏఏ మహాసంస్థలు ఉద్భవింప చేసికొని మహా పోరాటం సాగిస్తున్నారో, ఆయా సంస్థలలో మనం కూడా చేరాలట. ఇంతవరకు మనం అలా చేయటం లేదట! చెల్లీ నువ్వీ స్నేహితునితో కలుసుకు మాట్లాడి తీరాలి.

ప్రేమతో

లయొనెల్

ఈ ఉత్తరం చదువుకుంది. తన చిన్నన్న ప్రతి ఉత్తరంలోనూ ఆ బాలకుణ్ణి గురించి వ్రాస్తున్నాడు. ఏమి రకం యువకుడో అతను? అని మాత్రం ప్రశ్నించుకుంటూ ఉంటుంది జెన్నిఫర్.

## (2)

1934 నుంచి 1937 డిశంబరు వరకు అన్నగారు లయొనెల్ ఇంగ్లండు నుంచి ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. తనకూ తన ప్రియమూర్తి ఎలిజబెత్‌కు అంతకన్న, అంతకన్న ఎంత పరమాద్భుతమయిన ప్రేమో వృద్ధి అయిందట. తన చదువు వొక మోస్తరట, తన ప్రాణస్నేహితుడు మూర్తి చదువు అఖండ దీప్తితో ప్రజ్వలిస్తోందట!

పరీక్షలు కాగానే అన్నగారు రాసిన ఉత్తరంలో మూర్తి ఆ ఏడు జయమందిన వారందరిలో మొట్టమొదటి వాడుగా వచ్చాడనీ, తాను ఒక్క మొదటి తరగతిలో మాత్రం రాగలిగానని, తనకూ మూర్తికి తాతావారు తమ నగర్ కర్మాగారానికి రమ్మన్నారని, అందుకు మూర్తి ఒప్పుకోలేదనీ, తాను ఒప్పుకున్నాననీ ఉత్తరం రాశాడు.

ఆ ఉత్తరంలో మూర్తి అమెరికా వెడుతున్నాడనీ అక్కడ టెన్నెసీనది ఆనకట్టలు, అందువల్ల విద్యుచ్ఛక్తి ఉద్భవించే విషయాలను గూర్చి నేర్చుకోడానికి వెడుతున్నాడనీ వ్రాశాడు. తాను ఇంగ్లండూ, జర్మనీ, రష్యాలలో విద్యుచ్ఛక్తి విధానాలన్నీ పరీక్షించి నేర్చుకువస్తాడట. ముఖ్యంగా రష్యాలో "నీరునది" ఆనకట్ట, దానివల్ల విద్యుచ్ఛక్తి ఉద్భవించే విధానమూ ఒక సంవత్సరంపాటు నేర్చుకువస్తాడట. అందుకయ్యే ఖర్చు అంతా "తాతా" కంపెనీవారే ఇస్తున్నారు అనీ రాశాడు.

తాను ఎలిజబెత్‌ను వివాహమై, ఆమెతో కూడా రష్యా మొదలయిన దేశాలన్నీ చూస్తాడట.

అన్నగారు రాసిన ఉత్తరాలలో వర్ణింపబడిన ఆ "మూర్తి" ఎవరు చెప్మా అన్న ప్రశ్న జెన్నిఫర్ హృదయంలో ఉద్భవించింది. తన తల్లితో మూర్తిని గూర్చి చర్చించేది. తనకు అన్నగారు రెండు డజన్లు ఫోటోలు పంపించాడు. అందులో మూడు మూర్తీ తాను తీయించుకున్నవి; నాలుగు తన్ను ఒక్కణ్ణే మూర్తి వివిధ స్థలాలలో తీసినవి, రెండు అన్నగారు ప్రత్యేకంగా ఒక మంచి కంపెనీలో తీయించుకున్నవి. రెండు మూర్తి ఫోటోలు తాను తీసినవి. తానూ తన కాలేజీ విద్యార్థులూ ఆచార్యులూ అందరూ కలిసి తీయించుకున్నవి రెండు. అన్నగారు అతని ప్రియురాలు కలసి తీయించుకున్నవి మూడు. అతని ప్రియురాలు ఒకటి. ఆమె కుటుంబము బొమ్మ ఒకటి. తక్కినవి ఇతరాలు.

మూర్తి ఫోటో మాత్రం జెన్నిఫర్‌ను కొంచెం ఆకర్షించింది. ఆ అబ్బాయి చరిత్ర విచిత్రమయిందన్న ఆశ్చర్యము, ఈతని సంఘం అంత దుర్భరమయిన స్థితిలో ఉన్నదన్న కరుణ, అంత అధోగతి స్థితిలోనుండి పట్టుదలతో, అద్భుతమైన శక్తితో ఇలా పైకి వస్తున్నాడన్న గౌరవమూ ఆమెకు కలిగాయి.

ఆ ఫోటోలన్నిటిబట్టీ యీ అబ్బాయి ఎలా ఉంటాడు అని ఊహించుకునేది. కారునలుపు కాకపోయినా, నలుపే! ముఖం మాత్రం విశాల ఫాలంతో, గుండ్రనితనంలోకి

వచ్చే కోలతనంతో, చదరపు గడ్డంతో, స్పష్టమయిన రేఖలతో, శక్తిని సూచించే వంపులతో వీరుని ముఖాన్ని ప్రత్యక్షం చేస్తున్నది.

వైద్య విద్యార్థులకు స్త్రీ పురుష సంబంధాల విషయంలో లేనిపోని పిచ్చిపిచ్చి భావాలు లేవు. రతి అనేది భౌతికమయిన అనుభవం. అందులో ముఖ్యంగా నరముల స్పందన ఎక్కువ ఉంటుంది. ఆ నరముల ద్వారా మెదడుకు ఆనందం కలుగుతుంది. భౌతికమయిన వాంఛలకు నరాల స్పందనవల్ల ఆనందం అనుభవం మెదడుకు కలుగుతుంది.

కోపం కలుగడానికి ఇంకొక మనుష్యుడు ఎదురు ఉండాలి. అలాగే స్త్రీ పురుష సంబంధమయిన వాంఛకు స్త్రీ పురుషులొకరి కొకరు తారసిల్లాలి.

జెన్నిఫర్ కొంచెం పొట్టి, నాలుగడుగుల పది అంగుళాలుంటుంది. ఐనా పొంకం కలిగిన అవయవాలతో బంగారు తీగలా వుంటుంది.

ఆ అమ్మాయి సముద్ర స్నానానికి వెళ్ళినప్పుడు చూడాలి ఆమె దేహసౌందర్యం. ఆమె అంగాల పొంకం తీగెలుసాగిన పచ్చ సంపెంగ నికుంజము, పిడికిటకు దొరికె ఆమె నడుము, కటిరేఖలలో నాతిగా విస్తరించి స్నిగ్ధమై స్విన్నమై దంతం చెక్కిన జఘన వక్రతలలో పొంగి నదిలా పాదాలకు ప్రవహించింది. ఆమె వక్షోజద్వయ కలశాలు స్వచ్ఛరజిత స్వప్నాలు. ఆమె మోము కొద్దిగా కోలనై పైకి వట్రువతిరిగిన తిలపుష్ప నాసికతో, చిరుగులాబీ మొగ్గ జంట వదనంతో, మాలతీ పూలగుత్తి చిబుకంతో, చిరునవ్వుతో పాల్కడలి పొంగులై సుడులుపడి, ఉషారుణ వర్ణచ్ఛవుల ప్రసరించే గండఫలకాలలో శిల్పుల కాశయ ప్రత్యక్షమే ఆ బాలిక.

ఇసుకలో నడుస్తూ సముద్ర వీచికలలోకి చొచ్చుకు వెళ్ళుతూన్న జెన్నిఫర్ కలశాంబోధి తరంగోద్భవ ఘృతాచీ బాల! ఆమె నడక అరభీరాగ కల్పన. ఆమె ఒయారము శృంగార రసావిర్భావము. ఆమె మూర్తి ధ్వన్యాలంకార యుక్త పరమ సౌందర్య కావ్యము.

ఆ బాలికను ఆశించని యువకుడు వైద్య కళాశాలలో మదరాసు నగర పథాలలో ఎవ్వరూ లేరు. తేనె, ద్రాక్ష, సారాయీ వకుళపరీమళమూ రంగరించిన సౌందర్యము ఆమె కంఠస్వరం. భారతీయ స్త్రీ కంఠంలోని కాకలీతనమూ, ఆంగ్ల స్త్రీ కంఠంలోని గంభీరతా రెండూ యమునా గంగా సంగమమయ్యాయి.

ఆ జవ్వని అజంతా గుహలలో తథాగతుని ఎదుట లాస్యమాడు మారదేవ తనయ! ఆయోష, ఎల్లోరా గుహలలో ఇంద్రసభా యుక్త శచీదేవి!

## 3

జెన్నిఫర్‌కు తన అన్నకు అంత సన్నిహితుడైన మూర్తిని చూడాలన్న వాంఛ కలిగింది. అన్న ఒక ఉత్తరంలో మూర్తికి జెన్నిఫర్ ఛాయాచిత్రం ఒకటి. తన కుటుంబం అంతా తీయించుకున్న ఛాయాచిత్రం ఒకటీ ఇచ్చానని వ్రాసినాడు. జెన్నిఫర్ తన అన్న పిచ్చివాడనుకొంది.

జెన్నీ! మూర్తి నీ ఛాయాచిత్రం చూస్తూ నేను పక్కన ఉన్నానన్న విషయం మరిచిపోయాడు. "ఏమిరా మా చెల్లి బొమ్మలో ఏమి విచిత్రత ఉంది?" అని ప్రశ్నించాను. మూర్తి తెల్లబోయి చిరునవ్వు నవ్వి,

"మీ చెల్లి వైద్య కళాశాలలో చదువుతోంది కాదూ లయొనెల్?" అన్నాడు.

"అవును నాయనా! అందంలో మా చెల్లి ఎదుట నిలువగల బాలిక ఈ ప్రపంచంలో లేదు. ప్రపంచమందు పందెం వేస్తే మా జెన్నీ మిస్ ప్రపంచం అయి తీరుతుంది."

"నువ్వన్న మాటల్లో అసత్యం ఏమీలేదు. ఛాయా చిత్రమే ఈలా ఉంటే, అసలు ఆ బాలిక-"

"నీ మతి మాయమంత్రం చేస్తుంది."

"మీ చెల్లెలు."

"చెప్పూ-"

"మీ చెల్లెల్ని మనం ఇండియాకు వెళ్ళగానే దర్శనం చేసుకోవాలి!"

"ఈలా మా సంభాషణ జరిగింది జెన్నీ!" ఈ ఉత్తరం పదిసారులు చదువుకుంది. తర్వాత చదువులో నిమగ్నురాలయింది.

ఆ రాత్రి ఆ బాలిక కాలేజీనుంచి వచ్చి పుస్తకాల బల్ల ముందర కూర్చుంది. మనస్సు పాఠశాలమీదకు పోదు. ఏదో ఆవేదన! తనకు ఇరవై రెండేళ్ళు జరిగి ఇరవై మూడవ సంవత్సరం వచ్చింది. తాను అందంగా ఉన్నానని ప్రతి మగవాడూ భట్రాజులా పొగడుతాడు. ఈ అందం శరీర శాస్త్రపరంగా చూస్తే ఏముంది? వృక్షశాస్త్ర పరంగా మనం తినే కాయగూరలు ఏమున్నాయి? అయినా అవి సేవిస్తూంటే భోజనం ఎంత ఆనందంగా అనుభవించడం లేదు. జీవితం నిండి జీవితాన్ని అధిగమించిన ఏదో ఒక అనుభూతి మనుష్యులను కదిలించి వేస్తూ ఉంటుంది.

తన జాతి స్థితి ఏమిటి? బ్రిటిషు ప్రభుత్వం ఎంత కాలం ఈ దేశం పరిపాలిస్తూ ఉంటుందో, అంతకాలం పశు శరీర సౌందర్యం కల తనబోటి యువతులకు తెల్లసైనిక మిండగాళ్ళకు కొదువలేదు. ఆ మగ పశువులను ఆకర్షించే ఆడ పశువులుగా తన జాతి స్త్రీలు తయారై తన జాతిని ఎంత నీచగతిలోకి తీసుకువచ్చారు.

అటు ఎల్లమందమూర్తి కులం ఆడవాళ్ళు తనజాతికి తల్లులైతే, ఇంగ్లండునుండి వచ్చిన తెల్ల పశువులు తన జాతికి తండ్రులయ్యారు. ఇదేస్థితి బర్మాలో, మలయాలో, జావాలో, ఇండోచీనాలో, ఆఫ్రికాలో, సర్వదేశాల్లోనూ అటు యూరపుకూ చెందక, ఇటు ఆసియాకు చెందక అతి నీచజాతి ఓటి ఈ ప్రపంచంలో ఉద్భవించడానికి కారణం తనబోటి నీచ స్త్రీలు. ఆమె కంటివెంట అశ్రుబిందువులు జలజలా ప్రవహించినాయి.

ఈ నిర్వేదనానికి కారణం అన్నగారు వ్రాసిన ఉత్తరం! ఎల్లమందమూర్తి భారతీయ హిందువులలో అతి నీచస్థితిలో వున్న ఒక కులానికి చెందిన బాలకుడు. అతడు చదవడానికి ఎలా ఏర్పాటయింది. అతడే చదువుతున్నాడా? అతని ఊరేది? జిల్లా ఏది? అతని చదువు అతన్ని ఇంగ్లండుకు ఏలా తీసుకువెళ్ళింది. అతనికి ధనం ఎవరిస్తున్నారు?

ఈలాంటి సంగతులు తన జాతివారు ఎవ్వరూ ఆలోచించరు. తాము భారతీయులము కామనుకుంటారు. ఆంగ్లేయులు కాలేరని తమవారికే తెలుసును. తాము బానిసలము, అధోగతిలో ఉండవలసిన వారము, అసభ్యమైన మాట లేకుండా మాటలాడలేనివారం, చదువు లేనివారం. రైల్వే ఉద్యోగాలూ, మదరాసు పోలీసు సార్జంటు ఉద్యోగాలు ఇలాంటివి తప్ప తమకు ఇంకో రాజకీయాలు లేవు. ఈ హిందూ దేశంలో

ఎన్ని రాష్ట్రాలున్నాయి, ఎన్ని మతాలున్నాయి. ఆ మతాలేమిటి, భారతదేశపు ఆర్థికస్థితి ఏమిటి? సాంఘిక వ్యవస్థ ఏమిటి? తమ వారికి ఎప్పుడన్నా పట్టిందా?

ఈ 1934 నవంబరు (మహాత్మాగాంధి చేసే మహోత్కృష్ట కార్యక్రమం ఏమన్నా తనకుగాని, తనవాళ్ళకుగాని, తనబోటి తమ జాతివారికిగాని తెలుసునా? తామంతా తెలుసుకుందామని ప్రయత్నం చేశారా?

యూరేషియన్ జాతట? ఏషియో యూరపియనులు అన్న పేరు పెట్టుకోలేదట? అది సిగ్గు, అవమానకరం! తాము వేసుకునే దుస్తులు పాశ్చాత్య దేశాలల్లో పాకీదొడ్లు ఊడ్చే కూలీలన్నా వేసుకోరే! అయినా ఆ దుస్తులు వేసుకొని ఇంగ్లండునుండి పి.అండ్.కో., నౌకమీద అప్పుడే దిగి వచ్చిన ఆంగ్లేయులులా తల ఎత్తి తిరగడం, తలంతా బొప్పెలు కట్టడం!

దేహం యూరోపియనులకున్న నిర్మలతా, స్వచ్ఛతా లేకుండా, తెల్లదంతం రంగుకడ ప్రారంభించి నల్లటికారు రంగు వరకూ ఉన్నది.

జెన్నిఫర్ తల హృదయంపైన వాలిపోయింది. వక్షోజాలు నిట్టూర్పుతో ఊపిరి పీల్చినప్పుడల్లా పైకి ఉబుకుతున్నాయి, దిగిపోతున్నాయి.

తమలో నాయకులు లేరు, తమకు సలహా చెప్పేవారు లేరు. ఎవరు తమతో మానసిక పథాల దూరాలకు పోగలవారు? తమలో డబ్బున్న ఆ స్త్రీలు ఏదో కొంచెం మర్యాదగా బ్రతుకుతారు. కాని వారు కొంచెం చదువు చదువుకొని నర్సులుగా, టైపిష్టులుగా ఇంగ్లీషు షాపులలో అమ్మకపు స్త్రీలుగా చేరుతారు.

ఆమె ఆలోచనలే ఆమెకు భయం కలిగించాయి. ఆమె హృదయంలో భరింపరాని బరువులు చేరాయి.

ఇంగ్లీషులో నెమ్మదిగా తన పియానోమీద ఏదైనా ఓ పాట వాయించుకుంటే, ఆవేదన అణిగిపోవచ్చుననుకొంది. పియానో కడకు వెళ్ళి మీటలు నొక్కింది.

*"మనుజుని తలపుల కవధే లేదా?*
*మనసుకు బానిసహృదయమె కాదా?*
*ఎవరికి వారే ఎరుగని పథముల*
*దారి వెదుకుతూ దారిని సాగుతు*
*ముందుకు పోవలె ముండ్ల పొదలలో*
*గండశిలలలో కర్కశ భూమిలో!*
*మనుజుని."*

## (4)

"జెన్నిఫర్‌లో ఏదో మార్పు వచ్చింది" అని యూరేషియన్ సంఘంలో యువకులు అనేకులు అనుకొనడం ప్రారంభించారు. ఎవరితోనైనా అవసరమైనప్పుడు తప్ప మాట్లాడడం మానివేసింది. ఎప్పుడూ ఏదో ఆలోచన. తన సంఘం విషయం ఏమి చేయదలచుకొన్నారని, సంఘ నాయకులైన 'కాల్నెల్‌గిడ్నీ' 'హానరబెల్ పెరైరా' 'సర్ ఫెర్నాండెజ్' మొదలయిన వారికి ఉత్తరాలు వ్రాసింది. తన సంఘము హరిజన సంఘంకన్నా ఎక్కువ అధోగతిలో

ఉందనీ హరిజన సమస్యతో యూరేషియన్ సమస్య కూడా తీసుకుని యూరేషియన్ల స్థితి ఉత్తమమయ్యే మార్గాలు ఉపదేశించి కాంగ్రెసువారి నిర్మాణ కార్యక్రమంలో భాగం చేయించాలనిన్నీ కోరుతూ జెయిలు నుండి విడుదలైన మహాత్మునికి పెద్ద లేఖ పంపించింది.

మహాత్ముడు అప్పుడే హరిజన సమస్య విషయంలో దేశ పర్యటన ప్రారంభించాడు.

"అమ్మాయీ" నీ ఆవేదన నాకు అర్థమయింది. నీ యూరేషియన్ సంఘము అతి నీచస్థితిలోనే ఉంది. కాని హరిజన సమస్య వేరు. మీ సమస్య వేరు. మీ సంఘం కావాలని అతి నీచస్థితిలోనికి ఉరికింది. మీ నీచస్థితికి మీరే కారకులు. భారతీయ క్రైస్తవులు తమ స్థితిని తామే బాగుచేసుకుంటున్నారు. అలాగే యూరేషియను సంఘమూ తన స్థితిని తానే బాగుచేసుకోవాలి! పార్శీ సంఘమూ చిన్నదే! ఆ సంఘము ఈనాడూ, వెనకా ఎప్పుడూ ఉత్తమస్థితే ఆక్రమించుకొంటున్నది - హరిజన సంఘం అలాంటిది కాదు. ఆ సంఘం ఈనాడు అనుభవించే కడగండ్లు, ఆవేదనలు, అవమానాలు మొదలయిన వానికన్నింటికీ హిందూ సంఘంలోని ఉత్తమ కులాలవారు బాధ్యులు, అందుకని ఆ సమస్యా పరిష్కారం నా అహింసా వ్రతంలో భాగమయింది. నేనూ ఆ ఉత్తమ కులాలకు చెందిన హిందూ మతస్థుడను. కాబట్టి ఇన్ని యుగాలనుండి ఆ ఉత్తమ కులాలవారు చేసిన ఘోర పాపాలకు వారితోపాటూ నేనూ ప్రాయశ్చిత్తం సలుపుకుంటున్నాను. ఆ సంఘాన్ని తక్కిన హిందువులతోపాటు సమం చేయాలని నా దీక్ష!

"నువ్వన్నట్లు ఆ హరిజన స్త్రీలలో ఎంతోమంది మీకు తల్లులే. పాపం ఆ కల్మషరహిత చరిత్రలు తమ దుర్భర స్థితివల్ల మీ సంఘానికి తల్లులయ్యేటట్లు పాపాలు సలిపినారు. అందుకని ఉత్తమ కులాల హైందవులు మీ స్థితికి కొంత కొంత బాధ్యత వహించవలసినదే! మీ పూర్వీకులూ, మీ పూర్వీకుల తండ్రులైన ఆంగ్లేయులూ మొదలయిన పాశ్చాత్యుల మతమే మీ పూర్వీకులు తీసుకున్నారు. ఆ పాశ్చాత్యులు మీకు ఏ అభిమానం చేతనో అనేక చిల్లర సహాయాలు చేస్తున్నారు. ఆ సహాయాలు మీరు పూర్తిగా గ్రహించి.

1. సంపూర్ణంగా చదువుకోవడంవల్లనూ,

2. ఎక్కువ నైతిక ప్రవర్తన అలవరచుకోవడంవల్లనూ,

3. మీలో చాలామంది కాంగ్రెసులో చేరి, అహింసావాదులై దేశసేవ చేయడానికి సిద్ధం కావాలి. "మేము భారతీయులం కాము." అని అనుకోవడం మానివేయాలి. మీ వాళ్ళు బ్రిటిషు దొరలు భోంచేసే బల్లదగ్గిర పడిన ఆహారపు నలుసులు తినే కుక్కలము - అని అనుకోవడం మానివెయ్యాలి.

ఈ కారణాలవల్లనూ మీ సంఘం ఉన్నతస్థితి పొంది తక్కిన భారతీయ సంఘాలతోపాటు అవుతుంది."

మహాత్ముడు రాసిన ఉత్తరం ఒక అందమైన పెట్టెకొని అందులో పవిత్రతా భావంతో దాచుకొంది.

కాబట్టి తన యూరేషియను సంఘంలో మదరాసులో 1934 క్రిష్టమస్‌కు జరిగే ఉత్సవాలలో ఆమె పాల్గొనదలచుకోక ఎంతమంది చుట్టాలూ, స్నేహితులు, నాట్యాలకూ, విందులకూ పిలిచినా, ఆ పిలుపు నిరాకరించింది జెన్నిఫర్.

ఎం.ఎస్.ఎం. రైల్వే జిల్లా ఇంజనీరుగా ఉన్న యువకుడు, విలియం ట్వీన్‌హాం అనే అతడు, జెన్నిఫర్‌ను భార్యగా వాంఛిస్తున్నాడు.

ఎన్నాళ్ళనుంచో ఆ యువకుడు జెన్నిఫర్ వెంట తిరుగుతూ, ఆమెను సుముఖం చేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

అతడు గుంతకల్లు రైల్వే జిల్లాకు ఇంజనీరు. కేంద్ర స్థానం గుంతకల్లు. అతడు తన స్వంత పెట్టెలో పెద్ద బండిమీద రాయచూరు వరకు, చిన్న బండిమీద హిందూపురం వరకూ, ఇటు కంభం వగైరాదులన్నీ తిరుగుతూ ఉండవచ్చును.

అతడు మదరాసు ఇంజనీరింగు కళాశాలలో చదువుకొనేటప్పుడు, జెన్నిఫరును ఎప్పుడూ కలుసుకొనేవాడు. ఇద్దరూ కలిసి నాట్యం చేసేవారు. ఇద్దరూ కలిసి సినీమాలకు వెళ్ళేవారు. సముద్ర తీరాలకు వెళ్ళేవారు. "విల్లీ" జెన్నిఫర్ అందం చూచి ఆమెకు దాసానుదాసు డయ్యాడు. ఆమె అతడు తన్ను కౌగిలించుకొన్నా ఊరుకొనేది. జుట్టూ, మెడ ముద్దుపెట్టుకోనిచ్చేది. కాని కన్నులు, పెదవులు, బుగ్గలు, గొంతుక, వక్షోజాలను ముద్దు పెట్టుకోనిచ్చేది కాదు. నాట్యం చేసేటప్పుడు, వాహ్యాళిలో నడయాడేటప్పుడు జెన్నీ నడుం చుట్టూ గాఢంగా చేయి పోనిచ్చి తన పక్కకు గట్టిగా అదుముకొనేవాడు.

వాళ్ళ చుట్టాలందరూ జెన్నీ, విల్లీల వివాహం తథ్యం అని అనుకొనేవారు. విల్లీకి జెన్నీ మంచి సంబంధం, జెన్నీకి విల్లీ తగిన వరుడూ అని పెద్దలలో స్త్రీలూ, పురుషులూ ముచ్చటపడేవారు. తండ్రి మాత్రం "జెన్నీ ఇంకా చిన్న పిల్ల" అనుకుంటూ వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోదలుచుకోకుంటే, అతడు ఇంజనీరు పరీక్ష పూర్తి చేసేంత వరకూ పెళ్ళిమాట తలపెట్టవద్దు, అని ఆజ్ఞ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. కాని ఎన్నాళ్ళు ఎదురు చూచినా, ఆ పెద్దలకెవ్వరికీ ఈ శుభ వర్తమానం తెలిసింది కాదు.

విలియమ్సు బి.యి.లో విజయం పొందాడు. తన పెద్దల ప్రాపకంవల్ల ఒక ఏడాది ఆ రైలు కంపెనీ ముఖ్య ఇంజనీయరుగా పనిచేసి ఇప్పుడు జిల్లా ఇంజనీయ రయ్యాడు. ఇప్పుడాతనికి ఇరవై అయిదేళ్ళు నిండి ఆరవ ఏడు జరుగుతున్నది.

జెన్నిఫర్ వైద్యకళాశాలలో ప్రవేశించిన కొత్తలో అతణ్ణి గాఢంగా తన పెదవులను ముద్దుపెట్టుకొన నిచ్చింది! బంగారు బంతులులా ఉన్న ఆమె హృదయ కలశాలను అతడు తన హృదయానికి అదిమివేశాడు.

"జెన్నీ, మన వివాహం మాట ఏమిచేశావు? నువ్వు దేవకన్యవు. నువ్వు నడచిన పథంలో నేను నడవడానికన్నా అర్హుణ్ణికాను. అయినా ఈ భక్తుణ్ణి త్వరలో అనుగ్రహించవా?" అని విల్లీ గాఢమయిన మత్తుమాటలతో ఆమె చెవి ముద్దుపెట్టుకుంటూ అడిగాడు.

"విల్లీ నేను వైద్య కళాశాలలో చేరినానుకదా?"

"అయితే ఏమి, మన పెళ్ళి పూర్తి అయినా నువ్వు ఇక్కడే ఉండి చదువుకోవచ్చును. నా చదువూ ఇంకా పూర్తి కాలేదుకదా?"

"అందుకనే ఏ విషయమూ నీ చదువూ, నా చదువూ పూర్తి అయిన వెనుక మాట్లాడుకొందాం."

"ఈలోగా పెళ్ళి చేసుకుందాము అని నిశ్చయించుకుందాము."

"ఆ విషయం ఇప్పుడప్పుడే నిశ్చయం చేసుకోవద్దు విల్లీ!"

"అదేమిటి?" అతని ఆశ్చర్యానికి అంతులేదు. అతని మోము వైవర్ణ్య మొందింది.

"కంగారుపడకు విల్లీ!"

"నువ్వు నన్ను ప్రేమించటం లేదా?"

"ఇంకా నేనేమి నిశ్చయానికి రాలేదు?"

"అయితే-?"

"అయితే ఎల్లా ముద్దు పెట్టుకోనిచ్చావూ?" అని ప్రశ్న! అంతేనా? ఈ ఇరవైయవ శతాబ్దంలో ముద్దులకు స్నేహార్ద్రత తప్ప ఇంకో అర్థంలేదు. అందుకనేగా ఇంతవరకు నిన్ను నా పెదవులు ముట్టనివ్వలేదు: నువ్వు ప్రస్తుతం నాకు చాలా దగ్గిర స్నేహితుడవు. ఇంక కొంచెం అయితే నా పురుషుడవే అవుతావు!"

"ఇంతేనా నీ భావం. నాకు ఆశలేనట్లే! ఎందుకు నా బ్రతుకు! నేను నీకు ఆటవస్తువును అయ్యానా జెన్నిఫర్?"

తన్ను "జెన్నీ" అని పిలవకుండా "జెన్నిఫర్" అని పిలవడం ఆమెకు అతని హృదయవేదనా, అతనిలో ఉద్భవించిన కోపమూ అర్థమైంది.

"నామీద కోపం వచ్చిందా విల్లీ?"

"నీమీద కోపం ఎందుకూ, నామీదే నాకు కోపం!"

అతడు అతి విచారంతో వెళ్ళిపోయాడు. ఆరునెలల వరకు అతడు మళ్ళీ జెన్నిఫర్‌ను కలుసుకోలేకపోయాడు. 1935వ సంవత్సరం జూన్ నెలలో ప్రత్యేకం ఒక నెలరోజుల పాటు సెలవు పుచ్చుకుని విల్లీ మదరాసు వచ్చాడు. ఆ నెల రోజులూ అతను జెన్నీ మనస్సు కరిగించేసిన ప్రయత్నం ఇంతా అంతా కాదు. కాని జెన్నీ తనచుట్టూ నిర్మించుకొన్న కోట మొదటి గుమ్మం అన్నా అతడు దాటలేక పోయాడు. ఈ మార్పుకు కారణం గాంధీజీ ఉత్తరం.

జెన్నిఫర్ అతిమర్యాద భావము ప్రవహించింది. "ఒహో!" అంటే "ఓహో" అని మారు పలికింది. చిరునవ్వు నవ్వింది. "చాలా విచారంగా ఉంది. నీతో వాహ్యాళికి రాలే" నంది, "నాకిప్పుడు సినిమాలకు వ్యవధిలేదు" అంది. "ఈ ఏటి పరీక్షలు గడ్డుపరీక్ష"లంది.

వారం రోజులు ప్రయత్నించి, నిష్ఫలుడై నిరాశ పొంది, నిట్టూర్చి విల్లీ వెళ్ళి; జెన్నిఫర్‌కన్న బాగోగులా, ప్రపంచ స్థితి, జీవితంలోని నిజానిజాలు తెలుసుకొన్న "మాడలైను" కన్యను పెళ్ళి చేసుకొన్నాడు. పెళ్ళికి జెన్నిఫర్‌ను పిలిచారు. జెన్నిఫర్ అప్సరసలా వేషం వేసుకొని పెళ్ళికి వెళ్ళింది. భార్యాభర్తలకు మంచి వెలగల వెండి భోజనపు గిన్నెల సెట్టు బహుమతి ఇచ్చింది. మాడలైను అందమైనదే!

అయినా జెన్నిఫర్‌నూ మాడలైనునూ పోల్చుకుంటూ స్వర్గంలో నందనవనాన్ని పోగొట్టుకొని మదరాసులో తేనాంపేట తోటను సంపాదించుకొన్నాననుకొని ఒక నిట్టూర్పు వదలి, ఇంతే చాలుననుకొని, విల్లీ మాడ్‌ను తమ మధురమాసాన్ని గడపడానికి నీలగిరి కొండలకు తేల్చుకొని పోయాడు.

## 5

జెన్నీ జీవితంలో ఇంకో అంకం కూడా గడచిపోయింది. 1936 సంవత్సరాంతానికి ఆమె వైద్యవిద్య పూర్తి అయింది. తర్వాత వచ్చే ప్రసూతి వైద్యాలయ వైద్యపు తయారు పరీక్షా పూర్తి అయింది.

జెన్నిఫర్ మదరాసు ప్రసూతి వైద్యాలయంలో గౌరవ వైద్యురాలిగా చేరింది.

కాంగ్రెసు రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చినాయి.

జెన్నిఫరు అన్నగారు తన భార్యతో 1938 వ సంవత్సరం మధ్యలో భారతదేశానికి వచ్చి దక్షిణ భారత రైల్వేలో ఇంజనీరుగా ప్రవేశించాడు. లయొనెల్ తిన్నగా భార్యతో మదరాసే వచ్చాడు.

అన్నా చెల్లెళ్ల ఆనందం వర్ణనాతీతమైంది. అన్నగారి ఆనందంకన్న చెల్లెలు ఆనందం ఆకాశానికే ఎగసింది.

అన్నను జెన్నిఫర్ గాఢంగా కౌగలించుకొని, "ఎన్నాళ్ళకు చూచాను అన్నా నిన్ను? నువ్వు ఎంత తెల్లపడ్డావు. అచ్చంగా ఇంగ్లీషువానిలాగే వున్నావు" అన్నది.

అన్నగారి భార్య అసలు ఇంగ్లీషు బాలిక. ఆమెను రాగానే కౌగలించుకొని ముద్దుపెట్టుకొంది. ఎలిజబెత్తు ఎంతో సాధారణంగా బ్రతికిన, ఇంగ్లీషు మధ్య వర్గపు కుటుంబానికి చెందిన పిల్ల. హైస్కూలు విద్య పూర్తియై తండ్రికే కార్యదర్శిగా ఉండేది. ధనం వాంఛించింది. ఏ బెంట్లీ కారులోనో కొన్ని వేల కాసులు ఖరీదుగల దుస్తులు వేసుకొని లిండను బజారులో తిరుగుతూ ప్రతి పెద్దషాపులోను అందమైనవి, అతి విలువ కలిగినవి వస్తువులు కొనుక్కుంటూ, తనతో అందాలూ, పురుషత్వమూ వెదజల్లే పురుషుడు అపోలో దేవునిలా కూడా రాగా గులాబి పుష్పపుటాలలాంటి తన చెవికమ్మలు, గులాబిపువ్వులలాంటి తన బుగ్గలు, గులాబి మొగ్గలవంటి తన పెదవులూ ముద్దుబెడుతూ తన్ను గాఢంగా అదిమివేస్తూ, వెన్నెలలా తెల్లనై, స్నిగ్ధాలైన పొంకాలైన తన వక్షోజాలు నలిపివేసే యువకుడు, తన్ను కంగారు పెడుతూ ఉండగా తిరగాలని ఆశించేది, కలలు కనేది. ఆ ఎలిజబెత్తును ఒకనాడు లండనులో లయొనెల్ కారు ప్రమాదంనుండి రక్షించాడు.

ఆ నాటినుండి ఎలిజబెత్ జీవితం మారిపోయింది. భావాలు మారిపోయాయి. స్వప్నాలూ మారిపోయాయి. ఏది చేయకూడని పనో అదే చేసితీరడంలో ఉన్న ఆనందం, రైలు పట్టాలతనంలో లేదు. స్వచ్ఛమైన ఇంగ్లీషువారు భారతీయుల్ని పెళ్ళిచేసుకోవడం తప్పు. అందుకని ఎలిజబెత్తుకు ఆ పనే చేయాలన్న ఉద్రిక్త భావం కలిగింది. ఆ భావాలకు తగినట్లు తాను నిజంగా లయొనెల్‌ను ప్రేమిస్తున్నది. ఆ విధంగా ఈ వివాహం సుఖాంతంగా పరిణమించింది.

అన్నగారు భార్యతో ఉద్యోగంలో చేరినదాకా "కానొమారా" హోటలులో మకాముపెట్టి ఉద్యోగంలో చేరగానే తిరుచునాపల్లి పోయి చార్జి పుచ్చుకున్నాడు. అక్కడ లయొనెల్‌కు రైల్వేవారి బంగళా నివాసానికి ఉన్నది. కావలసినంత మంది నౌకర్లు, చాకర్లు; ఎలిజబెత్‌కు ఆనందంగానే ఉంది.

లయొనెల్ తిరుచునాపల్లి పోయి చార్జి పుచ్చుకోక మునుపు, ప్రతిరోజూ జెన్నీ అన్నగారిని కలుసుకొనేది. లయొనెల్ దంపతులు జెన్నీ ఇంటికి వచ్చేవారు – లేదా జెన్నీ కానొమేరాకు పోయేది. లయొనెల్ వైద్య కళాశాలలో జెన్నీని కలుసుకొనేవాడు.

ఈలా కలుసుకొన్నప్పుడెల్లా "ఎల్లమందమూర్తి"ని గురించి సంభాషణలు వచ్చేవి.

"జెన్నీ! మూర్తి హృదయం చాలా విచిత్రమయింది. ఈ దేశంలో హిందూ సంఘంలో అతి నీచస్థితిలో ఉన్న కులాలల్లో ఒకదానిలో ఉద్భవించాడతడు!"

"అతడు చదువుకోడం ఎలా సంభవించింది?"

"అది విచిత్ర సంఘటన! భగవంతుడుంటే – ఉన్నాడని నాకు పూర్తి నమ్మకం కుదిరింది. జెన్నీ – అతడే మూర్తిని చదువుదారిలో పెట్టి ఉండాలి. ఇంక విద్యాసోపానాలు ఎక్కడం ప్రారంభించాడు."

"అతను చదువుకి ఇంగ్లండు రావడం ఏలా సంభవించింది?"

"అలాంటి వారికైనా వస్తాయి అవకాశాలు లేదూ, లక్షాధికారులకు వస్తాయి."

"అతడు ఇంగ్లండులో ఎలా ఉండేవాడు?"

"ఇద్దరం ఒకేసారి లండనులోని ఇంజనీరింగు కలాశాలలో చేరినాము. ఇంకేం కావాలి? ఇద్దరం తారసిల్లాము. అతడు నీటిని వదలిన చేపలా ఉన్నాడు. ఎల్లా ప్రయాణం చేసి వచ్చాడో ఏమో కాని, ఉత్సవంలో తప్పిపోయిన బాలకునిలా కంగారుపడుతూ అప్పుడే చేరి ఆఫీసు గుమాస్తాల గది ముందున్న ప్రాంగణంలో తెల్లబోతూ నిలుచున్నాడు. నేను చేయవలసిన తంతంతా నెరవేర్చి బయటకు వచ్చాను. అతడు కనబడ్డాడు. విశిష్టమయిన అతని మోము చూచి జాలి వేసింది. అతని దగ్గరకు వెళ్ళి, "ఏమండి! మీరు ఫలానా ఓడలో మొదటి తరగతిలో ప్రయాణం చేస్తున్న వారిలో వొకరు కాదా?" అని ప్రశ్నించాను.

"అవును... కాదు... ఏమిటి... ఏమిటంటే? ఓడ... అ... దే కాని మొదటి తరగతిలో కాదు, నేను ప్రయాణం చేసింది రెండవ తరగతిలోనండీ!" అన్నాడు.

"అదే అయి ఉంటుంది; నాకు జ్ఞాపకం లేదు," అన్నాను.

"నా పేరు మూర్తి. మాది పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం గ్రామంవద్ద జక్కరం గ్రామం.

"ఇక్కడకు వచ్చారేం?"

"ఈ ఇంజనీరింగు కళాశాలలో చేరాలని వచ్చాను!"

"ఏమిటీ?"

"అవునండీ."

"చాలా సంతోషం. మాది మదరాసు. నా పేరు లయొనెల్. నేను ఇప్పుడే చేరేనాను, ఈ కళాశాలలో!"

"మీ... మీ... ది... ఈ దేశం మీ – అంటే మీరు ఈ దేశ నివాసులనుకున్నాను."

అలా అనుకోకండి. నేనూ మీ దేశం వాణ్ణి!"

అక్కడనుండి నాకూ మూర్తికి స్నేహం ప్రారంభం అయింది.

"లయొనెల్! మూర్తీ, నువ్వూ ఈ దేశంలో ఇంజనీరింగు కళాశాలలో చదువుతూ వుంటే స్నేహం చేసి ఉందువా?"

"ఏమో చెప్పలేను! దేశం వదలి పరదేశాలకు వెడితే ఏలాంటి వాడైనా మనదేశం వారితో ఎక్కువ సన్నిహిత సంబంధం కలుగుతుంది గదా జెన్నీ!"

"అవునులే; అయితే మూర్తి అక్కడ ఎలా ఉండేవాడు?"

"ఎప్పుడూ ఆలోచన! తన సంఘం అంత నికృష్ట స్థితిలో ఉండడానికి తామే కారణం అనీ, ఏనాటికైనా తామే పెద్దకులాలవారి ముక్కులు గుద్ది వారితో సమత్వం సంపాదించుకోవాలని వాదించేవాడు."

"అంతేకాని, పైకులాలవారి వైద్య ప్రాబల్యంవల్ల తమకా హీనస్థితి వచ్చిందని వాదించేవాడు కాదా?"

"జెన్నీ, వాళ్ళ కులం వాళ్ళ స్థితి అతను వర్ణిస్తూ ఉంటే గుండె తరుక్కుపోతుంది."

"అవును లయొనెల్! మనదేశంలో బీదవాళ్ళ స్థితి భరించరానిదే!"

"మన దేశం అంటావు. ఏ దేశమయినా అంతే! ఒక్క రష్యాలో తప్ప, తక్కిన అన్ని దేశాలలోను బీదవాళ్ళ స్థితి అంతే!"

"కాని ఇతర దేశాలలో బీదవాళ్ళు భాగ్యవంతులు కావచ్చును. ఈ దేశంలో హిందూమతంలో కొన్ని కులాల వారు ఎప్పటికీ పైకి వెళ్ళడానికి వీళ్ళు లేనేలేవు."

జెన్నీ ఆలోచనా పరురాలయినది. మూర్తి! మూర్తి!! ఏ పూర్వానుబంధమో ఎవరికి తెలుస్తుంది? మూర్తి విషయం అంతా కనుక్కుని తెలుసుకోవాలని బుద్ధి కలగడమేమిటి?

❁ ❁ ❁

## మూడవ భాగం

# నరుడు - నారీ

అమెరికా నుండి ఎల్లమందమూర్తి దిగినాడు మదరాసులో. టెన్నిసీ లోయల ఆనకట్టల విధానం సమగ్రంగా చూడడమే కాక అక్కడ పెద్ద ఇంజనీరు దగ్గర రెండేళ్ళు విద్యార్థిగా పని నేర్చుకునేవానిగా పనిచేశాడు. ఆ ఇంజనీరు "మాకు ఫర్టను" ఇంజనీరు శాస్త్రంలో ఉద్దండ పండితుడు.

లోకంలో వర్షం వల్ల ఎంత నీరు పడుతోంది; ఒక్కొక్క నది ఎంత నీరు మోసుకుపోయి సముద్రంలో కుమ్మరిస్తోంది. ఆ నీరు తీసుకుపోతూ, నీటితోపాటు మన్నూ కొట్టుకుపోతుంది. ఊళ్ళు కొట్టుకుపోతాయి. పొలాలు తేలుకుపోతాయి. ప్రతి నదీ ఈనాడు ఈ దారిని, ఆనాడు ఆ దారిని పోతుంది. వరదలు, ముంపులు, పంటనాశనం, మనుష్యుల ప్రాణనాశనం, పశువుల నాశనం, రోడ్లు, రైళ్ళు నాశనం!

ఈలాంటివి భారతదేశంలో నిత్య ప్రళయ తాండవ దృశ్యాలు. ఓనాడు గోదావరి, ఇంకో సంవత్సరం కృష్ణ, ఆ మరుసటి ఏడు గంగ, శోణానది, గండకి, బ్రహ్మపుత్ర వరదలు, వరదలు.

కోట్ల కోట్ల గుండిగెల నీటిని నిష్కారణంగా కళ్ళారా చూస్తుంటే దిగమ్రింగడంలో దాహం ఏ మాత్రమూ ఎప్పుడూ చాలని ఆ బ్రహ్మాండ వృకోదరుడు సముద్రుడు తాగిపారేస్తున్నాడు. ఆ నీరు మనకు వద్దా అండీ అని ఎల్లమందమూర్తి అనుకున్నాడు. తాగడానికి కావాలి. పొలం తాగడానికి కావాలి! విద్యుచ్ఛక్తి ఉద్భవింపచేయడానికి కావాలి.

గోదావరికి ఎన్ని ఆనకట్టలు కట్టవచ్చును? ఆ దివ్యమాత సముద్రతలానికి మూడువేల అడుగులకుపైన ఉద్భవించింది. ప్రతి నూరు అడుగులు దిగడంలోనూ ఒక ఆనకట్ట కడితే, కామధేనువు నందినీవత్సానికి పాలు చేసినట్టు ప్రాణయస్సులు చేసి ఉండును. ఒక్కొక్క ఆనకట్ట ఒక్కొక్క పొదుగు. ముప్ఫై ఆనకట్టలు! నాసిక ప్రతిష్ఠానం. నాందేడు, గ్రామమందెన గ్రామం, భద్రాచలం, పోలవరం, ఈలా ఆ తల్లికి ఆ తల్లి లోనికి ప్రవహించే నదులకు ఆనకట్టలు! ప్రపంచమంతా నూత్న జీవంతో ఫక్కుమనదూ? అప్పటికీ ఎల్లమంద తెలిపే లెక్కల ప్రకారం గోదావరి నీటిలో నూరోవంతే ఉపయోగం అయ్యేది.

ఆనకట్టలు, కాల్వలు, వేలకొలది కాల్వలు, కాల్వలపై కాల్వలు, వంతెనలు, కాల్వలు దేశం అంతా జీవన రక్తనాళ పూర్ణమయిన మహాశరీర మయిపోతుందని టెన్నిసీలోయ చూస్తూ ఎల్లమంద స్వప్నాలు తేలినాడు.

వరదలు అలంకరించుకొన్న అప్సరసలులా దేశాల ప్రవహించిపోతాయిగాని ఎంతమన్నో భూములలో నిలుస్తుంది. భూదేవి గర్భం చల్లబడుతుంది. భారతదేశం నలభైకోట్ల పుత్రులను కాదు, నాలుగువందల కోట్ల పుత్రికా పుత్రకలను భరించ గలుగుతుంది.

ఎల్లమందమూర్తి ఈ స్వప్న ప్రపంచంలోంచి ఒక్కసారిగా కూలబడుతూ ఉంటాడు. తన దేశంలో ఇలాంటివి ఎవరు చేయిస్తారు. ఇంగ్లీషువారికి ఏమి పట్టింది. మహాత్ముని ఉద్యమం భారతదేశానికి స్వరాజ్యం తీసుకువస్తే ఆదేశంమీదకు ఇతరులు రాకుండా ఉంటే చిక్కిన తన దేశ ప్రజలు వందల సంవత్సరాలనుంచీ పోయిన బలాన్ని తిరిగి సంపాదించుకొని ఛాతీలు విరిచి పనిచేయగలిగేసరికి మళ్ళీ ఎన్ని వందల సంవత్సరాలు పడుతుందో?

ఎల్లమంద లోకమంత నిట్టూర్పు విడిచాడు. అమెరికా అంతా గురువుగారి సహాయంవల్ల తిరిగి మహోత్తమ యోగ్యతా పత్రము పుచ్చుకొని ఎల్లమంద స్వదేశాభి ముఖుడైనాడు. అతడు తాను వస్తున్నానని హరిజన సంఘం వారికి, తన మిత్రుడు లయొనెల్‌కూ, తన గ్రామంలో తండ్రికీ తల్లికీ ఉత్తరాలు రాసినాడు.

ఎల్లమంద ఇంగ్లండులో చదువుకుంటున్నాడు. ఎల్లమంద అమెరికాలో ఉన్నాడు. జక్కరం గ్రామంలో మాదిగవాడలో ఎల్లమంద తండ్రీ తల్లీ అన్నతమ్ములూ, అక్క చెల్లెండ్రూ, చుట్టపక్కలూ ఆ గుడిసెలో, ఆ వాసనలో ఆ మకిలిలో, ఆ చినిగిన గుడ్డల బీదతనంలో, ఆ తిండిలేని ఆకలి హీనతలో, అలాగే ఒకరకం ఆనందంతోనే కాలం గడుపుతున్నారు.

ఆ ఆనందం ఏమి ఆనందం అని ఎల్లమందమూర్తి పళ్ళు బిగించి అనుకున్నాడు. తన వాళ్ళకు ప్రయత్నం చేసే శక్తిలేదు, జ్ఞానమూలేదు, ప్రయత్నం చేయాలన్న భావమూ లేదు. మహాత్ముని పవిత్ర శంఖారావంలో స్వరకల్పన, తాళము, ఆనందమూ, వాళ్ళ పల్లెలకు వినబడుతుందా?

## (2)

ఎల్లమంద బాగా పొడుగ్గా ఎదిగి అయిదడుగుల పది అంగుళాల ఉన్నతి సంపాదించుకొన్నాడు. దేహం ఒక స్వచ్ఛత పొందింది. జ్ఞానం అతని మెదడు తలాల్లో నిత్యజీవ పవిత్రగంగా ఘరీ వేగంతో ప్రవహిస్తున్నది.

చక్కని అమెరికను దుస్తులతో అమెరికన్ వేషంతో ఎల్లమంద జపాను ఓడలోంచి దిగేసరికి లయొనెల్, లయొనెల్ భార్య ఎలిజబెత్తూ, జెన్నిఫర్ నవ్వుతూ ఎదురు వచ్చారు. లయొనెల్ చేతులు చాచి వచ్చి ఎల్లమంద చేతులు గట్టిగా పట్టుకొని జాడించాడు. ఎల్లమంద సంతోషం వర్ణనాతీతమే! ఎల్లమంద లయొనెల్ భార్యను బాగా ఎరుగును. ఎలిజబెత్ కూడా "మూర్తీ" అంటే ఎంతో స్నేహంగా ఉండేది, ఇంగ్లండులో. ఇంక మూర్తీ కళ్ళ ఎదుట ప్రత్యక్షమయిన దివ్య సౌందర్య నిధి ఎవరూ?

ఒహో! ఒక్క నిమిషంపాటే అనుకో, అతడు ఆనవాలు పట్టలేక పోయాడే! ఈ బాలిక జెన్నీ! అన్నగారి హృదయం చూరగొన్న మురిపాల చెల్లెలు జెన్నీ! లయొనెల్ అన్ని పొగడ్తలు ఈ బాలికవే! ఎంత అందమయిన బాలిక! సన్నగా బంగారు శలాకులా, మళ్ళీ తగిన బలంతో పొట్టిగా ఉన్న ఈ బాలిక అపశ్రుతి ఏమీలేని సౌందర్యాల నిధి!

ఎల్లమంద లయొనెల్ భార్య ఎలిజబెత్తుకు, టోపీ తల పైన నుండి తీసి నమస్కరించి కరస్పర్శచేసి, "ఎలిజబెత్! నీకు మా భరత భూమి కూడా బాగా సరిపడిందిలా ఉందే! నీ ఇంగ్లీషు గులాబులు ఇండియా ఎండలకు ఏమీ తగ్గలేదు."

ఎలిజబెత్ నవ్వుతూ, "మీ ఇండియా, రంగుల సౌభాగ్యాల సౌరభాల దేశమయ్యా! నాకు ప్రథమ పరిచయంలో ప్రేమ, ద్వితీయ పరిచయంతో గాఢ ప్రణయమే ఉద్భవించింది." అని అన్నది.

లయొనెల్ జెన్నీని చూపిస్తూ, "ఈ అల్లరి అమ్మాయి ఎవరో ఆనవాలు పట్టగలవా?" అన్నాడు.

"అల్లరి అమ్మాయినే ఆనవాలు పట్టాను." అని ఎల్లమంద చిరునవ్వుతో అన్నాడు.

"మా జెన్నిఫర్! జెన్నిఫర్!! ఈమే మూర్తి!" అని వారిరువురను ఎరుకపరిచారు. ఎల్లమందకు ఆమె చేయి ఇచ్చింది. ఇద్దరూ కరస్పర్శ కావించుకున్నారు. మాటలు లేవు. ఇద్దరూ ఒకరికొకరు తీక్షణంగా చూచుకున్నారు. ఎల్లమంద గుండె అతివేగంగా కొట్టుకొన్నది. ఆమె హృదయమూ ఎందుకో వేగంగా కొట్టుకొంది. తెప్పరిల్లి జెన్నీ "అమెరికానుంచేనా మీరు వస్తున్నది?" అని ప్రశ్నించింది.

**ఎల్ల:** దారిలో జపానులో పదిహేను రోజులు ఆగి ఆ దేశంలోని ఇంజనీరింగు విధానాలన్నీ పరిశీలించాను.

**జెన్నీ:** 'దయబుట్సూ'ను చూచారా?

**ఎల్ల:** దివ్య బుద్ధ విగ్రహం పరమ సౌందర్యవంతంగా ఉంది. అలాంటి విగ్రహాలు ఆ రకంగా మన దేశంలో లేవు. అయినా ఈ భావం మన దేశంనుంచే జపాను వెళ్ళిందని ఆశ్చర్యము పొందాను.

**ఎలిజ:** మొన్న మేము శ్రావణబెలగోలా వెళ్ళి బ్రహ్మాండమయిన విగ్రహాన్నొకదాన్ని చూచివచ్చాము.

**ఎల్ల:** దాన్ని గురించి విన్నాను.

**లయొ:** మా విజ్జీకి ఎల్లా తెలిసిందో నేను చార్జీ పుచ్చుకొని మా ఇద్దరి కాపురం తిరుచునాపల్లిలో పెట్టిన వారం రోజులనుంచీ శ్రావణబెలగోలా వెళ్ళాలని పట్టుపట్టింది.

**ఎలిజ:** ఏముంది, నేను హిగిన్‌బాదమ్స్‌లో యాత్రికుల గ్రంథాలన్నీ కొన్నాను.

వారందరూ పోయి టాక్సీ కారులో ఎక్కారు. కస్టమ్సు వారు ఎల్లమంద మూర్తి వస్తువులు తనిఖీచేసి, వేయవలసిన వానికి పన్ను విధించి ధనం తీసుకొని రశీదులు ఇచ్చినారు. సామానులన్నీ ఒక టాక్సీలోవేసి రెండవదానిలో తామెక్కి అంతా కానుమెరా హోటలుకు చేరారు.

ఎల్లమందకు ఇంగ్లీషు హోటల్లో ఉండడానికి ఇష్టం లేదు. అతన్ని ఎదుర్కొనడానికి వీళ్ళు ముగ్గురూ తప్ప ఇంక ఎవ్వరూ రాలేదు. హరిజన సేవాసమితి కార్యాలయానికి వచ్చి తెలుసుకోవలసినదని, "కానుమెరా"కు ఉత్తరం వచ్చింది.

అతన్ని అక్కడ వదిలి లయొనెల్ ఎలిజబెత్, జెన్నీలు తమ ఇంటికి పోయారు. జెన్నీకి ఛాంపేను త్రాగినట్లు ఏదో హుషారుగా ఉంది. ఎల్లమందమూర్తి భోజనంచేసి కాసేపు విశ్రాంతి తీసుకొని, సాయంకాలం అయిదుగంటలకు జెన్నీగారి ఇంటికి తేనీటికి వెళ్ళ నిర్ణయమైంది.

నాలుగు గంటలకు వేషం వేసుకొని టాక్సీ చేసుకొని, మూర్తి హరిజన సేవా సంఘ కార్యాలయానికి వెళ్ళినాడు. అక్కడ పనిచేసేవారికి మూర్తి తన విలాసం ఉన్న

చీటి ఇచ్చినాడు. వారు కూచోండనీ కార్యదర్శిగారు పని ఉండి రాలేకపోయారనీ, అయిదు గంటలకు వస్తారనీ చెప్పారు. వారిని మళ్ళీ దర్శనం చేసుకొంటానని చెప్పి అక్కడ సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయినాడు. సరిగా అయిదు కొట్టేసరికి జెన్నిఫర్ ఇంటి గుమ్మం మూర్తి ఎక్కినాడు.

## (3)

వెళ్ళగానే జెన్నీగారి సేవకుడు, ఎల్లమంద టోపీ అంది పుచ్చుకున్నాడు. జెన్నీగారి తల్లి, తండ్రి గ్రామాంతరం వెళ్ళారని, లయొనెల్, అతని భార్య జెన్నీకి అతిథులుగా ఉన్నారనీ జెన్నీ ఎల్లమందమూర్తికి చెప్పింది. లయొనెల్, ఎలిజబెత్తులు వీరిరువురు కూర్చున్న కడకు వచ్చారు. మూర్తి నమస్కరించాడు. తేనీరు అయిదున్నరకు, ఆ తర్వాత నలుగురూ కలిసి వెస్టుఎండ్ సినిమాకు వెళ్ళి అక్కడ ప్రదర్శితమవుతున్న మంచి చిత్రం ఒకటి చూడడం, తర్వాత నలుగురూ కానుమెరా హోటలులో మూర్తికి అతిథులుగా భోజనం చేయడం, భోజనం ముందు నాట్యం. ఆ రోజు కానుమెరాలో నాట్యదినం. నాట్య కార్యక్రమం తెల్లవారగట్ల రెండు మూడింటివరకూ సాగుతుంది. ఇది మనవారి కార్యక్రమం.

నలుగురూ హాలులో కూచుని చెకచెక కబుర్లు చెప్పుకుంటున్నారు. మూర్తిచేత జెన్నీ చక్కని ప్రోత్సాహం ఇస్తూ మాట్లాడిస్తున్నది. అతని స్వప్నాలు ఆశయాలు చిన్ననాటి స్థితి మొదలయిన విషయాలు సినిమా బొమ్మల్లా వాళ్ళ హృదయావనికలపై దృశ్యమై మాయమైపోతున్నవి.

**మూర్తి:** మా ఇళ్ళలోకి దూరి వెళ్ళాలి!

**జెన్నీ:** సముద్రం ఒడ్డున పల్లెవాళ్ళ ఇళ్ళలా!

**మూర్తి:** పల్లెవాళ్ళ ఇంటికి పెద్దకులం వాళ్ళెవరయినా రావచ్చును.
ఇంట్లో ప్రవేశించి కూచోవచ్చు.

**జెన్నీ:** మీ ఇళ్ళకు ఎవరూ రారు మూర్తిగారూ!

**మూర్తి:** నన్ను గారూ, గీరూ అనకు జెన్నీఫర్!

**జెన్నీ:** అయితే నువ్వు నన్ను జెన్నీఫర్ అనే పేరుతో పిలవకు 'జెన్నీ' అని పిలువు.

**మూర్తి:** అలాగే! మా గరువుగారి కొమరిత పేరు 'జోను' నన్ను 'జో' అని పిలవమనేది. అలాగే పిలిచాను.

**లయొనెల్:** గురువని 'మాక్ పెరని' పిలుస్తువా మూర్తి!

**మూర్తి:** అవును "లయొ!"

తేయాకు నీరు త్రాగినారు. ఎంతో సంతోషంతో కాలం గడిచిపోయింది.

ఎలిజబెత్తు జెన్నీలు సినీమాకై దుస్తులు మార్చుకొనడానికై వెళ్ళారు. మూర్తి లయొనెల్ సిగరెట్లు త్రాగుతూ కూచుంటే, లయొనెల్ తన ఉద్యోగం విషయం అంతా మూర్తికి చెప్పినాడు.

వారంతా కలిసి సినిమాకు వెళ్ళినారు. జెన్నీ మూర్తి ప్రక్కనే కూచుని ఉంది.

ఈ మూర్తి నలుపు. తన చక్కని గులాబి రంగు ముందు మూర్తి నలుపు రాక్షసి బొగ్గు నలుపు. ఆమె వీళ్ళంతా ఒకనాడు నీగ్రోజాతి వారేమోననుకుంది.

సినీమా చూసి, వారు ముప్వురూ భోజనపు దుస్తులు మార్చుకోవడానికి ఇంటికీ, మూర్తి కానుమెరాకు వెళ్ళినారు.

మూర్తిని అఖిల భారతీయ ప్రభుత్వంవారు తమ ఇంజనీరింగు శాఖలోనికి తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. దాని విషయమై, మూర్తికి, కేంద్ర ప్రభుత్వానికి చేరాల ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. ఈలా జరగడానికి కారణం మూర్తి గురువుగారు అమెరికానుంచి మూర్తి విషయం రాజప్రతినిధికీ, ఇంగ్లాండు భారత కార్యదర్శికీ రాయడమే'

మూర్తి విషయం కానుమెరావారికి తెలిసింది. వారికి ఎంత గౌరవమో కలిగింది. రంగుతేడా కాని మేధావంతుడైన ఇంగ్లీషు "నీలరక్తపు" పెద్దమనిషితో సహా సమానంగా సంచరిస్తున్న మూర్తి అంటే ప్రేమ కుదిరింది. కానొమెరా మేనేజరు మూర్తిని అమెరికా విషయాలు అనేకం అడిగి తెలుసుకోవడం అంటే సరదాపడసాగినాడు.

మూర్తి వేషం మార్చుకుని సరిగ్గా అనుకున్న సమయానికి క్రిందికి దిగినాడు. జెన్ని, లయొనెల్, ఎలిజబెత్తులు కారు దిగినారు.

లయొనెల్, జెన్నీ, ఎలిజబెత్తులు కొంచెం ఛాంపేను త్రాగినారు. మూర్తి తాను త్రాగనని కాంగ్రెసు నాయకులకు వాగ్దానం ఇవ్వడంచేత ఏవైనా రంగునీళ్ళు త్రాగేవాడే. కాని వాట్లజోలికి వెళ్ళలేదు. లయొనెల్ మూర్తిని చాలామంది తన మిత్రులకు ఎరుకపరచినాడు. వాళ్ళకు మూర్తి అంటే అంత గౌరవమేమి ఉంటుంది. "ఒక వెధవవాయి నిగ్గర్" అనుకున్నారు. కాని వాళ్ళందరికీ ఎలిజబెత్తుతో, జెన్నీతో నాట్యాలు కావాలి.

జెన్నీ, మూర్తికి ఆరు నాట్యాలు ఇచ్చింది. రెండు మూడు ఇతరులకు ఇచ్చింది. మూర్తితో కలసి బయట కూచుని మాట్లాడడం ఏర్పాటు చేసుకుంది. రెండు నాట్యాలు ఎలిజబెత్తుతో నాట్యమాడడానికి ఎలిజబెత్ నడిగి ఆమె అనుమతి పొందాడు.

మూర్తి ఎంతో అందంగా నాట్యం చేశాడు. జెన్నీ అతని చేతులలో ఇమిడి అతనితో నాట్యం చేస్తుంటే, ఆమె ఇంతకుముందు ఎవరితో నాట్యం చేస్తున్నా అనుభవించని ఆనందం అనుభవించింది.

అతడామెను ఏ లోకానికో తీసుకుపోయేవాడు. అతని అడుగు గోదావరి ప్రవహింపులా ఉంది. అతని స్వరూపము కంచుతో పోతపోసిన అపోలో విగ్రహంలా ఉన్నది. నడుం చుట్టూ చేయివేసి అతడు తన్ను తేల్చుకొని పోతూవుంటే జెన్నీకి హృదయము కరిగిపోయింది. ఆనందంతో ఆమె అతనికి మరింత దగ్గరగా వచ్చింది. చివరకు అతన్ని అదిమివేసుకొన్నది.

అతడు పురుషుడు, ఆమె స్త్రీ! యుగయుగాల నాటి నుండీ ఆమె అతణ్ణి కోరింది. అతడు ఆమెను కోరినాడు. గుహలలో, పొలాలలో, పట్టణాలలో, ఈజిప్టులో, గ్రీసులో, అరేబియాలో, చీనాలో, అమెరికాలో, జర్మనీలో, ఇంగ్లండులో, ఇండియాలో, నూగినియాలో, ఒకరినొకరు వాంఛించారు. కలుసుకొన్నారు. గాఢమధుర మత్తతాశ్లేషాలలో పరిమళ చుంబనాలలో వివశత్వం చెందారు. ఆమెకు ఒడలు తెలియలేదు. అతనికీ తెలియలేదు. ఇద్దరూ ఉప్పొంగిపోయినారు.

నాట్యంలోనుండి నెమ్మదిగా హోటలు తోటలోనికి చేరారు. జెన్నీ కళ్ళు నక్షత్రాలులా మెరుస్తున్నవి. అద్భుత సౌందర్యవతి యని పేరుగన్న ఆ బాలిక ఈ సమయంలో సౌందర్యానికే సౌందర్యం దిద్దే సౌందర్య సంపూర్ణ అయింది.

ఇద్దరు కొంచెం చీకటి ఉన్న ఓ పూపొదరింటి మాటున వేయబడిన సోఫాలో చదికిలబడినారు. ఇద్దరికీ మాటలు లేవు. జెన్నీ అతని భుజాలపై రెండు చేతులువేసి "మూర్తి, నేనే నిన్నే... ప్రేమిస్తున్నానని... తెలుపుతున్నాను. నువ్వూ నన్ను ప్రేమిస్తుంటే నన్ను - నా పెదవుల్ని ముద్దుపెట్టుకో!" అని మధురమయిన వాక్యాలు పలికింది.

## 4

ఆ వాక్యాలు అస్పష్టంగానే! అతడు ప్రేమ ఎరగడు. స్త్రీలను వాంఛించకపోలేదు. కాని తన వ్రతం చొప్పున పరదేశాలలో ఉన్నప్పుడు బాలికల జోలికిపోలేదు. నాట్యం నేర్చుకొన్నాడు. ఇంగ్లీషు బాలికలతో నాట్యం చేయడం నేర్చుకున్నాడు అంతే! అతన్నీ కొందరు బాలలు కోరారు. అతడు తల్చుకుంటే పొందు కూడడానికి అదనులు దొరక్క పోలేదు. కాని త్రాగుడును ఏలా అతిదూరంగా ఉంచేశాడో, అలాగే స్త్రీ తోటి సంబంధాలు అతి దూరంగా ఉంచేశాడు.

పైకి కనబడేవారి తెలుపురంగు ప్రవహించే గులాబీ రంగులు ఎల్లమందకు గుండె కొట్టించిన మాట నిజమే! కాని తన జాతి నల్లరంగు, తన జాతి గుడిసెలు; తన జాతి వాడలు, దుర్గంధము, దుర్భరస్థితి, మురికిగుడ్డలు, కుళ్ళిన మాంసము, చదువులేని తనము నాగరికతలో అది ప్రాథమిక స్థితి - అతనికి అలాంటి సమయాలల్లో మరింత భయం కొలిపేవి. అతడు వణికిపోయేవాడు.

తన సంఘంకన్న హైన్య స్థితిలోవున్న సంఘాలు ప్రపంచమంతా ఉన్న మాట నిజం! మంచి స్థితిలో ఉన్న సంఘాలు వాని ప్రయత్నాలమీదనే అవి ఉన్నతస్థితికి రాగలిగాయి. కాని ఆఫ్రికాలో నీగ్రోలు, అండమాన్సు నూజిలాండు, బోర్నియాలలోని ఆదిమవాసులు తన భారతదేశములో తన సంఘంవలె ఉండే ఇతర సంఘాలు, నాగులు, వేప్పాలు, శబరులు, చెంచులు, యానాదులు, భంగీలు, పెరయాలు, మాలమాదిగలు, డోంభీలు, చచ్చుటివాళ్ళు, వోర్లీలు, బిల్లులు కోతులు, గోండులు, సంతాలులు వీరందరి స్థితీ! బర్మాలో వారిస్థితీ! వీరందరూ అలాంటి పరమ హైన్య దశలో విముక్తి లేకుండా ఉండిపోవలసినదేనా? అని ఎల్లమందకి జెన్నీ ఎదుట కూర్చుండి ఆమెను దగ్గిరగా తీసుకొన్న ఆనందంలో, ఆమె తన్ను ముద్దుపెట్టుకోమని అడిగిన ఆనందంలో ఒళ్ళు ఝల్లుమంటుండగానే ఈ ఆలోచన అతన్ని విద్యుచ్ఛక్తిలా ఆవరించుకొంది.

కాని, అతని దేహాన్ని హృదయాన్ని జీవితాన్ని అలుముకొని ఉన్న గాఢపిపాస ఒక్కసారిగా ఉప్పొంగిపోయింది. అతడు జెన్నీని అతిక్రాంతాలింగనంలో అదిమికొని ఆమె పెదవులను మహోద్రేక చుంబనాన అదిమి వేసినాడు.

ఆ యిరువురికీ సర్వప్రపంచమూ మాయమయినది. వారిరువురూ ప్రపంచానికి, కాలానికీ అతీతమైపోయినారు. కాలమే ఆగిపోయినది!!

వారు కౌగిలింత విడినారు. అతడు వణికే కంఠంతో "జెన్నీ, నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాడు.

ఆమె మాట్లాడక అతని మెడచుట్టూ చేయి వైచి తల వంచుకొని అతని పెదవులను ముద్దుపెట్టుకుంటూ ఉప్పొంగే తన అధరాన్ని అతని విశాల వక్షానికి అదిమివేసి "నీకోసం, నీకోసం ఇన్నేళ్ళు కనిపెట్టుకుని ఉన్నాను!" అన్నది.

ఆ సమయం అయిన్‌స్టెయిను రెలెటివిటీ సిద్ధాంతాన్ని మించిన సమయం.

ఆ సమయంలో మనుష్యుడు అన్ని స్థితులను దాటిన దివ్యస్థితిలో ఉంటాడు.

"నేను ఎంతో అదృష్టవంతుణ్ణి జెన్నీ!"

"నేను అదృష్టవంతురాలిని మూర్తీ!"

"నేను నికృష్టుడయిన హిందూజాతి అధమ సంఘానికి చెందినవాణ్ణి!"

"మా సంఘానికి ఏ స్థితీ లేదు మూర్తీ!"

"నువ్వు దేవకన్యవు!"

"అది వట్టి పొగడ్త!"

"నన్ను గురించి ఏమీ ఎరగవు, ఎలా నన్ను ప్రేమించగలిగావు?"

"నిన్ను గురించి నాకు తెలిసినంత నీకే తెలియదు!"

"నేను ఈ దేశం వచ్చి కొద్దిరోజులే అయింది."

"నిన్ను ఏళ్ళ తరబడి ఎరుగుదును."

"ఈ నా ప్రేమ-"

"నీ ప్రేమ కాదు - మన ప్రేమ!"

"మన ప్రేమ విషయం మీ తల్లితండ్రులూ, లయొనెలూ విని ఏమంటారు?"

"నా అంత అదృష్టవంతురాలు లేదంటారు?"

వారిద్దరూ మరీ మరీ గాఢంగా అదిమి వేసికొన్నారు.

"రా! మూర్తీ, నా దివ్యభర్తా! రా! మళ్ళీ ఆ నాట్యంలోకి వెళ్ళలేను. మనం ఏ చక్కని ప్రదేశానికైనా పోయి అక్కడ ఏవో మధురమయిన, పిచ్చివైన అత్యంతార్థవంతాలయిన మాటలు చెప్పుకుందాము! రా!" అని జెన్నీ అన్నది.

అతడు లేచి, ప్రణయసరస్నాతుడయిన వానివలె జెన్నీని తన కదిమికొని ముద్దులిచ్చి ఆమె కారుకడకు కొని పోయినాడు. వారిద్దరూ అప్పుడే పన్నెండు కొట్టినదని, తెలుసుకొని, రెండు గంటల కాలంవరకూ సముద్రతీరం వరకూ వెళ్ళివద్దామనుకున్నారు.

## (5)

ఆమె తన కారు నడుపుకొంటూ అతన్ని తీసుకుపోయినది. తన కారు నడిపేవానితో అక్కడే ఉండమనిన్నీ, తన అన్నగారు అడిగితే ఇద్దరూ కలిసి సముద్ర తీరానికి వెళ్ళినారనీ చెప్పమని వారు బయలుదేరినారు.

ఆమె ప్రక్కనే అతడు అధివసించి ఉన్నాడు. ఆమె "నేను అందమయినదాననేనా మూర్తీ?" అని అడిగింది.

"నువ్వా! ప్రపంచములో ఒక్క బాలికన్నా నీ ఎదుట తగుదునని సౌందర్యం విషయంలో నిలవగలదా జెన్నీ?"

"బడాయి పొగడ్త!"

"పొగడ్తా! కాని నా వంటి శుద్ధ నీగ్రో మాటో?"

కారు ఆపుచేసి, "నన్ను అలా అవమానించినందుకు చూడు ఏం చేస్తానో?"

"నిన్ను అవమానించడమా?"

"అవును! నా ప్రియతముణ్ణి నీగ్రో అంటావా దుర్మార్గుడా!"

"ఇంత చదువుకున్నవాడవు శాస్త్రజ్ఞుడవు, శాస్త్ర పరిశోధకుడవు, నువ్వు కూడా ఏదో పారలౌకిక సంబంధమైన మాటలంటావేమి మూర్తీ?"

"నువ్వు దేవకన్యవు. దేవకన్యల ఎదుట ప్రాపంచికపు మాటలు ఎలా వస్తాయి?"

"నన్ను పొగడకు. సంపూర్ణంగా ప్రాపంచిక వాసనలలో మునిగివున్న దానిని నేను."

"అది నమ్మమనేనా నీ ఉద్దేశం?"

"ఆ!"

"అయితే నువ్వు నన్నెలా ప్రేమించగలిగావు?"

"అమెరికా వెళ్ళి పెద్ద విద్య నేర్చుకు వచ్చిన మొనగాడవు!"

"అవును! భారతదేశంలో అతి నికృష్ట సంఘానికి చెందిన హీనుణ్ణి!"

వారిద్దరూ పకపక నవ్వుకున్నారు.

ఆ వెన్నెలలో ఆమె అతని ఒడిలోకి ఒక వాగు ఇంకో వాగులోనికి ఒదిగినట్లు వాలిపోయినది. అతడామెను తన హృదయాన బిగియార కౌగలించుకొని, అమిత భక్తితో ప్రణయంతో, ఆనందావేశంతో ఆమె మోము, జుట్టు, కన్నులు, చెవులు, మెడ, వక్షసీమ, భుజములు ముద్దు పెట్టుకున్నాడు.

వారు ఒకరి నొకరు చూచుకుంటారు. పిచ్చిమాటలు పలుకుకుంటారు.

ఇంతలో ఇద్దరికీ ఒక్కసారే లయొనెల్ జ్ఞాపకం వచ్చినాడు.

ఇద్దరూ చటుక్కున లేచి ఒకరి నడుంచుట్టూ ఒకరు చేతులు అదిమిపట్టి రోడ్డుమీద ఉన్న కారుకడకు పరుగుపెట్టారు. కారులో ఎక్కి కానొమెరాకు చక్కా వచ్చారు.

కారుదిగి ఇద్దరూ తిన్నగా నాట్యంచేసే మందిరంలోకి పోయేసరికి లయొనెల్ నిలుచుండి, సోఫాపై కూర్చున్న భార్యతో ఏదో వాదిస్తున్నాడు.

ఎలిజబెత్తు గుమ్మంలో వచ్చే ఈ యువజంటను చూచి "అరుగో వస్తున్నారన్నది!" ఆమె భర్త తిరిగి, వీరిద్దరిని చూచి గబగబ రెండంగలలో వీరిద్దరికడకూ వచ్చినాడు. చిరునవ్వు నవ్వుతూ వీరిని చేరి, వారి మోములు చూచి, వారి ఫాలాలలో నృత్యం చేస్తున్న కాంతులు చూచి, వారి రహస్యము చటుక్కున గ్రహించినాడు.

తడబడుతూ ఎల్లమందమూర్తి "లయో! నీ... నీ... సోదరి నన్ను ధన్యుణ్ణి చేసింది. నన్ను వివాహం జేసుకోడానికి ఒప్పుకుంది. నీ అనుమతి... అనుమతి ఇవ్వ ప్రార్థిస్తున్నాను!" అన్నాడు.

వెంటనే లయొనెల్ మూర్తి చేయి దొరకపుచ్చుకొని, జాడించి, "నా అభినందనాలు, మూర్తీ! ఈ పవిత్ర క్షణంకోసం కలలు కన్నాను. కోరాను, భగవంతుణ్ణి ప్రార్థించాను. అలాంటిది నా అనుమతెందుకూ అనుమతి అయిదేళ్ళ క్రిందటే ఇచ్చాను," అన్నాడు.

చెల్లెలిని దగ్గరకు తీసుకొని, ఆమెను నుదురుపై ముద్దిడి, "రండి! విజ్జీకి చెబుదాము!" అని మూర్తివైపు తిరిగి, నువ్వు విజ్జీతో ఈ నాట్యంలో పాల్గొనవలసి ఉంది. నువ్వు సమయానికి లేక ఎక్కడికో వెళ్ళిపోయావని, ఆమెగారికి కోపం వస్తే, నేను నీ తరపున క్షమాపణ అడుగుతున్నాను." అన్నాడు.

మూర్తి తెల్లబోతూనే ఎలిజబెత్ కూర్చున్న తావుకు వెళ్ళి "ఎలిజిబెత్! నన్ను క్షమించాలి! నేనూ జెన్నీ కలిసి సముద్రం ఒడ్డుకు వెళ్ళాము. జెన్నీ నన్ను వివాహం చేసుకొని నా జన్మ పవిత్రం చేయడానికి ఒప్పుకొంది! ఆ విషయం మాట్లాడుకొంటూంటే ఆలస్యమయింది. నన్ను క్షమించమనీ, మా ఇద్దరినీ అభినందించమనీ ప్రార్థిస్తున్నాను." అని చేయి చాపినాడు.

ఎలిజబెత్తు ముఖంలో కోపకాంతులు మాయంకాలేదు. ముందుకు చాపిన అతని చేతిని ఆమె గమనించదలచకోలేదు. "నువ్వు క్షమాపణ అడగనక్కరలేదు, నీ నాట్యం లేకపోయినందువల్ల నా మనస్సు ఏమీ కలతపొందలేదు! కాని నా మాట జెన్నీ వినేటట్లయితే ఒక నిగ్గర్ను పెళ్ళి చేసుకోవద్దని ఆమెకు నా హృదయపూర్వకమైన సలహాయిస్తున్నాను. అని లేచి, భర్తవైపు తిరిగి నాకు తలనొప్పిగా ఉంది. ఇంటికి పోవాలి!" అని బయలుదేరింది.

వారందరి మధ్యా ఒక పిడుగు పడింది. మూర్తికి వేయి బాంబులు మీద పడినట్లయింది. అతని హృదయంలోని రక్తం మాయమై స్పందనమాగిపోయింది.

లయొనెల్ నోటమాటలేదు. అతడు చైతన్యముడిగి అలాగే నిలుచుండిపోయినాడు.

కాని జెన్నీ మొదట ఒక నిముషం ఆశ్చర్యంతో, తర్వాత కిలకిలనవ్వి.

"అన్నా! ఎలిజబెత్తు చిన్న బిడ్డ! పో ఆమెను సముదాయించు. మేం ఇద్దరం ఇక్కడే తోటలో ఒక గంటసేపు కూర్చుంటాము. తర్వాత ఇంటికి వస్తాను" అని అన్నగారిని తోసింది. లయొనెల్ మూర్తి రెండు చేతులు పట్టుకొని. విజ్జి తరఫున ప్రార్థిస్తున్నాను. ఆమెను నన్ను క్షమించు మూర్తీ!" అని దీనంగా వేడుకున్నాడు.

మూర్తి కన్నులు మెరిసినాయి. స్నేహితుని చేతులు గట్టిగా పట్టుకొని, ఈరోజు వచ్చినాను. ఒక్క రోజలో నా చరిత్ర పదియుగాల చరిత్రై నడిచింది. నా హృదయ పూర్వకంగా ఎలిజబెత్తును క్షమాపణ వేడుకుంటున్నాను." అన్నాడు.

లయొనెల్ తమ కారులో కూర్చుని ఉన్న భార్య దగ్గరకు వెళ్ళిపోయినాడు.

ఎల్లమందమూర్తి చేయి పట్టుకొని జెన్నీ, "రా ప్రియతమా! ఇటలీ విరుచుకుపడితే, అబ్సీనియా పెట్టిన మోము ధరించావేమిటి? రా!" అని అతనిని తోటలోనికి తీసుకు పోయింది.

తోటలో మునుపు కూర్చుండిన బెంచిమీదే వారిద్దరూ కూర్చున్నారు.

"మూర్తి నేను డాక్టర్ను!"

"నేను నీ విషయం అంతా అడుగుదామనుకుంటున్నాను."

"నువ్వు ఈరోజే వచ్చావు! ఈ రోజున సంఘటించిన విచిత్ర పరిణామాలన్నీ ఈరోజు కోసమే ఎదురు చూస్తున్నాయి."

"అంటే?"

"నీ అనుమానపూర్వకమయిన ప్రశ్న నాకు అర్థమయింది. ఎలిజబెత్తు కోపం కూడా ఈరోజు కోసమే కనిపెట్టి ఉన్నదా? అని అడగదలచుకొన్నావా! తప్పకుండా. మా ఎలిజబెత్ హృదయంలో నిండివున్న ఇంగ్లీషుతత్వం మాయం కాలేదు. ఆమె దృష్టిలో మా లయోనెల్ ఇంగ్లీషువాడే! ఒకవేళ ఎప్పుడైనా అచ్చమయిన ఇంగ్లీషు రక్తం ప్రవహించే వాడు కాదు తన భర్త అని ఆలోచన వచ్చినా అది ప్రేమచే సమాధాన పెట్టుకుంటుంది. కాని, సాధారణంగా భారతీయులంటే ఆమెకు నిరసనా, వాళ్ళు బానిసలన్న భావమూ తన బోటివారిదే. ఈ రాజ్యమన్న అహంభావము ఆమె జీవితంలోనుండి పోలేదు. అవి పోవడానికి నువ్వూ నేనూ కారణభూతులం అవుతామేమో!" అని పలికింది.

పదినిమిషాలు మాటలులేక వారలా కూచుండి పోయినారు.

దీర్ఘ వినీల పక్ష్మాల వితానం క్రిందనుండి తన పురుషుణ్ణి జెన్నీ తొంగిచూస్తూ, "ఈ మహాపురుషుడు మళ్ళీ స్పృశించడానికి కూడా ఎంత సందేహిస్తున్నాడు?" అనుకుంది.

వెంటనే ఆమె అతని మెడచుట్టూ చేతులు పోనిచ్చి "మూర్తీ! లోకం తలక్రిందు లయినా జెన్నీ నీదే!" అని అతని తలవంచి అతని పెదవులు అతిమధుర పరిమళయుక్తమయిన ప్రణయగాఢతతో అదిమి వేసింది.

❀ ❀ ❀

## నాలుగవ భాగం

# జలపాతం

మూర్తి నాలుగు రోజులు మదరాసులో ఉండి, కాంగ్రెసు నాయకుల్ని, కాంగ్రెసు మంత్రివర్గాన్నీ, హరిజన సేవాసంఘ నాయకుల్ని చూచినాడు.

వైస్రాయి: ఆంతరంగిక కార్యదర్శి నుండి పన్నెండు దినాలయిన వెనుక ఒక తారీఖు రోజున ఢిల్లీ రావలసిందని ఉత్తరం వచ్చింది. ఈ అయిదవ దినాన రాష్ట్ర గవర్నరు గారిని దర్శించినాడు.

ఈ అయిదు దినాలూ, తాను అమెరికాలో గడిపిన సంవత్సరాలూ మొదలయినవి చర్చించాడు. అందరూ అతన్ని మెచ్చుకుంటూ మాట్లాడారు. కాని అతని కర్తవ్యం ఎవ్వరూ నిర్ణయించలేదు.

లయొనెల్ ఎలిజబెత్తు చేసింది తప్పు అని ఎలా చెప్పగలడు? భార్యతో మూర్తిని పొగడి తమ స్నేహం ఎంత పవిత్రమో ఆమెకు తెల్పినాడు.

"మీ స్నేహం పవిత్రం కాదని నేను ఊహించలేదు. అంత మాత్రాన అతణ్ణి నీ చెల్లెలు వివాహం చేసుకొనడానికి నేనెలా సమ్మతించగలను?"

"వివాహానికి ప్రేమ ముఖ్యమంటావా లేక జాతి, సంఘము, రంగూ, ముఖ్యమా ప్రియా!"

"నువ్వు గజం పొడుగు ముందుకు వచ్చిన పెదవులు కలిగి, ఊలు జుట్టుతో, పీపాలాంటి కడుపుతో ఉన్న ఆఫ్రికా పిగ్మీ పిల్లను ప్రేమించగలవా?"

"ప్రేమించడం జరిగిన వెనుక ప్రేమను గురించి మాట్లాడాలి కదా! ఇక్కడ జెన్నీ మూర్తినీ మూర్తి జెన్నీని ప్రేమించుకొంటున్నారు గదా!"

"మూర్తి ఒక రిక్షాలాగే కూలీ అయితే వారి ప్రేమను నువ్వు ఒప్పుకుంటావా?"

"ఏదో అయితే గియితే అంటే ఏమి లాభం విజ్జీ! నా ప్రాణ స్నేహితుడు నా అనుంగు చెల్లెలూ ఒకరినొకరు ప్రేమించుకుని వివాహం చేసుకుంటే నేను ఆనందపూర్ణుడను కానా?"

"ఓహో కాకేమి? నేను ఉత్తమజాతి ఇంగ్లీషు బాలికను. మా వంశంలో వాడవు నువ్వు! నీకూ నాకూ కలిగిన ప్రేమను లోకం హర్షిస్తుంది."

"ప్రేమకూ లోకానికీ సంబంధం ఏమిటి?"

"ప్రేమించుకునే మనుష్యులు లోకానికి సంబంధం లేకుండా ఉద్భవించారా?"

లయొనెల్ ఏమి చేయగలడు? అతడు విచార పూర్ణ బాధతో క్రుంగిపోయాడు.

"ఇంతకూ మా జెన్నీ విషయంలో నేనేమి చేయగలను. ఆమె జీవితం దారి ఆమె నిర్ణయించుకోవాలి!" అంటూ అతడు తల వాల్చుకొని, తన కచ్చేరీ గదిలోకి వెళ్ళాడు.

ఎలిజబెత్తు మనస్సు కరగలేదు. పైగా, పౌరుషంతో దుఃఖం తెచ్చుకొని కన్నీరు పెట్టుకుంటూ ఆ సోఫాపై కూలబడింది.

ఆ చప్పుడు విని లయొనెల్ చప్పున తన గదిలోనుండి చక్కా వచ్చాడు. సోఫామీద వాలి విజ్జీ మూర్ఛపోయినట్టు గడబిడ పడుతున్నది. ఇంతట్లో లయొనెల్ పరిచారికను వాసనమందు తీసుకురమ్మనమని చెప్పి పరుగున వెళ్ళి ఫోను చేశాడు.

పరిచారిక విజ్జీకి ముక్కు దగ్గిర మందు వాసన చూపిస్తూ "యూడికోలోన్"తో తడిపిన గుడ్డతో నుదురు అద్దుతూ ఉన్నది. ఇంతట్లో డాక్టరుగారు చక్కా వచ్చారు.

ఆయన పరీక్షచేసి ఎలిజబెత్తు గర్భవతి అనిన్నీ ప్రథమ గర్భందాల్చి ఉన్న బాలికలు కొంత నరాల సంబంధమయిన గడబిడలకు పాల్పడతారనిన్నీ, కాని పదిరోజులపాటు మందు ఇచ్చి ఆ తర్వాత గర్భబలానికి ఆమె బలానికీ మందు ఇస్తూంటే పురుడు సరీగా జరగగలదని ఆ డాక్టరుగారు లయొనెల్‌కు చెప్పి మందు వ్రాసి యిచ్చారు.

ఇంతట్లో జెన్నీ ఇంటికి వచ్చింది. వదినగారి దగ్గరకు వెళ్ళి కౌగలించుకొని, ఆమెకు రెండు గంటల పరిచర్య చేసింది. విజ్జీకి ద్రవాహారం ఇచ్చి నిద్రబుచ్చింది.

జెన్నీ రెండు రోజుల సెలవుపెట్టి మూర్తితో ఒక్క మహా ప్రవాహానందంతో గడిపింది. అతడు పనిమీద వెళ్ళి మళ్ళీ వచ్చేవరకూ అతనికోసం ఎదురుచూస్తూ వుండేది. అతన్ని సినిమాలకనీ, విహారాలకనీ తీసుకుపోయేది. రాత్రి రెండు గంటలవరకూ అతని ఒడిలో వాలి వుండేది. అసలు నిద్రనేది లేకుండా వుంటే బాగుండుననుకునేదీ.

రెండు రోజులూ అయిన వెనక ఉద్యోగానికి వెడుతూ ఉండేది. పని అయిన వెంటనే తిరిగి తిరిగి ఇంటికి రావడం! రావడంతోటె ఎదురుగా ఎల్లమంద వుండాలని అతనికోసం ఎదురు చూడడం!

ఇదంతా చూచే ఎలిజబెత్తుకు మతిపోయింది. ఆరవ రోజు రాత్రి లయొనెల్ ఎలిజబెత్తులు తిరుచునాపల్లి వెళ్ళి పోయినారు. ఏడవ రోజు ఉత్తరాదికి పెద్ద కొడుకునూ, కోడలినీ, వారి బిడ్డలనూ చూడడానికి వెళ్ళిన ఎడ్వర్డు కార్లయిల్‌గారూ ఆయన భార్యా ఇంటికి వచ్చారు.

ఎడ్వర్డు కార్లయిల్‌గారు అయిదు సంవత్సరాల క్రితమే విశ్రాంతి వేతనం తీసుకొని ఉద్యోగం నుండి విరమించారు. అతనికిప్పుడు అరవై రెండు ఏళ్ళు ఉన్నాయి. ఆయన భార్య పేరు డోరిస్. ఆమెకు ఏభై ఎనిమిది సంవత్సరాలున్నాయి.

వారిద్దరూ రావల్పిండిలో పెద్ద కొమరుడు మేజరు రిచ్చర్డుకు అతిథులుగా వుండి, అక్కడినుంచి కాశ్మీరము, ఆల్మోరా, ముస్సోరీ, కరాచీ, జయపురం మొదలయినవి తిరిగి, రావల్పిండి వచ్చి పదిరోజులుండి బయలుదేరి చెన్నపట్నం వచ్చినారు.

కార్లయిల్‌గారి బంగాళా ఇల్లు కీల్పాకులో పూనమల్లీ రోడ్డుమీద పెద్ద తోట మధ్య వుంది. యూరేషియనైనా మదరాసులో వర్తకం చేసేటట్టీ, ఉద్యోగాలలో ఉన్నట్టి బ్రిటీషు పెద్దల గౌరవం పొందుతూ తానూ తన భార్యా బిడ్డలూ వారి ఇళ్ళకు అతిథులుగా పోతూ, తానూ వారిని తమ ఇంటికి విందులకు పిలుస్తూ గౌరవం పొందుతూ వుండేవాడు.

కార్లయిల్ కుటుంబంలో కొందరు ఇంగ్లీషు విధవలను, కొందరు ఇంగ్లీషు బాలికలను పెళ్ళి చేసుకున్న మాట నిజం. ఆ బాలికలూ, ఇంగ్లీషు విధవలూ అంత పెద్ద కుటుంబాలవారు కాకపోవచ్చును. కాని, పదహారణాల ఆంగ్ల రక్తంవారు.

మిస్టర్ కార్లయిల్‌గారు ఎంతో చక్కగా ప్రతిభతో ప్రభుత్వానికి భక్తితో పనిచేసి వుండడంచేత ఎం.ఎస్.ఎం. రైల్వేవారికి చీఫ్ యింజనీరు అయిన రెండేళ్ళకు 1924వ సంవత్సరంలో "నైటు బిరుదం పొంది సర్.ఎడ్వర్డు కార్లయిల్‌గారు కె.సి.ఐ." అయ్యారు.

వీరిని ముఖ్య ఇంజనీరును చేయడంలో ప్రభుత్వంవారు రెండు పక్షుల్ని ఒకే బాణంతో కూలవేయగలిగారు సర్. ఎడ్వర్డు కార్లయిల్‌గారు భారతీయుడు. అందుకని ఆయనకే ఈ ఉద్యోగం ఇచ్చాము" అంటూ మొగం అవతలికి తిప్పి "ఎల్లాగైనా ఆంగ్ల రక్తం ప్రవహించేవానికి ఆ మాత్రమయినా చేయకపోతే యెల్లాగు" అని ఒకరినొకరు కళ్లు గీటుకున్నారు.

సర్. ఎడ్వర్డు కార్లయిల్‌గారు ఇంటికి వచ్చారు. వస్తున్నామని తెలియజేయగానే జెన్నిఫర్ తల్లిదండ్రులను ఎదుర్కోవడానికి వెళ్ళింది. ఉండే పరిస్థితులలో ఎల్లమంద మూర్తి వచ్చి జెన్నీ తల్లితండ్రులను వివాహానికి అనుమతి అడగడంకన్న, తానే తన మాతా పితరులను ఒప్పించడానికి నిశ్చయం చేసుకొంది.

ఎల్లమందమూర్తి తన స్వగ్రామం వెళ్ళిపోయినాడు.

ఎల్లమందమూర్తి తన స్వగ్రామం వెళ్ళడానికి నిశ్చయించుకున్న రోజు సర్. ఎడ్వర్డు కార్లయిల్ వచ్చిన ముందురోజు. ఆ దినం ఒక్క నిమిషం విడవకుండా అతడు, జెన్నీ తిరిగారు.

"జెన్నీ! ఈ మానవ వ్యవస్థ చాలా విచిత్రమయినది. లోకంలో వున్న స్త్రీ పురుషులు నూరుకోట్ల సంఖ్య. అందులో ప్రేమించటానికి సిద్ధంగా వున్న వారి సంఖ్య కొద్ది కోట్లు అయినా ఈ ప్రేమల పరిణామం, పరిణత, చరిత్రా ఏ రూపాలు పొందుతాయో ఆలోచిస్తూ ఉంటే నాకు 'ఫాష్టు' చూచి దిగ్భ్రాంతుడయిన బ్రహ్మాండము కనబడుతూ వుంటుంది."

"నీకు ఎప్పుడూ ఆలోచనలే, కార్య నిమగ్నత తక్కువ ప్రియతమా?"

"అవును, నీ అద్భుత మూర్తిని సందర్శించిన యువకుడు పనిలేనివాడై లోకం అంతా తిరుగుతూ వుంటాడు."

"లోకంలో ఉన్న యువతీమణులు ఎన్ని జాతులవారు, ఎన్ని దేశాలవారు యెంతెంత అందంగా ఉన్నవాళ్ళు లేరు?"

"అది నిజమే. సౌందర్యశాస్త్రం ప్రకారం అందం కలవాళ్ళు ఒక జాతి అనుకుందాం. ఆ జాతిలో అంతరమయిన జాతులకు చెందిన సౌందర్యవతులను, ఒకరకం మానసిక ప్రవృత్తిగల యువకులు ప్రేమిస్తారు. అందులో ఒక్కొక్క అనుభూతి కారణాలవల్ల ఈ మనుష్యుడూ, ఈ స్త్రీ అని కేటాయింపయివుంటారు. ఆ కేటాయింపయిన జత మనం ఇద్దరం కాబోలు."

"నీ మాటలు అగమ్యగోచరంగా వున్నాయి." అని పకపక నవ్వుతూ జెన్నీ అతన్ని గట్టిగా అదుముకొంది.

"జెన్నీ, కొన్ని యుగాలు నిన్ను వదిలివుండాలి!"

ఆ రాత్రి మెయిలు మీద భీమవరం వెళ్ళిపోయినాడు ఎల్లమందమూర్తి.

## 2

ఆ మర్నాడు ఉదయం నిడదవోలులో రైలు మారి. మూర్తి భీమవరంలో దిగాడు. ఇదివరకే తమ పురోహితుడుగారి పేర టెలిగ్రాం అతడు ఈ దినానికి వస్తానని ఇచ్చి వుండడంవల్ల భీమవరం స్టేషనుకు జక్కరంవారూ, భీమవరం వారూ చుట్టుపక్కలవారు హరిజనులెందరో వచ్చి సిద్ధంగా వున్నారు. బండి రాగానే ఎల్లమందమూర్తికి "జయ్" అని వచ్చిన వారందరూ జయజయ ధ్వానాలు సలిపినారు. బండి ఆగగానే ఎల్లమంద దిగినాడు. ప్రజలందరూ పూలమాలలు వేశారు. ఖద్దరు దండలు వేశారు. హరిజన సంఘంవారు యెవరిదో కారు పట్టుకు వచ్చారు. ఎల్లమందను భీమవరం అంతా ఊరేగించి బోర్డు ఆఫీసుదగ్గిర పెద్ద సమావేశం జరిపినారు.

ఎల్లమంద ఉక్కిరి బిక్కిరై, చైతన్యం సగం తప్పి ఈ మహా భావానికి ఉన్న పరమార్థం తర్కించుకుంటూ కూచున్నాడు.

"హరిజనులు యుగయుగాలనుంచి ఇలా వేదన పడిపోతున్నారు. కాని యెవరో ఎల్లమంద వంటి కులోద్ధారకులు ఉద్ధరించి జాతిని తరింపచేస్తారు." అని ఒకరన్నారు.

ఉత్తమ కులాలవారు వింధ్య పర్వతంలాంటి బరువును ఈ కులాలవారిమీద వేసి వుండడంచేత వారు అలా నీచ స్థితిలోపడి ఉన్నారు. తప్పు ఉత్తమ కులాలవారిది. ఇన్ని యుగాలనుంచి, ఊళ్ళ బయటకు నెట్టి, చూడకూడని వారు, ఉచ్చరింపకూడనివారు, గ్రామంలోనికి రానివ్వకూడనివారు అని చెప్పి వారిని, సాంఘికంగా, నైతికంగా, ఆర్థికంగా, విద్యా విషయికంగా, రాజకీయంగా అతి నీచస్థితిలో వుంచిన పరమ రాక్షసులం మనం!" అని ఒక బ్రాహ్మణ యువకుడు మాట్లాడినాడు.

ఎల్లమంద యెప్పుడూ ఉపన్యాసాలిచ్చినవాడు కాడు. అతడు లేచి పది నిమిషాలు తడబడినాడు. అక్కడినుంచి ఎదురుగుండా ప్రేక్షకులు లేరు, ప్రపంచం లేదు. అతని ఎదుట అతడు ఉన్నాడు. అతనికి అతడే మాట్లాడుకున్నాడు.

"ఈ పరిస్థితులు యెలా వచ్చాయి? చరిత్ర అతిక్లిష్టంగా ప్రవహించింది. దానికి ఇవి కారణాలనిగానీ, అవి కారణాలనిగాని ఎవరు నిర్ణయించగలరు? ఆ నిర్ణయించడం వల్ల ప్రయోజనం ఏముంది? నదిలోపడిన మనుష్యుడు ఏలా పడ్డాడో విచారణ చేస్తుంటే అతడు ప్రాణం అర్పించుకోవలసి వస్తుంది. వెంటనే అతన్ని రక్షించాలి.

"హరిజనులకు కాంగ్రెసు ప్రభుత్వాలు మనుష్యునకు పది యెకరాలకు తక్కువగాని భూమి ఇవ్వాలి. తక్కిన వారి మాట ఎల్లా ఉన్నా హరిజనాది హైస్కూ సంఘాలవారికి తప్పక పట్ట పరీక్ష వరకు చదువు చెప్పాలి. ఆ శాసనం యెవ్వరూ తప్పటానికి వీలులేదు. ప్రస్తుతం దేవాలయాలకు పోవడం వగైరాలన్నీ కార్యక్రమంలో తర్వాత వస్తాయి. అవి కావలసిన మాట నిజమే!"

ఈలా ఈలా మహా వేగంతో మాట్లాడినాడు.

ఉపన్యాసానంతరం ప్రజలు యెల్లమందకు బ్రహ్మాండమయిన జయజయధ్వానాలు సలిపినారు.

ఆ మధ్యాహ్నం యెల్లమంద జక్కరం చేరినాడు. తన గుడిసె దగ్గిరకు వెళ్ళాడు. గుడిసెముందు పెద్దపందిరి. తోరణాలు, పందిరిలో కుర్చీలు, బల్లలు, మంచం, పరుపుదిండ్లు వున్నాయి. పరుపులు వేసిన మంచం చుట్టూ మూడు వెదురు తడికలు కట్టి ఒక గదిలా సిద్ధం చేశారు.

ఆ గూడెంలో దొరలు జీవించే విధానం ఎరిగివున్న క్రిష్టియనులు వున్నారు. వాళ్ళ సహాయంవల్ల చంద్రయ్య ఈ ఏర్పాటులు చేశాడు. తండ్రి ఆపేక్ష అనంతం! తల్లి ఆపేక్ష అనంతత్వానికి అవధి ఇవ్వగలదు! వారి ప్రేమ మధ్య అలాంటి ప్రదేశంలో ఇంగ్లండులో డి.యస్.సి ఇంజనీరింగు నెగ్గి అమెరికా వెళ్ళి రెండేళ్ళు ప్రవాహశక్తి జనిత విద్యుచ్ఛక్తిని గురించీ, ప్రవాహశక్తిని గురించీ నేర్చుకొని, విజయ పత్రాలు పొందిన ఎల్లమంద తడికెల పందిరి క్రింద మకాము.

తన అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములు అతి విచిత్రంగా చూస్తున్నారు. ఈ మనుష్యుల అతి ప్రాథమిక జీవితం, ఒకే గుడిసెలో అందరూ పడుకోడం! ఇతరులు వున్నారని లేకుండా స్త్రీ పురుష సరిగమక్రియ! యెంతటి నీచగతి!

ఏ పాపం చేశావు నా జాతీ!

ఎన్ని వేల సంవత్సరాలు ఈ భయంకర నీచస్థితిలో కుళ్ళిపోతూ ఉంటావు మాదిగవాడా?

నీకు విముక్తి లేదా?

ఎంతటి దీన చరిత్ర జరిగిపోతోంది!

తిండి లేకుండా!

మొండితనం కప్పే బట్ట లేకుండా!!

పండ పక్క లేకుండా!!!

ఉత్తమ జీవితం ఛాయలన్నా సోకకుండా, సత్తువలేని హృదయాలు స్వంతంలేని మనస్సులు, మత్తువాసన, కుళ్ళిన మాంసం వాసన హీనత్వం, లుకలుకలాడే భయంకర వాసన, వైద్యుణ్ణి, గురువునూ యెరుగని బీభత్సం. సేద్యం యెరుగని అడవి భూములకన్న హీనమే!

నా జాతీ!

నా మాదిగ జాతీ!

ఆశలేని భయంకరావస్థల క్రుంగే జాతీ!

ఏనాటికి నీకు ముక్తి?

ఏనాటికి నీకు ఏడుగడ?

అతడు వెక్కి వెక్కి రోదించాడు. తల్లితో తిండి సహించలేదని ఆ రాత్రే అలాగే పడుకున్నాడు.

గుడిసెలో తల్లీ తండ్రీ, మన తిండి వాడికి ఏం సయిస్తుంది, అనుకుంటున్నారు. తల్లి నెమ్మదిగా ఏడ్చింది.

"ఊరుకో నాయాలా! ఆడింటాడు," అని తండ్రి.

"ఏటింటాడో! సీమెల్లొచ్చాడు. ఆడికింత కూడెట్టవేం దైబమా!" అని ఎక్కి ఎక్కి రోదించింది తల్లి!

నెమ్మదిగా విన్నాడు ఎల్లమంద. "అమ్మా!" అని పిలిచాడు.

తల్లి పరుగున వచ్చి "ఏటి బాబో!" అని అడిగింది చిరుగుల చీరకొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ. తల్లిని తన మంచం మీద కూర్చోబెట్టి ఎల్లమంద "అమ్మా! నేను సీమ వెళ్ళి రావడంవల్ల ఈ విధంగా అవలేదు. నాకు తిండి సయించక పోవడమూ దానివల్ల కాదు. నాకు సయించే తిండి పెట్టలేకపోతే మీ తప్పేమి ఉంది. కాని అసలు మన మాదిగ కులంవాళ్ళూ, అలాంటి నీచస్థితిలో వున్న మాలలు, ఇతర చోట్లవున్న మనబోటివాళ్ళూ అనుభవించే పరమ అసహ్యాకరమైన, భరించలేని బాధలు నా మనస్సును వికలం చేశాయి. అందుకు తిండి సయించలేదు. ఇప్పుడు బాగా ఆకలివేస్తూ ఉంది. తీసుకురా అన్నీ." అని నవ్వుతూ వీపు తట్టినాడు.

ఆ వెర్రిబాగుల తల్లి ఒక్క గంతు వేసింది గుడిసెలోకి. ఈ బాలకుడు వస్తున్నాడని తమ చుట్టాలల్లా కిరస్తానీ మతం పుచ్చుకొని దొరల దగ్గిర బట్లరు పని చేస్తున్న జకరయ్య, దొరసానమ్మ నడిగి ఒక సెట్టు పింగాణీ గిన్నెలు వగయిరాలన్నీ పట్టుకువచ్చాడు. ఒక దాంట్లో బజారులో కొన్న నాను రొట్టె, ఒక దాంట్లో మాంసం కూరా, ఇంకో దాంట్లో అన్నం, మరో దానిలో పులుసూ మొదలయినవన్నీ పట్టుకువచ్చి మంచం దాపున వున్న బల్లపైన పెట్టింది.

మనస్సు నిర్మల మయిపోవడంచేత కడుపునిండా భోజనం చేస్తూ, ఎల్లమంద తల్లిని ఎంతో మెచ్చుకున్నాడు. తల్లి వెంకమ్మ ఎంతో సంతోషించింది.

అతనికి తన చిన్ననాటి భోజనం జ్ఞాపకం వచ్చింది. మూకుడులో గంజి, నాలుగు మెతుకులూ, ఉప్పు చేత నంజుకోవడమూ, అంతే భోజనం. ఉప్పుగల్లే షడ్రుచులు సంతకని తల్లి బుధవారంనాడు చిప్పలో పెట్టుకున్న ఆరణాల డబ్బులు అంటే ఆరణాల డబ్బులే రొంటిని ముడేసుకొని భీమవరం పోయేది.

అర్ధణా డబ్బులు ఎండు మిరపకాయలు, మూడు కాన్లు ఉప్పు, ఒక అర్ధణా వంకాయలు, కందిపప్పు అణా, ఘరంమసాలా అర్ధణా, కొబ్బరి నూనె అర్ధణా, వేరుశనగనూనె అర్ధణా, ఉప్పుచేపలు అణా, ఒక కాని దుంపలపోగు, పందిమాంసం అర్ధణా ఇదీ సంత ఖర్చు. ఈ కోటీశ్వరులకీ సంత ఖర్చుతో వారం అంతా గడవాలి. ఖామందుల ఇంటిలో ఏదైనా పండగా పబ్బమూ, శుభకార్యమూ వగయిరాలు వస్తే ఆ రోజు ఇంటిల్లిపాదీ కాస్త రుచులు చూస్తూ కడుపునిండా తింటారు.

ఖామందులు సుబ్రహ్మణ్యశాస్త్రులుగారు కాస్త డబ్బూ ఆస్తీ ఉన్నవాడవటంచేతా, పదిమంది పిల్లలుగల వాడవటంచేతా వారింటిలో ఏవో శుభకార్యాలు వస్తూనే ఉంటాయి. ఆ శుభకార్యాల సమయంలో సాయంకాలం ఆకుల్లో పెట్టి కులం పాలేరువాళ్ళు ఇంటికి బైటదొడ్డిలో గడ్డి మేటికి యివతలగా పదిమందికి సరిపోయే అన్నం, పప్పు, రెండు కూరలు, పులుసు, రెండు పచ్చళ్ళు, పిండివంట రకాలూ పెడితే వెంకో, చంద్రయ్యో మూటలు కట్టుకొని ఇళ్ళకు తీసుకుపోతారు.

అలాంటి భోజనాలు ఎన్నిసార్లో తిన్నాడు ఎల్లమంద. చిన్నతనంలో ఇలాంటి శుభకార్యాలు శాస్త్రులుగారి ఇంట ప్రతిరోజూ జరుగుతూ ఉంటే బాగుండిపోను అని అనుకున్నాడు.

గాంధీజీ కాంగ్రెసు నాయకుడై, హరిజనోద్యమం వచ్చినప్పటినుండీ సభలు జరుగుతున్నాయి. అలాంటి హరిజన మహాసభలలో కూడా రెండు రోజులపాటు కాంగ్రెసు నాయకులు వంటలు చేయించి భోజనాలు పెట్టిస్తున్నారు.

ఎంత దుర్గతి తన జాతికి! ఏనాటికి, ఎన్ని వందలు సంవత్సరాలకైనా కడుపు నిండా తినడం తన సంఘానికి రాగలదా అని అనుకుంటూ ఎల్లమంద భోజనం ముగించాడు.

## (3)

ఎల్లమందమూర్తి ఢిల్లీ వెళ్ళి కేంద్ర ప్రభుత్వం ముఖ్య ఇంజనీరును కలుసుకున్నాడు. ఇంజనీరింగు శాఖా సభ్యుని చూచినాడు. తాను ధరించిన విదేశీ దుస్తులు అతనికి అసహ్యం వేశాయి. కాని అవి ధరించి వెడితేగాని ప్రభుత్వోద్యోగుల్ని చూడడానికి వీలులేదు. హృదయానికి ఆ దుస్తులంటే ఇష్టంలేదు. తన సంఘం అతి నీచం అవడంచేత యీ పెద్దరకం విదేశీ దుస్తులు ధరించాలి. తక్కిన భారతీయులందరితో సమానంగా ధరించాలి. అప్పుడు ఇంకా గొప్పతనం కూడా ఉంది అన్న భావం వస్తుంది కాదా.

అలాంటి భావాలన్నీ మహాత్మునితో మనవి చేసుకున్నాడు.

"మూర్తీ వేలకొలది సంవత్సరాలు బాధపడిన మీ జాతి బాధాస్నాతులై మహాపవిత్రత పొందారు. నేను మీకు సేస్తున్నానంటే వట్టి ధర్మపాలనకే కాదు. బాకీ తీర్చడానికీ కాదు. మీ సేవచేసి పవిత్రత పొందడానికి!" అని బాపూజీ దివ్యనేత్రాలు పలికినాయి.

"బాపూజీ! నా కర్తవ్యం నాకు తెలియటంలేదు. ఇంత చదువు చదువుకొని వచ్చి, నేను ప్రభుత్వోద్యోగం స్వీకరించకుండా ఉంటే నా చదువు వృధా! ఈ చదువు మన దేశానికి ప్రస్తుతం శిరోమణి వంటిది. ఆనకట్టలు లేక నదులు ఉపయోగం లేదు. ఆనకట్టలవల్ల విద్యుచ్ఛక్తి ఉద్భవిస్తుంది. ఈ శక్తి దేశానికి వెలుగూ, పొలాలకు నీరూ, గృహాలకు చిన్న పరిశ్రమలకు ఎన్ని విధాలో ఉపయోగం. పూర్వకాలపు గృహ పరిశ్రమలూ, గ్రామ పరిశ్రమలూ, కొద్ది రూపం మారుతాయి. వ్యవసాయమూ, మరీ రాక్షసం కాకుండా అనేక రూపాల ఉత్తమ విధానాలు అలవరచుకొంటుంది." అని మనవి చేసుకొన్నాడు.

సేవా గ్రామంలో ఉన్నన్నాళ్ళూ వడుకుతూ ఉండే వాడు. వడుకుతూ ఉండవచ్చును. రాతసమయంలో, నడిచేటప్పుడూ ఇతర విధమయిన పని సమయములోనూ తప్ప తక్కినప్పుడు రోజుకు ఒక గంటో రెండు గంటలో ఎందుకు వడకకూడదు. ఆ నిశ్చయానికి వచ్చి ఆ పనే చేయడానికి సంకల్పించుకొన్నాడు.

సేవాగ్రామంలో ఉండే రోజుల్లో చేతిపరిశ్రమగా విద్యుచ్ఛక్తి పిడంబితమయిన వస్తువులు తయారుచేయడం, ఈలా అని దీపాలు వగైరాలు ప్రయత్నించాడు. వెదురుగొట్టంలో బాటరీలు పెట్టడం లోపలనుండి రెండు శక్తులూ కలిసేటట్లు ఏర్పాటు చేయడం దీపం వెలగడం ఈలాంటి చిత్రాలు చేస్తూ ఉండేవాడు.

తన జక్కరం గ్రామంనుంచీ, ఢిల్లీనుంచీ, సేవాగ్రామం నుంచీ జెన్నీకి రోజు విడిచి రోజు ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు.

జెన్నీ రోజు విడిచి రోజు ముత్యాలకోవవంటి దస్తూరితో ఉత్తరాలన్నీ చక్కని మంచిగంధం మంజూషలో పెట్టుకునేవాడు. మధ్యమధ్య జెన్నీకి తానూ, తనకు జెన్నీ తంతులు ఇచ్చుకొనేవారు.

141, పూనమల్లి రోడ్డు, కీల్పాకు,
మదరాసు,
6 మార్చి, 1939

"ప్రియతమా!

మా నాన్నకూ, అమ్మకూ నీ విషయం, మన ప్రేమ విషయం చెప్పాను. పెండ్లికి అనుమతి ఇవ్వవలసిందని కోరాను.

మా తండ్రి ఆలోచించుకోనిమ్మన్నాడు. మా అమ్మ మూతి ముడుచుకుంది.

మర్నాడు మా తండ్రి పిలిచి, "జెన్నీ ఈ వివాహం నాకేమీ ఇష్టంలేదు, మీ తల్లికీ అంతే! ఆమెతో నువ్వు మాట్లాడు." అన్నాడు.

"నేను, 'ఎందుకు ఇష్టం లేదు డాడీ నీకు'?" అని ప్రశ్నించాను.

ఒక కారణం మన సంఘమూ పెరయా సంఘమూ కలియదు. నీ భావికి మంచిది కాదు.

రెండు, ఆ అబ్బాయి ఎంత చదువుకున్నా అతడు నీగ్రోజాతివాడు! మనం తెల్లవాళ్ళం. ఈ రెండు జాతులూ కలియడం నేను చూస్తూ చూస్తూ ఒప్పుకోదలచుకోలేదు.

మూడు, అసలు ఈ సంధానం నా మనస్సుకు ఎంత ప్రయత్నించినా ఎక్కటంలేదు. ఇది కారణం లేని కారణం.

నువ్వు ఈడుకు వచ్చిన పిల్లవు. ఇంకా మైనరువు కావు. ఉద్యోగంలో చేరావు. నీ భవిష్యత్తు నువ్వే నిర్ణయించుకొనే దశలోకి వచ్చావు. నీ కుటుంబం మంచీ, నా సంఘం స్థితీ ఆలోచనా సలహానే నువ్వు పాటించేటట్లయితే, మూర్తిని భర్తగా భావించుకోవడం మానెయ్యి." ఇవి మా తండ్రి మాటలు.

ఈ రెండో పరాభవంతో నేను భూమిలోకి కుంగిపోయాను. ప్రాణప్రియా! నిజమయిన నిర్మలమయిన ప్రేమ వచ్చినచోట్ల ఈలాంటి అడ్డాలు ఉద్భవిస్తూ ఉంటాయి కాబోలు. నేను మాట్లాడకుండా వచ్చేశాను.

ప్రియతమా! నువ్వు దూరంగా వున్నావు. నిన్ను వదిలి వున్న ప్రతి నిముషమూ యుగాలై పోతున్నది. వైద్యాలయానికి వెడుతున్నాను. ఆ పనిలో మునిగిపోతాను. కాస్త కాళీ వచ్చిందంటే నువ్వు ప్రత్యక్షం అవుతావు. ఎన్ని అడ్డాలు వచ్చినా నువ్వే నాకు; నేనే నీకు ఈ అనుబంధం విచిత్రమే. నేను డాక్టర్ని, ప్రేమంటే ఒకటి ఉందని నాకు నమ్మకం లేకుండా ఉండేది. అలాంటి ప్రేమ మానవజన్మకు అత్యంత ఉత్తమత్వం ఆపాదించే మహత్తర విషయం.

ప్రేమకు కులంలేదు. సంఘం లేదు. జాతి లేదు. మానవమైన ఒక మహత్తర వాంఛకు అది పవిత్ర రూపం.

ప్రియతమా
నీకు ప్రాణం అంతా ప్రోగుచేసుకొన్న ముద్దులతో
"జెన్నీ"

141, పూనమిల్లి రోడ్డు,
కీల్పాకు, మదరాసు
9 మార్చి, 1939

"ప్రియతమైన ప్రియా!

నీ కౌగిలింతలు స్మృతి మాత్రం అయినా, అవి తలచుకొని పులకరించి పోతూ వుంటాను. నీ ఫోటోను మాత్రం పల్కరించుకొంటాను.

ఇది ఈలా అవుతుందా! ఇన్ని తీపులు బాధాపూర్ణమై స్త్రీలను ముంచెత్తి వేస్తవా? భారతీయాంగనలు తమలోని కామవాంఛా దాబులను కళ్ళేలు పెట్టి ఆపుకోగలరు. పాశ్చాత్య స్త్రీలు అగ్నిలా మండిపోగలరు. ఈ రెండూ నాలో ఎప్పుడూ యుద్ధం చేస్తూ వుంటాయి. అయినా నేను నిన్ను వాంఛిస్తున్నాను. నాలో తుచ్ఛకామం మొలకలెత్తనే లేదు. సంకరులైన వారికి తుచ్ఛవాంఛే పగ్గాలు తెంపుకొని దౌడులు తీసే గోడిగలవుతుందట! కాని, నాలో అటువంటి భావాలే కలగవు. ఆ విషయమూ నాకు ఆశ్చర్యం కలగజేస్తూ ఉంటుంది.

నా ఆత్మా! నువ్వే నాకు ఎట్టఎదుట. నాకు బదాయి లేదు. నీ ఎదుట నేను తలవంచిన "చెట్టి" పూల చెట్టునయ్యాను. నాలో వికసించే ప్రతిపూవు నీ కోసమే దాచుకొంటున్నాను.

మా అమ్మతో ఒక గంట తీవ్రంగా వాదించాను, ప్రాణస్వరూపా! మన వివాహ విషయం. ఆ అమ్మ పూర్వకాలం మనిషి. మా చుట్టాలందరూ నా ప్రేమ విషయం తెలిసింది, గంటగంటకూ పూటపూటకూ, ఓ చుట్టమో, ఓ పక్కమో, ఓ స్నేహితుడో, ఓ హితురాలో రావడం మా అమ్మతో, నాన్నతో తమ విద్దూరం వెలిబుచ్చడం, నన్ను సన్నసన్నగా చివాట్లు పెట్టడం, నాకు సలహా ఇవ్వడం. నాకో ఉపన్యాసం చదవడం; వెళ్ళడమూ!

నేను ఒక్కొక్క చిరునవ్వు ఒక్కొక్కరికి జవాబుగా అర్పిస్తున్నాను.

నీమీద ఎలిజబెత్తుకు అంత కోపం ఎందుకూ? నిన్ను విడిచి యుగాలు ఉండగలనని నీ ఉద్దేశమా. నా అందం అంతా నీది. నా అందం రహస్యాలు నాకే తెలియవు. నా అందం నువ్వు పరిగ్రహించి అనుభవిస్తున్నప్పుడే ఆ రహస్యాలు నాకు అర్థవంతమవుతాయి కాబోలు.

గాఢ ప్రేమతో ముద్దులు
నీదే "జెన్నీ"

# (4)

ఎల్లమందమూర్తి ప్రతిదినమూ ఉత్తరాలు రాయడమే. "నా హృదయం మధ్య సింహాసనం అధివసించి ఉన్న ప్రియా! మధుర మధురమయిన ఆలోచనలన్నీ వ్యక్తం చేయలేము. ఉత్తరంలో కాగితమూ కలమూ, ఆలోచనలూ మనమూ!

"కలం పాటలు పాడుతుంది; నాట్యం చేస్తుంది. వీణ, వాయులీనం, మాండోలీనం, పియాను, పిల్లంగ్రోవి గుండెలు కరిగేటట్లు మోయించకలదు. కలం నాట్యం చేస్తుంది. కలం దూరంగా ఉన్న వ్యక్తుల్ని దగ్గిరగా తీసుకువస్తుంది.

"నాకు ఎదుట మాటలు లేవు! కాని నీ ఉత్తరాలు నిన్నే సర్వకాలం నా ఒడిలో కూర్చుండబెడుతున్నాయి.

"ఓయి ప్రియతమేశ్వరీ! నేను దారి తెలియని పసిబాలకునిలా ఉన్నాను. హదలి ప్రపంచాన్ని తెల్లబోయి చూస్తున్నాను. అంతా కొత్తగా కనబడి కంటనీరుతో కరిగి పోతున్నాను. అలాంటి నాకు తోటిపిల్లవూ, స్నేహితురాలవై నాకు ధైర్యం చెప్పే గురువువై నీవు కన్పించావు.

"ప్రపంచంలో పురుషుడు ముందుకు పోవాలంటే పురుషునికి స్త్రీయే సారధి. అలాగే స్త్రీకి పురుషుడనుకొంటాను. ఇది నిర్ధారణగా నాకు తెలియదుగాని, మొదటి విషయం నాకు తెలుసును. ప్రాణేశ్వరీ! నేను కౌగలించుకోడానికంటే సిగ్గుపడతాను. నేను చీకటిని, నువ్వు వెన్నెల వెలుగువు.

"కవులు - వెన్నెల చీకటిని తరిమివేస్తుందని వర్ణిస్తారు. నా ఉద్దేశంలో వెన్నెల అత్యంతమయిన దయతో చీకటిని తనతో లయింప చేసుకుంటుందని.

"నీ ప్రేమకు పాత్రుణ్ణా కానా? అనే పవిత్ర విషయం నాకింకా నిర్ణయంగా తేలలేదు. పాత్రా పాత్రదానం అంటో లేదా ప్రియా!"

"నీ వంటి దివ్యాంగన ప్రేమ ఎదుట ఉండే కల్మషాన్ని దహించి పవిత్రం చేసే శక్తిగలది.

ఇట్లు నీ పెదవులు భక్తితో
వరం క్రింద ఆస్వాదించే
నీ దాసుడు
"మూర్తి"

"ప్రియతమేశ్వరి!

మీ తండ్రికీ, తల్లికీ ఎలిజబెత్తుకూ, చుట్టాలకూ, మన ప్రేమ ఏమి అర్థం అవుతుంది. ఎలిజబెత్తు విషయంలో మాత్రం కొంత నాకు ఆశ్చర్యమే కలుగుతూ ఉన్నది. ఆమె శుద్ధమయిన ఆంగ్ల బాలిక! కాబట్టి లయొనెల్‌ను వివాహం చేసుకోకూడదని తల్లీ, తండ్రీ చుట్టాలూ మూర్ఖపు పట్టుపడితే, నేను వారందరితో ఎంతో కాలం వాదించి ఒప్పించాను. ఎలిజబెత్తు నాకు అర్పించిన నమస్కారాలూ నా జన్మ అంతకూ సరిపోతాయి. అలాంటి ఎలిజబెత్తు ఈలా తయారయిందంటే ఏదో కారణం ఉందనే నాకు తోస్తున్నది.

భారతదేశంలో సాధారణాంగ్లేయుల వర్తన విచిత్రం. ఇంగ్లండులో మాతో సమంగా చదువుకొన్న ఆంగ్ల యువకుడు ఏ ఉద్యోగిగానో మనదేశం రాగానే తనతోటి విద్యార్థి స్నేహితుని ఇక్కడ అవమానిస్తాడు. అతని ముక్కు పై కెగసిపోతుంది. ఫారెస్టర్ రాసిన "ఇండియాకు ఒక యాత్ర" అనే గ్రంథం చదవలేదా ప్రియతమా! ఆ భారతీయుడు తోడి ఉద్యోగిగా వచ్చినా ఆ ఆంగ్లేయుడు లెక్క చేయడు.

"నేను ఇంగ్లండులో చదువుకొంటున్నప్పుడు నన్ను మా కాలేజీవారు కాలిబంతి ఆట జట్టులోనికి తీసుకోవాలని ప్రయత్నించారు. ఎవరో కొందరు తప్ప తక్కినవారు. "భారతీయ నిగ్గర్ మాతో సమంగా జట్టులో ఉండడమేమిటి?" అన్నారు.

"కాని నేను ఆటలోనికి వెళ్ళక తప్పింది కాదు. కాలేజీ జట్టు మూడేళ్ళనుంచీ నెగ్గటంలేనిది, ఆ ఏడు మొదటి స్థానం ఆక్రమించి నెగ్గింది. ప్రతి విజయంలోనూ నేను ఎక్కువ గోల్సు చేయడం జరుగుతూ ఉండేది. ఆఖరి ముఖ్య పందెంలో చేసిన గోల్సు అన్నీ నేనే! అందుచేత మా కాలేజీ వాళ్ళు చేసిన ఉత్సవంలో నేను ప్రధాన నాయకుణ్ణి అయ్యాను. ఆ కాస్త పదవికీ చాలా కష్టపడిన వారున్నారు. ప్రాణేశ్వరీ, "ఈ నిగ్గర్ మనవాళ్ళందరికన్నా బాగా ఆడడమేమిటి?" అని ఒక యువకుడు అతని స్నేహితునితో అంటూ వుంటే ఆ ముక్కలు నా చెవిని పడినాయి.

"తెల్లవారు మన దేశంలో రాజ్యం చేస్తున్నారు. వాళ్ళది ఇండియా! ఈ భావం ఎలిజబెత్తులో ఉందని నేను కాస్త అనుకోవటానికి ఆమె మాటలే కారణం.

"ప్రాణప్రియా! నా ఆత్మ మధ్యస్థా! ఒక్కమాట మాత్రం బాగా నమ్ము. నువ్వు ఏది చేయమంటే అది చేస్తాను. నా జీవిత నౌకకు నువ్వే కెప్టెనువు.

నీ దాసానుదాసుడు
అతి ప్రేమభక్తుడు
నీ పెదవి అమృతం ఆశించే
"మూర్తి"

❀ ❀ ❀ ❀

15గ, గ్రాంటు హోటలు,
న్యూఢిల్లీ,
8 మార్చి, 1939.

ప్రియాతి ప్రియబాలికా,

నీ హృదయమే మూర్తి గట్టిన లేఖ అందింది. మీ తండ్రికీ, తల్లికీ ఇష్టం లేదన్న వార్త నా గుండెల్లో పిడుగులు కురిపించింది. అయితే మన కర్తవ్యం! మురుగుకాల్వలో పొర్లే జాతికి చెందిన ఒక దురదృష్టవంతుణ్ణి నువ్వు చేయిపట్టి ఈవలకు లాగినావు. ఏదో ఒక పరమాద్భుతమయిన దర్శనంలా నువ్వు నా ఎదుటకు వచ్చావు. పవిత్రమైన ఆశ్చర్యం కల్పించావు.

నేను ప్రేమ అంటే ఏమిటో, వివాహం అంటే ఏమిటో ఏనాడూ ఆలోచించని ప్రాథమిక మనస్తత్వంగల మనుష్యుణ్ణి.

మా సంఘం నిజస్వరూపం నీకు పూర్తిగా తెలియదు. తప్పి జారి ఒక్క గులకరాయి మహారాణి రత్నాల హారాని కెక్కినట్లు నేను మా సంఘంలోంచి తప్పి జారీ బయటపడిన మనుష్యుణ్ణి.

మా సంఘం సరియైన గుడ్డకట్టడం ఎరుగదు. సరియైన తిండి ఎరుగదు, లోకం అంటే ఏమిటో ఎరుగదు. ఒక్క విజ్ఞాన విషయమూ ఎరుగదు. మా ఊరి చుట్టుపక్కల వున్న ఊళ్ళ విషయం తప్ప మా వాళ్ళేమీ ఎరుగరు. వాళ్ళ రాజకీయాలు పెద్ద ఆసామీల దెబ్బలాటలు. వాళ్ళ కావ్యానందం అసభ్యపు పాటలు పాడుకోవడం. కొన్ని చాలా చక్కనివీ, రసవంతమయినవీ ఉంటాయి. వాళ్ళ సినీమా తోలుబొమ్మలాట. వాళ్ళ పండగ భోజనం చచ్చిన గొడ్డు మాంసం, వాళ్ళ బిడ్డల ఆటలు పేడపోగు చేయడం, దుమ్ములో పొర్లడం. వాళ్ళ చదువు నోటిలో వేళ్ళు పెట్టుకోవడం. వాళ్ళ ఉద్యోగం దేహం వంచి పొలంపని, అందుకు జీతం చిట్టెడు గింజలు.

మా అత్తరు వాసనలు కుళ్ళుకంపు. మా రంగు నల్ల కారుదున్న. మా తలలు నూనెలెరుగవు, మా ఒళ్ళు సబ్బు లెరుగవు. మా గుడ్డలు తెలుపు, ప్రకాశమూ ఎరుగవు. మా కామాలు తిన్నగా స్త్రీ పురుషులు కలియడమే!

మా హంసతూలికా తల్పాలు నులకమంచం, పొలం గట్టు, ఇంటి ముందు స్థలం. మా మోటారు యజమాని వ్యవసాయం బళ్ళు. మా చుట్టాలు నక్కలు, ఊరకుక్కలు, రాంబందులు, పందులు.

మా దేవుళ్ళు పీనుగుల అమ్మవార్లు, మా గుళ్ళు హడలగొట్టే పోతరాజు గుడిసె.
మేం అత్తరువులు, అగరువత్తులు, సబ్బులు, తల నూనెలు, దువ్వెనలు ఎరుగము.
చీనాతో, అల్యూమినంతో, ఇత్తడితో, కంచుతో, రాగితో చేసిన వస్తువులు ఎరుగం.
మా కంచాలు మట్టిచిప్పలు, మా వంటసామాను కుండలు, మూకుళ్ళు, దాకలు, కర్రతెడ్లు.

ప్రాణకాంతా! అలాంటి పెంటకుప్పల్లో నేను ఉద్భవించాను, పెరిగాను, నీ ఎదుట నిలిచాను.

నన్నంటి నా చరిత్ర క్రీనీడలా కూడా వస్తుంది కాబోలు నా పేరు వినేసరికే మీ తల్లితండ్రులకు భయం వేసింది.

ఏమిటి మన కర్తవ్యం? ఈ విషయం ఇంతటిది?

ఇక కేంద్ర ప్రభుత్వం వారు నాకు తాత్కాలికంగా ప్రవాహ జనిత విద్యుచ్ఛక్తి సంస్థలనూ, ఆనకట్టలను పరీక్ష చేసే ఉద్యోగిగా అయిదువందల రూపాయల జీతంమీద ఏర్పాటు చేశారు. ఖర్చులు వేరేనట. మొదటి తరగతి రెండు టిక్కట్లూ, బేటా రోజుకు పదిహేను రూపాయలు. కారుకు వేరే భత్యం ఇస్తారట. నా ఉద్యోగం ఏడాదివరకు తాత్కాలికమట. ఆ తర్వాత నేనిచ్చే నివేదికా, ప్రణాళికలనుబట్టి ఆ ఉద్యోగం ఉంచడమో, తీసివేయడమో చూస్తారట. నేను 15వ తారీఖున ఉద్యోగంలో చేరుతున్నాను.

నా ఆఫీసు న్యూఢిల్లీలోనే ప్రభుత్వంవారు ఏర్పాటు చేశారు. నేను కేంద్ర ప్రభుత్వ ముఖ్యఇంజనీరుగారికి లోబడి పనిచేయాలి. ఆయనే నాకో టైపిష్టునూ, ఒక గుమాస్తాను,

బంట్రోతును ఇచ్చినారు. నా ఆఫీసు ముఖ్యఇంజనీరు ఆఫీసులో భాగం. నేను నెలల తరబడి తిరుగుతూ ఢిల్లీ చేరకుండానే ఉంటూ ఉండవచ్చును. అలాంటప్పుడు నా ఆఫీసు నాతోనే వస్తుంది.

నేను ఎప్పటికప్పుడు రిపోర్టులు పంపవచ్చును. ఈరోజు ఉదయమే ఒక చిన్న చక్కని బంగళా న్యూఢిల్లీలో నాకు చూచిపెట్టారు.

నువ్వు ఢిల్లీలో వైద్యురాలవు అయితే! మనకు మన ఇల్లు ఎంత హాయిగా సరిపోతుంది! వేసవికాలంలో కూడా ఉండాలంటే వట్టివేళ్ళ తడికలూ అవీ ఏర్పాటు చేసుకోవచ్చును.

ప్రాణేశ్వరీ! పట్టిన చేయి విడవబోకు. నేను దారి తెలియని పాంథుణ్ణి. ఢిల్లీ కూడా నువ్వు దగ్గరలేక అడవిలా ఉన్నది.

నీ మహా మధుర చుంబనాలాశించే

నీ మూర్తి,

51, రీడింగ్ వీధి,

న్యూఢిల్లీ,

10 మార్చి, 1939

చేరాను ప్రాణేశ్వరీ కొత్త బంగళాలో ముద్దుగులికే తోట ఉంది. నా కంతా కొత్తగా ఉంది. ఆఫీసు పని ముందుగా పదిహేను రోజులపాటు నేర్చుకొనాలట. ఆ పైన పంజాబులోని ఆనకట్టల పరీక్షకు ఏప్రియల్ నెల ఆరంభంలో వెళ్ళవలసి ఉన్నది.

చుట్టాలు అందరూ మనకు వ్యతిరేకంగా ఉన్నారా? నా వివాహం సంగతి మా జక్కరంలో వచ్చింది. రంగూన్ వెళ్ళి కూలి పనిచేసి, తర్వాత కూలీల కంట్రాక్టు చేసిన మా కులంలో ఒకాయన ఏలూరు దగ్గిర దెందులూరు అనే గ్రామానికి చెందిన దెందులూరు రామస్వామినాయుడు అనే ఆయన చాలా భాగ్యవంతుడు. వారి అమ్మాయిని నాకు ఇస్తామని వచ్చారు. ఒక పంతులమ్మను పెట్టి ఆ అమ్మాయికి చదువు చెప్పించారట.

కాకినాడలో ఒక మా కులం అమ్మాయి బ్రహ్మ సామాజికుల పోషణలో పెరిగి బి.యే.లో నెగ్గిన అమ్మాయి ఉంది. ఇప్పుడు ఆంధ్రా యూనివర్శిటీలో ఎం.ఏ. చదువుతున్నది. ఆ అమ్మాయి సంబంధం ఆలోచించవలసిందని మరొక రాయబారం వచ్చింది. ఈ రెండు రాయబారాలు నేను మా ఊళ్ళో ఉండగానే వచ్చాయి. నాకు నవ్వు వచ్చింది. మా వాళ్ళందరితోనూ నా వివాహ విషయం ప్రస్తుతం ఆలోచించవద్దనీ, నా హృదయంలో వేరే ఒక సంబంధం ఉందనీ తెలిపాను.

నాకు ఉద్యోగం అయింది. ఇంక నా తల్లిదండ్రుల విషయమూ మా అన్నదమ్ముల, అక్కచెల్లెండ్ర విషయము ఆలోచిస్తాను.

వారందరినీ తీసుకువెళ్ళి మా దేశంలో ఒక పెద్ద నగరంలో ఉంచి వారికి తగిన సదుపాయాలూ, చదువూ ఏర్పాటు చేయాలని ఒక ఆలోచన ఉంది. ఢిల్లీ మొదలయిన ప్రదేశాలన్నీ ఒక మాటు త్రిప్పుతాను. మా అన్నదమ్ములు అక్క చెల్లెండ్రకు చదువుల విషయం ఒకటి జాగ్రత్తగా ఆలోచిస్తున్నాను.

ఇక మన భవిష్యత్తు, ప్రాణప్రియా! ఏమి చేయాలి నేను? నాకు నువ్వు ఈ జన్మలో ఎందుకు ప్రత్యక్షమయ్యావు? అయినదానివి అయి ఊరుకోక ఈ ప్రపంచ ప్రేమ మహా చరిత్రలో ఎప్పుడూ సంభవించని సంఘటన ఒక తెల్లబాలిక ఒక నల్లవాణ్ణి ప్రేమించడం సంభవింప చేశావు ఎందుకు?

నేను నిన్ను ముట్టుకుంటేనే నీకు నా నలుపు అంటుతుందేమోనని భయపడ్డాను. వెనక డెస్డెమోనా ఒథెల్లోను వివాహం చేసుకుంది. ఒథెల్లో నా అంత నలుపు అయి ఉండడు. నా జన్మ ప్రతి అణువు నీది. నీ ఇష్టం వచ్చినట్లు ఆ జన్మను చేసుకో. నాకేమీ అవసరం లేదు. "నాకు" అని అనడం ఏమిటి? నీలో ఐక్యమైపోయిన తర్వాత, "నేను" అని విడిగా ఎలా ఉండగలను?

నా సామ్రాజ్ఞీ! "మన ప్రేమ" అనే దివ్య సన్నివేశం జరిగిన తర్వాత ఇంకా సంపూర్ణ చైతన్యం కలుగలేదు. ఏదో మహామత్తతతో తిరుగుతున్నాను. ధవళ శరీర కాంతి వికసిత విలాసినులు ఆసియా వారిని చేసుకుంటూ ఉండడము ఉన్నది. అయినా నువ్వు ఏ దివ్య కారణంచేత నన్ను స్వీకరింప పూనుకొన్నావో ఆ కారణం కారణ రహితంగానే నాకు కనబడుతున్నది.

లయొనెల్ నాకు ఇంతవరకూ మూడు ఉత్తరాలు రాసినాడు. నా ఉద్యోగానికి నాకు పూర్తిగా అభినందనాలు పంపాడు. ఎలిజబెత్తు విషయంలో తనకూ ఏమీ గ్రాహ్యం కాక స్తబ్ధుణ్ణయి ఉన్నానన్నాడు. ఇక మన వివాహం విషయం ఆ బాలికకు ఏమీ ఇష్టంలేదట. అందుకు తన్ను నేను క్షమించాలట; తన యందు మునుపటికన్న ఎక్కువ ప్రేమగా ఆమె సంచరిస్తున్నదట. నేను దక్షిణాదికి వెళ్ళినప్పుడు తనకు అతిథిగా ఉండాలట. నన్ను తమకు అతిథిగా ఉండమని "విజ్జీ" కోరిందట.

ఈ మనఃపరిస్థితి విచిత్రమయినది కాదా జెన్నీ ప్రియా? జెన్నీ ప్రియా! ఎప్పుడు నిన్ను చూడడం? ఎప్పుడూ నీ శరీర సౌరభాలలో తేలిపోవడం? ఎప్పుడు నీ దివ్యమూర్తిని రెప్పలు వాల్చక అనిమిషుడనై చూచి ఏ అద్భుతానందంలోనో తేలిపోవడం? ఎప్పుడు, ఎప్పుడు? నువ్వు సెలవుపెట్టి ఢిల్లీ ఒకసారి వెంటనే వచ్చి మన ఇల్లు చూచి పోగలవా? నీ గులాబీ మొగ్గ పెదవుల నాస్వాదించే,

నీ పాదాలకడ భక్తుడు,

మూర్తి.

## (5)

మూర్తి రాసిన ఉత్తరాలు తన హృదయం దగ్గిర దాచుకొనేది జెన్నీ. ఒక్కొక్క ఉత్తరం ఎన్నెన్నిసారులు చదువుకుందో. జెన్నీ ఉత్తరాలు మూర్తి కోటిసార్లు చదువుకొనేవాడు. ఆమె ఉత్తరాలు ఒకటో రెండో అతని హృదయం కడ ఉండేవి.

పదిరోజులు సెలవుపెట్టి జెన్నీ ఢిల్లీ బయలుదేరింది. ఎందుకు బయలుదేరుతోందో తలిదండ్రులకు తెలిసింది. తండ్రి పిలిచి, "జెన్నీ నువ్వు ఎందుకు సెలవుపెట్టి ఢిల్లీ వెడుతున్నావో నాకు తెలుసును. ఈరోజుల్లో యువతీ యువకులలో విపరీతంగా

తిరుగుబాటు భావాలు తాండవం చేస్తున్నాయి. ఒక్కటి మాత్రం నమ్ము. నువ్వు ఆ నిగ్గర్‌ను వివాహం చేసుకున్నావా నీ ముఖం నీ తలిదండ్రులకు చూపించనక్కరలేదు. మీ పెద్దన్నా నాతో ఏకీభవించాడు. నీకు నా సంపాదన పైస ఒక్కటీ రాదు. మీ అమ్మమ్మ తన డబ్బంతా నీకు ఇవ్వడానికి వీలు రాసిన మాట నిజం. కాని, నేనూ మీ అమ్మ మా శాయశక్తులా ఆమె వీలునామా నుండి నీ పేరు తీయించి వేస్తాము. వివాహం అయిన మరుసటి నిముషంనుండి నీ ముఖం మాకు చూపించనక్కరలేదు. ఇక వెళ్ళు." అన్నాడు.

జెన్నీ ముఖంలో కత్తివాటు వేస్తే నెత్తురు చుక్కలేదు. అలాగే పది నిముషాలు నిలుచుంది. ఒక్కసారిగా ముఖం అంతా రక్తం పోటెత్తుకువచ్చి ఆపిల్‌పండు ఎరుపులా అయిపోయింది. డాక్టర్ అవడంచేతా, ఎప్పుడూ దేనికీ భయపడని జాతి బాలిక కాకపోవడంవల్లా వెంటనే దిట్టరి అయిపోయింది. పకపక నవ్వింది.

"డాడీ, నేను నీ కూతుర్ని, మా అమ్మ పోలికలు నాలో ఏమీ లేవు. ఆ సంగతి అందరికన్న బాగా నీకు తెలుసును. నేను మూర్తిని పెళ్ళి చేసుకోవడమే కాదు. మూర్తి మతమే నేనూ పుచ్చుకుంటున్నాను. పెళ్ళి అయేవరకూ మీరు చూస్తూ ఉండనవసరం లేదు. ఈ క్షణంనుంచి నా ముఖం మీ దృష్టిని వేసి మీ హృదయాలను కష్టపెట్టదలచుకోలేదు. నేను రాతి మనిషిని, సైతాను హృదయం కలదానిని అని అనుకోండి. అందుకు సర్వవిధాలా తగినదాన్నే. కాని మీ మీద నాకున్న ప్రేమా గౌరవం ఏనాటికీ పోవని గ్రహించండి. ఇక సెలవు." అని ఆమె నిదానంగా వెళ్ళిపోయి తాను ఈ మధ్యనే కొనుక్కొన్న చిన్న కారెక్కి డ్రైవరును కారు నడపమన్నది.

ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌లో ఇదివరకే సెకండు క్లాసులో ఒక సీటు ఏర్పాటు చేసుకొని ఉంది. డాక్టర్ జెన్నిఫర్ ఉదయం కారులో దిగి సామాను బండిలో సర్దుకుని కూచుంది. రైలు నడక ప్రారంభించింది. చూపులేని చూపులతో కిటికీలోనుండి చూస్తూంది. ప్రపంచంలో ప్రేమ చరిత్ర సంభవించదు. సంభవిస్తే దారి పొడుగునా అన్నీ గడ్డయిన అడ్డులే అనుకొంది.

అతడు నల్లవాడని తాను ప్రేమించిందా? మనుష్యులలో ఫ్రాయిడ్ చెప్పినట్లు వ్యతిరేక హృదయ తత్వం ఉంటుంది. అందమయిన అమ్మాయి కోతివంటి వాడిని ప్రేమిస్తుంది. మన్మథుని వంటి భర్తను వదలి పుచ్చుకుంకని మిండగాణ్ణి చేసుకునే అప్సరస లుంటారట. రసజ్ఞుడు, విజ్ఞాని అయిన పురుషుని చేసుకోటం మాని, బండవాణ్ణి నీచ భావయుతుని ప్రేమించి పెళ్ళి చేసుకొంటుందట. అమెరికాలో నీగ్రోలను తెల్లవారు తమ సర్వస్వం అర్పించేటంత గాఢంగా ప్రేమిస్తారట. అలాగే తానూ అయిందేమో!

అయితే తన ప్రియుడు కారు నల్లవాడు కాడు. మోము చాలా గంభీరమైంది. ఆ మోమే తెల్లవారి మోమైతే అపోలోతో సమమయిన వాడని పోల్చేవారే! బలమైనవాడు. కష్టపడి ఉన్నతవిద్య సంపాదించుకొన్నాడు. రసజ్ఞుడు, జ్ఞానపిపాసి, సత్పురుషుడు, ఉత్తమగుణపూర్ణుడు మహారాణులు పాదదాసీలుగా రావలసిన వ్యక్తిత్వం కలవాడు. ఇవన్నీ కలసి తన్ను అతని హృదయంలోనికి వాలిపోవచేసి ఉంటాయి.

ఫ్రాయిడ్‌తత్వం నిజం కావచ్చును. కాకపోవచ్చును. కాని ఆ బాలకుడే తనకు ఏడుగడ, తన ప్రాణాధికం. తన్ను స్త్రీనిగా వాంఛించినట్టి, భార్యగా వాంఛించినట్టి వారిలో

ఎంతో అందమైనవారూ ఉన్నారు. తెలివైనవారున్నారు. అద్భుతమైనవారూ ఉన్నారు. కాని వారెవ్వరూ తన హృదయంలో ఇంతైనా స్పందనం కలుగజేయలేకపోయారు.

తన అన్నగారు తనకు మూర్తిని గురించి ఉత్తరాలు రాసేనాడే విచిత్రమయిన ఆనందం కలిగేది. హిందూ వేదాంతంలో చెప్పినట్లు పూర్వకర్మ అంటూ ఒకటుందేమో? తనలో హైందవ రక్తం వుంది, అది ఊరికే పోతుందా? ఆ ఏనాటి సంబంధంవల్లనో మూర్తి తనకు సర్వస్వమూ అయ్యాడు. తన జాతి పోనీ, గౌరవం పోనీ, ధనం పోనీ తనకు కావలసింది తన మూర్తి.

తన మూర్తి తన పురుషుడు కానినాడు, తన్ను అతడు కౌగలించుకోలేని దినం తనకు సంభవించిననాడు, తన్ను మహోద్రేక కామకాంక్షా పరితృప్తిలో పరవశనుచేసి అతడు కరిగించలేని క్షణం ఆసన్నమయిననాడు తాను దేహమే వీడుతుంది.

ప్రేమకు కారణాలు ఉండగలవా? ప్రేమ పరిశోధనాతీతమయిన ఒక అద్భుత సంస్థ. ఒక స్త్రీ నలుగురు పురుషుల్ని ఒకే విధంగా ప్రేమించి దేహం అర్పిస్తూ ఉండగలదట. ఒక స్త్రీ ఒక్క పురుషుని ప్రేమించడమే ఎరగకుండా జీవితం ముగించగలదట. ఒక స్త్రీ ఒక పురుషుని హిమాలయ శిఖరితంగా ప్రేమించి వానికి తన దేహం అర్పించదట. కాని ఏమీ ప్రేమించని పశువులాంటి వానికి దేహం అర్పించడానికి ఏమీ సందేహించదట. ఒక స్త్రీ తాను ప్రేమించినవానికీ మరి ఎవ్వరికీ దేహం అర్పించడం అనే భావం వచ్చి మూర్ఛలూ మొదలయిన జబ్బులు పట్టుకొని బాధపడుతుందట.

తాను మాత్రం వక్రభావ రహిత అయిన స్త్రీ; పరమ సౌందర్యం కలిగిన స్త్రీ; ఒక్కడే పురుషుని ప్రేమించగలిగిన స్త్రీ; ప్రేమించిన పురుషుని తనలో లయింప చేసుకొని తాను అతనిలో లయమై దివ్యానందం పొందగలిగిన స్త్రీ.

ప్రేమకోసం ఆకాశం అంటగలదు. ప్రేమను సర్వఅనుభవాలుకన్న మహదానుభవంగా ఆనందించగల పరమ యువతి. తండ్రి అడ్డయినా ప్రపంచమే అడ్డయినా తన పురుషుణ్ణి తాను పొంది తీరుతుంది.

తనకు తన అమ్మమ్మ ధనం రాకపోతే భయమా? తాను ఈ ప్రపంచ భోగాలు కుత్తిక బంటివరకూ ఆనందించదలచుకుందా? ఇదివరదాకా తన దేహం ఇతరులు చూచి ఆనందించదాని కనుకుంది. తాను ఎవరో తెర వెనుకనున్న ఒక పురుషునితో ఒకనాడు లోకాలను ఆవరించే ప్రేమను అనుభవిస్తాను అని నమ్మింది. అలాంటి పురుషుడు ఒక పుణ్య దినాన తన ఎదుటికి వచ్చిననాడే కరిగిపోయింది. తానే పోయి అతన్ని ప్రేమిస్తున్నానని తెలుపుకుంది.

అలాంటి సందర్భంలో తన తండ్రి తన కోర్కెను సఫలం చేయకపోవడం విచిత్రమే!

**రైలు అన్నది:** జెన్నీ తన సంఘ పారిశుధ్యం తాను రక్షించుకోవాలని తన బిడ్డలను ఏ తండ్రి అయినా అడుపాజ్ఞలలో ఉంచకూడదా?

**జెన్నీ హృదయం:** సంఘ పారిశుధ్యం ఏమిటి? ఎక్కడ ఉన్నది. బ్రిటిషుజాతి స్వచ్ఛమయినదా? బ్రిటిష రక్తంలో కెల్టిక్, జర్మన్, లాటిన్, స్లావోనిక్, యూదు రక్తాలు లేవా? ఏమో! ఏ నీగ్రో రక్తం ఉన్నదో, అమెరికా జాతి స్వచ్ఛమా? జాతి సంకరత ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. అందులో మా జాతి?

**రైలు చక్రాలు:** ఓసి మూర్ఖ బాలికా! నువ్వు వివాహం చేసుకోదలచుకున్నది భారత సంఘంలో అతి తక్కువ కులంలో ఉద్భవించిన బాలుడు.

**జెన్నీ గర్వం:** అందుకే అతణ్ణి తప్పకుండా చేసుకుంటాను! తెల్లజాతులలో అతి నికృష్టమయిన అతి ఆఖరు సంఘంలోనుంచి నేను ఉద్భవించలేదూ?

## (6)

జెన్నీ బెజవాడనుంచి పక్క వేసుకొని వెంట తీసుకు వచ్చిన నవలలు, మాసపత్రికలూ చదవాలని ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది. మదరాసునుంచి ప్రయాణం ఎలా చేసిందో, ఏదో నిద్ర వచ్చేది. బొమ్మలు చూస్తూ కూర్చుంది. కొందరు దద్దమ్మ మగవాళ్ళూ నిజంగా స్త్రీ సౌందర్యం దర్శించి ఆనందించేవాళ్ళూ అటూ ఇటూ తిరుగుతూ ఆమెను గాఢంగా చూశారు. కాని వాళ్ళు చూస్తున్న విషయమే ఆమె గ్రహించలేదు.

తన ప్రాణ ప్రియుని గురించి కలలుకంటూ పడుకుంది. చూపులలో అతడు ప్రత్యక్షమయ్యే చూపులతో దెసలు చూస్తూ కూర్చుంది.

ఆమె బండిలో ఎవరో భారతీయాంగనలు ముప్వురు ప్రయాణం చేస్తున్నారు. అందులో ఇద్దరు ఒక కుటుంబం వారు. ఒక అమ్మాయి భర్తతో ఢిల్లీ వెడుతున్నది. ఆ భర్త వేరే రెండవ తరగతిలో ప్రయాణం చేస్తున్నాడు. ఆడవారి అందాల ముఖమూ, రూపమూ చూస్తూ ఇటూ అటూ పచారు చేసినంత మాత్రాన మగవాళ్ళు చచ్చువాళ్ళయిపోరు కాని, ఆ చూడడంలో పురుషులు వట్టి శుంఠలుగాక, సద్బుద్ధితో చూచే రసగ్రహణ పారీణులుగానో వ్యక్తం అవుతారు అని అనుకుంది జెన్నీ. హైందవ యువతి భర్త నిముషానికో మారు ఈ ఆడవారి బండికి భార్యతో ఏదో మాట్లాడడానికి వచ్చినట్టు నటిస్తూ జెన్నీని తేరిపార చూస్తూ ఉండేవాడు.

ఆ అమ్మాయికి పదునెనిమిదేండ్లు ఉంటాయి. అందమైన బాలిక. బంగారు ఛాయకలది. ముక్కున, చెవులనూ అసలు వజ్రాల ఆభరణాలు తళుక్కుమంటూ మరీ అందం తెస్తున్నాయి. ఆ అమ్మాయి తన భర్త అంటే పట్టరాని బడాయితో, ప్రేమతో వుందని ఆమె కళ్ళల్లో కాంతులే జెన్నీకి చెప్పాయి. అంత చక్కని భార్యను పెట్టుకొని ఇంకో బాలికమీదకు ఆ యువకుడు తన చూపును ఏలా ప్రసరింపగలడు? ఆ చూపుల్లో కాంక్షలు పొర్లాడుతున్నాయి.

ఆ అబ్బాయిని ఏడిపించాలని జెన్నీకి అల్లరిబుద్ధి పుట్టింది. డోర్నకల్లు దగ్గిర అన్నం గిన్నెల దొంతర భార్యకు పట్టించుకు వచ్చాడా యువకుడు. ఆ సమయంలో జెన్నీ ఆ యువకుడి వీపు తట్టి "ఏమండీ! నాకు ఇంగ్లీషు భోజనం ఇంకా రాలేదు. ఎందుకో కనుక్కువస్తారా?" అని అడిగింది.

ఆ అబ్బాయి ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు. గబుక్కున పరుగిడిపోయి ప్లాటుఫారం మీద తల్లక్రిందులా పడ్డాడు. జెన్నీ క్రిందకు దిగి అతన్ని లేవదీసింది. అతడు "మేమే" మని ఏదో కృతజ్ఞత తెలుపబోయాడు. అప్పుడు జెన్నీ అతని భార్య వింటూండగానే "ఏమయ్యా, అంత అందమయిన భార్యను తీసుకు వెడుతూ మనస్సు నిర్మలంగా ఉంచుకో

లేకపోతే తలక్రిందులుగా పడవా మరి. వెళ్ళు నీ పని చూసుకో! నీ భార్యను నేను జాగ్రత్తగా చూస్తానులే. నువ్వు స్టేషను స్టేషనుకు మా పెట్టెకు వచ్చి మా కందరికీ విసుగు పుట్టిస్తున్నావు. అంతగా నీవు పట్టలేకపోతే నీ భార్యను నీ పెట్టెకే తీసుకు వెళ్ళు!" అన్నది.

ఆ యువకుడు తెల్లబోయి తలవంచుకొని తన పెట్టెకు వెళ్ళిపోయాడు. జెన్నీ తన పెట్టెలోనికి వచ్చేసరికి ఆ అమ్మాయికి కళ్ళవెంట నీళ్ళు తిరుగుచున్నాయి. జెన్నీ ఆమెను బుజ్జగించి ఆమె హృదయం చూరకొంది. "రహస్యం చెప్పు స్నేహితురాలా?" అని ఆ బాలిక నడిగింది. ఆ బాలిక బి.యే ప్యాసయిందట. వాళ్ళు అయ్యంగారులు. ఆ కుర్రవాని తండ్రి ఇంపీరియల్ బ్యాంకు క్యాషియరట. చాలా ధనవంతుడట. ఈ అబ్బాయి లెక్కలలో బి.యే. ఆనర్సు మొదటి తరగతిలో నెగ్గి వ్యాపారపు లెక్కల పరీక్షకు చదివి నెగ్గాడట. అతనికి ప్రభుత్వం వారి అకౌంటెంటు జనరల్ ఆఫీసులో ఉద్యోగం అయిందట. పెళ్ళి అయిన ఏ రెండు మూడు నెలలో ఆ బాలికా అతడూ అతి ప్రేమగా ఉన్నారట. అక్కడనుంచి అతగాడు సినిమాతారల వెంటా, కొంచెం తళుక్కుమనే జావకడి మనస్సుగల డాబువేషాల బాలికల వెంటా కుక్కలా తిరగడం ప్రారంభించాడట. అందుకని తండ్రి బ్రహ్మ ప్రళయంచేసి, ఈ ఉద్యోగం ఇప్పించాడుట. ఢిల్లీ చేరి ఇల్లు చూసుకొని, ఆ అమ్మాయిని తీసుకు వెళ్ళుతున్నాడట. ఇవన్నీ జెన్నీతో చెప్పుకుని ఆ అమ్మాయి కుళ్ళిపోయింది. ఇక జెన్నీలో దాగివున్న మాతృశక్తి విజృంభించింది. ఆ బాలికకు తన చరిత్ర, చూచాయగా అందించింది.

ఆ తర్వాత నాలుగు ముఖ్య ఉపాయాలు అవలంబించమని సలహా ఇచ్చింది.

1 కొత్త పద్ధతులపైన చక్కగా అలంకరించుకొనుట.
2.. ఇంటిలో తోటపనీ, గోడబంతి ఆటా అవీ చేసి కసరత్తు చేస్తూ దేహాన్ని సౌష్టవంగా బాగు చేసుకొనుట.
3. స్త్రీ పురుష సంబంధం విషయంలో తాను విముఖంగా ఉన్నట్లు నటించుట.
4. భర్త వచ్చినదీ, లేనిదీ, వున్నదీ, వెళ్ళినదీ ఏమీ గమనించనట్లు నటించుట.

వీనిని ఆచరిస్తూ కొన్ని హొయలు చూపిస్తూ వుండాలనిన్నీ, ఇల్లు దాటివెళ్ళి ఇతర పురుషులను చూస్తున్నట్లు నటించవద్దని ఇంగ్లీషు గ్రంథాలు, రాజకీయాలు, వేదాంతాలు, కళలు ఈ విషయాలవి తెప్పించుకుని చదువుతూ ఉండమనీ, ఇంగ్లీషు నూనె రంగులూ కుంచెలూ వగయిరా సామాను తెప్పించుకుని బొమ్మలు వేస్తూ ఉండమనీ ఉపాయం చెప్పింది.

## 7

జెన్నీ ఢిల్లీలో దిగి దిగడంతోటే "జెన్నీ" అంటూ మూర్తి ఎదురు పడి, ఆమె రెండు చేతులూ పట్టుకొని, ఆమె కళ్ళల్లోకి గాఢంగా తమిగా తేరిపార చూచాడు. ఆమె అంతమంది ఉన్నా అతని కౌగలి లోనికి ఉరికింది. మూర్తి చప్రాసీ ఆమె సామాను పట్టుకురాగా వారిరువురు "వచ్చావా నారాణీ" అంటూ, ఎలా ఉన్నావు "నరుడా!" అంటూ బయటకు వెళ్ళారు. మూర్తి ఒక మంచి పాతకారు కొనుక్కున్నాడు. ఆ కారులో ఎక్కి ముందు డ్రైవరూ, చప్రాసీ కూర్చుండగా వెనుక తానూ, తన ప్రియురాలు కూర్చుండినారు. కారు తిన్నగా మూర్తి బంగళాకు వెళ్ళింది.

బంగళా చిన్నది. అందంగా ఉంది. ఈ కొద్ది రోజులలో ఎంత శుభ్రంగా ఉంచాడు. గృహం మగవాని వల్ల శుభ్రత పొందగలదు. స్త్రీవల్ల సౌందర్యం సముపార్జించుకొంటుంది.

"చక్కని ఇల్లు, ప్రియతమా! చాలా అందంగా నేను ఈ ఇంటి బాలికను అలంకరించవలసి వుంది." అని ఆ బాలిక స్నానాల గదిలోనికి పోయింది. ఆమె అతన్ని బంగళాలో వుండడానికీ, అతడు ఆమె ఢిల్లీలో వున్నన్నాళ్ళూ తన వెనకటి హోటలులో వుండడానికీ ఏర్పాటు చేసుకున్నాడు.

ఆ రోజల్లా ఇద్దరు ఒకరి కౌగిలి ఒకరు వీడలేదు. ఇద్దరి ఒళ్ళూ వేడెక్కినాయి. మూర్తి భయస్థుడూ, ఔచిత్యం నూరుపాళ్ళూ పాటించేవాడూ అవటంవల్ల అంతటితో ఆగింది. లేకపోతే వారిరువరకూ గాంధర్వ వివాహం జరగవలసిందే!

మూర్తి ఆ రాత్రి తన హోటలుకు నిద్రకోసం వెళ్ళబోయే ముందు, "ప్రియతమేశ్వరీ! ఎప్పుడు మన వివాహం?" అని ప్రశ్నించాడు.

"ప్రియా! నువ్వు క్రిస్టియన్ కాదలచుకున్నావా?" అని అడిగింది. అతడు తెల్లబోయి ఆమెవైపు పది క్షణికాలు చూచినాడు. ఆమె వెంటనే, నువ్వు కలియాలని నా ఉద్దేశం కాదుసుమా! ప్రేమకు మతాలు లేవన్న మాట నిజం. మనం మతమూ, సంఘమూ దాటినవారము కాబట్టి భారతదేశ రిజిస్టర్ వివాహం చేసుకుందాము. మీలోనూ, మాలోనూ భగవంతుని ఎదుట అన్ని ఒట్లూ పెట్టి పెళ్ళి చేసుకొని, ఆ ప్రతిజ్ఞలన్నీ వెంటనే మరచిపోయేందుకు సిద్ధం అవుతారు. మన కవన్నీ వద్దు." అన్నది.

"కాని, నాకు భగవంతుడంటే నమ్మకం ఉంది. నీ ఎదుట నన్ను భక్తుణ్ణిగా తీసుకొని రాగలిగిన ఒక మహాశక్తి లేదని ఎట్లా అనగలను. నీతో కలసి ఎక్కడో భగవంతుని ఎదుట నిలుచుండి మన వివాహాన్ని ఆశీర్వదించవలెనని ప్రార్థించడానికి మాత్రం అనుమతి ఇయ్యమని చేతులు ముడిచి నిన్ను కోరుతున్నాను."

ఆమె అతని ఒళ్ళో కూర్చుంటుంది. అతని మెడచుట్టూ చేతులు చుట్టి కౌగలించుకుంటుంది. తాను మంచముపై వాలిపోయి, తనతోపాటు మూర్తిని మంచంపైకి లాగుతుంది. అతనిమీద వాలిపోతుంది. ఆమె ప్రేమ ఉప్పొంగులో అతడు స్వచ్ఛనీరంలా కలిసి మెలసి పోయినాడు. అయినా వారిరువురు శృంగారోద్వేగ మహాగానంలో ఏ విధమైన అనౌచిత్యమూ రాకుండా అతడు చూచుకొన్నాడు. రెండు మూడు సారులు ఆమె తొందరపడింది. అతడు చక్కగా తప్పించుకొని, ఆమె ఉద్వేగానికి ఆనకట్టలు కట్టివేసినాడు.

ఒక ఉదయం టీ త్రాగుతూ ఉండగా అతడామె కంఠాన్ని తన చూపుడు వేలితో, మధ్య మాంగుళితో స్పృశిస్తూ "ప్రాణేశ్వరీ! నీ శరీర స్వచ్ఛతను నేను వేళ్ళతో నైనను ముట్టుకొనడానికి భయపడతాను. నేను ఇంగ్లండులో చదువుకొనే రోజుల్లో అమెరికాలో ఉన్న రోజులలో ఆయా దేశవాసులయిన స్త్రీ పురుషులకున్న స్వచ్ఛవర్ణం నాకు ఆశ్చర్యం కలుగచేసేది. నా చిన్నతనంలో మిషనరీ దొరల్ని, దొరసానులను చూచి వాళ్ళు దేవతలే అనుకునేవాణ్ణి. పెద్ద వాడినయిన వెనక తెల్లరంగులో అఖండమయిన తెలివి తేటలుగల మెదడులు వుంటాయని నిర్ణయానికి వచ్చాను."

"అది వట్టిమాట! జపానువాళ్ళ మాటో? దేహబలం అంటావా జోలూ యీ మూట? పైగా నిన్న మొన్నటివరకు తెల్లవాళ్ళ నాగరికత ఎంత? ఏవో కొన్ని ప్రస్తుత స్థితులను బట్టి సిద్ధాంతాలు చేయకు ప్రియతమా!"

"అవునులే, నారాయణుని ముందు నరుని నిర్వేదంలా ఈ మాటలేమిటి?"

"ఎవరు వాళ్ళిద్దరూ?"

"కృష్ణుడూ, అర్జునుడూ!"

"వాళ్ళ గొడవ మనకెందుకుగాని, మన వివాహమైతేనేగాని నేను ఈ ఊరునుంచి కదలదలుచుకోలేదు. దానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేయి. ఇంక నా ఉద్యోగం విషయమూ, నేను ఎక్కడ నా వృత్తి సాగించేదీ, అవి తర్వాత నిర్ణయం చేసుకుందాం!"

వారిరువురూ అతని కారుమీద ప్రతి సాయంకాలమూ ఎక్కడికైనా వాహ్యాళికి పోయేవారు. అర్థంలేని ప్రేమ సంభాషణలలో ఆనందం పొందేవారు.

ఎల్లమందమూర్తికి జెన్నీని చూచిన కొలదీ ఆమె తన్ను వివాహం చేసుకొని, ఏమి కష్టపడుతుందో అన్న తలపోత ఎక్కువై పోయింది. అతని కౌగిలిలో ఒదిగి కూర్చుండి ఆమె అతడు పరధ్యానంగా ఉండడం చూచింది.

"ఏమిటి ప్రియతమా ఆలోచన ఎక్కువైంది?" అని ఒకనాడు సాయంకాలం యమున ఒడ్డున గూర్చుండి ఆమె ప్రశ్నించింది.

"నా ఆలోచన నువ్వు, నా కలలు నువ్వు, నా జీవితం నువ్వు! ఇంకేం ఆలోచించగలను?"

"నన్ను గూర్చి ఏమి ఆలోచిస్తున్నావు?"

"నీ అందం చూస్తాను, నా అంద వికారం చూచుకుంటాను, "సుందరీ పశువుల" కథ జ్ఞాపకం వస్తుంది. నీ తీయని మధుర కంఠమూ నా అపశ్రుతి కంఠమూ తలపోసుకుంటాను. ఈనాటి అమెరికన్ జాజ్ అల్లరి జ్ఞాపకం వస్తుంది. నువ్వు ఇంగ్లీషు సంగీతం దివ్యంగా పాడటం గమనిస్తాను. ఆనందడోలికలో ఊగిపోతాను. నా కంఠంలో సంగీతం లేదు. ఈలా ప్రతి నిముషానికీ నా పనికిరానితనమూ, నీ దివ్యత్వమూ రెండూ కళ్ళ ఎదుట కదతాయి. నీళ్ళల్లో మునిగిపోవువాని పక్కకు పడవ కొట్టుకొచ్చినట్లు నా ఎదుట ప్రత్యక్షమయ్యావు."

"వారెవా! ఇదంతా ప్రభువువారు తమ రాణీని ప్రసన్నను చేసుకునే విధానం కాబోలు!"

"కాదు రాణీ! ఇన్ని కోట్ల హరిజనులలో, చదువుకుని తక్కిన హిందూ పెద్దలతోపాటు పైకివచ్చేవారు ఏ ఇద్దరో ముగ్గురో వుంటారు. వారిలో ఒకణ్ణిగా నేను వచ్చానంటే నా యాత్ర రహదారిలో నువ్వు ఉన్నావు గనుకనే నేను రాగలిగాను."

"అన్నీ బడాయి మాటలు చెప్పకు ప్రియా! నువ్వు అమెరికానుంచి వచ్చిన తరువాత గద నన్ను చూచింది?"

"నువ్వు ఉన్న విషయం నా బాహ్య ఇంద్రియాలకు తర్వాతనే తెలిసినందనుకో, కాని నాకు చదవాలని బుద్ధి పుట్టించిందీ ఆకివీడులో ఉన్న మిషనరీ దొరసాని. ఆమె

అందం చూచి ఆమె నాకు అమ్మమ్మ అంత పెద్దదీ అవటంవల్ల ఒక తెల్లని బాలికను నా స్వప్న ప్రపంచంలో నాకై సృష్టించుకొన్నాను. ఆనాటి ఆమె రూపు, సౌందర్యము, విలాసము నీలో మూర్తీభవించాయి.

ఆ బాలిక నిశ్శబ్దంగా మూర్తిని కౌగలించుకొని, "నా నాయకా! నేను అదృష్టవంతురాలనో నువ్వే అదృష్టవంతుడవో నిర్ణయించేది, ఆ అదృష్టదేవతే!" అని అతని పెదవులు తమిగా చుంబించింది.

## 8

మూర్తి మరునాడు ఆఫీసులో కూర్చుండి పనిచూసుకుంటున్నాడు.

నదులకు ఆనకట్టలు, తీరాల ఎత్తయినగట్టులు, ఆనకట్టలవల్ల పెద్దచెరువులు, చెరువుల క్రింద కాలువలు. నీరు మహావేగంతో బ్రహ్మరాక్షసియై చక్రాలను తిప్పడం, దానివల్ల డైనమోలు తిరగడం విద్యుచ్ఛక్తి ఉద్భవించడం, ఆ శక్తి దేశం అంతటా తీగెలతో సరఫరా చేయడం, ఆ శక్తివల్ల, మిట్ట ప్రదేశాల నూతులలోనుండి నీరు పైకి రావడం గ్రామాల పిండిమరలు, ప్రతి పూరిల్లులో వెలుగు, పల్లెటూళ్ళలో చిన్న చిన్న రోడ్ల పొడుగునా పెద్ద రాజ బాటలలో దీపాలు, గ్రామాల రేడియోలు, సినిమాశాలలు, చిన్న చిన్న యంత్రసహాయంవల్ల గ్రామ పరిశ్రమ, అందరికీ తిండి, అందరికీ బట్ట, అందరూ ఒకేజాతి, అందరూ ఒకే ఆనందం! ఆ స్వప్నంలో ఉండగా "సాబ్! ఒక సాహెబ్ (తెల్లాయన) ఈ కార్డు ఇచ్చినారు" అని చప్రాసీ మూర్తి బల్లమీద ఒక కార్డు పెట్టినాడు. "మేజరు కార్లయిల్, 3వ ఇండియను రైఫిల్సు, పెషావరు." అని ఉంది.

ఎవరా అని ఒకే ఒక్క నిమేషం ఆలోచించాడు. ఆ వెంటనే మెరుపులా జ్ఞాపకం వచ్చింది. జెన్నీ పెద్ద అన్నగారు! వెంటనే లేచి అతిథులు కూర్చునే గదిలోకి బోయి "నేను మూర్తినండీ! లోనికి దయచేయండి" అని పిలిచాడు.

మేజరు కార్లయిల్ సంపూర్ణ మిలటరీ దుస్తులలో ఉన్నాడు. చేతనొక బెత్తం వుంది. మేజరు కార్లయిల్ తండ్రి పోలిక. అతని ఒత్తైన మీసాలు చివర సన్నంగా మొన వచ్చేటట్టు మెలిబెట్టి వున్నాయి.

మూర్తి చేయి అందిచ్చినా అతను చేయి చాచలేదు. తాను "మూర్తి"నని చెప్పుకున్నా అతడు తాను మేజరు కార్లయిల్ అని చెప్పుకోలేదు. అతడు కుర్చీమీద నుండి లేవలేదు.

మూర్తి ఆశ్చర్యమందాడు.

మేజరు కార్లయిల్ కూర్చుండే, "ఒరీ బ్లడీ నిగ్గర్ ఏదిరా మా చెల్లెలు? ఎక్కడ ఉందిరా? నీ తోలు ఊడేటట్లు ఈ బెత్తంతో నీ వీపు" – అని, పండ్లు బిగించి మాట్లాడాడు.

"మా చెల్లెల్ని కలుసుకునేందుకు ప్రయత్నించినా, మా చెల్లెలికి ఉత్తరాలు రాయడానికి ప్రయత్నించినా, నా ఉద్యోగం సంగతీ, నీ ఉద్యోగం సంగతీ ఆలోచించకుండా పదిమందిలో పట్టుకు నీ వీపు చితకగొట్టడం తథ్యం!" అని లేచి మేజరు కార్లయెల్ విసవిస నడిచి వెళ్ళిపోయాడు.

ఎల్లమందమూర్తికి కలిగిన ఆశ్చర్యం వర్ణనాతీతము. కోపం, ఉక్రోషం, విచారం, భయం, దుఃఖం, ఒకదాని వెంట ఒకటి తరుముకు వచ్చాయి. అలాగే నిరుత్తరుడై

కూచున్నాడు. ఈలాంటి సంఘటన ఏదైనా రావచ్చునని అతడనుకున్నాడు. కాని, ఇంత రాక్షసంగా సంధానిస్తుందని అతడు తన ఊహా విశ్వంలో ఎప్పుడూ, ఏ విధంగా అనుకోలేదు.

హిందూమతంలో వర్ణభేదం ఏర్పడడానికి, ఇదే కారణం. బంగారం కూడా వెండిని నిరసిస్తుంది. రాక్షసిబొగ్గు బొగ్గుని నిరసిస్తుంది. ఆర్యులు, పసిమిరంగు సుమేరియనులను, వారు గోధుమరంగు దస్యులను, వారు నల్లనిరంగు రాక్షసులను అసహ్యించుకొనేవారు. ఆర్యులంతా మొదట ఒకేరంగు. వారే ద్విజులై ఉంటారు.

తెల్లవాళ్ళకు రంగుల వాళ్ళంటే కడుపుమంట. అంతే కాబోలు చటుక్కున ఎల్లమంద లేచినాడు. ఏమీ పని పూర్తి చేసుకోకుండా కారు ఎక్కి తన ఇంటికి చేరుకున్నాడు. ఇంటిలో జెన్నీ లేదు.

అతని గుండె పదినిముషా లాగినట్టయింది. "జెన్నీ! జెన్నీ!" అంటూ గదులు వెదికాడు. చప్రాసీ, పనిమనిషి పరుగునవచ్చి "సాబ్! ఒక మిలిటరీ సాహెబ్ వచ్చి, పది నిముషాలు దొరసానితో మాట్లాడి తన కారుమీద ఎక్కించుకొని పోయినాడు." అని చెప్పినాడు.

ఎల్లమంద వారి మాటలు విన్నాడన్న మాటేగాని, అసలు తాను ఏమి చేస్తున్నదీ అతనికి తెలియలేదు. గదులన్నీ ఆమెకోసం వెదుకుతూ వెదుకుతూ తిరుగుతున్నాడు. ఆమె నివసించిన గదిలోని అద్దానికి తగిలించి ఒక ఉత్తరం ఉంది.

"ప్రియతమా! మా మేజరు అన్న పెషావరునుంచి వచ్చాడు. అతని భార్య, మా వదినకు చాలా జబ్బుగా ఉందట. కాబట్టి వెంటనే రమ్మనమని ఈ సాయంకాలం మూడు గంటల బండికి బయలుదేరమన్నాడు. నీతో చెప్పి వస్తానంటే వ్యవధి లేదన్నాడు. ఈ ఉత్తరం రాసి మూడు గంటల బండికి వెళ్తున్నాను. అక్కడినుంచి ఉత్తరం రాస్తాను. నిన్ను ఇలా వదలి వెళ్ళడం, నా ప్రాణం, నా మనస్సు ఇక్కడే వదలి వెడుతున్నాను. ఇంతే సందర్భం. ఇంత తొందరయినది ప్రాణాధికా! నీకు కోటి కోటి ముద్దులు, శతకోటి కోటి కౌగిలింతలు – హృదయ ప్రభూ! నువ్వులేని సమయంలో సిగ్గువదలి నా ప్రభువు అని కంఠమెత్తి పిలుచుకుంటున్నాను. అన్న తొందరపెడుతున్నాడు, సెలవు.

నీ పెదవుల నా పెదవులు<br>
గాఢంగా ఆనించి<br>
"నీ జెన్నీ"

అని ఉత్తరం చదువుకొన్నాడు.

పెద్ద నిట్టూర్పు విడిచి కుర్చీపై కూలబడిపోయినాడు. లోకం అంతా నల్లబడింది. ఒళ్ళు చెమటలు పోసినాయి.

"నా దివ్యమూర్తి నా జన్మనే వదలి వెళ్ళిపోయిందా!" అని పైకి అనుకున్నాడు.

జెన్నీ గుడ్డలు, కొన్ని స్త్రీలకు గోప్యమైన లోని దుస్తులు ఆమె ఉపయోగించు సబ్బు అవీ ఉన్న పెట్టె అక్కడే ఆమె వుంచి వెళ్ళిపోయిన విషయం అతడు కనిపెట్టినాడు.

అవి అన్నీ తీసి పెదవులతో చుంబించి, హృదయాని కదుముకొని, ఒక తోలుపెట్టెలో అన్నీ సర్ది తాళం వేసుకున్నాడు. అతడు ఆ రాత్రంతా నిద్రలేకుండా తిరిగినాడు. ఆ

బాలిక ఛాయాచిత్రాలను ఎన్నింటినో అతడు చిత్రచిత్రాలైన ఫ్రేములు కట్టించుకొని తన ఇల్లంతా అలంకరించుకొన్నాడు. ఆ చిత్రాలన్నిటినీ ఎన్నిసారులో పలకరించుకొన్నాడు.

పడక కుర్చీలో వాలి, ఏమిటి జెన్నీ అన్నగారి ఉద్దేశం? తానేమి చేయాలి? జెన్నీని తానెల్లా వదిలివేయగలడు? జెన్నీ ఏమంటుంది? ప్రపంచం అంతా తనపైనే కత్తిగట్టినారా? లయొనెల్‌కు రాస్తే అతడేమి అంటాడో!

"జెన్నీ! ప్రాణప్రియా! నిన్ను పొందలేని నాకు ఈ ఉద్యోగం వద్దు. మా జక్కరం గ్రామంపోయి అక్కడ ఏదో హరిజన సేవ చేసుకుంటూ ఉండవచ్చు. లేదా మహాత్ముని ఆశ్రమానికి పోయి, అక్కడ ఆ బాపూజీకి సేవచేస్తూ ఆయన ఆజ్ఞ ప్రకారం నడవవచ్చు." అని జెన్నీ చిత్రం వైపు చూస్తూ మాటలాడినాడు.

## (9)

యుద్ధం చల్లగా వచ్చింది. వచ్చినప్పుడు అంత ప్రళయం అవుతుందని ఎవరనుకున్నారు. జర్మనీ రష్యాతో సంధి చేసుకొని పోలండు మీదికి దిగింది. పోలండు జర్మనీ కత్తిపీటకు ఆనపకాయ అయింది. జర్మనీ పోలండు మీదికి వెళ్ళింది గనుక ఇంగ్లండు, ఫ్రాన్సులు జర్మనీమీద యుద్ధం ప్రకటించాయి. హిట్లరు అబ్బే అంటూనే ఆస్ట్రియా ఆక్రమించుకొన్నాడు. చెకొస్లావేకియా ఆక్రమించుకొన్నాడు. గొడుగు ధరించి ఛాంబర్లేనుగారు ఎంత తన రాజకీయపు టెత్తులు వేస్తే ఏమి? హిట్లరుకు భయమా!

ఇంగ్లండుకు ఏమంత బలం ఉంది? చీనా జపాను యుద్ధంలో ఏమీ చేయలేక పోయింది. ఒక మాటు చీనా పక్షం అంది, ఇంకోమాటు ఏ పక్షమూ కాదంది. బర్మా రోడ్డు తెరిచింది. చీనా సహాయంకోసం; తర్వాత జపానుకు కోపం వస్తే ఆ రోడ్డు మూసి వేసింది. అబ్సీనియాపై ఇటలీ విరుచుకుపడితే, ఆహాహా! అంది. ఇటలీ తన నావికాబలం, అదీ చూపించేసరికి తర్వాత చెప్తాలే అన్నట్టు ఊరుకుంది.

హిట్లరు ఇంగ్లండుకు ఎంత బలం ఉందో అప్పుడే తెలిసికొన్నాడు. ఫ్రాన్సు ఎప్పటికైనా తన చేతిలోనిదే. ఫ్రాన్సుకూ జర్మనీకి మధ్య ఫ్రాన్సువారి "మాజినో" దుర్గ శ్రేణి ఉన్నది. జర్మనీకి "సీగ్ ఫ్రీడ్" శ్రేణి వుంది. ఆ శ్రేణుల మధ్య మొదట వేళాకోళం యుద్ధం సాగింది. పోలండు అయిపోయింది. అప్పుడు పడమటకు తిరిగాడు హిట్లరు.

ఎల్లమందమూర్తి ఉద్యోగ ధర్మాన పంజాబ్, సింధు, బొంబాయి, మద్రాసు రాష్ట్రాలు తిరుగుతూ, ఆయా రాష్ట్రాలలో ఇదివరకే స్థాపింపబడి వున్న ఉదక వేగజనిత విద్యుత్ సంస్థలను పరిశీలిస్తున్నాడు. ఎన్నో ఉత్తరాలు రాసినాడు జెన్నీకి, జెన్నీనుంచి ఒక్క వుత్తరమూ లేదు. ఏమిటీ రహస్యం. జెన్నీ అన్నగారు, ఆ మేజరు ఏదో చేసినాడు.

ఎక్కడకు వెళ్ళినా అతడు ఆ చుట్టుప్రక్కల హరిజన వాడలు పరిశీలించేవాడు. అతని గుండె తరుక్కుపోయేది. ఏమి చేయగలడు? ఒక పర్వతం నెట్టివేయడం వంటిదది. ఏనాటికి తన సంఘానికి విముక్తి? కాంగ్రెసు వారూ వెనకటి సంప్రదాయం వదలలేకుండా వున్నారు. అయినా ఏం చేయగలిగినా వారే! ఒక్కటే మార్గం ఉంది. హరిజన బాలికలు చక్కని విద్య నేర్చుకుని ఉత్తమ కులాల బాలకుల్ని వివాహం చేసుకోవాలి. చదువు, అలంకారం, శుభ్రత, నాగరకత, ఇవి మనుష్యులను పైకి తీసుకువెడతాయి.

ఆర్థికంగా తనవారు భూస్వాములు, ఉద్యోగులు, వర్తకులు అయిన మరునాడు ఈ దుర్భరస్థితి పోతుంది. ఉద్యోగం చేసే క్రిష్టియనులకు తన సంఘానికి వున్న దౌర్భాగ్యస్థితి ఏది? ముస్లిం మతం కాని, సిక్కు మతంకాని పుచ్చుకున్న హరిజనులకు ఈ దుర్భరస్థితి లేదు. ఒక మతంలో వున్న లోపాలను సవరించి, దాన్నే ఉత్తమ స్థితికి కొనిపోవడం మగతనమూ, పవిత్ర ధర్మమూ అవుతుంది అని అనుకున్నాడు.

మూర్తి తిరుగుతూ పై అధికారులకు తాను చూచినది, చేయవలసిన మార్పులు, వృద్ధి చేయవలసిన విధానం అంచనాలు, లెక్కలు అద్భుత శాస్త్ర గ్రంథంలా తయారు చేసి పంపేవాడు. ఒకనాడు బ్రిటిషు దేశస్థుడయిన చీఫ్ ఇంజనీరు ఈతని నివేదికలన్నీ చదివాడు. అవి చదువుతూ చదువుతూ తక్కిన సర్వమూ మరిచిపోయి ఆ నివేదికలన్నీ పూర్తి చేశాడు. భాషమాట అట్లా ఉంచి విషయమూ, శక్తి చూచి ఆశ్చర్యమందినాడు. వెంటనే ఎల్లమందమూర్తిని గూర్చిన కాగితాలన్నీ తెప్పించుకు చూచినాడు. అతనికి ఎంతో సంతోషం వేసింది.

వెంటనే ఎల్లమందమూర్తికి బొంబాయి రాష్ట్ర ఉదక జనిత విద్యుచ్ఛక్తి సహాయ ఇంజనీరుగా, వేయి రూపాయల జీతం మీద ఉద్యోగం ఇచ్చి, వెంటనే వెళ్ళి చార్జి పుచ్చుకొమ్మని ఆజ్ఞ యిచ్చినాడు.

మూర్తి గరిసెప్ప జలపాతం దగ్గిర వున్నప్పుడా ఆజ్ఞాపత్రం అందినది. గరిసెప్ప జలపాతంవంటి మహాపాతాలు మూర్తి అమెరికాలో దర్శించినాడు. నయాగరా జలపాత మహాభావం అతదర్థం చేసుకున్నాడు. నయాగరా భావం అమెరికా! గరిసెప్ప భారతదేశం. శివసముద్రంకన్న గరిసెప్ప ప్రతాపం అఖండమైనది. శివసముద్రపు బాలికా తాండవము, గరిసెప్ప పురుషుని తాండవము.

క్షణికంలో ప్రతికోటివంతు కాలమూ నీటిలోని ప్రతి అణువు క్రిందకు పడుతున్నది. అలాంటి అణువులు ఆ కాల భాగంలో ముందుకు వస్తున్నాయి. నిత్యమై జలం ప్రవహిస్తున్నది. నిత్యపతనము, నిత్యనూతనము. అలాగే ప్రేమ నిత్యనూతనము, ప్రేమికులు నిత్యనూతనము. ప్రేమ గరిసెప్ప మహాప్రతాపము, ప్రేమమహాప్రవాహము ప్రేమ సూక్ష్మమూ, స్థూలమూ! ప్రేమ కదలని స్థిరత్వము; అఖండ వేగంతో కదలిపోయే మహాభయంకర తృణావర్తము. ప్రేమ ప్రేమకోసం, ప్రేమ జాతివృద్ధికోసం. ప్రేమ సూర్యాగ్ని గోళం. ప్రేమ చంద్రశీతలం.

ఆ ఆలోచన కడ చటుక్కున ఎల్లమందమూర్తి ఆగిపోయినాడు. ఏమిటిది? నీటిశక్తి లెక్కల చూచుకొనే తనకు ప్రేమశక్తి లెక్కల చూడడం సంభవించిందేమి? జెన్నీ తన ఆలోచనలలో అంతభాగం ఆక్రమించుకొని పోయిందేమి? జెన్నీ! ఎక్కడ వున్నావు?

* * *

# ఐదవ భాగం

# విషాదయోగం

జెన్నీ ఏమయిపోయిందో లోనవాలాలో మకాం పెట్టి మూర్తి ఆలోచించుకుంటూ కూచున్నాడు. లయొనెల్ దగ్గిరనుండి ఇంతట్లో ఒక ఉత్తరం చక్కా వచ్చింది. మూర్తి బొంబాయి వచ్చి చార్జిపుచ్చుకుని మూడురోజులయింది. లోనవాలా వచ్చి రోజయింది. ఇవాళ లయొనెల్ దగ్గిరనుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం బొంబాయి మెట్టూరు, లోనవాలా, మైసూరు, శివసముద్రం, గరిసెప్ప, బొంబాయి వచ్చి అచటనుంచి మళ్ళీ లోనవాలా వచ్చింది.

మూర్తి ఢిల్లీలో ఉండే రోజుల్లో లయొనెల్‌కు ఎన్నో ఉత్తరాలు రాసేవాడు. మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలయిలలో లయొనెల్ దగ్గిరనుండి ఉత్తరాలు వస్తూనే వున్నాయి. లయొనెల్ ఒకడే మూర్తికి సర్వవిధాలా మద్దతు చేస్తూ ఉండేవాడు.

జెన్నీ ఆ నాలుగున్నర నెలలూ మూర్తికి అరవై రెండు ఉత్తరాలు తన హృదయమే కావ్యమయినట్లు రాసేది. ఆగస్టు నెలాఖరులో జెన్నీ పట్టలేక ఢిల్లీ ప్రయాణమై వచ్చింది. వచ్చిన పదిరోజులలో మాయమైపోయింది.

తన ప్రేమచరిత్ర లెక్క చూచుకొంటూ జెన్నీ చిత్రం చేతిలో ధరించి లోనవాలా లోయలో తను మకాం చేసిన బంగాళాలో అధివసించిన మూర్తి తాను జెన్నీని కలుసుకున్నప్పటినుంచి తన ప్రేమ పొందిన పరిణామమూ, అది ప్రవహించిన వేగమూ, పతనాలూ, సుడులూ అన్నీ ఆలోచిస్తూ ఆమె చిత్రాన్ని రెండుసార్లు పవిత్ర ప్రేమతో కళ్ళకద్దుకున్నాడు.

ఏ మహాప్రేమ చరిత్రయినా రోజులలో మార్పులు, నెలలో మార్పులు అనేకం పొందుతూ ఉంటుంది. ఈ నాలుగున్నరనెలలలో తన ప్రేమ చరిత్ర అతి చిత్రమై, బాధాకరమై పరిణమించింది.

ఈనాడు లయొనెల్ ఉత్తరం చూస్తూనే ఎల్లమంద ప్రాణం జల్లార్చుకుపోయింది.

పెషావరు<br>
కంటోన్మెంటు<br>
2 సెప్టెంబరు, 1939.

ప్రియమైన మూర్తీ!

నీ ఉత్తరం అందింది. మా అన్నగారు వట్టి జంతువులా తయారయ్యాడు. జెన్నీని మాయచేసి పెషావరునుండి ఎత్తుకుపోయాడు. నీ ఉత్తరం చూచి నేను మా వదినకు నిజంగా జబ్బుచేసి ఉంటే సహాయార్థం జెన్నీని తీసుకు వెళ్ళడానికి వచ్చి నిన్ను కలుసుకొని తన అక్కసు అంతా తీర్చుకొని, జెన్నీని తీసుకువెళ్ళాడనుకొన్నాను. వెంటనే వదినకు ఎలా ఉందని మా అన్నకు తంతి కొట్టాను. కులాసాగానే వుందని నాకు జవాబు ఇచ్చాడు. ఆ సంగతే నీకు ఉత్తరం రాశాను.

నీకు ఉత్తరం రాసిన వెంటనే వదినకు ఎలావుంది. జబ్బేమిటి అని జెన్నీకి రాశాను. అందులో మా అన్న నిన్ను ఏలా అవమానించాడో అదీ రాశాను. దానికి జవాబు రాలేదు. నాకు ఆశ్చర్యం వేసింది.

మా వదినకు జబ్బుగా వుంది. నేను వెళ్ళి చూసివస్తానంటే విజ్జీ సరేనంది. నాకు కూతురు పుట్టిన సంగతి వెనకే రాశాను. చిన్న విజ్జీ వెన్న ముద్దల పాపాయిలా తయారైంది. వారిద్దరినీ మదరాసులో దిగబెట్టి, నేను పెషావరుకు వెళ్ళాను.

మా వదినకు జబ్బూలేదు, గిబ్బూలేదు. జెన్నీ తరఫున మా అన్నే రాజీనామా పెట్టాడు. ఆమె గవర్నమెంటు ఉద్యోగానికి. ప్రభుత్వంనుంచి విచారిస్తూ, ఆమెకు రాజీనామా అంగీకరించినట్లు ఉత్తరం వచ్చిందట.

ఆమెను ఎక్కడకు పోనీయడు. కొంచెం హెచ్చుతగ్గుగా ఖైదు. ఆమెవెంట ఎప్పుడూ ఎవ్వరో ఉండడం! జెన్నీ అన్నగారి ఉద్దేశం అంతా వెళ్ళిన రోజే గ్రహించింది.

మా డాడీ మా అన్నను మెచ్చుకుంటూ జెన్నీకి బుద్ధి చెపుతూ పెద్ద ఉత్తరం రాశాడుట.

మూర్తీ! మూర్ఖుల పట్టుదల ఈ ఇరవైయో శతాబ్దములోకూడా ఈలా వుంటుంది. నేను మాట్లాడకుండా మర్యాదగా మాట్లాడినట్లు నటించి, ఒక రోజున షికారు వెళ్ళినట్లు బయలుదేరి మా జెన్నీని రైలు ఎక్కించి లాహోరు అక్కడనుంచి తిరుచునాపల్లి పొమ్మని పంపాను.

ఈ సంగతి ఆ అన్నకు తెలిసి ముష్టియుద్ధం సలిపినాడు. దెబ్బలన్నీ తిని నేను అహింస అవలంబించితిని. మొగం వాచి పెదవి పగిలి పడిపోయాను. మా వదిన అడ్డం రాకపోతే మా అన్న ఎంతవరకూ వెళ్ళేవాడో! మా వదినే నాకు కట్టుకట్టింది.

ఈలోగా మా అన్న సాయంకాలం బండిమీద బయలుదేరి ఎలా గ్రహించాడో జెన్నీ ఢిల్లీలో ఉంటుందని అక్కడకు పోయి ఆమెకు బలవంతంగా రైలు ఎక్కించి తిరిగి పెషావరుకు తీసుకువచ్చాడు. ఇప్పుడు జెన్నీ ఆ ఇంట్లో ఖైదు. నేను ఒక ఇంగ్లీషు హోటలులో మకాం.

ఇంక నేను చేయబోయేది; మా అన్న సంగతి ముఖ్య సైనికోద్యోగికి తెలిపి జెన్నీని తీసుకుని నువ్వు ఎక్కడ వుంటే అక్కడకు వస్తున్నాను. నేను ఢిల్లీ వెళ్ళి నీ తిరగడం గురించి దర్యాప్తు చేస్తాను.

నా మొగం వాపూ అవీ తగ్గినాయి. ఏ సంగతీ వెంటనే ఉత్తరం వ్రాస్తాను.

ప్రియమైన

లయొనెల్.

ఈ ఉత్తరం చదువుకొన్నాడు. తెల్లబోయాడు. మళ్ళీ చదువుకొన్నాడు. కన్నుల నీరు తిరిగినంత అయింది. తన కోసం తన ప్రాణ స్నేహితుడూ, తన ఆత్మదేవి అంత బాధ అనుభవించారు. అతడు కోపంతో మండిపోయాడు. పళ్ళు బిగించాడు. ముష్టితో బల్ల కదిలిపోయేటట్లు గుద్దినాడు.

నెమ్మదిగా తమాయించుకొన్నాడు. అవును మాదిగ వాళ్ళకు చదువేమిటి? ఉద్యోగం ఏమిటి? ప్రేమ ఏమిటి? పెళ్ళి ఏమిటి?

వంటినిండా గంధం రాసుకొని, పసుపు బట్టలు కట్టుకొని బానలు బానలు తాగుతూ పెళ్ళిళ్ళు చేసుకొనే మాదిగ వాళ్ళకు ఉత్తమ సంస్కార వివాహం ఏమిటి?

తమలో ప్రేమలు ఏమిటి? తామంతా ఊరకుక్కలు. ప్రేమలు లేవు, నీతులు లేవు, ఉత్తమ స్థితి లేదు.

మాదిగ వారిలో పుట్టి, మాదిగ వాడలో పెరిగి, తాను చదువుకొనేందుకు సాహసించడమా? ఒక ధవళ కాంతుల అందమైన బాలికను ప్రేమింప సాహసించడమా? తమ సంఘానికి ఇది ఇంత అని నుదుటిపైన రాసివుంది. దానికి మించి వెళ్ళడానికి ఎవరు సాహసించేది? మానవ ప్రపంచం మాదిగవాళ్ళంటే అసహ్యించుకొంటుంది. చీదరించుకొంటుంది. తన సంఘాన్ని గాంధీగారు ఉద్ధరిస్తారని తాము గంపెడంత ఆశపెట్టుకొని వుండడం అంత వెఱ్ఱిపని ఇంకోటి వున్నదా? కరడుకట్టి, రాయైపోయిన సంఘాన్ని ఎవరు మార్చగలరు? ఎవరో తనబోటి నలుగురయిదుగురు, అంబేద్కరులు, శివరాజులు, పన్నీరు శెల్వాలు, రాజభోజులు, బి.ఎస్.మూర్తి మొదలయినవారు పైకివచ్చినా కూడా పై కులాల వారు తమ ఇంట్లో తమతో సమానంగా వారికి భోజనం పెడ్తారా?

తనకు ఈ నిర్వేదం అంతా ఏమిటి? ఎందుకీ ఏడ్పు గొట్టు కవిత్వం? నడుంకట్టి పనిచేయాలి. ఎంత ఇనుమైనా కొట్టగా కొట్టగా ముక్కలై పిండి అయిపోతుంది.

వెంటనే మూర్తి వారం రోజులు సెలవు పుచ్చుకొని, తిన్నగా పెషావరు వెళ్ళినాడు. లయొనెల్ వున్న హోటలులో లయొనెల్‌ను కలుసుకున్నాడు. ఇద్దరూ ఫ్రెంచివారిలా, ముస్లిం సోదరులులా కౌగలించుకొన్నారు.

"నువ్వు వస్తావని నేను అనుకుంటూనే ఉన్నాను."

"ఎలా రాకుండా ఉండగలను? జెన్నీ ఎక్కడ? ఎల్లా వున్నది?"

"జెన్నీ కులాసాగానే ఉన్నది. కాని మా అన్న ఆమెను ఒక గదిలో పెట్టి తాళం వేస్తున్నాడని నాకు రూఢిగా తెలిసింది."

"ఈ రోజుల్లో-"

"రోజులు మారుతాయిగాని, మనుష్యులు మారుతారా మూర్తీ!"

"నీ ఆలోచన?"

"నా ఆలోచన మా చెల్లెలిని తీసుకురావడమే!"

"ఎలాగ సాధ్యం?"

"అదే ఆలోచిస్తున్నా, మా అన్నకు నేను ఇక్కడ వున్న సంగతి తెలిసింది."

ఎల్లమంద ఆ హోటలులో స్థానం దొరక్క ఇంకో హోటలులో పెషావరుపురంలోనే మకాం పెట్టినాడు. తిన్నగా ఆ మర్నాడు చక్కనివేషం వేసుకుని ఆ స్కంధావారానికి సేనాపతి అయిన "కాల్నెల్ – " గారి దగ్గరకు పోయి తన చీటీ వారికి పంపినాడు. ఆయన లోనికి రమ్మని ఆజ్ఞ ఇవ్వగానే వెళ్ళి నమస్కరించి వారు చూపించిన కుర్చీపై కూర్చుండి తన కాగితాలన్నీ చూపినాడు. అవి చూచి "కాల్నెల్ –" గారు సంతోషమైన ముఖంతో "ఆనందం" అన్నారు.

అప్పుడు ఎల్లమంద జెన్నీ చరిత్ర వారికి చెప్పి, మేజరు కార్లయెల్ చేసినదంతా మనవి చేశాడు. ఎవరినైనా పంపి మేజరు తన చెల్లెల్ని తాళం వేసి ఉంచినాడో లేదో కనుగొనవచ్చునని మనవి చేశాడు.

"కాల్నెల్ –" గారు స్వచ్ఛమయిన ఇంగ్లీషువాడు. అతనికి మేజరు కార్లయెల్ సంకరం వాడైనా శుద్ధ ఇంగ్లీషు వానిలా సంచరించడం ఏమీ ఇష్టంలేదు. కాని కాంగ్రెసు ప్రభుత్వాలు వున్న రోజులు. దేశంలో స్వాతంత్ర్య వాతావరణం బాగా వుంది. పైగా కేంద్ర శాసనసభలో ఎవరయినా ప్రశ్నలు వేయవచ్చును. ఇవన్నీ ఆలోచించి, చూచీ చూడనట్లు ఊరుకున్నాడు. ఇప్పుడు మూర్తి చెప్పిన సంగతులన్నీ విని ఈ సంకరులకు నల్లవాళ్ళ కన్న సంబంధాలకు ఎవరు బాగా పనికివస్తారేమి? అనుకొని, గంటకొట్టి ఆర్డర్లీన్ని పిలిచాడు.

నువ్వుపోయి "కేప్టను–" గారిని తీసుకురా అని ఆజ్ఞ ఇచ్చాడు. అయిదు నిమిషాలలో "కేప్టన్–" వచ్చి సైనిక వందనంచేసి కఱ్ఱలా నిలుచున్నాడు.

"ఏమయ్యా నీవు మేజరు కార్లయెల్ ఇంటికిపోయి నా ఆనతి చెప్పి, ఫలానా గదికి వేసిన తాళం తీయించి, ఆ గదిలో ఉన్న బాలికను ఇక్కడకు తీసుకుని రమ్మనమన్నానని చెప్పు."

కెప్టన్ మళ్ళీ సైనికవందనం సలిపి, పైకివెళ్ళి కారు ఎక్కి మేజరు కార్లయెల్ ఇంటికి వచ్చాడు.

ఈలోగా అక్కడే ఉన్న వేరే గదిలో కూర్చుండమని చెప్పి ఆ సేనాపతి మూర్తిని పంపినాడు. అరగంటలో కారు వచ్చిన చప్పుడయింది. లోనికి జెన్నీ, మేజరు కార్లయెల్, ఆ కెప్టనూ వచ్చిన చప్పుడయింది. సేనాపతి గది దగ్గిరగా ఉండడంవల్ల ఆ గదిలో మాటలు స్పష్టంగా మూర్తికి వినబడుతున్నాయి.

**సేనాపతి:** (లేచి జెన్నీకి కుర్చీ చూపిన చప్పుడు.)

గుడ్‌మార్నింగ్. మీరేనా డాక్టరు జెన్నీఫరు కార్లయిల్?

**జెన్నీ:** అవును.

**సేనాపతి:** మేజరు కార్లయిల్ మీ అన్న?

**జెన్నీ:** అవును.

**సేనాపతి:** మిమ్మల్నెందుకు మీ అన్నగారు గదిలో ఉంచి తాళం వేశారు.

**జెన్నీ:** నిముషం (మౌనం)

**సేనా:** చెప్పండి డాక్టర్! మీకు భయంలేదు. మీ అన్న చేసిన ద్రోహం యావత్తూ నాకు తెలిసింది.

**మేజర్ కార్లయిల్:** నేను మనవి చేసేది.

**సేనాపతి:** ఊరుకోవయ్యా – చెప్పు బాలికా, ఏమీ భయంలేదు.

**జెన్నీ:** చెప్తానండి, నేను మూర్తి అనే హరిజన యువకుణ్ణి ప్రేమించాను. అతడూ నన్ను ప్రేమించాడు. అతడు ఇంగ్లండు విద్యుత్ ఇంజనీర్ పరీక్షలో కృతార్థుడై అమెరికా వెళ్ళి ఉదకజనిత విద్యుత్ శాస్త్రం బాగా నేర్చుకొని తరిఫీదై వచ్చాడు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగి.

**సేనా:** ప్రస్తుతం బొంబాయి ప్రభుత్వం విద్యుత్ ఇంజనీరు. కానీ అమ్మాయీ?

**జెన్నీ:** ఈ ప్రేమగాథ మా చిన్నన్నకు తప్ప మరి ఎవ్వరికీ ఇష్టంలేదు. నేను ఢిల్లీ వివాహంకోసం వచ్చాను. మా పెద్దన్న గారు మా వదినకు జబ్బు వంకతో నన్నిక్కడకు తీసుకువచ్చారు. మా చిన్నన్నగారు వచ్చి నన్ను పంపితే నేను ఢిల్లీ వెళ్ళాను, అక్కడకు నా వెంటనే మా పెద్దన్నగారు వచ్చి తీసుకువచ్చి నా బాగుకోసం నన్ను గదిలో పెట్టినారు.

**సేనా:** ఆహా. ఏమంటావయ్యా మేజరుగారూ?

**మేజరు కార్లయిల్:** అన్నీ ఒప్పుకుంటాను.

**సేనా:** ఆమెను పోనియ్యి. కెప్టెన్! మూర్తిగారిని ఇల్లా పిలు.

మూర్తి దగ్గిరకు కెప్టెన్ వచ్చాడు. గుండె కొట్టుకుంటూ ఉండగా మూర్తి లేచి వెళ్ళి సేనాపతికి వీరనమస్కారం చేశాడు. సేనాపతి మేజరు కార్లయిల్ వంక చూచి, "మీరు మూర్తిగారితో కరస్పర్శ గావించండి."

మేజరు కార్లయిల్ మోము వాలిపోయింది. అయినా తనస్థితి తనకు తెలుసును. సేనాపతి దృష్టిలో తాను ఉత్తముడు కావాలి. వెంటనే చేయి చాపి, "క్షమించండి మూర్తిగారూ!" అన్నాడు.

**సేనా:** మీరు వెళ్ళండి మేజరు కార్లయిల్.

మేజరు కార్లయిల్ వెళ్ళగానే, జెన్నీ సేనాధిపతికి నమస్కరించి కళ్ళనీళ్ళు తిరుగుతుండగా, "మీ సహాయం నా జన్మలో ఎప్పటికీ మరచిపోలేను," అన్నది. సేనాపతి లేచి భుజంచుట్టూ చేయి పోనిచ్చి.

"నువ్వు మా ఇంటిలో నాలుగు దినాలుండి వెళ్ళు," అని కోరినాడు.

"మేము వెంటనే బయలుదేరి వెళ్ళి ఢిల్లీలో వివాహం చేసుకుంటాము. ఒక్క నిముషం ఆలస్యం చేయదలచుకోలేదు కాల్నెల్‌గారూ!" అని బ్రతిమాలుతూ జెన్నీ అన్నది.

"అందాకా ఎక్కడ వుంటావు?"

మూర్తి సేనాపతికి కృతజ్ఞత తెలిపి, "కాల్నెల్‌గారూ మేజరు కార్లయిల్ సోదరుడు లయొనెల్ కార్లయిల్‌గారు ఇక్కడే – హోటలులో వున్నారు. జన్నీఫర్‌ను నేను లయొనెల్‌కు అప్పగిస్తాను. మేము ముగ్గురం రేపే బొంబాయి వెళ్ళిపోతాము. బొంబాయిలో మా వివాహం అవుతుంది. తమ కరుణను ఎప్పుడూ మరువలేను. కృతజ్ఞుడను," అని మనవి చేశాడు.

సేనాపతి తనకారుమీద వారిద్దరినీ లయొనెల్ ఉన్న హోటలుకు పంపినాడు.

## (2)

లయొనెల్ వీరిద్దరినీ చూచి ఆశ్చర్యమూ, ఆనందమూ పొంది, ఇద్దరినీ హృదయానికి అదుముకొన్నాడు. చాలాసేపు జెన్నీ భవిష్యత్తు, జెన్నీ మూర్తుల వివాహమూ అన్నీ ఆలోచించుకుంటూ కూచున్నారు. లయొనెల్ దగ్గిర వదిలి మూర్తి తన హోటలుకు వెళ్ళిపోయినాడు.

ఆ మర్నాడు వారు ముగ్గురూ బయలుదేరి ఢిల్లీ వెళ్ళినారు. ఢిల్లీలో వారు ముగ్గురూ మూర్తి యింట్లో మూడు రోజులు ఉండి జెన్నీ మూర్తులు రిజిష్టర్ వివాహం చేసుకొన్నారు.

జెన్నీ ఒక మంచి గుజరాతీ హోటలుకు ఆజ్ఞ ఇచ్చి పదిమందికి చక్కని విందు చేసింది. మూర్తి ఆ రాత్రే భార్యతో బొంబాయి మెయిలుమీద మొదటితరగతి రిజర్వు చేసుకొని బయలుదేరినాడు. లయొనెల్ మదరాసు ప్రయాణం అయినాడు.

ఆ రైలు పెట్టెలో వారిద్దరూ ఒంటిగా ఉన్నారు. రైలు కదలగానే జెన్నీ వచ్చి భర్త ఒళ్ళోకూచుని అతని మెడచుట్టూ గట్టిగా చేతులుచుట్టి అతని పెదవులను ఉద్రేకపు చుంబనంతో అదిమివేసింది. అతడు పెన్నిధిలా ఆమెను తన హృదయానికి అదుము కొన్నాడు.

వారికి మాటలు లేవు. ఆమెతో కలిసి ఈ లోకాలలో ఎక్కడికో పోతున్నట్లు అతనికి భావం కలిగింది. ఆమె ఉద్రిక్త భావపూర్ణ అయినది. అతడు విద్యుత్ ప్రవహించే మేఘంలా వెలిగిపోయినాడు.

అతడు వేగంగా, మధురాతి మధురంగా, గాఢంగా ఆమె పెదవులను చుంబిస్తూ, ఆమె మోమును వెనక్కు వంచుతూ, ఆ బాలిక కన్నుల అందం చూచీ, కన్నులు చుంబిస్తాడు. కనుబొమల వంకర సొంపులు చూచి అవి ముద్దుగొంటాడు. ముక్కుపుటాలు, నాసికారేఖా ప్రవాహం చూచి, పెదవుల నాస్వాదిస్తాడు; పెదవుల ధనుర్విలాసం, ఆర్ద్రత వానిపై వర్తించే ఆనందమత్తతాపూర్ణ మందహాసరోచిస్సులు, ఆ పెదవుల మందారపు టెరుపులు చలించే అమృతాలు చూచి ఆ పెదవులను తన కర్కశపు పెదవులు చుంబిస్తే, అవి కరిగిపోతాయని భయపడి, 'క్షమించండి పెదవులారా!' అన్నట్టు చూపులు పరపి, కనులు మూసుకొని సిగ్గుపడు బాలకునిలా ముద్దుగొన ప్రారంభించి దొంగలా దోచుకొంటాడు.

ఇంతటితో తృప్తిపడడు. ఈ ముద్దులు ఇంకా దాహం కొలుపుతూ ఇంకా తృప్తితీరుస్తూ ఆ తృప్తిపై కాంక్షకు దారి చూపగా, ఆ కాంక్షనందుకొని దానిని తృప్తిపరుస్తూ కాంక్షాతృప్తులు అనంతంకాగా, ఆ అనంతతను అందుకోలేనని నిస్పృహపొందుతూ, తానూ నిత్యుడై తన శృంగారోద్రేక స్థాయినీ నిత్యను చేస్తాడు.

వెంటనే అతని చూపులు ఆమె విచిత్రశ్రుతిస్వరూప సౌందర్య విలాసిత చుబుకంపై ప్రసరిస్తాయి. ఆ చుబుకం అతని చుంబన పుంఖానుపుంఖితమైన దాడికి లోనవుతుంది. ఆ చుబుకాన్ని రక్షించడానికి ఆ బాలిక కపోలాల భావం అడ్డం వచ్చి నిలుస్తుంది.

ఆ కపోలాలు ఒకటికొకటి సహాయం చేసుకుంటూ అతని నాయకహృదయ శిఖరితోత్కంఠా వేగాన్ని చీకాకు పరుస్తాయి. ఆ వేగం ఓడిపోయి, ఆమె కంఠనిమ్నంలోనికి ఉరుకుతుంది. సరియైన పొడుగు, నీలిధమనిరేఖలు దంతంతో చెక్కిన ఆ కంఠసీమ అందంలో వెనకటికన్నీ మరచి ఆ చూపు దక్షిణ నాయకుడైపోయినది. పెదవులా కంఠాన్ని వదలలేదు.

ఇంతలో ఈ గడబిడ ఏమని కంఠసీమ పక్క కాపురం చేయు తెల్లమల్లెమొగ్గల గుత్తులులా ఉన్న భుజస్కంధాలు రెండూ "ఏలనే నవ్వంటు" కనుక్కోవడానికి తొంగిచూస్తే చూపులు అల్లరి తుమ్మెద దొంగలులా ఆ మల్లెమొగ్గ గుత్తులు భుజాలపై వాలినవి.

చూపు దొంగలగుంపుకు దారిచూపుదు గాడుకా వెంటనే పెదవిదొంగలు ఆ భుజద్వయార్ద్రతా నంతా తస్కరింప ప్రయత్నించి ఎంతకూ తగదని ఆ ధనం కొల్లగొనలేకపోయినవి.

కొంచెం దిగువను ఎవరో ఇరువురు తొంగిచూస్తూన్నారు. వేళ్ళు ఆ యిరువురిపై ముసుగులూ, బొత్తాములు దీసి సడలించినవి.

అప్పుడాతని దృష్టికి దంతాన్ని నలుపుచేసే ధవళకాంతులు కలవి, స్వచ్ఛహిమాచలశృంగాలపై పడిన ఉదయారుణకాంతులను కర్కశం చేసే పాటలవర్ణ దివ్యకాంతులు కలవి, గుండ్రని శిఖరాలు కలవి, లోకాద్భుత సౌందర్య విజృంభణము కలవి, సర్వమనోహరాలతో స్నాతులైనవి, ఉచ్చైశ్రవం ముట్టె, కామధేనువు చిరుమూపురం, పారిజాతాల పరీమళం, లక్ష్మీదేవి నుదురు ప్రాభృతాలు పొందినవి. కోటివేల చిత్రవిచిత్ర పవిత్ర కాంక్షలు దాచుకొన్నవి. వక్షోజోన్నతాల సందర్శనం అయింది. గౌరీశంకర కాంచన గంగా శిఖర సందర్శనం చేసిన కళాకారుని మహదానందమూ, కైలాసశిఖర ప్రత్యక్షము వరమందిన భక్తుని దివ్యానందము! గంగా యమునలు సంగమమై అతని చూపులు ప్రవహించినవి. అతని హృదయ మాసంగమంలో సరస్వతిలా లయమై పోయినది.

పవిత్రచుంబనా లా చూచుక దివ్యత్వాల కర్పించి మూర్తి తెరలు కప్పివేసినాడు.

వారిరువురకు మాటలు లేవు. ఇరువురు సహ్యామలయ మధ్యస్థ లోనవాలాలో తమ నివాసగృహం చేరిన కాని ఆత్మమనస్సులతోబాటు, దేహాలలీనం కావింపదలచు కోలేదు. రైలు సాగిపోయింది.

## (3)

లోనవాలా ఇంటికి ఢిల్లీ నుండి సామానంతా వచ్చినది. అవీగాక, బొంబాయిలో కొత్తసామాను కొన్నది జెన్నీ. ఆ గృహాన్ని ఆ ఎత్తయిన లోయ అందానికి శ్రుతిగా అలంకరించింది.

సాయంకాలం అయింది. జెన్నీ, మూర్తీ ఇద్దరూ కలసి ఆ లోయబాటలో వ్యాహ్యాళికి బయలుదేరారు. రెండువేల అడుగులకు మించి, మూడువేలు, నాలుగువేల అడుగుల వరకు పైకెగిసిన సహ్యామలయ పర్వతలోయలు, అడవులు, జలపతనాలు, పరమాద్భుత ప్రకృతి సౌందర్యవర్తిత మనోహరమై ఆ ప్రదేశం వారి హృదయాలను కరగించివేసింది.

ఆ దినం వారు నిర్ణయించుకొన్న పవిత్ర సంధాన దినం. ఆ ఇద్దరే ఆ ప్రకృతోత్సాహం మధ్య! పక్షులు గూళ్ళకు చేరుతున్నాయి. కిలకిల, గలగల, కూకూ, కువకువ స్వరాలు ఆ కొండ చరియలకు తాకి ఆ లోయలో ప్రతిధ్వనిస్తున్నవి. సూర్యబింబమూ కొండల చాటుకు దిగజారిపోయింది. ఆకాశంలో ఎరుపు, వంగపండు, కుంకుమ అరుణలు కాంతులు ఒరుసుకుపోతున్నవి.

ఇద్దరిలో మాటలు లేవు. ఇద్దరూ సిగ్గుపడుతున్నారు. అతడు నీలసుందరీనగ్నత పొరపాటున ఏ కాలవ రేవులోనో తన గూడెంలో స్నానాల సమయంలోనో చూచి ఉన్నాడు.

పాశ్చాత్య దేశాలలో ధవళసుందరుల నగ్నత దర్శించడానికి కోటివేల అవకాశాలున్నా ఎల్లమందమూర్తి హృదయంలో ఆ కోర్కె చాలాసారులు ఉద్భవించినా, ఆ భావానికే అతడు లజ్జపడి ఊరుకొన్నాడు.

తన భార్య జెన్నీ ఈ దినం. ఈ పరమ పవిత్ర దినంలో తన్ను పూర్ణంగా భర్తకు అర్పించుకొంటుంది. అందుకు తాను తగునా అన్న భయం అతణ్ణి ఈ రెండు మూడు రోజులూ గడబిడ పెట్టింది.

శుభముహూర్తం దరికి వచ్చినకొలదీ అతనికి గుండెలు దడదడ కొట్టు కొంటున్నాయి.

జెన్నీ నిజమా కాదా? ఆమె తన భార్యయేనా? ఆమె ఇప్పుడు తన దగ్గరగా చేయీ చేయీ, పార్శ్వమూ పార్శ్వమూ కలిపి నడుస్తూ ఉన్నదా? అతడు త్రపాపూర్ణుడై, భయకంపిత గాత్రుడై ఆమెతో తన సహచర్య ఊహించుకొంటున్నాడు.

జెన్ని ఒకచోట మూర్తిని ఆపింది. ఒక రాయి చూపించి దానిపైన కూర్చుండమన్నది. తానతని ప్రక్కనే కూర్చున్నది.

"మూర్తీ!"

"జెన్నీ!"

"నేను నిన్ను వివాహం చేసుకున్నానంటే, మనం ఇద్దరం సర్వసములమై కలసిపోతున్నాము అనే భావంతోనే! అంతేకాని నేను నిన్ను వివాహం చేసుకోవడంవల్ల కొంత దిగిపోయాను అనిగాని, నాకు పాశ్చాత్య స్త్రీలకున్న తెల్లతనం ఉండడంవల్ల నేను నీకన్న కొంత గొప్పదానిని అని గాని ఏ మాత్రమూ లేదు. ఈ విషయం నువ్వు దృఢంగా నమ్ము!"

"అదేమిటి జెన్నీ?"

"ఉండు ప్రియతమా! కనక నువ్వూ నేను రెండు రేకులుగల పుష్పంలోని రెండు రేకలం. యమునా, గంగా సంగమం ఎంత నిత్యమో మన కలయిక అంతే నిత్యం. నేను నీకై, నీవు నాకై!" అని ఆ బాలిక అతని తలను వంచి ముద్దాడింది.

వారిద్దరూ రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వేంచేసినారు. ఇద్దరూ స్నానంచేసి మనోహర వస్త్రాలు ధరించినారు.

బట్లరు ఆ దినం వండిన వంట దేవతలు రుచిచూచి ఆనందించతగినది.

భోజనమైన వెనుక రేడియో పాటకు నాట్యం చేశారు. ఆమె బొంబాయిలో కొని తెచ్చుకున్న చిన్న పియానోమీద "లా-ఎ-పాష నెషా" (ఉద్రిక్త ప్రేమ) మహా గీతాన్ని వాయించింది. అతడు తాను అమెరికాలో కొందరు నీగ్రో సంగీత పాఠక స్నేహితుల దగ్గర నేర్చుకొన్న ఛోపిన్ గీతాలు కొన్ని పాడినాడు.

రాత్రి పన్నెండు గంటలు మ్రోగినవి.

అతని హృదయము దడదడ మ్రోగుచున్నది.

ఆమె మోమంతా గులాబి పూవులో కందిపోవ, భర్త వంక చూచి "ప్రియతమా! నేను ముందు వెడుతున్నాను. సరీగా ముప్పాతిక గంట అయిన వెనుక –" అని లోనికి ఆనందహాస – ప్రఫుల్ల వదనంతో వెడలిపోయింది.

ఇక ఆ ముప్పాతికగంట అతనికి నిముషమొక యుగం చొప్పున కల్పాలై జరిగినది. అతను పియానో వాయించుకుంటూ కూచున్నాడు. కొంతసేపు రేడియో తిప్పినాడు.

కొంతసేపు "మేరీస్టోప్సు" "భార్యాభర్తల ప్రథమ దినము" అనే గ్రంథము తీసినాడు. కొంతసేపు పైకి వెళ్ళి దూరపుటిళ్ళ వెలుగులు, ఆకాశంలో తారకల వెలుగులు ఆ దశమినాటి వెన్నెల రాయని ఆనందము గమనించాడు.

ఇంటిలోనికిపోయి గడియారం వంక చూస్తే ఇంకా పావుగంట వున్నది. రేడియో తగ్గించి వున్నందున నెమ్మదిగా "హవాయిన్" గీతాలు విచిత్ర మేళనపు హంగుతో పాడుతున్నది.

మూర్తి బొంబాయిలో ఒక ఛాయా చిత్రశాలలో తయారు చేయించిన జెన్నీ పెద్ద చిత్రానికి ఎదురుగా నిలుచుండి ఆమె సౌందర్యము, ఆమె విలాసము ఆమె మందహాసము, ఆమె చూపులలోని మంత్ర ముగ్ధత్వమూ తనివితీర గ్రోలుతూ సర్వము మరచి వున్నాడు.

బాల్యదశలో రాబోవు ప్రేమ, ప్రథమయవ్వనంలో ప్రేమకై ఎదురుచూపు, యౌవనమధ్యాన పొదివికొన్న ప్రేమ, యౌవనంలో ప్రేమమయత, కౌమార ప్రారంభములో ప్రేమఫలము, వృద్ధాప్యంలో ప్రేమస్మృతి, "ఓహో ప్రేమమయ మీ జగమూ!" అనే సినిమాపాట జ్ఞాపకం వచ్చింది మూర్తికి. తన ప్రేమలోని విచిత్రత, సర్వలోక ప్రేమికులకూ ఏలా సంభవిస్తుంది.

*"ప్రేమింపవే రాణి ప్రేమింపు నన్ను*
*ప్రేమ కల్లోలాల మింటికెగరేయవే!"*

మానవ జన్మలో ప్రేమ శిఖరము. ఆ ఉత్తమ సంధానంవల్ల మానవ జన్మంతా తేజోవిలసితమై మానవ లోకానికి కళ్యాణప్రదమై, మహోత్తమమై, పవిత్రాదర్శపులకితమై పోతుంది. జెన్నీ! సకల సౌందర్యరాశీ! ఆమె శిరస్సు ఏ శిల్పులకూ అందని మూర్తిమంతము. ఆమె జుట్టు చాకొలేటు రంగుతో పట్టుకుచ్చులై ఒత్తయి భుజంమీద పతనాలుగా ప్రవహిస్తుంది. ప్రాచ్యలోచనాల దీర్ఘ వినీలత మధుర మత్తతతో వక్రాంచల సమనాశికా గులాబీపుష్ప పత్రపుటాలతో, మధ్యపూర్ణ ధనుర్వక్ర మధుమయార్ద్రిత మందార కుట్మల సదృశా ధరోష్ఠాలతో వెలుగొందే ఆమె ముఖం! జెన్నీ! ప్రేమదేవతా!

సరిగా శుభముహూర్తము వచ్చినది.

అతని కాళ్ళు వణకినవి. చిరు చెమటలు పట్టినవి. అతడింతవరకు ఆ పడకగది అలంకరణ చూడలేదు. ఆమె అతనిని లోనికి రానీయలేదు.

మూర్తి స్లిప్పర్సు చప్పుడు చేయకుండా నడిచి తలుపు దగ్గిరకు చేరినాడు.

గుండెల చప్పుడు దెసలు మారుమ్రోగుతూ ఉండగా నెమ్మదిగా తలుపు తీసినాడు. తలుపులు లోనికి కొంత పోయినవి.

దీపములన్నీ ఆర్పి వచ్చినాడు. కావున ఆ చీకటిలోనికి తలుపు సందునుండి నీలివెలుగు పైకి నీలపు తీగలా ప్రసరించినది.

అతడు తలుపు దగ్గిర ఆగిపోయినాడు.

అతని గొంతుకలో దగ్గుత్తిక వచ్చినది.

పది లిప్తలు తలుపు దగ్గిర ఆగి, లోనకు కుడి అడుగు వేసినాడు.

తలుపు నెమ్మదిగా ఇంకను తోసినాడు. తలుపు వెనక తెర ధరించిన కాండ పటము రాధకృష్ణ విలాసమగు ఒక బృందావన క్రీడాచిత్రంతో ప్రత్యక్షమయినది. రంగురంగుల మనోహరమైన ఆ చిత్రంపై నీలపు వెలుగు పడుతున్నది.

అతడు కాండపటం వెనకనే నిలుచుండినాడు. మరి పది క్షణికాలు గడచి పోయినాయి.

ధైర్యం పట్టుకొని తలుపుమూసి, నెమ్మదిగా గడియవేసి అతడు కాండపటం ప్రక్కనుండి లోనికడుగిడినాడు.

ఎదుట కనుపించిన దృశ్యము అతని హృదయ స్పందనమొక నిమేషం మాపుచేయగలిగిన దివ్యసౌందర్యపూర్ణము.

తల్పము పాలసముద్రంలో తేలిపోయే దేవవిమానంలా ఉన్నది. తల్పము తెల్లని సన్నని వల తెరలతో అచ్ఛాదితమై ఉన్నది. గది అలంకారము తల్పానికి శ్రుతిపూర్ణము.

అతడు నెమ్మదిగా అడుగడుగువేస్తూ తల్పంకడకు పోయి, ఆ తల్పంపై అస్పష్టంగా దృశ్యమయ్యే మనోజ్ఞత్వ రాశిని ఆస్వాదిస్తూ తెరలు ఒత్తిగించి చూచినాడు.

జెన్నీ కోటిగులాబీలతో మూర్తికట్టిన జీవవిగ్రహము పాము కుబుసాల దుస్తులు హౌరీలా అలంకరించుకొని, ఒయ్యారంగా త్రిభంగిగా శయనించివున్నది. ఆమె కనులు అరమూతలై ఉన్నవి! ఆమె ఎఱ్ఱని పెదవులు కొంచెము విడివిడి ఉన్నవి.

తనివి ఎంతకును తీరనికాంక్షతో ఆమె సౌందర్యాన్ని గ్రోలుతూ అతడటులనే నిలుచుండి, మరునిమేషాన ఆమెపై వాలిపోయినాడు. ఆమె నెమ్మదిగా అతనివైపు తిరిగి చేతులు చాచి అతని మెడచుట్టూ ఆ దంతాలచ్ఛలతలు చుట్టివేసినది.

అతడామెపై వంగి విడివడి వున్న ఆ తేనెపెదవులను అతి తమితో ముద్దిడినాడు.

## (4)

దేవీ పర్వతపులోయ, లోనవాలాకు పదిమైళ్ళున్నది. ఆ లోయలో అయిదారు సెలయేరులు కొండమీదనుండి పతనమై కలిసి పెద్ద నదిగా సంగమించి లోనవాలా లోయలోనికి ప్రవహిస్తున్నది. లోనవాలా లోయలో నదికి ఆనకట్ట కట్టి ఉదకశక్తి జనిత విద్యుచ్ఛక్తి సంస్థను ఇదివరకే ఏర్పాటు చేసినారు. ఈ జలాశయంలోనికి ప్రవహించే శైలివాలినులలో పెద్దదానిలో జలాశయానికి మూడువందల అడుగుల ఎగువనే రెండు పెద్ద ప్రస్రవణాలు సంగమిస్తున్నవి. ఆ సంగమస్థల దగ్గిర వేరొక్క జలాశయం నిర్మిస్తే, దానివల్ల మరికొన్ని లక్షల కిలోవాట్లు ఉద్భవించే విద్యుచ్ఛక్తి యంత్రాగారం నిర్మించవచ్చును.

ఈ భావము మూర్తికి ప్రత్యక్షమై, బొంబాయి ప్రభుత్వానికి రాయడంతోటే, వారెంతో ఆనందించి, ఆ విషయం కేంద్ర ప్రభుత్వానికి రాస్తూ, "మూర్తి" ఇంజనీరుగారిని తమ కా పనిని నిర్వర్తించేందుకు అప్పు ఇవ్వవలసిందని కోరినారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికీ, బొంబాయి ప్రభుత్వానికీ అతి తొందర కార్యం అవడానికి కారణం యుద్ధం.

చిన్న చిన్న గాలిగా ప్రారంభించిన యుద్ధం అప్పుడే ప్రళయ ఝంఝామారుతంలా పరిణమించినది. హిట్లరు సగం పోలండు ఆక్రమించితే, రష్యా తూర్పు పోలండు ఆక్రమించుకొన్నది. డాన్జిగ్ జర్మనీ పాలను పడింది. యూరపు దేశాలలో జర్మనీ దగ్గిర దేశాలన్నిటిలో నాజీ రాజకీయ వేదాంతాలు ప్రబలిపోతున్నాయి.

పోలండు తర్వాత హిట్లరు ఎవరిమీద విరుచుకు పడతాడో తెలియలేదు. ఇంగ్లండుమీదకే దండెత్తవచ్చునన్న వదంతులు బాగా ప్రబలి ఉన్నాయి. 1939 అక్టోబరు నెలలో బొంబాయి ప్రభుత్వంవారిని కేంద్ర ప్రభుత్వం వారు పడమటి కనుమలలో విద్యుచ్ఛక్తి పరిశ్రమ బాగా వృద్ధి చేయమన్నారు. ఆ పరిశ్రమను యుద్ధావసరాలలో ఒకటిగా కేంద్ర ప్రభుత్వం చేర్పించవలసి వచ్చింది. హిట్లరు ఇండియాకు రాలేదని ఎవరు చెప్పగలరు? అందుకై ఇండియా యుద్ధ పరిశ్రమలలో ఎక్కువ పాలుపుచ్చుకోవాలి!

భారతీయ ప్రభుత్వంవారు కూడా జర్మనీపై యుద్ధం ప్రకటించారు. భారతీయ సేనలు సిద్ధంగా ఉండవలసి ఉన్నది.

భరతదేశంలో పూనా సైన్య కేంద్ర పెరిగిపోతున్నది. పడమటి కనుమలలో కొన్నికొన్ని యుద్ధ పరిశ్రమలు స్థాపించవలసి వచ్చింది. ఆ పరిశ్రమలకు విద్యుచ్ఛక్తి అవసరము.

కాబట్టి మూర్తి కలలుకన్న ఆ విచిత్ర జలాశయ నిర్మాణానికి మూర్తి కోరిన రెండు కోట్ల రూపాయలు ప్రభుత్వంవారు వెంటనే మంజూరు చేసినారు. పెద్ద ఇంజనీర్లు వచ్చినారు. అందుకు సంబంధించిన వారెందరో వచ్చినారు.

మూర్తి వేసిన ప్రణాళిక ప్రకారం నిట్టనిలువునా వున్న ఆ రెండు కొండలూ కలిపి జలాశయం నిర్మించాలి. కట్టవలసిన రెండు కొండల నడుమ నది వేయి పతనాలుగా పడి ప్రవహిస్తున్నది. క్రింద జలాశయం ఇదివరకే నిర్మాణం అయి, దానివల్ల చాలా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసేటటువంటి పరిశ్రమాగారం నిర్మించారు.

నాలుగు వందల అడుగుల ఎత్తునుంచి వేయి చిన్న పతనాలుగా పడే ఆ నది ఒక చోట రెండు మూడు వందల చదరపు గజాల వైశాల్యం మాత్రం కలిగిన శిఖరంపైన ఒక చిన్న కొండమీద ఎగుడు దిగుడుగా, వంకరటింకరగా ప్రవహించినది. మళ్ళీ పతనాలై పడుతున్నది.

ఎల్లమంద ఆలోచన ఇది. ఆ రెండు వందల పైచిలుకు చదరపు గజాల ప్రదేశంలోనూ జలాశయం నిర్మించి, ఆ చరియను దిట్టంచేసి, అక్కడనుంచి పెద్ద గొట్టాల ద్వారా జలప్రవాహం ప్రక్కగా ఆ కొండలలో ఇంకో సమతలానికి తీసుకువెళ్ళి అక్కడ విద్యుచ్ఛక్తి కర్మాగారం స్థాపించాలి. అక్కడనుండి ఆ నీరు మళ్ళీ గొట్టాల ద్వారా తీసుకువచ్చి క్రింద జలాశయం లోనికి కలపాలి.

ఈ పనికై దగ్గిర ఉండి ఆ ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి లెక్కలు, ప్లాన్లు తయారు చేశాడు. అతని చేతి క్రింద నలుగురు ఒవర్‌సీయర్లు, డైనమైట్ పెట్టి ఆ శిఖరతలం అరుగులా సమంగా చేయ ప్రారంభించారు. పని అతివేగంగా తాను దగ్గిర ఉండి చేయిస్తున్నాడు. పగిలి విడివడిన రాళ్ళను ముక్కలుచేసి తన పనికి పనికిరావడంకోసం చిన్న చిన్న రైలుపట్టా బండ్లపై ఇంకో స్థలానికి లాక్కుని వెళ్ళి అక్కడ పోగు చేయించి అందులో కొన్నింటిని మరీ చిన్నవిగా సిమెంటు కాంక్రీటుకోసం కొట్టిస్తున్నాడు.

క్రిందనుంచి పొట్టి గుర్రాలమీద రోజూ సిమెంటు బస్తాలు, లావుపాటి ఇనుపకడ్డీలు, తీగెలూ తీసుకు వస్తున్నారు.

ఆ కష్టం అంతా చూచి మూర్తి ఆ సరుకు అతి సులభంగా విద్యుచ్ఛక్తి సహాయంవల్ల పైకి వచ్చే తీగదారి ఏర్పాటు చేశాడు. అంచెలు అంచెలుకడ యంత్రాలు ఉంటాయి. అక్కడినుండి పైకి బరువులుంచిన ఉయ్యాలలను లాగే తీగలుంటాయి. ఆ ఉయ్యాలలను ఒక తీగలాగుతూ ఉంటే రెండు తీగలమీద, రెండు చక్రాలతో ఈ ఉయ్యాలలు సువ్వున పైకి పోతాయి. వానిమీద మనుష్యులూ ప్రయాణించవచ్చును.

మూర్తి పనిచేస్తూంటే అక్కడికి మూర్తితోపాటు ఒక్కొక్కసారి ఉదయం వంటవానిచేత తయారు చేయించిన వంటకాలు, కాఫీ గొట్టాలు, పళ్ళు అవీ భోజనపు పెట్టెలలో పెట్టించుకొని అవి సేవకుల నెత్తిమీద పెట్టి జెన్నీ కూడా వచ్చేది.

జెన్నీతో ఆమె కొన్న పెద్ద "బుల్‌డాగు" జాతిలో మేలుజాతి కుక్కకూడా వస్తుంది.

మూర్తికి పని అయి తనకడకు వచ్చేవరకూ జెన్నీ కుక్కతో ఆ కొండలలో తిరుగుతూ ఉంటుంది. ఆ కుక్క పేరు ఫెయిత్ (నమ్మకం) అని పెట్టింది. భార్య సరదాగా తిరగడం, తనకు వేళకు భోజనం తమకు ఆ దాపునే ఒక చెట్టు క్రింద వేసిన దేరాలో క్యాంపు బల్లమీద చక్కగా అంచులు కుట్టిన తెల్లటి గుడ్డవేసి భోజనం అమర్చి "ఫెయిత్! నీ యజమానుణ్ణి తీసుకురా!' అని పంపేది జెన్నీ. ఆ కుక్క మరుసటి నిమేషంలో మాయమై మూర్తి దగ్గరకు వచ్చి "దయచేయండి" అన్నట్టుగా కుర్రుమని అతనిపైకి ఉరికేది. బలువైన, బలపూర్ణమైన ఆ కుక్కను మూర్తి చేతులతో అందుకొని క్రిందికి దింపి "వస్తున్నాను ఫెయిత్?" అని యిద్దరూ దేరాకు బయల్దేరుతారు.

దేరాకు రాగానే మూర్తి పక్కనున్న చిన్న దేరాకు పోయి, అక్కడ మొగమూ చేతులూ కడుక్కొని, బట్టలు మార్చుకొని, ఆమెకు తనివితీర మూడు ముద్దులు అర్పిస్తాడు.

ఆమె, అతడూ ఎదురు బొదురుగా కుర్చీలలో కూర్చుండి తీయని, మత్తయిన కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తారు. ఒక బోయ్ వడ్డిస్తూ ఉంటాడు. భోజనాలు పూర్తి కాగానే అతడు సిగరెట్టు వెలిగించుకొని మాటలు చెబుతూ జెన్నీని చూచి తన అదృష్టం తానే నమ్మలేకపోతూ ఉంటాడు.

ఒకనాడు జెన్నీ భర్తను చూచి, "ప్రియతమా! మీ నాన్నగారూ, మీ అమ్మా, అన్నదమ్ములు, అప్పచెల్లెళ్ళు ఏమి చేస్తున్నట్లు?" అని ప్రశ్నించింది.

"కులాసాగానే ఉన్నారు."

"కులాసాగానే ఉంటారోయ్! అది కాదు నేనడిగిన ప్రశ్న వాళ్ళ విషయం ఏమీ ఆలోచించావని?"

"వాళ్ళకై భీమవరం పాటిదొడ్లల్లో ఒక దొడ్డి కొనే ఏర్పాటు చేసినాను. ఆ దొడ్డిలో పాటిమన్నంతా అమ్మి ఇసుకపోసి పూడ్చినారట. ఒక గజం యెత్తు నల్లమన్ను పోయించమన్నాను. అలాగే చేశారట. ఎనిమిది గదులు ఒక హాలు వుండే డాబా ఇల్లుకు ప్లానువేసి పంపాను. వంట ఇల్లు వేరు. అన్నీ కలిపి ఆ ఊళ్ళో పన్నెండు వేలయిందట. నేను అమెరికాలో ఉన్న రెండేళ్ళు పదిహేనువేల డాలర్లు సంపాదించుకొన్నాను. ఇంక నా దగ్గర బాంకులో ఎనిమిదివేల రూపాయలు నిలువ వున్నాయి. మా తండ్రి పేర అయిదువేల రూపాయలు బ్యాంకులోవేసి ఉంచాను. వాళ్ళకు రెండేళ్ళకు సరిపోయే గుడ్డలు

కొన్నాను. చదువు చెప్పడానికి నెలకు ముప్పది ఇచ్చి ఒక ఉపాధ్యాయుణ్ణి ఏర్పాటు చేశాను. ఆత్మేశ్వరీ! భగవంతుడూ, ప్రజలూ, కాంగ్రెస్‌వారూ మెట్లు కట్టుకొని నీ ఉత్తమపథం నువ్వు చేరు అని నన్ను పంపించారు. లోకంలోని అభ్యుదయమంతా పురుషునికి అతని స్త్రీ రూపంలో, స్త్రీకి ఆమె పురుషుని రూపంలోనూ ప్రత్యక్షమవుతుంది. నా దివ్యాభ్యుదయ మూర్తివి నువ్వు!"

"చాలులే! నేను స్త్రీని, నువ్వు పురుషుడవు. నిన్ను నేనూ, నన్ను నువ్వూ కామపరతంత్రులమై వాంఛించుకొన్నాము. ఆ కామవాంఛను సాంఘిక సమదర్శనంకోసం, శాంతికోసం కాలువ త్రవ్వి ప్రవహింప చేయవలసి వచ్చింది. ఆ కాలువ వివాహం. అందుకని మనం ఇద్దరం వివాహమాడినాము."

"అయితే యవ్వనం నశించిన తర్వాతకూడా మానవులకు ప్రేమలు ఎందుకుంటాయి?"

"అవి చిరకాల సహవాస జనిత స్నేహాలు."

"భార్యాభర్తలకన్న పురుషులకూ, స్త్రీలకూ ఎక్కువ స్నేహితులుంటారు. అయినా ఆ స్నేహితులకు కూడా భార్యాభర్తలకున్న ఉత్తమ స్థితి రాదేమి?"

"చిరకాల కామస్నేహం అది. అది విచిత్రమైనది కాబట్టి మామూలు స్నేహంకన్న కామస్నేహం గొప్పది."

"కామమే ప్రేమలో ముఖ్యభావం అయితే, ఒక స్త్రీ ఏ పురుషునిపడితే ఆ పురుషునిగాని, ఒక పురుషుడు ఏ స్త్రీని గాని కామ సంబంధంకోసం ఏరుకోక ప్రేమ అని అంటారేం?"

"వెర్రివాళ్ళు కనుక!"

"ఆ వెర్రే ప్రేమ గనుకా అను"

"ప్రేమ వెర్రితనం ప్రేమ అంటావు!"

"కాదు, ప్రేమికుడు వెర్రివాడు అంటారు ప్రియతమా?"

జెన్నీ లేచి భర్త మెడచుట్టూ చేయివైచి, "ప్రేమ అనే దివ్యగుణం లోకంలో ఉందని నాకు తెలియును ప్రియతమా! నీతో వాదించడం ఎంతో ఆనందం!"

## (5)

యుద్ధం సాగిపోతూ వుంది. 1940 సంవత్సరం మార్చి నెల వచ్చింది. ఆ సమయంలో మూర్తి కట్టిన ఒక పక్క సిమెంటు గట్టుతో కూడిన కొండచరియ క్రింద లోయలోనికి జారిపోయింది. ఆ జారిపోవడంవల్ల మూర్తి హృదయమూ జారిపోయింది. దానివల్ల జలాశయానికి ఇరువది రెండు చదరపు అడుగులు పోయాయి. ప్రభుత్వానికి రెండు లక్షల రూపాయలు నష్టం వచ్చింది.

దీన్ని గురించి మూడు రోజులు చమటలతో తడిసిపోతూ మూర్తి ప్రభుత్వానికి రిపోర్టు పంపించినాడు. నాలుగో రోజుకు పెద్ద ఇంజనీర్లందరూ అక్కడకు పరుగెత్తుకొని వచ్చినారు. వాళ్ళు నాలుగు దినాలు పూర్తిగా పరీక్షించి ఇందులో మూర్తిలోటు ఏమీ

లేదని తీర్మానించినారు. అప్పుడు మూర్తి తానా ప్రక్క పెద్ద కొండను కొంత భాగం దొలుస్తానని దానికి ఇంకా పదమూడు లక్షలు ఖర్చు అవుతుందనీ, అందువల్ల వేయి చదరపు గజాలు వస్తాయని తెలిపినాడు. అవన్నీ ప్లానులు వేసి చూపినాడు.

ఆ ప్లానులన్నీ పట్టుకొని చీఫ్ ఇంజనీరు, మిలటరీ చీఫ్ ఇంజనీరు వారం రోజులు పరీక్షించినారు. వారికి మూర్తి వాదనలు నచ్చి, పని ప్రారంభించవచ్చునని ఆజ్ఞలు జారీ చేసినారు.

ఆ పదిహేను దినాలు మూర్తి తిన్నగా భోజనం చేయలేదు. జెన్నీ దగ్గిర లేకపోతే అతడు మతిచెడి ఏలాంటి పిచ్చి పనులు చేసి ఉండేవాడో!

"ప్రియతమా! నీ ధైర్యం అంతా ఏమయింది. అమెరికాలో నువ్వు చేసిన పని అంతా మంచులా కరిగిపోయిందా?"

"జెన్నీ దేవతా! నేను యే పని చేయగలను? యుగయుగాలనుంచీ భారతీయ సంఘంలో అట్టడుగున కుళ్ళిన మాదిగ కులస్థుణ్ణి!"

"అవునులే! భారతీయ సంఘంలో కొండ శిఖరాలు మీద కూర్చున్నవారే ఈలాంటి చదువులు చదవాలిగాని నీబోటి వాళ్ళు ఏం పనికి వస్తారు?"

"వేళాకోళం కాదు జెన్నీ."

"కాదులే... కాదు! మూడక్షరాలా ని...జ...ము? నువ్వు మాదిగ కులస్థుడవు గనుక, నిజం మాట్లాడుతావని నాకు నమ్మకం లేకపోయినా, ఏమో నిజం అయితే కావచ్చును."

"జెన్నీ, నే నేం జేయను."

"ఏం చేస్తావు? మళ్ళీ జక్కరం వెళ్ళి పొలం కూలీపని చేసుకో. చచ్చిన గొడ్డు మాంసం తిను."

"ఈ రోజు నన్ను కొరడా పుచ్చుక్కొడుతున్నావే?"

"లేక నీ ధైర్యానికి, నీ ఉత్సాహానికి, నీ ముందుచూపునకూ కష్టాలు లెక్కచేయకుండా చొచ్చుకుపోవడానికి ముద్దులు పెట్టుకోమన్నావా?"

"అబ్బబ్బా!"

"క్షమించు ప్రియా! భారతాంగన భర్తకు బానిస! అలాంటిది నీకు సలహా చెప్పడ మేమిటి?"

ఎల్లమందమూర్తి మౌనం వహించాడు. అతని మోము విషాద పూరితమైనది. అతని మోము తీక్షణంగా గమనించింది జెన్నీ. వెంటనే అతని చేయి పట్టుకొని డేరా లోనికి తీసుకు వెళ్ళింది.

అక్కడ అతని హృదయాన్ని బిగియార కౌగలించుకొని పెదవులు ముద్దిడి, "ప్రియా! అంత చిన్న బాలునిలా అయిపోయావేమిటి? నువ్వు చేయలేని పని ఒకటైనా ఉందా? కాక, నాకు నువ్వంటే నేనే వర్ణించుకోలేని ధైర్యం. నీకు వేడి పుట్టించడానికి అన్న మాటలు," అని మళ్ళీ ముద్దుపెట్టింది.

ఎల్లమందమూర్తి భార్య ముద్దు పెట్టుకొనటమే గమనించనివానిలా అయిపోయాడు. తాను ఏదో ఆలోచనా లోకానికి పోయినాడు. ఆ పరధ్యానంలో భార్య మోము చూడని చూపులతో చూస్తున్నాడు. జెన్నీ మూర్తి విశాల ఫాలము నల్లనిదైనా మోములోని కాంతీ, అతని అవయవ స్ఫుటత్వమూ గమనిస్తూ కూచుంది.

ఇంతలో ఒక ఉరుకు ఉరికి భార్య చంకలో చేతులు పెట్టి పైకి గబుక్కున ఎత్తి "నా ప్రాణప్రియా! నీ మాటలు నాలో ఏ మూలనో ఒదిగి ఉన్న కొత్త ఆలోచనలను స్పందించి పైకి తీసుకు వచ్చాయి." అని ఆమెను హృదయం మీదకు దింపుకొని ఆమెను మోమంతా ముద్దుపెట్టుకొన ప్రారంభించినాడు. "నువ్వు నాకు దేవతవు, నాకు గురువువూ!"

"ఏమిటి నీ కొత్త ఆలోచన ప్రియతమా!"

"ఆ కొండ చరియనుండి బరువు వల్లగాని ఇంకో కారణంవల్లగాని రాళ్ళు కదిలి క్రిందికి జారిపోకుండా, సిమెంటు కాంక్రీటుతో గట్టిచేస్తాను. ఇంటిపైన కురిసే నీరుకు ఎల్లాపోయే ఏర్పాటు చేస్తారో అలాగే ఈ జలాశయం చుట్టుపక్కల కొండలలో కురిసిన నీరు పోయేటట్లు చేస్తాను."

"ఈ విధానంవల్ల ఎక్కువ ఖర్చు ఎంత?"

"ఇరవై లక్షలు - ఇంకా తక్కువ కావచ్చును."

"ఇదంతా ప్రభుత్వం ఒప్పుకోవద్దూ?"

"ఒప్పుకు తీరుతారు. అన్ని లెఖ్ఖలూ, పటాలూ వెంటనే సిద్ధం చేసి పంపుతానుగా!"

"ఈలోగా ఒక చక్కర్ కొట్టవద్దూ బొంబాయి అవీ! ప్రియతమా!"

"ఈరోజు మీ అన్నగారి దగ్గిరనుండి ఉత్తరం రావాలి?"

"అవును!"

"మీ నాన్నగారి కోపం ఇంకా తగ్గదా?"

"ఏం చేస్తాము? మన ఇద్దరం ఏ కొండ చివరో గూడు కట్టుకొని గరుడ పక్షులలా ఉందాము!"

"నీ వైద్యవృత్తి?"

"వృత్తిలేదు గిత్తీలేదు. నీవే నా వృత్తివి ప్రియతమా!"

"కాదు నా రాణి, జాగ్రత్తగా ఆలోచించు."

"నీ ఉద్యోగంలో ఇక్కడకూ, అక్కడకూ మార్చడం ఉంటూ ఉంటుంది. నిన్ను వదలి నేనెక్కడో వైద్యవృత్తి ప్రారంభించనా? నీ కోసం బెంగ పెట్టుకొని కూర్చుందనా?"

"పోనీ నేను-"

"ఏమీ తొందరపడకు. నేను ఆలోచిస్తున్నాను. ఇద్దరం ఈ విషయం బాగా ఆలోచించే చేద్దాము ప్రియతమా!"

ఇద్దరూ దిగి ఇంటికి పోయారు.

* * *

# ఆరవ భాగం

భార్యాభర్తలిద్దరూ ఎల్లోరా, అజంతాలు వెళ్ళి వచ్చారు. ఆ ప్రపంచం అంతా చాలా విచిత్రంగా ఉంది.

భారతీయ చిత్రలేఖనమంటేనూ, శిల్పమంటేనూ వాళ్ళిద్దరకూ ఏమీ తెలియదు. ఎల్లమందమూర్తి ఇంగ్లండులో ఉన్నప్పుడు, సరదాకు మ్యూజియమంతా తిరిగి వచ్చాడు. కాని శిల్పమన్నా, చిత్రలేఖనమన్నా ఏమీ తెలియదు.

మూర్తికన్న జెన్నీ కొంత నయం. గృహం అలంకరించడం తెలుసును. చిత్రలేఖనం చూడగానే ఇది మంచిది అని మాత్రం చెప్పగలిగేది. అవైనా పాశ్చాత్య చిత్రలేఖనా శిల్పాలను గురించే. అందులో కూడా లియోనార్డో నుంచి వెలాస్క్వెజ్ వరకూ లెయిటన్, టర్నర్, బరన్‌జోన్సు మొదలయిన వారి చిత్రాలు బాగా అర్థమయ్యేవి. గ్రీకు, రోమను శిల్పాలు బాగా అర్థమయ్యేవి. కాని ఎయిప్ స్టెయిన్ శిల్పం వట్టి అగమ్యగోచరంగా ఉండేది.

మూర్తికి భారతీయ లలితకళా విషయాలు అగమ్యగోచరాలు. ఇంగ్లీషు సంగీతం మాత్రం నేర్చుకున్నాడు. పియానో వాయిస్తూ గంభీరమయిన కంఠంతో పాడుతాడు.

జెన్నీ, మూర్తీ ఎల్లోరా మొదట చూచారు. జెన్నీ భర్తను చూచి, "ప్రియతమా ఈ కైలాస గుహ చూచినా, తక్కిన బౌద్ధ గుహలూ, హిందూ గుహలూ, జైన గుహలూ చూస్తూ ఉన్నా నా మనస్సు ఏదో చెప్పరాని ఆనందం అనుభవిస్తున్నది. నేను గ్రీకు శిల్పాన్ని గూర్చీ, ఇటాలియను చిత్రలేఖనాన్ని గూర్చీ బాగా చదివాను. కాని భారతీయ శిల్ప చిత్రలేఖన సంప్రదాయ చరిత్ర ఏమీ తెలియదు. నువ్వు చెప్పగలవా?"

"నువ్వు పాశ్చాత్య శిల్పాన్ని గూర్చైనా చదివావు. నేను ఏమీ తెలుసుకోకుండా కాలం ఇంతవరకూ వృథాగా పోనిచ్చాను."

"ఆ కైలాసగృహం పనితనం చూస్తే నా హృదయం కరిగిపోయింది."

ఇద్దరూ విస్తుపోయి చిన్న పిల్లలులా చేయి చేయీ పట్టుకొని ఆ గుహలన్నీ తిరిగారు. ఇద్దరూ నైజాము ప్రభుత్వ విశ్రాంతి మందిరంలో మకాం పెట్టినారు. ఎల్లోరా గుహలు మూడు రోజులు వరుసగా చూచినారు.

ఎల్లోరా జైన గుహలలో ముప్పైనాలుగవ గుహలో శచీదేవి విగ్రహం ముందు జెన్నీ నిర్ఘాంతయై నిలుచుండి పోయింది. ఇంత ప్రపంచాద్భుత సౌందర్యం ఎలా శిల్పం చేయగలిగాడు శిల్పి? తాను "వీనస్ డెమెలో" అనే గ్రీకు సౌందర్య దేవతా విగ్రహం ఛాయాచిత్రం చూచింది. ఆ శిల్ప దేవత సౌందర్యం ఈ శచీదేవి విగ్రహ సౌందర్యం ముందు ఏ విధంగా నిలువగలదు? ఆ ఒయ్యారము, ఆ దేహ భంగిమ, ఆ పరమశ్రుతి, ఆ వదన విలాసము, అహో ఈ సుందరి సర్వవిశ్వంలో అతీత సౌందర్యవతి.

ఆ బాలిక ఆశ్చర్యము గమనిస్తూ ఎల్లమందమూర్తి తానూ ఆశ్చర్య చకితుడై అలాగే నిలుచుండిపోయినాడు.

ప్రియతమా? ఇంతవరకూ పురుషమూర్తి యొక్క అద్భుత సౌందర్యం గమనించాము. ఈ స్త్రీ విగ్రహ సౌందర్యం ముందు ఇతర సౌందర్యం పోల్చడానికి ఎవరికి సాహసం ఉంటుందీ?"

"ఈ సౌందర్యం నాకు కాస్త చెప్పు ప్రాణాధికా."

"ఓయి వెఱ్ఱివాడా, నువ్వు వట్టి శాస్త్రజ్ఞుడవులా కనబడుతున్నావే?"

"నువ్వు వట్టి డాక్టరువు కాదు కాబోలు."

"డాక్టరుకు శరీర సకలమూ పరమాద్భుత సృష్టి రూపమని తెలుసును."

"అవును."

"పరమ సౌందర్యవంతమయిన బాహ్య శరీరమూ మాకు తెలుసును."

"ఆ సౌందర్యం ఒక చక్కని యంత్రంవంటిదిగానే మీరు భావిస్తారా? లేక కవులు వర్ణించే సౌందర్యంగానా?"

"కవులు వర్ణించనక్కరలేదు సౌందర్యాన్ని! సువాసన నువ్వు ఆఘ్రాణించి ఆనందం పొందుతావు కవులు వర్ణించి చెప్పాలా! అలాగే సౌందర్య భావమూ!"

"అద్భుతం!"

"ఏమిటి అద్భుతం?"

"నీ సౌంద్యం!"

"నేను సౌందర్యవతినని ఎలా తెలుసును?"

"నువ్వు ఈ విగ్రహం సౌందర్యవంతమైనదని ఎలా చెప్పగలవో అలాగే!"

"ఓ హృదయనాధుడమైన నా తెలివి తక్కువ భర్తా!"

మూర్తి పకపక నవ్వి తన భార్యను గట్టిగా హృదయానికి అదుముకొని, ఆమె పెదవులు తమిగా ముద్దిడుకొని, "ఈ శచీదేవి విగ్రహం అఖండ సౌందర్య పూరితం కావచ్చు కాని నా జెన్నీ సౌందర్యం ముందు–"

## ②

అజంతాలో మూడు రోజులున్నారు. దీపాలు పెట్టి చూచారు. ఈనాటి డేరాలు, ఈనాటి క్యాంపు కుర్చీలు, బల్లలు, ఆ ఆడవాళ్ళ చేతి సంచీలు, అన్నీ జెన్నీ చూచి ఆశ్చర్యం పొందింది. "ఆనాటి స్త్రీలు ఇప్పటివాళ్ళకన్న అందమైనవాళ్ళు. ఎక్కువ నాగరకత కలవాళ్ళుగా కనబడుతున్నారు ప్రియతమా!" అని ఆమె అన్నది.

"పురుషులూ అలాగే కనబడుతున్నారు. ఈ అజంతా ప్రపంచంలోని ఉత్తములు ఈనాటి ఉత్తములులానే కనబడుతున్నారు. ఈ బోధిసత్వులా బుద్ధుడిలా ముఖాల్లో మహాత్ముని ముఖం కనబడటంలేదు నీకు. ఈ శిబిచక్రవర్తే ఈనాటి జవహర్‌లాల్ అయి ఉంటాడు. ఇక్కడ ఎక్కడో వీళ్ళందరిలో వెదికితే నేనూ కనబడతాను సుమా!"

"నేను కనబడను కాబోలు."

"ఈ అజంతా బాలికలలో సౌందర్యవంతులయిన యువతులలో ప్రథమురాలు నీకన్న కొంచెం తక్కువ."

"ఏమిటా బడాయి?"

"నాకెందుకు బడాయి?"

"అంత అందమైన భార్య తనకే ఉన్నదని అందరు అనుకుంటారనీ!"

"ఆ గుహలు తిరిగి తిరిగి, ఆ ప్రదేశ సౌందర్యంలో మునిగిపోయి, మతులుపోయి వదలలేక వదలలేక, తిరిగి బొంబాయి ప్రయాణం అయ్యారు.

## 3

వీరు బొంబాయి చేరేసరికి ఎల్లమందమూర్తి ప్రణాళిక ప్రభుత్వంవారు ఒప్పుకున్నట్టూ, పని వెంటనే ప్రారంభించమనీ కాగితాలు వచ్చి వున్నాయి.

మూర్తి పక్కన ఉన్న భార్యను కౌగలించుకొని ఆమెతో నాట్యం చేయసాగినాడు.

ఇద్దరూ వెంటనే లోనవాలా పరుగెత్తినారు. ఆ మరునాటినుండి మూర్తి పనిలో మునిగిపోయాడు. వేలకొలది మేస్త్రీలు మూర్తి అనినా, జెన్నీ అనినా ఎంతో గౌరవంతో భక్తితో మెలగసాగినారు. జెన్నీ వారందరికీ ఎంతో ప్రేమతో వైద్యం చేస్తూ ఉంటుంది. ఒక్క పైసా పుచ్చుకోదు. ఆ పని మనుష్యులలో స్త్రీలకు ఎంత మందికో జెన్నీ పురుడు పోసింది.

లోనవాలాలో జెన్నీ వేరే ఒక ఇల్లు పుచ్చుకొని వైద్యాలయం ప్రారంభించింది. పనివాళ్ళల్లో ఇద్దరి బాలికలకు నర్సుల పని నేర్పింది. జెన్నీ పెళ్ళయి వచ్చిన కొత్త రోజులలోనే లయొనెల్ మదరాసులో ఉన్న ఆమె మందులూ శస్త్ర వైద్యపు పనిముట్లూ అన్నీ పంపించాడు. ఆమె బొంబాయిలోను చాలా మందులూ పరికరాలు కొనుక్కున్నది.

ఈ వైద్యంతోపాటు చుట్టుపక్కల ఉన్న పర్వత నగరాలలో కాపురమున్న పెద్ద కుటుంబాలవారికీ, పాశ్చాత్యులకూ నెమ్మదిగా ఈమె వైద్యురాలయింది. దానివలన బాగా రాబడి రా నారంభించింది.

ఈలోగా తన భర్తకు ఆమె కోటి విధాల ఆలోచన చెబుతూ హుషారు ఇస్తూ వున్నది.

మూర్తి ఆ కొండరూపం మార్చినాడు. అమెరికాలో నేర్చుకొన్న విద్యకు అవసరాన్ని బట్టి ఇంకా కొత్త విధానాలు చేర్చి పనిని మహావేగంగా ప్రజ్ఞాపూర్ణంగా సాగిస్తున్నాడు. మూర్తి చేయించే పనిని చూడవలసిందని ప్రభుత్వం దేశ దేశాలనుంచి ఇంజనీర్లను పంపింది. మూర్తి దగ్గిర పని నేర్చుకొనడానికి యువక ఇంజనీర్లెంతమందినో పంపించింది. వారందరూ మూర్తిగారి అఖండ విజ్ఞానమూ, కార్యాలోచనా నిశితత్వమూ చూచి ఆశ్చర్యం పొందినారు.

## 4

1940 సంవత్సరం మే నెలలో జెన్నీ తండ్రీ, తల్లీ ఇద్దరూ బొంబాయి వచ్చి కొమరితను చూడడానికి రమ్మనమని ఉత్తరం వ్రాసినారు. జెన్నీ వెంటనే వారున్న తాజ్‌మహలు హోటలుకు తాను రావడానికి వీలులేదనీ, తనకు హాస్పిటలుపని తల మునిగినంత ఉన్నదనీ, కాబట్టి తల్లిదండ్రులే ఇద్దరూ రావలసిందని ఫోను చేసింది.

ఆ ముసలి దంపతులు బింకం పట్టుకున్నంత కాలం ఉన్నారు. జెన్నీ భర్త కోర్కె చొప్పున తమ క్షేమ సమాచారాలను గూర్చి తలిదండ్రులకు ఉత్తరాలు రాస్తూ ఉండేది. పెద్దన్నగారు పెషావరునుంచి యూరపు వెళ్ళిన సేనలలో ఉన్నాడు. అతనికి ఆయన భార్యకూ ఎప్పుడూ జెన్నీ ఉత్తరాలు రాస్తూ ఉండేది. మేజరు భార్యా బిడ్డలు అందరూ మదరాసులో జెన్నీ తలిదండ్రుల దగ్గిర ఉండినారు.

జెన్నీ ఎంతమందికి ఎన్ని ఉత్తరాలు రాసినా లయొనెల్ తప్ప చుట్టాలెవ్వరూ ప్రత్యుత్తరాలైనా వ్రాసేవారు కారు. అందువల్ల జెన్నీ కూడా వాళ్ళకు ఉత్తరాలు రాయడం మానివేసింది. తలిదండ్రులు జెన్నీకి ఉత్తరం రాయకుండా బొంబాయి వచ్చేశారు.

ఆమెతో ఫోనులో మాట్లాడడానికి తల్లి వచ్చింది.

"జెన్నీ!"

"మమా!"

"ఎన్నాళ్ళయింది నీ గొంతుక విని!"

"మమా! నువ్వు నన్ను ముద్దుపెట్టుకు ఎన్నాళ్లైంది?"

"జెన్నీ ఏమంటావు?"

"మీ ఇద్దరూ మా ఇంటికి రావాలి!"

"నీ భర్తను కలుసుకోడానికి నీ డాడి కిష్టంలేదు–"

"ఇన్నాళ్ళనుంచీ నా మొగమే చూడనన్న డాడీ ఇప్పుడు బొంబాయికి రాగలిగినాడు. ఇంతవరకు వచ్చి మా ఇంటికి రావడానికి మీ ఇద్దరి కభ్యంతరం ఏమిటి? అంత అభ్యంతరమే ఉంటే నన్ను చూడకుండానే తిరిగి మదరాసు వెళ్ళండి!"

"అయ్యో!" విచారయుక్త స్వరపూరితమయి ఆమె మాటలు జెన్నీ హృదయాన్ని పిండిచేసినాయి. అయినా ఆశయాలలో మెత్తబడటం ఉండకూడదని పళ్ళు బిగించుకొని, "మమా! ఇక సెలవు పుచ్చుకుంటాను–" అన్నది.

ఆమె తల్లి హృదయంలో బాధపడినట్లు "అయ్యో" అన్నది. మళ్ళీ ఇంతట్లో జెన్నీ తండ్రి ఆ ఫోను రిశీవరు తీసుకొని, 'జెన్నీ'ని పిలిచాడు.

"ఏమిటి డాడీ! నువ్వేనా?" అన్నది జెన్నీ.

"నేనేనమ్మా! నేనే! నేను ఆలోచించిన కొలదీ నిన్ను ఇక్కడకు రమ్మన మనడం తప్పుగానే కనబడింది. మేము ఇద్దరం అక్కడికి రేపు ఉదయం మీకు అతిథులుగా వస్తున్నాము. ఈ విషయం నీ భర్తతో చెప్పు. నీ భర్త చాలా ఉత్తముడు. ప్రజ్ఞాశీలి. అతడు నా అల్లుడవడం నాకెంతో గర్వకారణం అని అనుకుంటున్నానని కూడా చెప్పు." అని ఆ వృద్ధుడు గంభీర కంఠంతో అన్నాడు.

వారిద్దరూ ఒకరి దగ్గర ఒకరు సెలవు తీసుకొన్నారు. జెన్నీ నాట్యం చేసింది. సాయంకాలం భర్త రాగానే తన తలిదండ్రులు ఇద్దరూ తమ అతిథులుగా వస్తున్నారని చెప్పింది.

## (5)

మర్నాడు ఉదయం సర్ ఎడ్వర్డు కార్లయిల్, భార్యా లోనవాలా స్టేషనులో దిగినారు. స్టేషనులో జెన్నీ, మూర్తి వీరికోసం ఎదురు చూస్తున్నారు. బండి దిగగానే మూర్తి మామగార్కి నమస్కరించినాడు. ఇద్దరు ఆనందంగా కరస్పర్శ కావించినారు. తల్లి కొమరితను కౌగలించుకున్నది.

అందరూ కలిసి మూర్తి ఇంటికి వెళ్ళారు. అక్కడ ఫలహారాదులు అయిన వెనక అల్లుడూ, మామా కూర్చుండి మాట్లాడుకోవడం సాగించారు. ఆరోజు ఆదివారం అవడం వల్ల మూర్తికి సెలవు.

**సర్ ఎడ్వర్డు:** కాబట్టి నువ్వు ఇంకో ఆరు నెలల్లో పని పూర్తి చేయగలవన్నమాట?

**మూర్తి:** తప్పకుండా నండి!

**సర్ ఎడ్వర్డు:** ఇంతవరకూ చేసిన పనిని పెద్దవాళ్ళెవరైనా వచ్చి చూచారా?

**మూర్తి:** మూడు నాలుగుసార్లు వచ్చి చూచారండీ!

ఆ సాయంకాలం నలుగురూ జలాశయం కట్టే స్థలానికి వెళ్ళి చూచినారు. సర్ ఎడ్వర్డు మంచి ఇంజనీరు అవడంవల్ల మూర్తి చెప్పేవి అన్నీ వింటూ, పరిశీలిస్తూ గమనించాడు. మూర్తి అఖండ ప్రజ్ఞావంతుడనిన్నీ అదృష్టవంతుడయితే భారతదేశం అంతకూ ఇలాంటి జలాశయాది నిర్మాణంలో ఈతడు రత్నస్థగితమకుటంలాంటి వాడు అవుతాడనీ అనుకున్నాడు.

వీరిద్దరూ ఇక్కడ వుండగానే మదరాసునుంచి మేజరు కార్లయిల్ భార్యా, బిడ్డలూ, తిరుచునాపల్లినుంచి లయొనెల్ భార్య ఎలిజబెత్తూ వస్తున్నామని తంతి ఇచ్చారు.

# మంగళగీతము

అందరూ వచ్చినారు. ఇల్లంతా కలకలలాడిపోయింది. బిడ్డలందరికీ మూర్తి ఎంతో ఇష్టుడైనాడు. అతన్ని ఎక్కి తొక్కే వా రా బాలికలు. వారినందరినీ అతడు బొంబాయి సినిమాలకు తీసుకొని వెళ్ళేవాడు. అక్కడ బొమ్మలు, మిఠాయి దినుసులు బహుమతులిచ్చేవాడు. ఆ సమయంలో డాక్టరు గ్రేస్ టెంపిల్టనుగారు కూడ మేనకోడలి కాపురం చూడటానికి వచ్చింది.

వచ్చిన చుట్టాలందరూ వారం రోజులుండి అందరూ కలిసి వెళ్ళిపోయినారు. భార్య చుట్టాలందరితో తనకు తిరిగి ప్రేమ కుదరడం తన అదృష్టమని ఉప్పొంగిపోయాడు మూర్తి.

అతడూ, జెన్నీ ఇద్దరూ వారి వారి పనులలో నిమగ్నులైనారు. సాయంకాలం అతడు తిరిగి వచ్చేసరికి జెన్నీ తన వైద్యాలయంలో పనిలో మునిగి ఉండేది. మూర్తి స్నానంచేసి బట్టలు మార్చుకొని, భార్యకడకుపోయి, ఆమె పని పూర్తికాగానే, ఆమెతో కలిసి ఇంటికి వచ్చేవాడు. ఆమెకూడా స్నానం చేసి బట్టలు మార్చుకొని వస్తే ఇద్దరూ కారు ఎక్కి బొంబాయి సినిమాకు పోవడమో, లేక ఊరికే శీతల వాయుసేవానంద సంచారం చేయడమో కార్యక్రమం పెట్టుకొనేవారు. ఇంటికి వచ్చి భోజనంచేసి రాజకీయాలూ యుద్ధమూ చర్చింపసాగేవారు.

మానవ ద్వేషమూ, పశుత్వమూ అతని హృదయాన్ని కలచివేసేది. ఆమె హృదయం అతని హృదయానికి శ్రుతి.

"ప్రియతమా! ఈ యుద్ధం తలచుకున్నప్పుడల్లా గుండె బేజారవుతూంటుంది."

ఒక్కొక్కప్పుడు హిట్లరు సంధికి వస్తాడేమో అనే ఆశ పుట్టుతూ ఉంటుంది.

"వట్టి అడియాస జెన్నీ!"

"ఇప్పుడే దేశాలన్నిటా యుద్ధపు వేడి అలుముకుపోతోంది. హిట్లరు డెన్మార్కు ఆక్రమించాడు. నార్వే మీదకు విరుచుకుపడ్డాడు. మన వాళ్ళందరూ! వెళ్ళి ఇరవై రోజులు కాలేదు. నార్వే అయిపోయింది. హాలెండు, బెల్జియం, లక్జెంబర్గులలోనికి ఒక్కసారిగా చొచ్చుకుపోయారు. ఆ దేశాలన్నీ అయిపోతున్నాయి."

"వీడు సైతాను తమ్ముడు కాడుగదా?"

"ఇటు కాంగ్రెసు వారి ఉద్దేశమే తెలియటంలేదు!"

"లీగుకూ, కాంగ్రెసుకూ మధ్య దాటరాని అఖాతం వచ్చిపడింది."

"మన దేశానికి ఇబ్బంది లేదని నా ఉద్దేశము. ఎందుకంటావా? మహాత్ముడు దేశంలో ఉన్నంతకాలమూ దుర్మార్గులు ఈ దేశంవైపు తేరిపార చూడలేరు."

"నీకు మహాత్ముడంటే అంత పవిత్ర భావం ఎందుకో ఇప్పుడు నాకర్థం అవుతున్నది."

"మహాత్ముడు వ్యక్తి సత్యాగ్రహం ఎంత చక్కగా నిర్వహిస్తున్నాడో!"

మూర్తి జెన్నీని చూచి "ప్రియా సంపూర్ణ స్వరాజ్యం రానీ హిమాలయాలనే అఖండ శక్తిని మేము మన దేశానికి వరమిచ్చేటట్లు చేయగలం. ఆ పర్వతాలలో యెన్నివేల లోయలు, ఎన్ని మహానదులు! అన్నీ ఆనకట్టలు కట్టి హిందూదేశం ఏమిటి సర్వ ఆసియాకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయగలం. రాజపుత్రపు టెడారిని మహోద్యానవనం చేస్తాము." అని పలికినాడు. జెన్నీ భర్త మోము చూచి అందు వెలిగిపోయే కాంతులు చూచి ఆనంద చకితయైనది.

అలా వారు గంటలకొలదీ మాట్లాడుకొనేవారు.

ఆనాటి కానాడు జెన్నీ భర్త ప్రేమ క్షీరవారాశిలో వటపత్ర శయని అయి ఆనందతరంగ డోలికాలోల పరవశయై పోతున్నది. ఆమె మూర్తిని హిందూ బాలికలవలె పూజింపసాగింది. ఆమె అద్భుతాలైన ఖద్దరు పట్టుచీరలు కొనుక్కొని కట్టడం నేర్చుకుంది. బెంగుళూరి పట్టురవికలు, భారతీయ భూషణాలూ అలంకరించు కొనసాగింది. ఆ నూత్న మనోహరి వేషం చూస్తూ మూర్తి పరవశుడై పోయినాడు.

మూర్తి పని జూన్ నెలాఖరుకు మూడుపాళ్ళు పూర్తి అయిపోయింది. జలాశయం, జలసూత్రాలు, గొట్టాలు, కొండపని అంతా పూర్తి అయినాయి.

వానలు ప్రారంభించాయి. పని అంతవరకూ బాగా ఉందని సంతోషిస్తూ, మూర్తి ఇంటికి వచ్చేసరికి, జెన్నీ ఇంటికి రాలేదు. మూర్తి స్నానంచేసి సావిడిలో పడకకుర్చీలో కూర్చుండి పైపు కాలుస్తూ, పగటి కలలు కంటున్నాడు. కాలం ఎంత జరిగిందో అతనికి తెలియదు. చటుక్కున జెన్నీ కలకలలాడుతూ లోననుండి నెమ్మదిగా నడిచి వచ్చి భర్త కన్నులు మూసింది. అతదులిక్కిపడి "దొంగా! నా సామ్రాజ్ఞివి నువ్వు! తెలుసుకున్నానులే!" అన్నాడు.

ఆమె చేతులు తీసి, అతని పైపు నోటనుండి తీసి బల్లమీద పెట్టి అతని ఒళ్ళో కూర్చుని అతని మెడచుట్టూ చేయి వైచి, అతని చెవిదగ్గర నోరుంచి "ఓ నా నరుడా! నువ్వు తండ్రివి కాబోతున్నావు!" అని చెప్పి, అతని కన్నులు మూసింది.

"ఆఁ!" అంటూ మూర్తి భార్యను గట్టిగా హృదయానికి అదుముకొని, "నా దేవీ! కుళ్ళు నీళ్ళలో పొర్లాడే ఈ పశువును ఐరావతాన్ని చేశావు. నాకు నా ఆత్మలో నీ ఆత్మ కలిపి ఒక దివ్య వరం ప్రసాదించావా?" అని ఆమె పెదవులు చుంబించినాడు.

ఓం అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ.

# జాజిమల్లి

• సాంఘిక నవల •

Blank Page

# అంకితము

భారత పురోభివృద్ధికి పురుషులతో

సమభాగం పంచుకొని ముందంజ వేస్తున్న

## ఆంధ్ర స్త్రీకి

Blank Page

# చూలిక

త్యాగరాజనగరంలో వివిధ పుష్పజాతుల పొదలు వృక్షాలు వికసించిన తోటమధ్య శ్రీమతి గీతాదేవి. అంటే పద్మావతి, వెంకట్రావుల మేడ ఉంది.

పద్మావతి బిరుదనామం గీతాదేవి!

గీతాదేవి జీవితంలో ఈనాటికీ పూవులు అన్ని రంగులతో, వివిధ సౌరభాలతో నిండార వికసిస్తున్నవి.

గాంధర్వ దేవతై, ఉత్తమాంధ్ర కర్ణాటకబాణిలో దివ్యమధురార్ద్రితమైన కంఠంతో సర్వరాష్ట్రాలవారిని సమ్మోహితుల, ఆనంద పరవశుల చేయగలిగిన పద్మావతికి, సంగీతలోలురైన ప్రజలు "గీతాదేవి" అని బిరుదును సమర్పించారు.

ఆమె కంఠంవిప్పి, రాగం ఆలపించినప్పుడు అర్ధవికాసితములు, పూర్ణావికాసితములైన పూవులు జడులు జడులుగా కురుస్తవి. ఆమె పల్లవి ప్రస్తారంచేస్తే వివిధ సౌరభాలు సుళ్ళుదెసలు కలయజల్లుతాయి. ఆమె కీర్తన ఎత్తితే అమృతాలు వాకలు కట్టి శ్రోతల జీవితాలు ప్రవహించిపోతాయి.

ఆమె ఆ ఉదయం జాజిమల్లె పందిరికడ నిలుచుండి అరవిచ్చిన మొగ్గలుకోస్తూ పాట పాడుకుంటున్నది.

ఆమె తోటలోలేని పూవులు మదరాసులోనే లేవు. బోగైన్ విల్లాలు, దాలియాలు, గులాబులు, చేమంతులు, కార్నేషనులు, నాగలింగాలు, జాజి, సన్నజాజి, విరజాజి, చెట్టుమల్లె, బొడ్డుమల్లె, గుత్తిమల్లే, రేకమల్లె, జినియా, దయాంతస్, తోటంతా పూవుల జాతులే.

పూవుల వెండిసజ్జలోకి పూవులు కోస్తూవుండగా నరసింహమూర్తి మాష్టారు రెండేళ్ళబాలకుని ఒకణ్ణి ఎత్తుకు వచ్చాడు.

"అమ్మ....పూలు కోత్తోన్ని" అన్నాడా బాలుడు.

"ఒరే నాన్నా! అప్పుడే తాతయ్యగారి భుజం ఎక్కావు?" అంటూ పద్మావతి పూలసజ్జ మేష్టారుకిచ్చి, బాలకుణ్ణి తా నందిపుచ్చుకొన్నది.

"పూవు-తే...." అని బాలుడు తల్లి చేతుల్లో ఎగిరి అల్లరి చేస్తున్నాడు. ఇంతట్లో బుచ్చి వెంకట్రావు కూతురు చెయ్యిపట్టుకొని తోటలోకి వచ్చాడు. బుచ్చి వెంకట్రావు పద్మావతి భర్త. "చూడు పద్మా! నీ కూతురు నాట్యం నేర్చుకుంటుందట. సంగీతంలో వాళ్ళ అమ్మకన్న గొప్పదవుతుందట. నా దగ్గిర ఒకటే కోతలు!"

"అవునమ్మా! నాపాట చాలా బాగుంటుందని నువ్వు అనలేదేమిటి?" అని అయిదేళ్ళ సాగరిక నాట్యంచేస్తూ పాట పాడడం ప్రారంభించింది.

నరసింహమూర్తి మాష్టారు తాళం వేయసాగారు. తాను తలిదండ్రులతో, నరసింహమూర్తి మాష్టారుతో ఆమధ్య చూచిన కుమారి నటసుందరి భరతనాట్యంవలెనే అద్భుతంగా నాట్యంచేస్తూ ముగించింది.

తన బాలికను చూస్తూ వుండగా పద్మావతి మనస్సులో ఆమె జీవితం యావత్తూ సినిమావలె తేలిపోతూ ప్రవహించి జరిగిపోయింది.

పువ్వులు, పూవులే ప్రోవుగా జన్మించిన సాగరిక; తనకు పరమేశ్వరుడైన భర్త పోలికలతో, మురళీ మనోహరుడైన బాలగోపాలునిలా "వ్యాసమూర్తి" తన బాలుడు; ఆ తోట, తనభర్త చిన్ననాటి గురువై, తన కుటుంబానికి సంరక్షకుడైన నరసింహమూర్తి మేష్టారు; అన్నీ కరిగిపోయి, సముద్రతీరంలో సముద్రహోరు శ్రుతిగా జీవితమూర్ఛన రచించుకొనే తన పల్లె ప్రత్యక్షం అయినది.

# జాజిమల్లి

• సాంఘిక నవల •

## ప్రథమ గుచ్ఛము

**పు**వ్వులను చూస్తే ఆనందపడని బాలిక ఎవరు? పువ్వులు జన్మ చాలించి పూబోడులై పుడతాయో, పూబోడులే అవతారాలు చాలించి పూవులై పుడతారో పద్దాలు చిన్న బాలిక. వాళ్ళింటి దగ్గరవున్న నాగమల్లి చెట్టు పువ్వులు వానాకాలంలో జల్లులు జల్లులుగా రాలుతూన్నప్పుడు, తెల్లవారుతూనే లేచి, ఆ చిరిగిపోయిన తాటాకు బుట్టలో పోగుచేసి ఏవేవో అర్థంకాని, అర్థానికి అతీతమైన, చిన్న బిడ్డల వెఱ్ఱిపాటలు పాడుకుంటూ పోగుచేసేది. "అమ్మా! యీయాళ ఎన్ని పూవులు దొరికాయో! ఏంటనుకున్నావు. ఈయేళ ఈ పువ్వులన్నీ ఎట్టి జడేసుకుంటానమ్మా!" అని వాళ్ళ పూరిగుడిసెలో గంతులు వేసేది.

**"మల్లెలు మల్లెలు కాడల మల్లెలు**

**జల్లులు జల్లులు తెల్లని మల్లెలు"**

అని ఓ పాట సంపూర్ణమైన యాసతో పాడుతూ ఆ బుట్టను తన హృదయానికి అదుముకొని "ఓ లమ్మా! జడయెయ్యవంటే?" అని తల్లిని ప్రశ్నించింది.

ఇంక ఏమి పువ్వులుంటాయి ఆమె ఈ చిన్ననాటి జీవితంలో! వాళ్ళయ్య పనిచేసే దశరథరామిరెడ్డి పొలంలో సంక్రాంతి రోజులలో వికసించే బంతి పూవులూ, బొడగ బంతిపూవులూ, సీతామ్మవారి జడపూవులూ, బంగారం ముద్దలు, పొద్దుపొడుపు పూవులూ.

రకరకాల గోంగూర పూవులు చెవుల్లో పెట్టుకొనడానికి ఎంత అందంగా వుంటాయో అందుకనే వాటిని పూర్వకవులు కర్ణికా పుష్పాలనేవారు. గోంగూరపూవులలో ఎన్ని రంగులున్నాయి. ఎరుపు, నీలం, తెలుపు, పసుపు, చంద్రబింబాలులా విచ్చియున్న ఆ పువ్వుల హృదయంలో మధురరాగము. రాగవర్జిత విరాగహరితమై పుప్పొడులు ప్రసరిస్తూ పొలయించి వుంటుంది. దూరాన ఆవలి చిట్టడవిలో కొండ తంగేడు పూవులూ, మోదుగపూవులూ, వానకాలంనాటి దిరిశన పూవులూ ఆమెకు ఎంతో ఇష్టం.

ఆమెకు తల దువ్వడానికి నూనెలేదు. వాళ్ళదొర రెడ్డిగారింట్లో యిచ్చిన నువ్వులనూనె, కూర తాళింపుకోసం మాత్రం సరిపోయేది.

బిరుసైన ఉంగరాలజుట్టు తుమ్మెద రెక్కలలా నిగనిగలాడుతూ వున్నా, సంస్కారంలేక బాగా పెరగక తొలకరి చిరుమబ్బుల్ని నలుదిక్కులకూ ప్రసరిస్తూ ఉండేది. దొరబండ్లకు చక్రాల యిరుసులకు చుట్టిన నార తడపడానికి చిక్కని ఆముదం తెచ్చేవాడు తన అయ్య. అది నవ్వుకుంటూ చేతులకు రాసుకొని తలంతా పులుముకొనేది తల్లి దువ్వుకొనే కఱ్ఱ దువ్వెనతో చేతులు పడిపోయేటట్లుగా దువ్వుకొని, తల్లి దగ్గరకు పరుగెత్తి జడవేయించుకొనేది. అమ్మయ్య! అప్పుడు పెట్టుకొనేది పువ్వులు. ఆ బిడ్డ 'పద్ది' పల్లెవాళ్ళ ఎల్లు చందనం బొమ్మ!

## 2

ఎంత నికృష్టమైన జీవితం పల్లెజాతివారిది? వారిని పల్లీలంటారు. వారిలో పెద్దలు కొందరు అగ్నికుల క్షత్రియులమని పిలుచుకుంటారు. ఆలాంటివాళ్ళు యజ్ఞోపవీతాలు కూడా వేసుకుంటారు. వారి గ్రామం 'కావలి'కి నాల్గుమైళ్ళ దూరములో ఉంది. అది గ్రామమేమిటి? అది పల్లెవాళ్ళ చిన్నపల్లె. ఆ బాలిక పూర్వీకులు అనాది కాలం నుంచీ సముద్రంలో పడవలు కట్టుకుపోవడం సాయంత్రానికి పడవలు చేపలతో తిరిగిరావడం, ఆ చేపలు ఎండబెట్టి ఎండు చేపల క్రింద ఎగుమతి చేయడం, లేక పచ్చిచేపలుగా అమ్మేయటమో అలాంటి వ్యాపారం చేసి జీవితం సాగిస్తూండేవారు.

ప్రాణాలు ఒడ్డి, పడవడు చేపలు పట్టుకొని వచ్చినా మధ్యవర్తకుల పాళ్ళన్నీపోగా ఇంక వారికి మిగిలేది ఏముంటుంది గనుకా? అందుకని ఆమె అయ్య దశరథరామిరెడ్డి గారికి పాలేరుపని చేస్తూండేవాడు. దానా దీనా అతడి పెద్ద కుటుంబం ఆకలిగీత దాటకుండా బ్రతుకుదారిలో ప్రయాణం చేస్తూండేది.

ఆమె తాత, అవ్వ, పెద్దయ్య, అయ్య, చిన్నయ్య, వాళ్ళందరి బిడ్డలు, ఆమె అన్నదమ్ములు, అక్క సెల్లెళ్ళు మొత్తం వారి రెండు మూడు గుడిసెల్లో అందరూ కలిసి ముప్ఫై ఆరుగురుండేవారు. ఏటిలో వలలువేసి చేపలు పట్టినా, సముద్రంలోకి పోయి చేపలుపట్టినా, ఆ పాటు అంతా మగవాళ్ళదే. తట్టలతో కావలీ, బిట్రగుంటా పోయి అమ్ముకురావడం వంతు ఆడవాళ్ళది.

తమ బట్టలన్నీ చేపల వాసనకొట్టేవి. తమ యిండ్ల చుట్టూ చేపలవాసన. ఇల్లంతా చేపలవాసన. చివరికి వళ్ళంతా చేపలవాసనే! వారి పూర్వీకురాలైన మత్స్యగంధి చరిత్ర ఎవరు వినలేదు! ఆమె జీవితములో పరాశరుడు ప్రవేశించి ఆమెను యోజనగంధిని చేసినాడు. ఈ బాలిక పద్దాలు జీవితములో బుచ్చి వెంకులు పరాశరుడూ, శంతనుడూ కూడా!

## 3

పద్దాలుకు పదహారో ఏడు వచ్చింది.

సముద్రం మథించిన లావణ్యాలు సుడులు సుడులుగా ఆమెలో చేరుకుంటున్నాయి.

చింపిరిజుట్టు పొడుగై, ఉంగరాలు తిరిగి, లోతు సముద్రాల నీలాలై, సముద్రం ఆవలిగట్టు కాటుక కొండలై నిగనిగలు తేలింది.

ఆమెకు యవ్వనం వచ్చి రెండేళ్ళయింది:

ఆ పల్లెవాళ్ళలో పల్లెనాయకుడు వీరాస్వామి కొడుకు బుచ్చి వెంకన్న. అతనికి పద్దిని ఇవ్వడానికి వారిరువురి చిన్నతనంలోనే నిశ్చయం చేశారు పెద్దలు. ఉక్కు విగ్రహంలాంటి బాలుడు. సముద్రం మొసలిలాంటి శక్తిమంతుడు, నల్లమద్ది చెట్టులా కమ్మెచ్చులు తిరిగిన కండలుకట్టిన దేహంతో బార ఈతలో సముద్రములో ఎంత దూరానికైనా వెళ్ళేవాడు.

బుచ్చి వెంకులంటే పద్దికి తన ఎనిమిదో ఏటినుంచీ ప్రాణమే. ఆనాటికే వాడు ఒక్కడూ తెరచాప ఎత్తి నావ నడుపుకుపోయేవాడు! ఎంతదూరమైనా సముద్రంలోనికే. మాటలు తక్కువ. చేతకు ఎప్పుడైనా సిద్ధమే. తన పల్లెలో ఏ పని వచ్చినా, అంత

చిన్నతనంలోనూ అతడు ఎన్నడూ వెనుదీయలేదు. ఆమెకు పన్నెండు వచ్చింది. అతనికి పదహారో ఏడు వచ్చింది. అప్పుడే వీళ్ళిద్దరి పెండ్లి చేయడానికి సంకల్పించారు. పెళ్ళి మూడురోజు లుండనగా బుచ్చివెంకన్న పడవ సముద్రములో మాయమైపోయింది. ఆ చుట్టుప్రక్కల పల్లెవాడలలో పల్లెనాయకులందరూ అతనికోసం ఆ తీరమంతా గాలించారు. ఆ బాలకునికోసం పల్లెవాడలన్నీ గగ్గోలు పుట్టాయి.

పద్దమ్మ దుఃఖానికి మేరలు లేవు. ఆ లేతహృదయం చితికిపోయినట్లే అయింది. వారం రోజులకి పెన్నసముద్రంలో చేరే ప్రదేశానికి తెరచాప ఎత్తుకొని కొనవూపిరితో ధైర్యం చెడకుండా వచ్చి చేరుకున్నాడు బుచ్చి వెంకన్న. ఈ సంగతంతా చెప్పి కావలిలో వున్న ఒక అయ్యవారిని అడిగితే ఆయన బుచ్చివెంకన్న రోజులు మంచివి కావనీ, రెండేళ్ళ వరకూ బుచ్చి వెంకన్నకూ, పద్దమ్మకూ పెండ్లి చేయవద్దని సలహా యిచ్చాడు.

పద్దమ్మకు పదహారోయేట బుచ్చి వెంకన్నకు ఇరవయ్యో యేట వాళ్ళిద్దరకు పల్లెపాకలలో ఎన్నడూ ఎరుగని వేడుకలతో పెళ్ళి చేశారు. కెరటమూ కెరటమూ కలసిపోయినట్లు గాలీ గాలీ ఒరుసుకుపోయినట్లు, ఏరులో ఏరు సంగమించినట్లు వారి జీవితాలు కలిసినవి. రెండు తిమింగలములులా వారు ఉప్పొంగినారు. సముద్రాల ఈదులాడినారు. రెండు కృష్ణ దేగలలా వారు మైమరపులతో ఆకాశాల తేలిపోయినారు!

ఇంతలో ప్రపంచపు బ్రతుకు మార్గాల జటలమారెమ్మ, ఠాకినీదేవి యుద్ధము అవతరించింది. జపాను యుద్ధరంగంలోకి దిగింది. భారతీయ యువకులెంతమందో కడుపుకోసం యుద్ధంలోకి జేరేరు. ఎంతమందో సరదాకోసం యూనిఫారము వేసికొన్నారు. చాలామంది ఏ సంగతీ తెలియకుండా మాయమాటలు నమ్మి సైన్యాల జట్టులలో జేరిపోయినారు. అలాగే యుద్ధములోకి వెళ్ళిపోయినాడు బుచ్చి వెంకన్న. తాను పద్మ కోసమే యుద్ధానికి వెళ్ళ నిశ్చయించాడు. వెళ్ళాడు.

చేరిన ఆరునెలల్లో కోహీమా రంగానికి వెళ్ళవలసి వచ్చింది. మరి ఆరునెలలు తిరక్కుండా యుద్ధం ఆగిపోయింది. టకటక సైనిక వేషంలో జేబునిండా డబ్బుతో సంచులనిండా చిత్ర విచిత్రమైన వస్తువులతో, సువాసన నూనెలతో, రంగు రంగుల సబ్బులతో, ఫేసుపౌడర్లతో, దిబ్బనతో లోలకులతో అనేకరకాల వెన్నెలలాంటి చీరలతో యింటికి వచ్చాడు బుచ్చి వెంకట్రావు జమాదారు.

## (4)

తన పల్లెలో తన వాళ్ళతో ఉండడానికి యిష్టంలేక పోయింది బుచ్చి వెంకట్రావుకు. వచ్చి కావలిలో మకాము పెట్టాడు. తాను చేపల వర్తకము ప్రారంభించాడు. పెళ్ళానికీ తనకూ చదువు చెప్పడానికి ఒక మేష్టర్ని పెట్టుకున్నాడు. పెళ్ళాన్ని పద్మావతీ అని పిలిచాడు. తాను బుచ్చి వెంకట్రావయినాడు! పద్మావతి కంఠం ఎంత మధురమైనది? ఆమె చిన్నతనంలోనే -

"ఏడుకలూ పెళ్ళి ఏడుకలూ
భూమంత పందిరేసి
పువ్వుల తోరణాలు

బూరాలు ఊదారు
ఏదుకలూ పెళ్ళి ఏదుకలూ
పడవెక్కి తెడ్లేసి
నడిసముద్రాన్ని చేరి
ఆలిచిప్పల మద్దె ముత్యాల జాలరులు
ఏదుకలూ పెళ్ళి ఏదుకలూ"

అని తల్లితోపాటు చేపలు ఎండవేసేటప్పుడుగాని, అయ్య యిచ్చిన చేపల్ని బుట్టలో తీసుకొనివచ్చి అమ్మకు అందిచ్చేటప్పుడుగాని, సన్నటి రొయ్యపప్పు రంగూన్ యెగుమతి కోసం తండ్రితోపోయి బుట్టలలో కట్టేటప్పుడుగాని, వెన్నెల రాత్రుల ఒడ్డుకు తేలుకుంటూ వచ్చి పాటపాడేటి ఉప్పునీటి కెరటాలతో కలిపిగాని ఆమె గొంతెత్తి ఎన్నో పాటలు పాడుతూ ఉండేది. ఆ పల్లెవాళ్ళ వేడుకలలో, ఉత్సవాలలో పద్దమ్మ పాడకపోతే అవన్నీ పరిమళాలులేని పువ్వులులా అయిపోయేవి. అడవి పువ్వులకు దోహదాలు కావాలా అందమైన సువాసనలను వెదజల్లడానికి! కావలిలో ఆ బాలిక గొంతు విని ప్రయివేటు మాష్టరు "ఏమండీ వెంకట్రావుగారు! మీ వాళ్ళకు సంగీతం చెప్పించండి" అని ప్రోత్సహించాడు. అప్పుడే పద్మావతి జీవితములో నరసింహమూర్తి మేష్టారు ప్రవేశించాడు.

సముద్రపు ఒడ్డున పాలసముద్రపు కెరటాలులా ఉబికి ఉన్న ఆ ఇసుక తిన్నెలలో ఆటలాడుకుంటూ, నత్తగుల్లలు ఏరుతూ, శంఖాలు ప్రోగుచేసుకుంటూ, రంగురంగుల పీతల్ని తరుముతూ కూరకు పనికివచ్చే పెద్ద పీతల జోలికి పోకుండా ఆటలాడుకునే పల్లె బాలికలకు ఆ సముద్రం అవతల ఒడ్డున ఏమున్నదో ఏమి తెలుసు? కెరటాలు ఎందుకు పుడతాయో వాళ్ళు ఆలోచిస్తారు. సముద్రపు లోయల్లో ఏ రాక్షసో నిట్టూర్పులు విడుస్తూవుంటే ఆ కెరటాలు ఏర్పడుతాయేమో? ఉతుకు ఎరుగని పేలికలైన పరికిణీ చొక్కాలు ధరించి మహారాజు కుమార్తెలా గంతులువేస్తూ ఆడుకొనే పద్దాలుకు, సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, సముద్రానికి ఇవతల ఒడ్డు అవతల ఒడ్డు సముద్రుని పోటూపాటూ, సముద్రుని పెండ్లాము నదీసుందరి రాకపోక, తోలుబొమ్మల ఆటలులా జరిగిపోయేవి.

ఎందుకు అందమైన బట్టలు కట్టుకోవాలో తెలియకపోయినా రంగురంగుల కొత్త పరికిణీలు చక్కని వల్లెవాటులను, చుక్కచుక్కల రవికెలు కావాలని చిన్నతనంనుంచీ వాంఛించేది పద్దాలు.

పెద్దవాళ్ళ యిళ్ళలో తిండికోసము ఏమి వండుకుంటారో అని పద్దాలు ఎప్పుడూ ఊహించుకోనయినా ఊహించుకోలేదు. అనుకుంటే ఇంకా చిక్కటి గంజీ, ఇంకా చిక్కటి సంకటి ఇంకా పెద్దవి చేపలు, కోడిమాంసపు కూరలు ఉంటాయి. అంతకన్నా ఏమిటో అవి ఎప్పుడైనా అనుకున్నదేమో! కాని కావలి పట్టణపు బజారులలో మిఠాయి అంగడులమీద అమ్మే ఆ నోరూరిస్తూ ఘుమఘుమలాడే అవేవో పకోడీలు, కారంపూసా, అవి తన అయ్య పాలిపని చేసే రెడ్డిగారింట్లో తింటారు కాబోలు అని అనుకునేది.

# ద్వితీయ గుచ్ఛము

ఎన్నో అందాలు ఎందరి జీవితాలలోనో ప్రత్యక్షం కాకుండానే, భావమాత్రంగా నైనా, దర్శనం ఇవ్వకుండానే ఈ జగత్తు నడిచిపోతూ ఉంటుంది. కాని ప్రాథమికమైన సౌందర్యభావం మానవులందరి జీవితంలోనూ వికసించి ఉండనే ఉంటుంది. జీవితాన్ని నిజంగా అర్థం చేసికోలేని కర్కశ వాదులు రెండు చేతులా ఆ కాస్త అందాన్ని కూలద్రోసుకొని ధూళి నిండిన దారులలో యాత్రసాగిస్తారు.

పల్లెటూరివారి జీవితాలలో కవిత్వమూ, సంగీతమూ నిత్యకర్మలో అంతర్భాగమై పోతాయి. అవతల ఒడ్డులేని సముద్రము, లోతు తెలియని కడలి పద్దాలుకు ఎప్పుడూ ఏవో చిరుగాలులు ప్రసరించిన యేటి అలలూ, ఆలోచనలను ఉద్భవింపజేసేవి.

పల్లెవారికి సముద్రం ఒక మహారాజ స్నేహితుడు. కాబట్టే వాళ్ళ జీవితాలలో అనంతమైన దూరాలు, లోతులు, లోతులు మించిన పారాలు! వాళ్ళు ఓడలు నిర్మించే విశ్వకర్మలూ, ఆ ఓడలు దెసల కడవలకు తేలిపోజేసే నావికులూ కాగలిగారు.

పద్దమ్మ కూడా తండ్రి తెప్పనావమీద చేపలకోసం ఉదయ దిశాంచలాలు దాటి వెళ్ళేటప్పుడు తానూ వెళ్ళింది. ఉప్పునీళ్ళలో చేపపిల్లలా ఈదగలగేది. ఎంత మునిగినా, లోతులందని నీలజలాలు, ఎంత ఈదినా దూరమందని కెరటాలు; కొండవిరిగినట్లు ఒడ్డుకు దొర్లిపడే తరంగాలు, ఆకాశాలతో గుసగుసలుపోయే కల్లోలాలు; ఏ కడనుంచి, ఏ కడకు పోతాయో తెలియని అవ్యక్తవాంఛల్ని ఎన్నో అందిస్తూ ఉండేది.

ఏడు సముద్రాలకూ పెంపుడు బిడ్డ పద్దమ్మ. ఆ సముద్రాల అమృతం అంతా పద్దమ్మలో నవనవలాడుతూ ఉండేది. ఆ జవ్వని కంఠమూ లావణ్యం దాల్చింది.

సంగీతం మేష్టారు నరసింహమూర్తి నేడు పద్మావతి అయిన పద్దాలుకు గాన విద్యా శిక్షణ ప్రారంభించాడు. కెరటాలలోని, తుఫానులలోని, ఆకాశనీలాలలోని అనంత దూరాలలోని మాధుర్యాలు వాకలు కట్టించుకొన్న ఆమె కంఠం ఆ శిక్షణకు ఎలా లొంగుతుంది? సముద్రానికి ఆనకట్టలు కట్టగలరా? లోతులకు కొలతలు వేయగలరా? నరసింహమూర్తి కష్టపడి కర్నాటక బాణి సంపాదించుకొన్న సంగీతం మేష్టారు. కావలిలో, కావలి చుట్టు ప్రక్కల గ్రామాలలో, సంగీత సభలు చేసి "పాటకుడు" అని పేరుపొందినవాడే! అయితే మాత్రం సంగీత సముద్రాలకు వారధులు కట్టడానికి అతడు శ్రీరామచంద్రుడా ఏమన్నానా!

## 2

పద్మావతి ఒంటినిండా నగలు దింపాడు బుచ్చి వెంకట్రావు. ఆనాటికి అవి పదమూడు వందల ఏభై రూపాయల మూల్యం కలిగిన బంగారం నగలు. తాను పెద్ద చేపల వర్తకుడవుతున్నాడు. యుద్ధంలో దేశాలు తిరిగివచ్చిన వాడవటంచేత ఇంతో కొంతో లోకజ్ఞానం సంపాదించుకున్నాడు. దేశాలు తిరిగేవారికి దుమ్ముధూళిలా అక్కర్లేదనుకొన్నా జ్ఞానం కాస్త అంటుకు తీరుతుంది. కాని ఇది ఏమిటీ అని ప్రశ్న వేసుకొనే యోగంతో

బయలుదేరిన పురుషునికి అతడు ఎంత తక్కువ బుద్ధి శ్రేణిలో వాడైనా లోకజ్ఞానం బాగా నచ్చితీరుతుంది. బుచ్చివెంకట్రావు తన జీవితానికి నిచ్చెనలు అమరించి, పైకి వెళ్ళాలి అన్న పట్టుదల కలిగిన సంకల్పజీవి. అతడు సముద్ర దూరాలు ఈదుకు వెళ్ళిన మనిషి. యుద్ధంలో రంగూనుకు వెళ్ళినప్పుడు సముద్రం ఓడమీద దాటినవాడే! ఏ రేవైనా సముద్రానికి అవతల వొడ్డు రేవు కాదు. సముద్రం వేరు. రేవులు వేరు. రేవులన్నీ సముద్రానికి సేవకులవంటివి అని బుచ్చివెంకట్రావు ఊహించుకున్నాడు.

తాను తన జీవితంలో గొప్పవాడవటం తన పద్మావతి కొరకే. తనకూ తన పద్మావతికీ ఒకేసారి చదువు కావాలి. తన జీవితం చెట్టు అయితే ఆ చెట్టంతా నిండి వికసించిన పూవులప్రోగు పద్మావతి... పూవులు లేని చెట్టుకు అందమే లేదు. చెట్టులేక పూవులు ఎట్లా వికసించగలవు?

ఇద్దరికీ ఒకడే ప్రయివేటు మాష్టరు. ఇద్దరికీ ఒకే పాఠాలు చెప్పుతున్నాడు ఆ మాష్టరు. పద్మావతి దబ్బున గ్రహిస్తుంది. దబ్బున మరచిపోతుంది. బుచ్చివెంకట్రావు ఒక పట్టాన పాఠం త్వరగా గ్రహించలేడు. గ్రహించిన పాఠం త్వరగా మరచిపోడు. కాబట్టి తన భార్యకు తానే రెండవ గురువైనాడు వెంకట్రావు. ఏ పాఠమైనా నాలుగుసార్లు త్వరగా గ్రహించి వెంటనే మరచిపోయిన తరువాత ఐదవసారి పద్మావతికి పాఠం శాశ్వతంగా వచ్చేది. ఈ విధంగా ప్రవాహాలు సుళ్ళు సుళ్ళుగా వారిద్దరి జీవితాలలోకి జ్ఞానం ప్రవహించుకు రాసాగింది. ఆ జ్ఞానంతోపాటు లోకానికి కప్పివున్న తెరలు ఒక్కొక్కటే పైకి చుట్టుకుపోసాగాయి.

పద్మావతి భర్తను తన్ను కూడా ఈ ప్రదేశాలకు ఆ ప్రదేశాలకు తిప్పి, ఉత్తమ గాయకుల పాటలు తాను వినేటట్టు చేయవలసిందని ప్రార్థించింది. వాళ్ళిద్దరు సంగీత సభలకు మద్రాసు వెళ్ళసాగారు. వారిద్దరూ రామేశ్వరంవరకు ప్రయాణం చేసినప్పుడు దర్శనం చేసికొన్న తంజావూరు, చిదంబరం, శ్రీరంగం, మధుర, రామేశ్వరం మొదలైన దివ్యక్షేత్రాలలో ప్రత్యక్షమైన దేవాలయాల రీతిగానే కర్ణాటక బాణి ఉంటుంది. రాగాలు, మూర్ఛనలు, కీర్తనలు, గతులు, తాళాలు, క్షేత్రాలై, మండపాలై ఉత్తుంగ గోపురాలై, విమానాలై పద్మావతికి గోచరించినవి. ఆమెకు ఆనందము కలిగినది. భయము వేసినది.

ఏ సుబ్బులక్ష్మో, శమ్మంగుడో, కర్ణాటక సంప్రదాయ ప్రపంచమును ఇంద్ర జాలికులులా ప్రత్యక్షం చేసేటప్పటికి పద్మావతి దిగ్భ్రమచెంది అతిలోకమైన దివ్య మాధుర్యంలో మైమరచిపోయి స్థాణువులా అయిపోయేది.

**పద్మావతి:** నాకీలాంటి సంగీతం ఏలా వస్తుందండీ? ఈ రాగాల పోకడలే నా గ్రహణశక్తికి మించిపోతున్నాయి. నేను ఎన్నాళ్ళు తపస్సుచేస్తే, ఆ తపస్సు ఎన్ని జన్మలు వీడని దీక్షతో ఆచరిస్తే, నాకు ఈలాంటి సంగీతం అబ్బగలదు! ఎందుకు నాకు ఈ సంగీతం చెప్పించడం. ఆ సుబ్బులక్ష్మి అమృత ప్రవాహం ముందర నా కంఠం ఉప్పునీళ్ళ కాలవలా కనపడుతుంది.

**బుచ్చి వెంకట్రావు:** ఓసి వెర్రినాగమ్మా! ఒక్క రోజులో సుబ్బులక్ష్మి తనకున్న యావత్తు సంగీతశక్తితోను వూడిపడిందా? ఎన్ని సంవత్సరాలు కష్టపడిందో. నేను లక్షాధికారిని కావాలంటే ఒక్క రోజులో కాగలనా చెప్పు.

**పద్మ:** అంత విద్య మన నరసింహమూర్తి మాష్టారు చెప్పగలరనేనా?

**బుచ్చి:** నరసింహమూర్తి మాష్టారు కావలి స్టేషను అనుకో, ఇంకా బిట్రగుంట, నెల్లూరు, గూడూరు జంక్షను చెన్నపట్టణం ఉన్నవి కదా?

పద్మ: ఎన్ని వుంటే ఏమండీ? నా కెట్టావస్తుంది ఆ సుబ్బలక్ష్మి కంఠం.

**బుచ్చి:** ఎవరందాలు వారివి; ఎవరి గొప్పలు వారివి. ఏమంటావ్! నీ కంఠంలో శ్రీ పి.సుబ్బలక్ష్మి కంఠంలో కనపడేలేదు! ఎవరికున్న గొప్ప వారిది.

**పద్మ:** ఐతే నన్ను పట్నం తీసికెళ్ళో లేకపోతే దక్షిణాదికి తీసుకుపోయో గొప్పవారి దగ్గర సంగీతం చెప్పించండి.

## (3)

బుచ్చి వెంకట్రావు ఎందురొయ్యి పప్పు ఎగుమతి మద్రాసునుండే చేయ సంకల్పించాడు. తన ఆఫీసు కావలినుండి మద్రాసుకు మార్చాడు. కావలినుండి మద్రాసువరకూ ఉండే పల్లె గ్రామాలలో పల్లెవాళ్ళను తన కంపెనీకే వారి రొయ్య పప్పు అమ్మేటట్టుగా ఏర్పాటు చేసికొన్నాడు. తన ఆఫీసు వాల్‌టాక్సు రోడ్డులో కుదుర్చుకొన్నాడు. తను కాపురం ఉండేందుకు రాయపేటలో ఇల్లు కుదుర్చుకొన్నాడు. బ్రహ్మప్రళయంమీద ఊరంతా జల్లిస్తే ఆ ఇల్లు దొరికింది. భార్యకు సంగీతం చెప్పే నరసింహమూర్తి మాష్టారును కూడా తీసికొని వచ్చాడు.

పద్మావతికి చెన్నపట్నం వచ్చినప్పటినుంచీ జీవితం ఒక అనంతమూలికలా అయిపోయింది. కావలసినన్ని జాజిపూవులు, కావలి వచ్చినప్పుడే ఆమెకు మొదటిసారి జాజిమల్లె ప్రత్యక్షమైనది.

ఒక్కొక్క వస్తువు ఒక్కొక్కరి జీవిత ప్రవాహాన్ని నూతన పథాలకు త్రిప్పుతుంది. ఒక్కొక్క పువ్వు ఒక్కొక్క బాలిక బ్రతుకునే మారుస్తుంది. పెద్దజాజిపువ్వును మదరాసులో జాజిమల్లిపూవు అంటారు. తెలుగుదేశంలో పెద్దజాజి అని మాత్రమే పిలుస్తారు. అసలు జాజికి మల్లికి ఉద్భవించిన పువ్వు అయివుంటుంది. అటు మల్లిపువ్వులోని సౌందర్యాలూ ఉన్నవి. ఇటు జాజిలోని సుకుమారతా ఉన్నది. ఏదో వివశత్వం కలిగించే మత్తువాసన నక్షత్రరూపమై, నక్షత్ర లోకాల ఆవలిదిశలకు కొనిపోయే రూపసౌందర్యము, స్వచ్ఛజాజిమల్లి పూవులో నృత్యమాడుతూ ఆమెకు గోచరించినవి. ఆమె మల్లెపూవు లెరుగును; నాగమల్లి పూవులూ ఎరుగును. నాగమల్లి చెట్లు వాళ్ళ పల్లెదగ్గరనే ఉన్నవి. వర్షాకాలం రాగానే అవి చక్కగా వికసించి వాన జల్లులతోపాటు పూవులు జల్లులు జల్లులై కురుస్తవి. తెల్లవారగట్లే లేచేది పద్మాలు వాటిని ఏరుకోటానికి. చెవులలో జూకాలుగా అమరించుకొనేది. దండలు గుచ్చి మెడలో వేసుకొనేది. తన చింపిరి జుట్టులో అలంకరించుకొనేది. ఒక్కొక్క పువ్వూ ముచ్చిక తెంపి ఆ పువ్వులోని తియ్యటి పాలను తాగేది. సన్నగా బూరాలు ఊదేది.

ఆ నాగమల్లి పువ్వులు జాజిమల్లి ఎదుట సామ్రాజ్ఞి ఎదుట రాణులులా అయిపోయినవి. నాగమల్లి మల్లియపీఠానికి దారి చూపిస్తుంది. మల్లిక జాజిమల్లి సింహాసన వితర్దిక కడకు గౌరవంగా తీసికొని వెడుతుంది.

కావలిపట్నంలో తాను తన భర్త కాపురం పెట్టిన మొదటి వసంతమాసంలో ఈ జాజిమల్లి పువ్వులు అమ్మకానికి వచ్చినప్పుడు, ఏమిటి యీ కొత్తరకం పూవులు ఇంత అందంగా వున్నాయేమిటి అనుకొన్నది. జీవితం అడుగు భాగాలలో దాగుకొనివున్న ఎన్నో కాంక్షలనూ, ఆశయాలనూ ఈ జాజిమల్లి పూవుల వాసన రేకెత్తించినది. ఎక్కి ఎక్కి పైకి ఎక్కి, ఏదో ఒక మహానది ప్రవహించి క్రిందికి దిగే పర్వత సానువుల చరియల అనుసరిస్తూ, ఎక్కుతూ, కొండలు దాటుతూ, ఆ నదీబాలిక ఉద్భవించే పరమరహస్య ప్రదేశాలకే ఆ జాజిమల్లి వాసనలు తీసికొనిపోతున్నట్లుగా ఆమె మనసులో పొంగులు కలిగించేది.

చెన్నపట్నంలో అన్నీ జాజిమల్లిపూలే! అరటిదొప్పలలో దొంతరలు; దండల చుట్టలు, తక్కెడలో తూకాలు! జాజిమల్లియతో సంగమిస్తూన్న కనకాంబరాలు, మరువం కురువేరులున్న కదంబ మాలలు! మదరాసు జాతి కుసుమ వైభవ సమృద్ధమైన మహానగరం.

ఎన్ని కాంక్షలు ఆ నగరంలో ఉద్భవించాయో! తీరని కలలు, గాఢవాంఛలు, ఉత్కృష్టమైన ఆశయాలు జాతీ కుసుమ పరీమళ సంఘాతాలై మదరాసు నగరంలో ఎన్ని బ్రతుకులలోనో పుట్టిపెరిగి, మహాఝంఝులై గాలివానలై పోతున్నాయో!

## (4)

నరసింహమూర్తి సంగీతం మేష్టారు వాళ్ళింటిలోనే మకాం. నెమ్మదిగా సంగీతం మేష్టారు వంట బ్రాహ్మణుడూ అయ్యాడు; పద్మావతికి పితృదేవుడూ, గురువూ అయ్యాడు. పద్మావతి కనుముక్కు తీరుగల, అందమైన ముఖముకల పడుచు. ఆమెలో నాగరికత స్థానం ఏర్పరచుకొన్నప్పటినుంచీ ఆమెకున్న నీలోత్పలకాంతి ఉజ్వల శ్యామలకాంతి కాజొచ్చింది! శరీరం సామ్యాంగ పరిపుష్టమై కాకతీయశిల్ప బాలికా సౌందర్యం మూర్తించుకొన్నది.

సంగీతం మేష్టారు నరసింహమూర్తికి పల్లెపడుచు పద్దాలు ఏవో పరమరహస్యాల పాలసముద్ర తరంగాలలో నుండి అవతరించిన లక్ష్మిలా గోచరమయ్యేది. పల్లెవారికి ఈ అందాలు ఎక్కడనుంచి వచ్చాయి? కాశీరాజుకు మత్స్య గ్రంధి చేపగర్భంలో దొరికినట్లు యీ పద్మావతి కూడా ఏ సముద్రపు అలలకో కొట్టుకు వచ్చిన వరుణదేవుని కొమరిత ఏమో? నల్లవారున్నారు. వారు తెల్లచీర కట్టుకుంటే చీర నల్లబడిపోతుందేమో అన్నట్టుంటారు. కాని పద్దాలు నలుపు రంగు ఆకాశనీలంలా, సముద్రంలోతుల గరుడపచ్చల నీలంలా, నరసింహమూర్తికి దర్శనం అయ్యేది. జూకామల్లి పూవుల నీలంలో వున్న ఆర్ద్రత ఆమె శరీరచ్ఛాయలో వికసించి వున్నదని నరసింహమూర్తి అనుకున్నాడు.

**నరసింహమూర్తి:** ఏమమ్మా పద్మావతీ! ఏదో ప్రైవేటు మాష్టరును పెట్టి మీ ఆయన నీకు ఏదో వానాకాలం చదువు చెప్పించాడు. నిజంగా సంగీత రహస్యాలే అర్థం కావాలంటే చదువు కూడా బాగా వచ్చి తీరాలి అమ్మాయి.

**పద్మావతి :** ఇక్కడ కూడా ప్రయివేటు మాష్టారును పెట్టించుకోవచ్చు కాదుటండీ!

**నర :** ప్రయివేటు మాష్టరు చదువు ఆటా పాటల చదువు. ఏదయినా స్కూలులో చేరి చదువుకోవాలి. ఆ చదువునకు ప్రయివేటు మాష్టరు చదువు బలమిస్తుంది.

**పద్మ:** ఇంత పెద్దదాన్ని ఇప్పుడు స్కూలు ఏమిటండీ మాష్టారూ?

**నర:** ఆంధ్ర మహిళా సభలో చేరరాదూ. వాళ్ళు బెనారసు యూనివర్‌సిటీ ప్రవేశపరీక్షకు పంపిస్తారు. రెండేళ్లలో టింగురంగా అని ఇంటర్‌మీడియట్‌లో చేరవచ్చును.

**పద్మ:** ఇవాళ మా వారిని అడుగుతానుండండి. ఒక్కప్పుడు నాకు ఈ చదువెందుకు బాబూ అనిపిస్తుంది. ఈ పట్టణవాసం, ఈ మోటారుకార్లు ఈ గడబిడల్లో ఏమి ఆనందం ఉంటుందీ! మా పల్లెలో ఆ సముద్రం వొడ్డునే ఆ ఏటి కాడనే ఎంతో ఆనందంగా ఉండేది.

**నర:** ఇక్కడమాత్రం సముద్రం లేదటమ్మా.

**పద్మ:** ఇక్కడ సముద్రం సముద్రంలా అనిపించదండీ.

**నర:** అక్కడ కెరటాలు ఇక్కడా వున్నాయి. అక్కడ ఇసుక ఇక్కడా వుంది.

**పద్మ:** ఎట్లా అయినా ఆ సముద్రం వేరు. ఈ సముద్రం వేరు. ఇన్ని లక్షల జనంలో సముద్రం మన సముద్రంలా కనిపించదు. ఎవరి సముద్రమో చూడడానికి వచ్చినట్లుగా వుంటుంది. మాష్టారూ ఈ సముద్రంలో చేపలు దొరుకుతాయీ.

**నర:** అదేమిటమ్మా! పొద్దున్నే తెప్పలు కట్టుకొని మీవాళ్ళెంతమందో తెల్లారగట్టే సముద్రంలోకి వెళ్ళిపోతారు. పది పన్నెండు గంటలకు తిరిగివస్తారు. తెప్పలనిండా కావలసినన్ని చేపలు పట్టుకువస్తారు.

**పద్మ:** అవి విదేశీ చేపలేమో!

**నర:** మంచిదానవే!

పద్మావతి ఆంధ్ర మహిళా సంస్థలో చేరింది. బుచ్చి వెంకట్రావు తాను అగ్నికుల క్షత్రియులమని చెప్పాడు. ఆంధ్రమహిళాసభ విద్యాలయంలో చేరినప్పటినుండి పద్మావతికి దీక్ష ఎక్కువైంది. రాత్రింబవళ్ళు చదువే. మహిళాసభ విద్యాలయంలో వున్న బి.ఏ. పాసయిన ఉపాధ్యాయినిని ఒకరిని ఆమెకు ప్రయివేటు మాష్టరుగా కుదిర్చాడు బుచ్చి వెంకట్రావు.

మద్రాసు వచ్చినప్పటినుంచీ బుచ్చి వెంకట్రావు వ్యాపారం వృద్ధి అయింది. వచ్చిన ఆరునెలలో అతనికి ఎనిమిదివేలు లాభం వచ్చింది. భర్తను ఆంధ్ర మహిళా సభకు దగ్గిరగా యిల్లు అద్దెకు పుచ్చుకోమని పద్మ పోరుపెట్టింది. సలివన్సే గార్డెన్స్‌లో చిన్న మేడ నూరురూపాయలు అద్దెకు కుదుర్చుకొన్నాడు బుచ్చి వెంకట్రావు. అందుకు వేయి రూపాయలు అడ్వాన్సు యిచ్చాడు.

చదువు వస్తున్న భార్య బుచ్చి వెంకట్రావుకు నిత్యనూతన విద్యామూర్తిలా, సౌందర్యదేవతలా కనిపించేది. చదువుకున్న బాలికలతో సహవాసాలు అలవరచుకొన్న పద్మావతికి ఏదో ఒక నూతన ప్రపంచం సన్నిహితం కాసాగినది. చదువులు, దేశాలు, దుస్తుల విధానాలు, వివిధ భాషలు, రాజకీయాలు, అలంకరణలు, ఆనందాలు, శుచి, శుభ్రతలు పద్మావతికి అర్థంకాసాగినవి.

ఆమె ఇల్లు అలంకరించటం నేర్చుకొన్నది. తాను కడిగిన ముత్యంలా ఎప్పుడూ నిర్మలంగా వుండటం నేర్చుకొన్నది. వివిధ సువాసనలు తమ తమ వ్యక్తిత్వాలతో ఆమె జీవితంలోనికి వచ్చి చేరినవి. తాను అర్థం చేసుకొన్న ప్రతి సంస్కృతినీ ఆ బాలిక తన

భర్త జీవితంలో కూడా ప్రవేశపెట్టాలనీ ప్రయత్నం చేయసాగింది. బుచ్చి వెంకట్రావు ఆమెకు దాసానుదాసుడైన శిష్యుడైనాడు. వారిద్దరికీ ఈ దైనందిన సంస్కృతి విద్యాశిక్షణ ఎంతో ఆనందం కలిగించే వ్యావృత్తి అయినది.

ఇల్లు అలంకరించుకొనే పాఠం ఉపాధ్యాయిని చెప్పేది. చెప్పిన పాఠమెల్లా ఆచరణలో పెట్టాలని పద్మావతికి కుతూహలం. భర్తతో మారాం పెట్టేది. రోజుకు ఒక కొత్తరకం భావం బుచ్చి వెంకట్రావును ఉక్కిరిబిక్కిరి చేసేది. ఇవాళ కిటికీలన్నిటికి పచ్చరంగు, ఎర్రరంగులు కలిగిన పువ్వులు. రేపు నీలంమీద తెల్లచారలు కలిగిన తెరలు, ఇవాళ పేము కుర్చీలు, రేపు రోజువుడ్డు సోఫాకుర్చీలు “నీకేమైనా మతిపోయిందా?” అంటాడు బుచ్చి వెంకట్రావు.

నరసింహమూర్తి మాష్టారు పద్మావతి భావాలన్నీ వింటూ ఎంతో ముచ్చట పడిపోయేవాడు. ఎంతో కాలం సంగీతంలో ప్రయివేటు మాష్టరుగా వుండి నూరు రూపాయలు నెల్లూరులో సంపాదించుకుంటూ కుటుంబం పోషించుకుంటూ ఉండేవాడు. నేడు అరవైరెండు ఏళ్ళు వచ్చాయి. భార్య పోయింది. బిడ్డలు లేరు. స్వచ్ఛమైన వెలనాటి బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. పెద్దవాడవటంచేత నెమ్మదిగా పాఠాలు తగ్గిపోయినాయి. నెల్లూరు వదలి స్వగ్రామమయిన కావలి చేరుకొన్నాడు. కావలి చేరుకొన్న కొద్దిదినాలకే బుచ్చి వెంకట్రావు 50 రూపాయలిచ్చి నరసింహమూర్తిగారిని భార్యకు సంగీతపు మాష్టారుగా ఏర్పాటు చేసినాడు. నేడు యీ కుటుంబంతో తాను మదరాసు వచ్చాడు. తానింత వండుకొని వాళ్ళిద్దరికి వడ్డించుకు తినమని ఇవతల పెట్టేసేవాడు. పద్మావతే అతనికి కూతురైంది. బుచ్చి వెంకట్రావు అల్లుడైనాడు. వీళ్ళిద్దరి దినదినాభివృద్ధి అతనికి నిత్య సంతోషకారణమైనది.

* * *

# తృతీయ గుచ్ఛము

ఏమిటీ సంగీతం. ఎందుకూ ఈ సంగీతం అని పద్మావతి అనుకొన్నది. ఎవరైనా మధురంగా పాట ఒకటి పాడుతుంటే విన్న వారికి మైమరపు కలగాలి! ఏ రాగాలాపనలోనో, కంఠంలో ఏ గమకము వికసింపజేయటంలోనో, ప్రాణాలు కరిగిపోయి దొనదొన ఆనందరూపమై బాష్పాలు ప్రవహించి వస్తాయి అనుకుంటూ ఆమె రాగం ప్రస్తారము చేస్తూనే వుంది. ఆమె తన కంఠం పూర్ణంగా వికసితంచేసి మూడు స్థాయిలలో పాడుకుంటూ తన గాన సౌందర్యానికి తానే మైమరచిపోయేది. ఆమెకు లోకమంతా సంగీతమయమా అని ప్రశ్న ఉదయించేది. చప్పుడు చేయవు అని అనుకొనే కదలికలలో కూడా ఏవో అస్పష్టరాగాలు ధ్వనిస్తూనే ఉంటవి. నిట్టూర్పులో పున్నాగవరాళి ఉన్నదా? సాయంకాలపు మలయమారుతంలో మలయమారుతమే వున్నది.

సంగీతంతో సాహచర్యంవల్ల, గాంధర్వ పీఠాన్ని ఆర్జించడంవల్ల పద్మావతికి పగటికలలు ఎక్కువ కాసాగాయి. వాస్తవిక ప్రపంచముకన్న భావనాలోకం ఆమెకు ఎక్కువ నిజం కాసాగినది. వాస్తవిక ప్రపంచంలో అన్నీ అపశ్రుతులే. ఒక అపశ్రుతిని శ్రుతిగా దిద్దుకొనేటప్పటికి ఇంకొక కొత్త అపశ్రుతి దాపరిస్తుంది. జీవితం నిత్య శోభనమయం చేసుకోవాలంటే నిత్య జాగరూకత అవసరంకదా?

పద్మావతికి పెళ్ళినాటి భర్త వేరు. ఈనాటి భర్త వేరు. ఆనాడు తాను పద్దాలు. తన భర్త బుచ్చి వెంకులు. ఇద్దరూ కలిసి తిరుపతి కొండ మెట్లు ఎక్కుతూవుంటే ఆమెకు తాను ఒక పర్వతం ముందర ఎక్కినట్లయిపోయింది. తన భర్తను ఇంకా చేపల వాసన పొదివి కొన్నట్లే వున్నది.

నిద్రపోతూ గురక కొడతాడు. అతనికి లలితంగా ప్రణయ వాక్యాలు పలకటం చేతకాదు. లాలించలేదు. అనునయించలేడు.

నిజమే! డబ్బు గడిస్తూన్నాడు. ఏ సిల్కు ఆర్టుపాలెస్‌లోనో, ఏ భాలుసామి అయ్యర్ షాపులోనో చక్కని బెంగుళూరు చీరలు, బెనారస్ పట్టుచీరలు, ఖద్దరు సిల్కు అద్దకం చీరలు, వెంకటగిరి ఒరయూరు, కోయంబత్తూరు, పుల్లపాడు నూలు నేత చీరలు బుచ్చి వెంకట్రావు కొనుక్కువచ్చి భార్యకు బహుమతులు ఇస్తూ వుండేవాడు. సెకండుహ్యాండ్ హిల్‌మన్‌మింక్స్ కారు కొన్నాడు. భార్యను సినిమాలకు తీసుకొని వెళ్ళేవాడు. బీచికి వాహ్యాళికి తీసుకువెళ్ళి భార్యతో పాటు సముద్రపు వొడ్డున కూర్చునేవాడు.

ఆమెలో అసంతృప్తి, తొలకరివర్షం చినుకులు భూదేవి హృదయంలోకి ప్రసరించి వచ్చినట్లు ప్రవేశించింది. ఈ జీవితంలో తనకేమి లోటున్నది? భర్త తనకున్న కోరికలనన్నిటిని నెరవేరుస్తున్నాడాయెను. బాగా సంపాదిస్తున్నాడు. బాగా ఖర్చు చేస్తున్నాడు. తన జీవితం యేదో ఓ వున్నత పథాలకు యెక్కి వెళ్ళేందుకు అతడు మెట్లు నిర్మిస్తున్నాడు, కాని దాక్టరు మూలం కనుక్కోలేని రోగికి కారణం తెలియలేని చిన్న రోగంలా, ఆమె జీవితంలో అసంతృప్తి ప్రవేశించింది. మృగశిరా కార్తె రాగానే ఆకాశంలో చిన్న చిన్న

కారుమేఘాలు మూలమూలలగా ప్రయాణించి వచ్చినట్లు ఆమె హృదయం మారుమూలలా అసంతృప్తి చొచ్చుకు వచ్చింది.

ఆమెలోని స్త్రీత్వము నూతనపరిణామం పొందుతున్నది. ఆమె చదివిన చదువులలో జీవితానికి నూతనార్థాలు పొడసూపినవి. రాత్రిళ్ళు తన ప్రక్క నిద్దరపోయే భర్త ఆమెకు ఎవరో క్రొత్తవానిలా గోచరింప ప్రారంభించినాడు. ఇన్నాళ్ళు ఇరువురి జీవితాలు ఒకటిగానే ప్రవహించి వచ్చినవి. ఆమెకు అతడు జీవిత సర్వస్వము. ఒకనాడు తన జీవితానికి పరమేశ్వరుడై తన ప్రపంచానికి చక్రవర్తియై తన ఆలోచనలు, హృదయము, ఆశయాలు, నిండియున్న తన ప్రాణసర్వస్వము, అణువు అణువున నిబిడించియున్న యీ పురుషుడు, ఈ రోజులలో ఎందుకు తనకు క్రొత్తవాడవుతున్నాడో?

## (2)

ఒకనాడు పద్మావతీ బుచ్చి వెంకట్రావూ ఎన్నూరు వైపుకు కారుమీదపోయి వస్తున్నారు. అతనికి ఎన్నూరులో ఏవో కొన్ని చేపల విషయం కనుక్కోవలసి వచ్చింది. ఈనాడు ఆ ఎండిపోయిన ఉప్పుచేపల వాసన పద్మావతి భరించలేకపోయింది. ఆమెకు తల తిరిగి వాంతి వెళ్ళిపోయింది.

బుచ్చి వెంకట్రావు కంగారుపడిపోయి మంచినీళ్ళు ముఖం మీద చల్లి యెత్తుకు తీసుకొని వచ్చి కారులో పడుకోపెట్టి, ఇంటికి తీసుకొని వచ్చినాడు. డాక్టరు వచ్చి మందు ఇచ్చినాడు. కొంచెం సేపటికి ఆమెకు బలము వచ్చి మామూలు మనిషి అయినది.

తన జీవితం ముందుకు సాగివచ్చిన వేగంతో తన భర్త జీవితం ముందుకు సాగిరాలేదు. అతని రూపమే కర్కశమై ఆమెకు కనుపించినది. అతని చుట్టూ ప్రసరించియున్న గంధమే నేడామెకు భరింపరాని దవుచున్నది. అతని మాటలలో అపశ్రుతులూ, అపస్వరాలు స్వచ్ఛజలాలతో ప్రవహించివచ్చే శైవాలినిలో రాళ్ళు దొర్లుకు వస్తున్నట్లనుకొని, పద్మ భరింపలేనని భావించింది.

ఆమె అతనితో ఏకశయ్యాగతురాలు కాలేకపోయినది. ఆ భావమే ఆమెకు నానాటికి దుర్భరమైపోయింది. ఏదేని వంకతో ఆమె తనకు వేరే పడక ఏర్పాటు చేసికొన్నది.

"అదికాదు బావా! వంట్లో అంత బాగుండడంలేదు."

"ఏమిటి జబ్బు! డాక్టరుగారు చెప్పినమందు పుచ్చుకోవు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూవుంటావు. నవ్వులతో ఎప్పుడూ కలకలలాడే నీ ముఖము వానలు కురవని పొలంలా బిగుసుకుపోయి ఉంటున్నది. నిజంగానే వంట్లో బాగుండటము లేదా? నీకు చీరలు కావాలా, నగలు కావాలా? పద్మా నీవు ఏదో మారిపోతున్నావు"

"నా వంట్లో బాగుండటములేదు బావా, తిండి తిన్నగా సహించటములేదు. వళ్ళు అంతా నొప్పులుగా ఉంటున్నది. రాత్రిళ్ళు నిద్రపట్టదు."

"రా వెంటనే డాక్టరుగారి దగ్గరకు వెళుదాము. ఇలాంటివి అశ్రద్ధ చేస్తే కొంపలు ముంచుకువస్తాయి. అప్పుడు ఏమి అనుకున్నా ఏం లాభంలేదు."

"నా వంట్లో కొంచెము నలతేతప్ప డాక్టరుని చూడవలసినంత అవసరములేదు. నువ్వు వట్టి కంగారు మనిషివి."

ఏమైనా బుచ్చి వెంకట్రావు హృదయంలో ఏదో భయం ప్రవేశించింది. ఎప్పుడూ నిర్మలమైన హృదయంతో చంటిబిడ్డలా ఆడుకొనే తన పద్మావతి ఏమిటి ఇలా అయిపోతున్నది? నిజంగా దాని వంట్లో పెద్ద జబ్బు ప్రవేశించిందేమో! ఏలాగా? డాక్టరు దగ్గిరకురాదు; కనుక దిట్టమైన డాక్టరును ఒకరిని ఇంటికే తీసుకొని వచ్చి పద్దాలుని పరీక్ష చేయించడం మంచిది.

ఆ మర్నాడు ఉదయం డాక్టరు లక్ష్మి అనే ప్రసిద్ధి వహించిన వైద్యురాలిని బుచ్చి వెంకట్రావు తీసుకొని వచ్చినాడు. ఆమె పద్మావతిని పూర్తిగా పరీక్ష చేసినది. జ్వరం రావటం లేదాయెను. ఒళ్ళు నొప్పులు మామూలేగాని, ఎచ్చటా ఎక్కువగా నొప్పిగాని పోటుగాని లేదాయెను. మొదట డాక్టరు లక్ష్మి బుచ్చి వెంకట్రావు మాటలు విని ఆమె గర్భవతేమోనని అనుకున్నది. అదీలేదు. ఇంక ఏమిటి?

పద్మావతికి వంట్లో ఏ విధమైన జబ్బూ లేదని నరములు నీరసించి యుండవచ్చునని మానసికమైన వ్యథ ఏదో ఆమెకు తెలియకుండానే ఉద్భవించి యుండవచ్చునని డాక్టరు లక్ష్మి బుచ్చి వెంకట్రావును వేరే తీసుకొని వెళ్ళి చెప్పినది. అతణ్ణి ఆమెను సర్వదా సంతోషము కలిగేటట్లు చూడమని ఆమె నొక్కి చెప్పినది.

పద్మావతిని చూచి డాక్టరు లక్ష్మి, "పద్మావతమ్మ గారూ, శరీర సంబంధమైన జబ్బు ఏదీలేదు. కాని కొంచెం నరాలు నీరసించాయి. సరదాగా ఉంటూ ఉండండి. ప్రస్తుతం సంగీతం నేర్చుకోవడం ఆపి, నాలుగురోజులపాటు కాలక్షేపం చేయండి. రెండు మందుల పేర్లు మీ ఆయనకు వ్రాసి ఇచ్చాను. అవి పుచ్చుకునే విధానమూ వ్రాసి యిచ్చాను. ఒక్కొక్కటి రెండేసిబుడ్లు చాలు. మీవంటి సంగీత పాఠకులు ఎంతో ఆనందముగా గడపవచ్చునుకదా! సాయంత్రమపుడు మా ఇంటికి రండి. కొంతసేపు రోజూ కులాసాగా కాలక్షేపం చేయవచ్చును." అని సలహా ఇచ్చింది.

పద్మావతి మందులు పుచ్చుకుంటున్నది. కాని ఆవిడ జబ్బేమీ నెమ్మదించినట్లు లేదు. రాత్రిళ్ళు నిద్రలేక కూర్చోవడం సాగించింది. ఒక్కొక్కప్పుడు ఊరికే ఎక్కి ఎక్కి ఏడవడం, కొంచెం పని సరిగా జరగలేదనుకున్నా విపరీతమైన కోపం రావడం, చేతిలో ఏముంటే ఆ వస్తువుని నేలకేసి గట్టిగా బద్దలకొట్టడం, చీరలు, రవికెలు చింపుకోవడం. గబ గబా తల బాదుకోవడం ఆవహించాయి.

బుచ్చి వెంకట్రావు భయపడి దయ్యము పట్టుకుందేమోనని అనుమానపడి, కావలి తనవాళ్ళకు టెలిగ్రాము ఇచ్చాడు, అత్తగారు, మామగారు, తన తల్లిదండ్రులు, ఇంకా ఇద్దరు ముగ్గురు చుట్టాలు చెన్నపట్నం చక్కావచ్చారు.

చింతాద్రిపేట నుంచి దయ్యాల మంత్రగాడిని తీసుకువచ్చారు. పద్మావతికి మరీ మతిపోయింది.

"ఏమిటండీ మీ గొడవంతానూ! మీకన్నా మతిలేదు. నాకన్నా మతిలేదు. నాకు దయ్యం పట్టడమేమిటి? ఎందుకు బాధపడుతున్నానో నాకు తెలియదు. మనసంతా పాడైపోయింది. ఇలా దయ్యాలనీ, దేవతలనీ, కుళ్ళుచేపలలో పొర్లాడే మనవాళ్ళ పిచ్చి భావాలన్నీ ఇంకా మిమ్ములను పట్టుకుని వేళ్ళాడుతూనే వున్నాయి. ఇవన్నీ ఇంతటితో

ఆపుచేయండి. లేకపోతే నేను నిజంగా ఏ సముద్రంలోనో పడిపోతాను" అని పద్మావతి భర్తతో కేకలువేస్తూ ఒకరకంగా ఏడుస్తూ చెప్పింది.

ఆంధ్ర మహిళా సభ కార్యదర్శిని పద్మావతికి "నాలుగు రోజుల పాటు మహిళా సభలోనే మకాము పెట్టండి పద్మావతిగారూ! పిల్లలతో, ఈ మాష్టర్లతో కాస్త కాలక్షేపం జరిగి మీ మనస్సు నెమ్మదిస్తుంది" అని సలహా యిచ్చింది. ఆ సలహా బుచ్చి వెంకట్రావుకు నచ్చింది, వాళ్ళ చుట్టాలందరు బాగుందన్నారు. పద్మావతి వచ్చి మహిళాసభ హాస్టలులో చేరింది. ఇదివరకల్లా విద్యార్థినిగా వుండనే వుంది.

## (3)

ఆంధ్ర మహిళాసభలో చేరిన దగ్గరనుండి పద్మావతి నెమ్మది నెమ్మదిగా శాంతించి ఆమె హృదయంలో ఏమూలనో దాగుకొనివున్న భయాలు మంచువలె మాయంకాసాగాయి. ఆ భయాలకు కారణమైన పరిస్థితులు ఆంధ్ర మహిళాసభలో లేవుకదా?

తాను తన భర్తతో ఏకశయ్యాగతురాలు కానక్కరలేదు. హాయిగా ఏ విధముగా పురుషుని సంపర్కములేని ఒక నిశ్చలత్వము ఆమెకు ఆంధ్ర మహిళా సభలో దొరికినది. తోడుగా చదువుకునే బాలికలుగాని ఇతరులుగాని అతి తెలివితేటలుగా మాట్లాడుతారని కాదు; ఆధ్యాత్మిక చింతన చేసినవారు అక్కడ వున్నారనే కాదు; ఇన్నాళ్ళనుంచీ ఏ చిత్తవృత్తి తనలో వృద్ధిపొంది తనకు శాంతము దూరము చేసిందో ఆ చిత్తవృత్తికి కారణాలైన పరిసరాలనుంచి ఆమె విడివడి రావడమే పద్మావతికి శాంతం చేకూర్చింది.

సాయంత్రం వాళ్ళందరు సభకు ముందున్న తోటలో చేరి కథలు చెప్పుకుంటూ వుంటె తాను "ఊ" కొట్టేది, తనకు తెలిసిన కథలు చెప్పేది. వాళ్ళతో ఉయ్యాలలూగేది. కారమ్సుబోర్డులో పందేలు వేసేది. డాక్టరు లక్ష్మి బుచ్చి వెంకట్రావుతోను పద్మావతితో కూడా వాళ్ళిద్దరూ కొన్నాళ్ళపాటు విడిగా వుండటమే మంచిదని సలహా ఇచ్చింది.

బుచ్చి వెంకట్రావు ధనవంతుడు. ధనం తేనెవంటిది. తేనె ఈగలను ఆకర్షిస్తుంది. ధనం ఒక రకమైక ఈగజాతి మనుష్యులని ఆకర్షిస్తుంది. వెంకట్రావుకు స్నేహితులకు కొదవేమిటి? మనుష్యులలో ధనము సంపాదించేవాళ్ళు మూడు జాతులుగా తయారవుతారు. ధనం ఇంకా కావాలనుకునేవారు. వాళ్ళు ధనం పోగుచేయడంలో ఆనందం. ధనం పెంచడంలో పరమార్థం ధనం పెరగడమే. రెండో రకం వాళ్ళు తాము సంపాదించిన ధనం, తాము సంతృప్తిగా అనుభవించాలని కోరుకుంటారు. మూడోరకంవారు తాము సంపాదిస్తూన్నట్లు లోకానికి తెలియాలి. తమ ఐశ్వర్యము చూచి లోకం దిగ్భ్రమ చెంది అసూయపడిపోవాలి. అది వారి కానందం.

బుచ్చి వెంకట్రావు యీ మూడు రకాలుగా కూడా ఆనందపడేవాడు. భార్య చక్కని నగలతో, అందమైన చీరలతో దేవలోకంనుంచి తిలోత్తమలా దిగివచ్చినట్లు కనబడుతూ తనతోపాటు సినిమాలకు రావడం, బీచికి రావడం ఎంతో ఆనందంగా వుండేది. ఏ మాత్రమూ బొద్దుకాకుండా చిన్ననాటి అంగసౌష్ఠవమూ పరిపూర్ణత పొందిన శరీర సౌందర్యము కలిగి, లావణ్యమును అమృతధునీ సంగమమొంది, పద్మావతీ నేడు ఎల్లోరాలోని ముప్పది నాలుగవ గుహలోని శచీదేవి విగ్రహంలా వున్నది.

అలాంటి భార్య ఈనాటి కాతనికి దూరమైనది. ఆమెకు స్వకీయమైన పరిమళము ఆమె తన ప్రక్క నిదురపోవునప్పుడు. మేలుకొని తన్ను లతలా చుట్టివున్నప్పుడు. తనతో సమంగా నడిచి వచ్చేటప్పుడు తన అంకాసనం అలంకరించి ఉన్నప్పుడు తన్ను పొదివికొని పోయినప్పుడు. ఆ సురభిళము తన జీవితంలో ఒక భాగమైనదది. ఆ సుగంధము నేడు తనకు దూరమైపోయింది.

ఏమి జరిగినది? ఎందుకు తనకామె ఇలా దూరమైపోయినది? ఆనందపూర్ణమైన తమ దాంపత్య పూర్ణిమను నేడు ఏ రాహుగ్రహము మ్రింగివేసినది? పుష్పానికి పరిమళంలా తన చిన్నారి భార్యకు సంగీతము, నేడా సంగీతము ఆమెను ఎచ్చటికో లాక్కొనిపోతోందా? చిన్ననాటినుంచీ ఆ బాలిక తనకు వేయి తిమింగిలాల బలం సమకూర్చేదికదా? ఆమె చూపుల రక్షణలో సముద్రపు మొసళ్ళన్నా భయపడక, అతివేగంగల ప్రవాహాలన్నా భయపడక ఎన్నిసార్లు తాను సముద్రంలో ఉరకలేదు!

తనకు చదువువస్తూ కవిత్వము అర్థమయ్యే ఈ రోజుల్లో ఆమె తనకు వేయికాంతులతో దర్శనమిచ్చే ఈనాడు, ఆమె పెదవులలో ఉద్భవించిన కాంతులలో నూరవపాలు ఎరుపులలో నుండి పగడాలు పుట్టివుంటాయి అని అనుకున్నాడు. ఆమె నవ్వితే తళతళలాడే పళ్ళ తళుకులలో నూరవపాలు ధగధగలోంచి ముత్యాలు పుట్టాయి అనుకున్నాడు. దట్టంగా, నల్లగా, ఒత్తుగా, పట్టులావున్న ఆమె జుట్టు చీకటిలోనుండి నూరవపాలు నిగనిగలు సముద్రపు లోతులై వుంటాయని బుచ్చి వెంకట్రావు సరిపోల్చుకునేవాడు.

పద్మావతి ఎందుకు వెళ్ళినట్లు? తానేదోషము చేసినాడు? ఆమె మనస్సు చెడిపోలేదుకదా? ఆమె ఎడబాటు నానాటికి అతనికి భరించరానిదై పోయినది. సినిమాలకు వెళ్ళేవాడు. కథలు అర్థమయ్యేవి కావు. అప్పటికింకా మద్రాసు నగరంలో ప్రొహిబిషన్ రాలేదు. బుచ్చి వెంకట్రావు బసోటోకో, కాన్మెరాకో పోయి కొంచెం ఘాటైనవి ద్రాక్షసారాయి, బీరులు, విస్కీలు, బ్రాందీలు వగైరాలు మొదట సోడాలో కలిపి, ఆ తరువాత ఏమీ కలుపకుండా సేవించడం ప్రారంభించాడు. తన పనియందు శ్రద్ధ తగ్గిపోయినది. జాగ్రత్త తక్కువయ్యేటప్పటికి అతని కంపెనీ వ్యవహారాలు చిక్కులుపడసాగినవి.

అతని పురుషత్వము స్త్రీ స్పర్శను సర్వకాలము కోరే గాఢవాంఛతో నిండినది. స్త్రీ శరీర సంచలిత సౌరభాలు ఆఘ్రాణించక ఒక్క నిమేషమైన అతడు మనలేకపోయినాడు. ఇంతవరకూ అతని ప్రపంచము అతని భార్యే, నేడు ఆ ప్రపంచము శూన్యమై పోయింది.

## (4)

పద్మకు కలలో ఎన్నిసార్లో భర్త కనబడేవాడు. ఆ కలలు ఒక్కొక్కప్పుడు, హృదయ బాధాపూర్ణమైన సంఘటనలతోనూ, ఒక్కొక్కప్పుడు ఉత్సాహసమ్మిశ్రితానుభవ యుక్తంగానూ ఉండేవి.

ఎలా వచ్చింది తనకీ బాధాపూర్ణమైన పరిణామం? ఎందుకు? ఏ మార్గాల తన జీవితం ప్రవహించబోతున్నది? ఎంతవరకు? ఏదికోరి? దైవమనుకొన్న భర్తను

వదలిపెట్టుకోగలిగిందే! తన చిన్ననాటినించీ తనతో ఆడుకొన్నవాడు, లోకం అందిచ్చే చేతులు పట్టుకొని, తనతోపాటు అతడున్నూ పైపథాలకు నడచి వచ్చాడు కదా? ఏ జీవితం జీవిస్తే ఆ జీవితాన్ని సమగ్రంగా అందిపుచ్చుకొని, దృఢమైన నడకలు వేయగల ధీమా గల్గిన మనిషి! అతనికి చేపల పేర్లన్నీ తెలుసు, వాటి గుణగణాలు తెలుసు. వాటి జీవిత విశేషాలన్నీ తెలుసు. సముద్రపు మొసలి (షార్క్) కాని, టేకిచేపగాని, తూరగాని, ఎదుట వచ్చినప్పుడుగాని, పడవని ఎదుర్కొన్నప్పుడుగాని వాని బారినుండి ఎలా తప్పించుకోవాలో, కూడా వుండే శూలబల్లెంతో వాటిని ఎలా హతమార్చాలో అతనికి పూర్తిగా తెలుసు.

తన్ను పడవలో తీసుకువెళ్ళేవాడు! అతడు తెడ్డువేస్తే తాను తోలవేసేది. అతడు తెరచాప ఎత్తి చుక్కాని కోలవేస్తూ వుంటే తాను డామాను దగ్గర కూర్చొని.

"ఏ దిక్కు పోతాదో
ఈ కదలి మన పడవ
ఆ తీరమేలేని
ఆకాశమే నీరు ॥ఏ దిక్కు॥

పై కెగసి వాగులో
పల పాల తుంపర
నీ రాల బయలులో
దారడిగి దారంది ॥ఏ దిక్కు॥

తెరచాప రెక్కలతొ
తెల్ల పులుగై పడవ
మన వలపు రేవునకు
మనల నిరువుర చేర్చు ॥ఏ దిక్కు॥

అని పాడుతూ ఉంటే తన బావ తన్ను చిరునవ్వులతో చూస్తూ తానూ ఒక పాట ఎత్తుకునేవాడు.

"వాగువాగులు కలిసి సాగు దారుల యెంట
వాగు వడిలో తేలి వడివడిగ మన పడవ
నా ముందు నీ నవ్వు నా ఎనకనా నువ్వు
ఈ పడవ తెరలెత్తు మన బ్రతుకు దవుదవ్వు.

❀ ❀ ❀

# చతుర్థ గుచ్ఛము

ఏమీ తెలియనివాళ్ళ జీవితమే ఆనందమయము. సముద్రంలో ఏరు కలిసేచోట, బెస్తలపల్లెలో ఏటిలో పోటూ పాటులూ, సముద్రం కెరటాలూ, ఆటలాడుకునే యిసుక వొద్దుల్లోనే, తాను బుచ్చి వెంకులుగా వున్న నాటి జీవితమే ఏ దిగులూ లేకుండా, ఏ పొగులూ తగలకుండా జరిగిపోయింది. వేసవిలో సాయంకాలం సముద్రదూరాలనుంచి వచ్చే చల్లగాలిలా హాయిగా వుండేది. చేవపారిన కొబ్బరిమానుల్ని ఏటిలో ఈ దరినో ఆ దరినో, నిట్రాళ్ళుగా పాతి, పోటులో వలలుగట్టి, పాటులో చేపలను పోగుచేసుకొనే ఆనందం, బంగారు నాణాలను ప్రోగుచేసుకొనేటప్పుడేనా దొరకదు కదా! ఈ ఆలోచనలు బుచ్చి వెంకట్రావు హృదయంలో మేఘాలై కమ్ముకు వచ్చాయి. పద్దాలు ఎంత ఒదుపుగా చేపలను పట్టుకొనేది. ఔను తను గడగాలం వేసి, కాచుకుని వుంటే, గంటలు గంటలు ఇంత చిన్న చేపైనా తన గేలం ముల్లుకు తగిలేదా ఏమన్నానా? ఇంతట్లో పద్దాలు పరుగు పరుగున వచ్చి "బావా! ఎన్ని చేప లట్టినావు? ఏంది! ఒక్క సేపయినా గాలానికి తగల్లేదేం? సూసుకో నే మంత్రంబెట్టి ఎన్ని సేపల్లాగేస్తానో! హామ్. మాంకాళీ హూం మాంకాళీ ఓ యీ శెదుసేపా పడవే" అంటూ గేలంగెడ చేత్తో పుచ్చుకొని తన అందమైన చేతులతో యిటూ అటూ కదిపేటప్పటికి జఱ్రని గేలం తాడు బిగువెక్కేది. "ఓ చేప పడింది. తాడుకి కట్టిన బెండు మునిగిపోయింది. "తే! యిలాతే! నువ్వు లాగవే"వని తాననేవాడు: "ఓ లాగేయి, అబ్బో దిట్టమైన చేపే! నన్నే లాగేస్తున్నది" అన్నాడు. ఇద్దరూ పట్టి నెమ్మదిగా వెనక్కి నడుస్తూ ఒక సరివిచెట్టు వూతపట్టుకుని ఒక మూరన్నర "పంజరం" చేపని యివతలకు లాగారు! ఎంత తెలివితో పద్దాలు ఆ చేపను ఒడిసిపట్టుకొందీ! తామిద్దరూ కలిసి ఎన్నిమార్లు చందువా చేపలూ, సొరలూ, సముద్రపు పెద్దరొయ్యలూ, పండుగొప్పులూ, సావిడాయిలూ, నెత్తళ్ళూ అతినేర్పుతో పట్టుకొని ఆనందపడలేదు!

ఆ తీయతీయని దినాలు వెళ్ళిపోయాయి. తమ జీవితంలోంచి చేపల వాసన పోయింది. కొత్తగా వచ్చిన శాండల్ వుడ్ సబ్బు వాసనా, పేరీస్ సెంటుల పరిమళాలూ శ్రుతులు కలియక, తెచ్చుకోలు మాయై, ఎరువులు సొమ్ములైనట్లు కదా!

ప్రపంచ జ్ఞానంవల్ల ఇదివరకు ఎరగని విషయాలు, జీవితంలో క్రొత్తగా ప్రవేశిస్తాయి. ఈ చెన్నపట్నం బ్రతుకు ఎప్పుడూ ఆగని గందరగోళంతో, తగ్గని వేగంతో, అంతులేని కాంక్షలతో నిండి వుంది. కోరి అంతు తెలియరాని దుఃఖాలు తెచ్చిపెట్టుకున్నాడు తాను.

అతని ఆరోగ్యం చింది, జలజల కండల పొంకాలు విరిగి ఉంది. అతని బలం సముద్రం కెరటాలులా ఉప్పొంగుతూ ఉంటుంది. అతని స్త్రీవాంఛ ఉత్తమ మానవనైజ ధర్మపూర్ణము. ఎన్నడూ అది అతిగా ఉండలేదు. ఉత్తమంగా ఆరోగ్యవంతమై ఉండేది. నేడాతని సహధర్మచారిణి తన్ను ఒంటిగా వదిలి వెళ్ళిపోయింది. తన బ్రతుకు చుక్కాని పోయిన నావలా అయింది. ఈ వాగుల్లో, వేగమైన ప్రవాహాల లాగుడులో, తన నావ మునిగిపోవునో, ముక్క లవునో!

అతడు తన మనసులోని బాధను చంపుకోడానికై తన కులస్థులు నివసించే చేరీలలోనికి వెళ్ళేవాడు. ఎంత దుర్భరమైన జీవితం జీవిస్తున్నారు. వాళ్ళు గట్టిగా కాళ్ళు చాపుకుంటే మనిషి పట్టనంత చిన్న స్థలాల్లో కట్టుకొన్న గుడిసెలలో కాపురాలు - పరిసరాలు ఎన్నో కల్మషాలు కూడుకున్న ప్రదేశాలు. ఇంత పెద్ద చెన్న పట్టణంలో జీవిస్తూ ఒక్కరైనా సినిమాకు వెళ్ళి చూడగలుగుతారా? ఆఖరికి చీనాబజారులో, రోడ్డు ప్రక్కన పెట్టుకొని అమ్మే వస్తువుల్లో ఒక్క అణా సరుకైనా కొనుక్కొని ఆనందించగలరా! ఒకనాడైనా వారు కాఫీ హోటలెరుగుదురా! సంగీతం కచ్చేరులంటే ఏమిటో వారికి తెలుసా? ఎందరి జీవితాలలో నాట్యాలు నిండిపోయి ఉన్నాయి! కాని ఒక్క నాట్య ప్రదర్శనానికై యీ చుట్టాలు, యీ ప్రజలు, యీ బెస్తలు, యీ చేపలు పట్టుకునేవాళ్ళు వెళ్ళగలరా? సముద్రపు ఒడ్డున చిన్న పీతలులా బ్రతుకులే ఏనాటికీ వాళ్ళకి రాసివున్నాయా అనుకున్నాడు.

ఎక్కడ చూచినా వలలు - చేపలు వుంచుకునే బుట్టలు! గేలాలు! కుళ్ళిపోయిన చేపల వాసన!!

ఏనాటికైనా యీ చేరీలు, తీర్చిన వీధులలో, తోటల మధ్య ఉన్న సొగసైన యిళ్ళతో, శుభ్రమైన బట్టలు కట్టుకొని ఆడుకొనే పిల్లలతో పొందికగా అలంకరించుకొని కళ్ళల్లో కాంతులు వెలుగుతూవుండగా ఆరోగ్య దేవతలులా నడిచిపోయే స్త్రీలతో కలకలలాడి పోగలవా! తెచ్చిన చేపలు ఉంచేందుకు, వాటిని బుట్టలు కట్టేందుకు, తర్వాత ఎగుమతి చేయడానికి వేరే ఒకటి ఫ్యాక్టరీలాంటి కర్మాగారం వుండవచ్చు గాక! అలాంటి సంస్థను శుభ్రంగా, శాస్త్రయుక్తంగా వుంచవలసి వుంటుంది. కర్మాగారానికీ, ఆ కర్మకూ జనకులైన బెస్తల జీవితానికి ఇతర సంబంధమేమీ వుండకూడదు. వస్త్రాల ఫ్యాక్టరీలో పనిచేసేవారి యిళ్ళలో దూది పడివుంటుందా?

అతడు గాలివానంత నిట్టూర్పు విడిచాడు.

## (2)

ఆంధ్ర మహిళాసభ విద్యార్థినులందరు కలిసి వారి ఉపాధ్యాయినుల ఒద్దికలో ప్రత్యేకం బస్సు ఒకటి కాంట్రాక్టు తీసుకొని, మహాబలిపురం వెళ్ళారు. బాలికలందరూ కలకలలాడుతూ ఆ ప్రదేశమంతా నిండిపోయారు. బొమ్మలు చూస్తున్నారు కొందరు. ఒక్కొక్క శిలతోటే నిర్మాణం చేసిన చిన్న ఆలయాలైన శిలా రథాలకడకు పరుగిడిపోయారు కొందరు. కొందరు సముద్రతీరం దగ్గర వున్న దేవాలయానికి పరుగెత్తారు. భీముని పొయ్యి చూశారు. అర్జునుని తపస్సు ఆశ్చర్యం పొందుతూ గమనించారు. వేణుగోపాలుని వెన్నముద్ద చూశారు.

వాళ్ళకి శిల్పరహస్యాలు అర్థమయ్యాయి అని కాదు. పల్లవ శిల్ప విశిష్టత తెలిసిందనికాదు! శిల్ప సౌందర్యమే వారిని హత్తుకొన్నది. ఆ ప్రదేశముయొక్క మంత్రశక్తి వారందరిని ఆవహించింది. ఏ యుగాలనాటి అనుభూతులో, ఏ మహాశిల్పుల దివ్యస్వప్నాలో ఆ ప్రదేశం నిండా నిండి, ఆ క్షేత్రానికి వచ్చిపోయే యాత్రికుల హృదయాలను స్పృశిస్తాయి.

పద్మావతి దేశాలు తిరిగింది. కంచిలో కామాక్షీ, ఏకామ్రేశ్వరుడూ, వరదరాజూ; తంజావూరులో బృహదీశ్వరుడూ, పెరినాయకీ, చిదంబరంలో నటరాజూ, శివకామసుందరీ; శ్రీరంగంలో రంగనాయకుడూ, లక్ష్మీదేవి; మధురలో మీనాక్షి, సుందరేశ్వరుడూ; రామేశ్వరంలో రామలింగస్వామి, పర్వతవర్ధనీ ప్రత్యక్షమయ్యారు. ఆ పవిత్ర క్షేత్రాలలో భక్తుల ఆనందం ఆమె హృదయానికి పులకరింపులు కలుగజేసింది.

ఇంక ఈ శిల్పక్షేత్రాలేమిటి? పూజలుపోయినా శిల్ప సౌందర్యం ఉంటే. ఆ విగ్రహాలు మనుష్యులకు కళానందం కలిగిస్తాయని మహిళా సభలో కొందరు కళా విద్యార్థినులు అంటూ వుంటారు. దేశం అంతా ఇట్లాంటి క్షేత్రాలెన్నో ఉన్నాయట. ఎల్లోరా, అజంతా, నాగార్జునకొండ, హంపీ, లేపాక్షి, అనుమకొండ, ఒరంగల్లు, సాంచీ మొదలయిన క్షేత్రాలెన్నో ఉన్నాయట. ప్రసిద్ధికెక్కిన దేవతల గుళ్ళల్లో కూడా ఎన్నో ఉత్కృష్టమైన శిల్పాలు ఉన్నాయట. శిల్ప క్షేత్రాలలో ఈ మహాబలిపురం ఒకటి అన్నారు. ఈ విగ్రహాలన్నీ అదో అందం కలిగిఉన్నట్టు ఆమెకు తోచింది. శిల్పం అన్నా, చిత్రలేఖనం అన్నా తన ఉద్దేశాలు ఇదివరకు వేరు. దేశం అంతా గాంధీ విగ్రహాలు వెలిశాయి. అవే శిల్పాలనుకొంది. మదరాసులో కొందరి తోటల్లో, సిమెంటు చేసిన సింహం, కుస్తీపట్టేవాడు, బంట్రోతు మొదలైన విగ్రహాలే నిజమైన శిల్పం అనుకొన్నది పద్మావతి. చిత్రలేఖనాలు అంటే బజారులో దొరికే అచ్చుబొమ్మలనే ఆమె ఉద్దేశం.

దారిలో తిరుక్కలికుండ్రంలో ఆగి ఆ పక్షి తీర్థం చూశారు వారంతా. తామంతా సర్దాగా కొండ ఎక్కారు. దారిలో అల్లర్లు చేశారు. ఆడుకున్నారు. పాడుకొన్నారు. కొండమీదికి వెళ్ళిన వెనక పూజారి పక్షులను పిలవడం అవి రావడం; ప్రసాదం ఆరగించడం, మళ్ళీ దేని దిశకు అవి వెళ్ళిపోవడం ఆ దృశ్యాలు పద్మావతి కెంతో ఆనందం కలిగించాయి. ఒక పక్షి కాశీనుండి వస్తుందట – ఇంకొక పక్షి రామేశ్వరాన్నుంచి వస్తుందట.

ఆ పక్షులు మొదట ఏ అనంత నీలాల్లో నుండో ప్రత్యక్షమయ్యాయి. ఆకాశంలో గాలిపడగల్లా తేలుకొని వచ్చాయి. తన మనస్సు తిరిగిపోయినట్లే ఆ రెండు పక్షులు వాలుతూ గిరగిరా తిరిగినవి. తేలుకొని దేలుకొని వచ్చి పక్షులు పూజారికడ వాలినవి.

కొందరు ఉపాధ్యాయినులు ఇదంతా హుళక్కి అన్నారు – "ఆ పక్షులు ఆ చుట్టు ప్రక్కలనే కొండలలో ఉంటాయి. సరిగ్గా, భోజనం వేళకు అవి వచ్చి వాల్తాయి!" అంది సైన్సు ఉపాధ్యాయిని.

"అయితే ఈ చుట్టుప్రక్కల వున్న అన్ని గరుడ పక్షులూ ఎందుకు రాకూడదండీ!" అని పద్మావతి ప్రశ్నించింది.

"వాటికి భయం!"

"వీటికెందుకు లేకపోయింది?"

"వీటిని పెంచి ఈలా అలవాటు చేసి ఉంటారు!"

"ఈ పక్షులు ఎంత పూర్వకాలంనాటివో?"

"ఒక జత ముసలివైపోగానే ఇంకో జతను తయారుచేస్తారు!"

ఈ సంభాషణ అంతా వింటూవున్న ఇంకో ఉపాధ్యాయిని వీరిద్దరి దగ్గరకూ వచ్చి కూచుంటూ, "ఒక మహా భావాన్ని ఎంత ముక్కలు చేశావమ్మా మాలతీ?" అని అన్నది.

"ముక్కలు చేయడమేమిటి ఇందిరగారూ? భావం ముక్కలు అవడమేమిటి?"

"అవును, భావం ముక్కలవడమేమిటి? భావం రబ్బరు ముక్కలు కాదులే! గాజు సామాను ముక్కలౌతుంది. ఎంత శాస్త్రజ్ఞురాలివి. కలలు విచ్ఛిన్నం కావూ? ఆశయాలు భగ్నం కావూ? ఆశలు ముక్కలు కావూ? ఆ విధంగానే భావాలు ముక్కలవుతాయి."

**మాలతి:** నువ్వు కవయిత్రివి. కథలు రాస్తావు. మధురమైన కంఠంతో పాటలు పాడుతావు. వీణతీగలు మీటి మంత్రాలు పన్నీరు జల్లుతావు.

**పద్మావతి:** మాటలతో కవిత్వం ప్రదర్శిస్తున్నారే టీచరుగారు!

**ఇందిర :** అలాంటిది ఆ అమ్మాయి భావం ముక్కలవడమంటుందేమిటి పద్మా!

**పద్మా:** ఏం భావం ముక్కలయింది ఇందిరక్కగారూ!

**ఇందిర:** ఈ విచిత్ర సన్నివేశము అనేక శతాబ్దాలనుండీ జరుగుతూ ఉన్నదని, చరిత్రలు చెప్పుతూన్నవి. ఈ పూజారి పూర్వీకులు ఈ పూజారివలెనే పక్షులను పిలిచారు. పక్షుల పూర్వీకులు యీ పక్షులవలెనే సరిగా వేళకు యింత అందంగానూ వచ్చి తమ కర్పించిన ప్రసాదము ఆరగించి, రివ్వున నీలాల లోతులోనికి ఎగిరిపోయి తెల్లని మేఘాలలో కలిసిపోతున్నాయి.

**మాలతి:** ఎంత తియ్యగా చెప్పుతున్నావు అక్కా! కోతులను తయారుచేసి మన యింటికి వచ్చి ఆటలాడించే చెంచు, జంగాల ముసలమ్మల కన్న ఈ పూజారులు ఎక్కువేమిటి.

**ఇందిర:** ఇక్కడ ఈ దృశ్యంలో వుండే భావము చాలా ఉత్తమమైనది కదా! కోతులాట ఒక బిచ్చకత్తె అడుక్కునేందుకు వుపయోగించేందుకు మాత్రమే.

**మాలతి:** ఆ కోతిని హనుమంతుడని ఆడించుతుందిగా! అదీ గొప్ప భావమే.

**ఇందిర:** ఎంత చక్కగా పోల్చావు! ఈ కొండ శిఖరాలమీద పచ్చని వృక్షాలు నిండిన యీ చరియలలో మేఘాలు మన కడకు వచ్చి మేలమాడే పవిత్ర ప్రదేశాలలో ఒక దివ్యలోకము ప్రత్యక్షమౌతుంది. ఆ లోకంలో శ్రుతి కలిసిపోయి, మహావిచిత్ర సన్నివేశము మానవజీవితాలను మహోన్నతపథాలకు కొనిపోతుంది. హిమాలయాలలో నిత్యజన్మయై దిగివచ్చి భారతదేశంలో నిత్యప్రవాహయై నిత్యసముద్రసంగమయైన గంగానదీ భావం భారతీయ జీవితానికి ఎట్లు నిత్యనూతనోత్తేజము చేకూరుస్తుందో, అలాగే యీ తిరుక్కళికుంద్ర సన్నివేశమున్నూ!

**పద్మా:** ఇందిరక్కయ్యగారు చెప్పిన మాటలు నాకేవో పులకరాలు కలుగజేస్తున్నవి. నేను గ్రహించుకోలేని ఆలోచనలు జాజిమల్లి సువాసనలుగా నన్ను అలుముకుపోతున్నవి.

## (3)

నరసింహమూర్తి మేష్టారు నానాటికి చిక్కులెక్కువ పడిపోతున్న బుచ్చి వెంకట్రావు పద్మావతుల జీవిత సూత్రాలు గమనిస్తూ గాఢ విషాదంలో పడిపోయాడు. వాళ్ళ బ్రతుకులే ఒక సంగీతమైతే అపశ్రుతుల్లా అపస్వరాలులా, తప్పుడు తాళాలు ఏవేవో వచ్చి పడినవి.

అతి వేగమైన ఒక ప్రవాహంలోపడి తాను కొట్టుకొచ్చాడు. తగిన శిష్యురాలై తనకు పేరు ప్రతిష్ఠ తెచ్చిపెట్టుతుంది అనుకున్న పద్మావతి తన దగ్గరకు రావడమే మానేసింది. పోనీ, సంగీతాభ్యాసం కోసం ఎవరైనా ఒక పెద్ద సంగీత విద్వాంసుడి దగ్గరకు వెళ్ళుతున్నదా అంటే, ఆ వెళ్ళడమూ మానుకుంది. ఆడవాళ్ళ మనోభావాలెవరికర్థమౌతాయి? అసలే సంగీతం మానివేస్తుందేమో, అని లోలోన అతడు భయపడినాడు.

తాను వట్టి వంటబ్రాహ్మణుడై పోయినాడు. వీరిరువురి కోసమూ తాను పాడుకునే సంగీతమూ కూడా అభ్యాసము చేసుకోవడము లేదు. సంగీతము భగవతార్చన అని అనుకున్న తాను చేపలవాసన కొట్టే ఒక బెస్తల దాంపత్యం, తన్నంత ఇంద్రజాలంలో ముంచివేయడం ఒక విచిత్రమే. ఆమె తనకు ఒక కూతురుకన్న యెక్కువైనది. ఉత్తమ విద్య విషయంలో కులం తేడాలు వుండనే వుండవు. అసలు కులం తేడాలేమిటి? ఏ విధంగానూ గోడలు కట్టని మూడు ముఖ్యమైన కులాలు వేదకాలంలో వుండేవంటారు. వారిలో ఒకరికొకరికి సంబంధ బాంధవ్యాలు, భోజన ప్రతి భోజనాలు ఉండేవి కాదా! రాను రాను జనసమృద్ధి ఎక్కువై, భావసంఘర్షణలు వృద్ధియై అనేక కులాలు ఉద్భవించాయి! ఏమిటి తనకీ ఆలోచనలు! ఏది ఎట్లాయైనా వీరిద్దరు తన బిడ్డలు! వీళ్ళు వృద్ధిలోనికి రావడం అతను కన్నులారా చూశాడు. ఆ వృద్ధిలో తాను పాలుపంచుకొన్నాడు. వాళ్ళిద్దరినీ తల్లిలా పెంచాడు. చూస్తూ చూస్తూ ఉండగా ఏదో పెనుభూతం వాళ్ళ జీవితాన్ని ఆవహిస్తున్నట్లు అతనికి భయం ముంచుకువచ్చింది.

ఏమిటీ పెనుభూతం? ఎవరిలోటు? అంత ప్రేమించుకున్నారే! ఒకరినొకరు విడవకుండా ఉండేవారే! విడిచి బ్రతుకలేక పోయేవారే! ఒకరికోసం ఒకరు రూపాలు దాల్చినట్లుగా, ఈడుజోడై తన కన్నుల యెదుట తిరుగుతూ ఉండే వారే! ఏమిటి ఈనాటి ఈ పరిస్థితి! నరసింహమూర్తి మేష్టారు దినదినమూ ఆంధ్ర మహిళా సభకు వచ్చి పద్మావతిని చూచిపోతూ ఉండేవాడు. సాయంకాలము కాగానే పిల్లలందరు సభలో ఉన్న తోటలో ఆడుకొంటూ ఉండేవారు. కొందరు కేరంబోర్డు ఆడేవారు. ఊయల ఊగేవారు కొందరు. బల్ల బంతి ఆట ఆడేవారు కొందరూ. బల్ల ఊపు ఆట ఆడేవారు మరి కొందరు. ఇలా కలకల ఆటల్లో పొంగి బాలికల మధ్య ఎక్కడో పద్మావతి ఒక్కతే కూచుని ఆలోచించుకుంటూ ఉండేది!

ఆమె కేమీ ఆలోచనలు తెగేవికావు. ఇంతట్లో నరసింహమూర్తి మేష్టారుగారు వచ్చారనగానే ఆమెకు కొంత ఊరట కలిగేది. వెంటనే అధికారి అక్కగారిని సెలవు వేడి, ఆ బాలిక నరసింహమూర్తితో సముద్రం ఒడ్డుకు వాహ్యాళికి బయలుదేరింది. పన్నెండో నెంబరు బస్సుఎక్కి, ట్రిప్లికేనులో దిగి, సముద్రం ఒడ్డుకు పోయేవారు వారిద్దరూ!

ఓనాడు వారు అక్కడ కూచుండగా నరసింహమూర్తి సతీర్థుని శిష్యుడైన ఒక యువకుడు వీరిద్దరూ కూచున్న కడకు వచ్చాడు. ఆ యువకుడు నరసింహమూర్తికి కొన్నాళ్ళు శిష్యరికం చేసినాడు.

యువకుడు. "నమస్కారం నరసింహమూర్తి మేష్టారూ! మద్రాసు ఎప్పుడు వచ్చారు? ఇక్కడ పనేమిటి? ఎంతకాలం ఉంటారిక్కడ?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

నరసింహమూర్తి ఒక్క నిమిషం అతణ్ణి ఆనవాలు పట్టలేక పోయినాడు. "ఓహో! నువ్వటోయ్ రాధాకృష్ణా! నీ వేషం చూచి నిన్నానవాలు పట్టలేకపోయినాను సుమా! ఏం చేస్తున్నా విక్కడ? ఎన్నాళ్ళనుండి ఉన్నావు?" అని ఆనందంతో లేచి, అతన్ని కొంచెం దూరంగా తీసుకువెళ్ళి ఆ ఇసుకలో అతన్ని కూచోబెట్టి తానూ కూచున్నాడు. వారి మాటలు పద్మావతికి వినబడుతున్నాయి.

ఆ యువకుడు రాగానే పద్మావతి అతన్ని కొంచెం ఆశ్చర్యంగానే చూచింది. పట్టుపయిజామా, పట్టులాల్చీ. చేతికి కొంచెం ఖరీదుగల రిస్టువాచీ, మెళ్ళో సన్నని బంగారపు గొలుసూ ఆ గొలుసును వేలాడుతూ ఏదో ఓ చిన్న పతకమూ! కళ్ళకు ఫ్రేములేని అద్దాలజోడు! కాళ్ళకు జరీ పూవులు కుట్టిన మొఖమల్ చడావులున్నాయ్! ఈ యువకుడు చాలా గమ్మత్తుగా ఉన్నాడు. గిరజాలులా జుట్టు చిత్రంగా సముద్రపుగాలికి ఎగురుతూ ఉంది. అతడూ నరసింహమూర్తి మేష్టారు మాట్లాడే మాటలు వింటూ, ఆ యువకుని గమనిస్తూ ఆమె కూచుని ఉన్నది.

"నేను ఇక్కడ ఓ సినిమా కంపెనీలో సంగీత దర్శకునిగా ఉన్నాను. భరతనాట్యం కూడా బాగా నేర్చుకున్నాను. గొంతు చాలా తియ్యగా సైగల్ కంఠంలా వుండడంచేత కథానాయకునికి నా కంఠం ఇస్తూ వుంటాను."

"ఆశ్చర్యమే! ఎంత సంపాదిస్తున్నావు?"

"ఏదోలెండి. నెలకు రెండు మూడువేలు! సంగీత దర్శకునిగా ఒక్కొక్క చిత్రానికి పదివేలు చొప్పున ఇస్తారు. కంఠం ఇచ్చినందుకు పాటకు వేయి రూపాయలు. డాన్సు డైరెక్టరుగా ఉంటే అయిదారువేలు. ఒక్కొక్కసారి రెండు మూడు కంపెనీలలో పనిచేస్తూ వుంటాను."

"ఏమిటీ! బాగానే ఉందోయ్ నీ పని. నాకూ సినిమాలలో పని యిప్పించ కూడదటయ్యా?"

"దానికేముందండి మేష్టారు! అదిగో అందమైన చిన్న కారు చూశారా! బేబీఫియట్టంటారు దాన్ని. అది నా స్వంత కారు. మా కుటుంబానికి ఒక హిల్‌మాన్‌మిన్క్సు" కొన్నాను. దానికి డ్రైవరున్నాడు."

"చాలా బాగా ఉంది. ఫస్టుక్లాసు! ప్రజ్ఞ అంటే నీదీ ప్రజ్ఞ!"

"మా ఇంటికోసారి రండి మేష్టారు!"

"తప్పకుండానోయ్"

"అచ్చా! అయితే అడగవచ్చునో అడగకూడదో! మరి, ఆ అమ్మాయి ఎవరు? మీ బ్రహ్మచర్యానికి స్వస్తి చెప్పారేమిటి? ఎవరా సినిమాతార! సినిమాలో చేర్పించడానికి తీసుకువచ్చారా? అయితే మనం చాలా సహాయం చేయగలం."

"ఛా! ఛా! ఆ అమ్మాయి నా బిడ్డవంటిది. వంటి దేమిటి, నా పెంపుడు బిడ్డే! నా దగ్గిర సంగీతం నేర్చుకుంటూంది. మా వూరే. కావలి. వాళ్ళు బెస్తలులే! అయినా భాగ్యవంతులు. ఆవిడ భర్త ఈ ఊళ్ళోనే పెద్ద వ్యాపారం చేస్తున్నారులే!"

"అలాగా! క్షమించాలి మీరు. కాని కాస్త నలుపైనా ఏమి అందంగా ఉందండీ ఆ అమ్మాయి! పేరు మోసిన మా సినిమా తారలు చాలామందికన్న నయం. సంగీతం బాగుంటుందా అండీ మేష్టారు!

"బాగుండడమేమిటోయ్! తిలోత్తమ కంఠమే. తారలందరికన్నా చాలా బాగా పాడుతుంది."

"నాకోమాటు వినిపించేటట్లు చేయరూ"

"చూద్దాములే!"

"ఆ అమ్మాయిలో ఏదో అద్భుతమైన ఆకర్షణ ఉంది మేష్టారు! ఆ అమ్మాయి భర్త ఒప్పుకుంటే ఆవిణ్ణి మొదటి రకం తారగా తయారు చేయగలను. ఈ మధ్య మన కంఠం మీరు వినలేదు. మొన్ననే రికార్డు ఇచ్చిన ఈ పాట వినండి!"

❀ ❀ ❀

# పంచమ గుచ్ఛము

ఇంతేనా? నా సంగతి విన. నా
వంతైనా ప్రియురాలి మనసు కరగదు
పంతమో, చింతయో
కంతుదురటే నా ఎడద గాసిపెట్టి, దూసిపెట్టి
చింతాకులంత చిందర చేసినా
డింతేనా?

అతని కంఠం చాలా మధురంగా ఉంది. ఆ పాట ఏదో కొత్త రకం బెంగాలీ వరసలా వుంది. ఆ కొద్ది మాటలూ మూడు నిమిషాలు పాడాడు రాధాకృష్ణ.

ఆ యువకుడు ఆ పాట ఎంత లోగొంతుకతో పాడినా చుట్టుప్రక్కలవారికి కొంతమందికి వినిపించింది గాబోలు నెమ్మది నెమ్మదిగా పదిమంది ఆ ప్రాంతాలకు చేరినారు.

"ఆదే రాధాకృష్ణడా?"

"అదు! ఎన్న రొంబా నైసా యిరుకు అంద కంఠం!"

"రాధాకృష్ణ ఏమి బాగా పాడతాడయ్యా!"

"ఆ అమ్మాయి కొత్త సినిమా స్టారులా వుంది."

"మాంచి చురుగ్గా, షోగ్గా ఉంది."

ఈ మాటలు అస్పష్టంగా వున్నా, పద్మావతీ చెవిలో పడ్డాయి. ఆమె మోము కెంపువారింది. ఆమె గుండెలు కొట్టుకున్నాయి. ఆమెకు కోపమూ వచ్చింది. సంతోషమూ వచ్చింది. ఆమె నెమ్మదిగా లేచి, తలవంచుకొని, బీచి రోడ్డువైపుకు నడవడం ప్రారంభించింది. అది గమనించి నరసింహమూర్తి "వస్తున్నాను వుండు అమ్మాయి!" అని కేకవేసి రాధాకృష్ణవైపు తిరిగి, "మళ్ళీ కలుసుకుంటాను. నీ అడ్రస్సు మురుగప్ప వీధి, పదోనెంబరు ఇల్లుకాదూ, త్యాగరాయ నగరంలో! తప్పకుండా వస్తాను. ఎప్పుడు నీకు సావకాశం?" అని ప్రశ్నించాడు.

"నాకా మాష్టారూ! ఎల్లుండి షూటింగు లేమీ లేవు. రేపు సాయంకాలం అయిదు తర్వాత మా ఇంటికి రండి. ఉండండి! ఉండండి! మిమ్మల్నీ ఆ అమ్మాయినీ నా కారుమీద దిగబెట్టనా?" అని రాధాకృష్ణ అడిగాడు.

"వద్దులే, ఆ అమ్మాయికి ఇష్టం ఉండదు."

ఎంత చక్కగా వుంది అతని కంఠం! ఎంత తెచ్చిపెట్టుకుంటే వస్తుంది సంస్కారము? ఈ ప్రశ్నలు పద్మావతి హృదయంలో దారిపొడుగునా వున్నాయి. బస్సులో ఆమె నరసింహమూర్తి మేష్టారుగారితో మాట్లాడలేదు. ఏలాగో ఆంధ్రమహిళ కడ దిగింది. ఆమెను దించి నడిచి ట్రాం కడకు వెళ్ళి రాయపేట చేరుకున్నాడు నరసింహమూర్తి

మేష్టారు. ఆ రాత్రంతా పద్మావతికి నిద్రరాలేదు. పక్కమీద ఇటూ అటూ దొర్లింది. లేచి ఎలక్ట్రిక్కు దీపం వెలిగిద్దామా అంటే తన గదిలోని ఇతర బాలికలు లేస్తారు.

నెమ్మదిగా పక్కమీదనుండి లేచి, పై డాబామీదకు వెళ్ళింది. సభాభవనాల మధ్య వున్న పూలతోటలో నుండి పూలవాసన పైకి ప్రసరించి వస్తున్నది. ఆకాశాన అక్కడక్కడ మబ్బులు ప్రయాణం చేస్తున్నాయి. చంద్రుడు అస్తమించడం చేత నక్షత్రాలు తళతళలాడుతూ ఆకాశం అంతా చిత్రమైన ముగ్గుల పట్టులలా నిండి వున్నాయి.

ఆ తారకలను చూస్తూ వాటి విచిత్రరూపాలూ, చిత్రమైన కాంతులు గమనిస్తూ వున్న పద్మ ఈ తారలనే పేరు సినిమా స్త్రీల కెందుకు వచ్చింది అని ఆశ్చర్యం పొందింది. ఈలా వారు మినుకు మినుకుమంటారా? ఇంత ఎత్తున వుంటారా అందుబాటులో లేకుండా! చూపులకు చిన్నగా ఉన్నట్టు కనబడి నిజంగా బ్రహ్మాండాలంత వారా వారు! చల్లని రాత్రిలో మినుకుమనే ఈ చుక్కలు సూర్యునికన్న ఎక్కువ వేడిమికల మహా సూర్యగోళాలని టీచరుగారు చెప్పింది. అలానే సినిమాతారలు పైకి ఒక రూపూ, లోపల ఒక రూపూ కలవారనా తాత్పర్యం!

ఆమె చిరునవ్వు నవ్వుకుంది. ఎందుకు వచ్చిందో ఆ పోలికా ఆ పేరు. తాను సినిమా తార అయితే అద్భుతం అన్నాడేమి ఆ సంగీత దర్శకుడు. తనలో ఏమి వుంది? తనలో ఏదో ఆకర్షణ వుందిట! ఏమిటో ఆ ఆకర్షణ? తెల్లని బంగారం ఛాయతో మిలమిలలాడే బాలికలు ఎంతోమందో తనతో చదువుకుంటున్నారు. మదరాసులో ఆ బంగారు విగ్రహాలు జలజలలాడే చీరలు ధరించి చిత్రమైన ఫేషనుల బ్లౌజులు తొడిగి, కొందరు పంజాబీ కుడతాలు తొడిగి, విచిత్రమైన నగలు ధరించి ఎంత అందంగా వుంటారు. తాను వారి ముందు కోతిలా వుంటుందేమో!

ఆ అబ్బాయి ఎంత అందంగా పాడాడు.

ఆ రాత్రి ఆ చుక్కల వెలుగులో కలిసిపోయేటట్లు తానూ తన మధురమైన కంఠంతో ఆ పాటే పాడింది. తన కంఠం కృష్ణవేణి కంఠంలా వుంటుందా? భానుమతి గొంతు, వరలక్ష్మి గొంతులకు సరిపోల్చడానికి వీలుందా? ఆ సంగీత దర్శకుడు తన కంఠం వింటే ఏమంటాడో? ఏమంటాడు?

ఆ సంగీత దర్శకుడు రాధాకృష్ణకూ ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఏదో 'సెక్సు' ఆకర్షణ వుంది ఆ బాలికలో! ఎంత జిగిగా వుంది ఆమె అంగసౌష్ఠవం! ఆమె నరసింహమూర్తి మేష్టారు శిష్యురాలా? అంటే సంగీతములో నిధి అన్నమాట. నిజంగా ఆ యువతి సినిమాలో చేరవలసిందే! ఏమి ఠీవిగా నడిచింది! బెస్తలా? అయితే దాశరాజు కూతురు యోజన గంధిలా వుంది. మత్స్యగంధి మాత్రం కాదు. ఏదో చక్కని సువాసనద్రవ్యం ఉపయోగించింది. ఆమె మూర్తి శిల్పంవలెనే వుంది. ఈనాడు తానో మొదటిరకం సినిమా తారను లోకానికి ఇస్తాడుగాక. పుల్లయ్యగారివంటి దర్శకులే కాదు సినిమా ప్రపంచానికి కొత్తతారను ఇచ్చేది! 'వాహిని' వారి వంటి సంస్థేకాదు పాతతారలను నూతన కాంతితో వికసింపచేసేది! ఒక సంగీత దర్శకుడు తెలుగు సుబ్బలక్ష్మిని ప్రపంచానికి ప్రత్యక్షం చేస్తాడు గాక. మరునాడు నరసింహమూర్తి రాధాకృష్ణ ఇంటికి వెళ్ళినాడు.

## (2)

రాధాకృష్ణ మేడ చిన్నదైనా చాలా అందంగా ఉంది. ఆ మేడ తాను కట్టించుకున్నానని రాధాకృష్ణ చెప్పినాడు. వంట యిల్లు, భోజనశాల ఆ రెండు ఇళ్ళనూ కలిపి వరండా ఉంది. వరండాకు ఈవలావల దొడ్డి, ఆ దొడ్డికి గోడలు ఉన్నాయి.

అసలు మేడకు దూరంగా తూర్పున ఇంకొక చిన్న మేడ కట్టించుకున్నాడు రాధాకృష్ణ. ఆ మేడకు పైన ఒక పడకగదీ, ప్రక్క గదీ - క్రింద అలాగే పడకగదీ, ప్రక్కగదీ ఉన్నాయి. పెద్దగది అతని సంగీతం గది. క్రింద గది అతని గాంధర్వమేళం గది. రెండు ఫిడేళ్ళు, రెండు వేణువులు, రెండు వీణలు, ఒక క్లారియొనెట్, ఒక పియానో, ఒక జలతరంగము, ఒక తబలా తరంగము, ఒక మృదంగము, ఒక తబలా, ఒక సారంగి, ఒక దిల్‌రుబా, ఒక మాండోలిన్, రెండు వీణలు, ఒక సితార్ - ఇవీ అతని మేళవాద్యాలు. ఆ వాద్యాలు వాయించేవారికి అతడేం జీతమిస్తాడు. ఆ మేళంకోసం తన జీతం కాకుండా ఇంకో వేయి రూపాయలు అతణ్ణి సంగీత దర్శకునిగా పెట్టుకున్న సినిమా కంపెనీవారు జీతం ఇచ్చుకోవలసి వస్తుంది. అతని పై గదిలో "హిజ్ మాష్టర్సు వాయిస్" కాబినెట్ గ్రామఫోను ఉంది. ఒక గోద్రెజ్ ఇనప బీరువానిండా ఉత్తరాది దక్షిణాదివారల రికార్డులు ఉన్నాయి. ఇంకో బీరువా నిండా హిందీ, తెలుగు, తమిళ, బెంగాళీ, మరాటీ, గుజరాతీ రికార్డులున్నాయి.

మూడవ బీరువా నిండా ప్రసిద్ధికెక్కిన పాశ్చాత్య సంగీత మేళాల రికార్డులు, ప్రసిద్ది పాశ్చాత్య గాయకుల రికార్డులూ ఉన్నాయి.

ఫ్రాన్సునుండి వచ్చిన "ఆర్గను" ఒకటి ఒక మూలను ఉంది, అతడు అన్ని వాద్యాలూ వాయించగలడు.

అన్ని గదులూ చక్కగా అలంకరించుకొన్నాడు. క్రింద ప్రక్కగది తనతో పని ఉండి వచ్చిన పెద్దమనుష్యులు కూర్చుండే గది. పైన ప్రక్కగది తన పడకగది.

ఇవన్నీ నరసింహమూర్తి మేష్టారుకు చూపించాడు.

"ఎంతవాడ వయ్యావోయ్! అంతా అంతా డబ్బే సినిమాలో" అన్నాడు నరసింహమూర్తి మేష్టారు.

"అవునండీ మీ అమ్మాయి పేరేమిటి!"

"పద్మావతి!"

"ఆ అమ్మాయి కంఠం చాలా బాగుంటుందనుకుంటాను."

"బాగుండడమేమిటోయ్, కిన్నెరకంఠం? నువ్వు విని తీరాలి."

"ఎప్పుడు తీసుకువస్తారు?"

"ఏదో సెలవురోజున; కాని, ఆ అమ్మాయి భర్త యీ ఊళ్ళోనే ఉన్నాడు. పెద్ద చేపల వర్తకుడు. అతని ఆజ్ఞ లేకుండా ఆ అమ్మాయిని ఎక్కడికీ కదిలించదానికి వీలులేదు."

"ఏమిటీ? భర్త ఒకడున్నాడు, పైగా ఆ భర్త ఈ ఊళ్ళోనే ఉన్నాడూ? అతని ఆజ్ఞ కూడా కావాలీ! అయితే మీరు ఆ అమ్మాయిని బీచికి ఎట్లా తీసుకువెళ్ళారు!"

"అది ఆ భర్త ఆజ్ఞవల్లనే!"

"సరేలెండి! ఆ భర్తనే అడగండి, అతన్ని కూడా వెంటబెట్టుకురండి. నాకు కావలసినవి మధురమైన కంఠాలు. కనక ప్రథమంగా ఆ బాలిక వాణి వినాలి. ఏమంటారు?"

"సరే సరే! ప్రయత్నిస్తాను."

అక్కడ పద్మావతికి మరునాడు రాత్రి కూడా నిద్రపట్టలేదు. ఆ యువకుడు ఎంత అద్భుతంగా పాడాడు! ఎవరాయన? సంగీత దర్శకుడా? సినిమాలో పాడతాడా? అనుకున్నది. ఆ పాటంత అందంగా తానూ లోగొంతులో పాడుకున్నది. ఆ పాటవిన్న సహోధ్యాయినులైన కొందరు బాలికలు సుడిగాలులులా వచ్చి, ఆమె చుట్టూ చేరినారు. "ఆ పాట ఇంకోమాటు పాడు పద్మా!" అని కొందరు. "ఏది ఏదీ కాస్త కంఠమెత్తండి!" అని కొందరు ఆ బాలికను వేధించసాగినారు.

ఆంధ్రమహిళలలో ఆమె సంగీతమంటే బాలికలందరూ ప్రాణాలిస్తారు. రోజూ చదువులయ్యాక పడుకునే ముందర హాస్టలు భవనంపై మేడమీద ఉపాధ్యాయినులు, బాలికలు చేరి పద్మావతిని పాడమంటూ ప్రార్థిస్తూ ఉంటారు. ఆ బాలిక తన మధుర గాంధర్వం వెన్నెలలోనో, తారకల కాంతిలోనో మేళనం చేస్తూ వుంటుంది.

ఈ దినం ఆ బాలిక లెంతమంది బ్రతిమాలినా పద్మ మళ్ళీ పాడడానికి వప్పుకొనలేదు. ఏదో కంఠంలో మంట వచ్చిందదంది. విసుగుచెంది ఒక్కొక్క బాలికా వెళ్ళిపోయింది. పద్మావతికి ఏదో బాధ వచ్చింది. తన భర్త అంతచక్కని గాయకుడు ఎందుకు కాలేకపోయాడు అనుకున్నది. ఇంతట్లో అతని మూర్తి తన మనస్సులో ప్రత్యక్షమైంది. ఎంత నాగరికతను అతడు దగ్గరకు తీసుకున్నా, అది అతనిపైన కప్పిన పట్టు పచ్చడంలా ఉంది కాని, అతడు ఫేషన్‌తో కలకలలాడిపోయాడు. అతని కంఠం ఉరుములా వుంటుంది. అతని దేహం నల్లరాతితో చెక్కిన విగ్రహంలా వుంటుంది. అతడు బుష్‌కోట్లు ధరించినా, పట్టులాల్చీలు తొడుక్కున్నా అతడూ అతని దుస్తులూ ఏ మాత్రమూ శ్రుతి కలియలేదు.

ఈ సంగీత దర్శకుడు ఎంత అద్భుతంగా పాడాడు! తమ తోటలోని పూలన్నీ ఒక్కసారి పరిమళాలు వెదజల్లినట్లయినదికదా! అది మనుష్యుని కంఠం కాదు. దేవతల కంఠం.

ఆమె మంచంమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ సమయంలో అందరు బాలికలూ నిద్రపోయేదీ, చదువు కొనేది గమనించడానికి వరండాలో తిరుగుతున్న వసతి గృహాధికారిణి, కిటికీలో నుండి చూచి, పద్మావతి ఏదో బాధపడుతున్నట్లు గ్రహించింది. తలుపుతీసి ఉండటంచేత, ఆమె చల్లగా పద్మావతి గదిలోకి వచ్చి, ఆ బాలిక ప్రక్కనే మంచంమీద కూచుని, పద్మమీద చేయివైచి, "పద్మా! ఏమిటిది? ఈ పాటికి నిద్రపోతుంటావు అనుకున్నాను. వంట్లో బాగా లేదా?" అని ప్రశ్నించింది. ఆ అధికారిణి పేరు శ్రీమతి కరుణామయి. హాస్టలులోని బాలికలందరూ ఆమె బిడ్డలు. తన తీయని కంఠంతో మెల్లగా మాట్లాడుతూ, బాలికల మనస్సులు గ్రహించి వారిని కంటికి రెప్పల్లా కాపాడుకుంటూ ఉంటుంది. శ్రీమతి గారంటే బాలికలందరూ ప్రాణాలర్పిస్తారు. ఆమెతో

తమ సంతోషాలూ, ఆశయాలూ, కష్టాలూ చెప్పుకుంటారు. ఎవరికైనా ఏ కాస్త జ్వరము వచ్చినా ఆవిడ వారి ప్రక్కను వుండాలని గోలపెడ్తారు.

శ్రీమతి అంత తీయగా తన్ను ప్రశ్నించగానే ఆమెకు మరీ దుఃఖం ఎక్కువైంది. గబుక్కున పద్మ తలను శ్రీమతి ఒళ్ళోపెట్టి వెక్కి వెక్కి ఏడ్చింది. ఎందుకా బాల అలా ఏడుస్తున్నదో శ్రీమతి కేమి తెలుస్తుంది. కాని పద్మకు నరాల జబ్బు వచ్చి ఆరోగ్యం చాలా చెడిపోవడంచేత భర్త ఆమెను ఆంధ్రమహిళా సభ విద్యాలయంలో చేర్పించారు. ఆ జబ్బు ఇంకా పోలేదు అని అనుకుంది. చదువూ వస్తుంది, ఆమె ఆరోగ్యమూ పూర్తిగా కోలుకుంటుంది అని కదా ఆమెను తమ విద్యాలయంలో చేర్పించి హాస్టల్లో ప్రవేశపెట్టించి నాడాయన. కాని నరాల జబ్బు తగ్గినా ఎన్నాళ్ళకోగాని పూర్తిగా వదలదు. అందుకని పద్మ ఏడుస్తున్నదనుకుని శ్రీమతి నెమ్మదిగా ఆ బాలికను అనునయించ ప్రారంభించింది.

"ఏమి పద్మా! యీ స్వాతంత్ర్య మహాయుగ ప్రారంభంలో భారతీయాంగనలు తమ మహోత్తమ కర్తవ్యం నిర్వర్తించడానికి సిద్ధంగా ఉండవద్దూ?"

పద్మావతి మౌనం.

"మనం ధైర్యం వహించి, బాధ్యతలు గుర్తించి, నిజమైన శాంతి దేవతలమై, మగవారికే దారి చూపించవలసి వున్నదిగదా!"

పద్మావతి తల వూపింది.

"అనేకమంది బాలికలు ఎంత చదువుకున్నా జ్ఞాన విదగ్ధ మూర్ఖత్వం వదలలేక వారి దగ్గర వీరిమీదా, వీరిదగ్గర వారిమీదా నేరాలు చెపుతూ, తగాదాలు పెంచుకుంటారు. ముప్పై ముళ్ళు ఇముడుతాయి. మూడు కొప్పులు ఇమడవు అన్న సామెత మూడువందల రెట్లు నిజం చేస్తున్నారు. అందుకు కారణం తమ సహజమైన స్త్రీత్వం దగ్ధం చేసుకొని మగవారి సుగుణాలు అలవాటు చేసుకొనలేక మగరాయళ్ళలా సంచరిస్తూ వుంటారు."

"మగవారు మాత్రం ఉత్తమంగా సంచరిస్తున్నారా పిన్నిగారూ?"

"ఆనాటికీ ఈనాటికీ మగవాళ్ళలో మార్పు ఏమీ రాలేదు తల్లీ. పని వేడి తగ్గగానే వారికి భామ వేడి కావాలి. ఉత్తమమైన ఉద్యమంలో చటుక్కున చేరుతారు. తీవ్రంగా పట్టుదలతో పనిచేస్తారు. జయమో అపజయమో తేలగానే చప్పబడిపోతారు!"

"గాలిపోయిన రబ్బరు బుడగలా!"

"అదీ! సరసమైన పోలిక తెచ్చావు. విజయమే సంభవిస్తే వాళ్ళ ఆత్మబలిభావం ఎగిరిపోయి, స్వలాభాపేక్షా, స్వకులపరాయణత్వమూ స్వీయయశోకామత్వమూ ఉద్భవిస్తాయి. ముప్పైమంది, మూడువందల ముఠాలవుతారు. దేశాన్ని గంగలో దింపుతారు."

"మన ఆంధ్రదేశ వ్యవహారాలన్నీ అల్లానే వున్నాయి కాదండీ అక్కా."

"నిజం చెప్పావు. ఇంక మనమూ అలానే సిద్ధం అయితే?"

"ఆడవాళ్ళు దేవతల బిడ్డలాండి! వారికి అధికారం చేతికివస్తే మీ రన్నట్లు గర్వాలు ఆకాశం అంటుతాయేమో! అప్ప చెల్లెళ్ళకన్న ఎక్కువగా స్నేహంగా వున్న స్త్రీలు ఒకరికొకరు భరించలేనంత విరోధం వహిస్తారు."

"అందులోనూ నిజం వుంది. అయినా ఆడవాళ్ళు కూడా ఎక్కువగా జాతీయ జీవనంలో పాలుపంచుకోవాలి."

ఆ విధంగా పద్మావతిని ఊరడింపచేసి శ్రీమతి వెళ్ళిపోయింది.

పద్మావతికి ఏదో వర్ణనాతీతమైన శాంతి కలిగి దిండుపైన తల వాల్చింది. ఆ మరునిమిషంలో నిద్రాదేవి ఆమెను తల ఒడిలోకి గాఢంగా ఒరిగించుకొన్నది.

## 3

సంగీత దర్శకుడు రాధాకృష్ణ స్వయంగా తన గురువుగారైన నరసింహమూర్తి మేష్టారిని వెంకట్రావుగారింటికి చేర్చాడు. వారు ఇంటికి వెళ్ళేటప్పటికి బుచ్చి వెంకట్రావు హాలులో ఎలక్ట్రిక్ దీపం వెలుతురున పేపరు చదువుకొంటున్నాడు.

"మేష్టారూ రావడం ఆలస్యం చేశారే! పద్మ కులాసాగా వుందికదా?" అని బుచ్చి వెంకట్రావు నరసింహమూర్తి మేష్టారును పలకరిస్తూ, అతనితో వచ్చిన రాధాకృష్ణ వైపు తేరిపార చూచాడు. ఆ చూపులో 'ఎవరయ్యా యీ అతి పట్నంవాసం వాడు!" అన్న ప్రశ్న స్పష్టంగా మూర్తించింది.

"ఏమీలేదు. ఈయన రాధాకృష్ణ! చాలా పేరు పొందిన సంగీత దర్శకుడు. నాతోపాటు మా గురువుగారి దగ్గిర సంగీతం నేర్చుకొన్న వెంకటరత్నం శిష్యుడు. నా దగ్గిరా కొంతకాలం శిష్యరికం చేశాడు. ఈతనిది బాపట్లలే! చటుక్కున సముద్రం ఒడ్డున కలుసుకున్నాం" అని నరసింహమూర్తి మేష్టారు తొందరగా జవాబు చెప్పినాడు.

"అలాగా. చాలా సంతోషం!" అంటూ లేచి బుచ్చి వెంకట్రావు రాధాకృష్ణ చేతిని స్పృశించి కరచాలనం చేశాడు.

రాధాకృష్ణ చేయి నెప్పెట్టింది. ఆరి ఉద్ధండపిడుగా, చేయి కాస్తయితే ముక్కలయి వుండును. ఎంత బండగా ఉన్నాడు! అందుకనే ఆ నీలికలువ పూవులాంటి ఆ అందమైన బాలిక అంత బాధపడుతున్నట్లు కనబడింది. అని అనుకున్నాడు రాధాకృష్ణ.

**బుచ్చి:** కూర్చోండి రాధాకృష్ణగారూ! మిమ్ములను కలుసుకోవడం చాలా ఆనందంగా వుంది. మా ఆవిడ చాలా గొప్ప సంగీత పాఠకురాలు అంటారు మా నరసింహమూర్తి మేష్టారు. మీరు వినాలి. మీ అభిప్రాయం చెప్పాలి.

**నర:** అదేనయ్యా వస్తూ అనుకున్నాము. రాధాకృష్ణ సంగీతం నువ్వు వినితీరాలి. ఏమయ్యో రాధాకృష్ణా! మా బుచ్చి వెంకట్రావుకు సంగీతం అంటే ప్రాణం.

**రాధా:** అవును! ఆయన్ని చూడగానే గ్రహించవచ్చును. ఆయన కళాహృదయం ఈ హాలు చూడగానే గ్రహించవచ్చును.

**నర:** ఈ రోజుల్లో దబ్బున్న ఒక్క పెద్దమనిషి ఒక్క కళాపూర్ణమైన బొమ్మనుకొని తన ఇల్లు అలంకరించుకొన్న పాపాన పోతున్నాడటండీ?

**రాధా:** ఈ రోజులలో లలితకళలు నేర్చుకోవడం ముష్టి ఎత్తుకోడానికే! జమీందారులు వారింక శతాబ్దాలనుంచీ వచ్చిన సంస్కృతి ప్రీతిచేత కళావేత్తలను పోషిస్తూ వచ్చారు.

ఇప్పుడేముందీ? జమీందారీలు లాగేశారు. స్వతంత్ర సంస్థానాలు ఎగిరి పోయాయి. ఎక్కడినుంచి వస్తారింక అపరభోజులూ, కృష్ణదేవరాయలూను!

**బుచ్చి:** జమీలూ అవీ పోవలసిందే అనుకోండి. కాని లక్షలు ధనం ఆర్జించే ధనస్వాములకు ఏం పొయ్యేకాలం వచ్చింది చెప్పండీ?

**నర:** ఈ దేశంలో ప్రభుత్వం కులతత్వ ప్రభుత్వం! తక్కిన దేశోద్ధారక ప్రణాళికలన్నీ కులతత్వ రాక్షసి కడుపులో ప్రాణాయస్వాహా అయిపోతున్నాయి.

**రాధా:** ధనస్వాములకు కళలెందుకండీ. సంగీతం పాడే బాలిక మీద ఎక్కువ మోజు. అందుకనే సినిమాలు. సినీమాలు అని కంపెనీ పెడుతూ ఉంటారు. అలా పెట్టడం మా బోటివారికి లాభమే అనుకోండి. లేకపోతే ఎంతమందో చిత్రకారులూ, గాయకులూ మాడిపోవలసిందే కదా!

**బుచ్చి:** నేను ఇంతవరకూ కొంచెం కళావేత్తలు అనుకున్నవారి సలహాతో ఒక డజను మంచిబొమ్మలు కొన్నాను రాధాకృష్ణగారూ! రండి చూద్దురుగాని.

**రాధా:** మొత్తం ఏమాత్రం అయివుంటుందండీ!

**బుచ్చి:** పదిహేనువందలు ఖర్చయ్యాయి. కాని అంత విద్య సంపాదించుకొని, అలా అందంగా బొమ్మలువేస్తే నూరు నూటయాభై వారిని ఏం పోషిస్తాయి చెప్పండీ?

**రాధా:** చూడండి, మా సినిమావారు లక్షలు సంపాదిస్తారు. ఒక్కబొమ్మ కొన్న డైరెక్టరుగాని, తారగాని, తారకుడు గాని ఉన్నారా? ఒక్క రామబ్రహ్మంగారు తప్పబుట్టాడు మహానుభావుడు.

**నర:** ఏమనుకుంటే ఏం లాభం? ప్రభుత్వం ప్రజారాజ్యం అంటారు. ప్రజలకు కళ కావాలికదా. ఆ కళను ప్రదర్శనశాలలుగా ఏర్పాటు చెయ్యాలి ప్రభుత్వం. ఈ ప్రజా ప్రభుత్వాలకు మాటలు జాస్తీ, చేతలు నాస్తీ.

**బుచ్చి:** ఎప్పుడండీ మీ సంగీతం మేము వినడం?

**రాధా:** నా కారు పంపిస్తాను.

**నర:** మా కారుమీదే వస్తాములే! నీకు ఎప్పుడు వీలో, అప్పుడే వస్తాము. మా అమ్మాయినీ తీసుకువస్తాము.

**రాధా:** రేపు రాత్రి ఎనిమిదిగంటలకు రండి. మా ఇంట్లోనే మీ భోజనాలు. మళ్ళీ కాదనకండి. మాకు కులం తేడాలు లేవండోయ్ బుచ్చి వెంకట్రావుగారూ.

**బుచ్చి:** నాకు ఆ విషయంలో ఎవరినీ, ఏమీ ఇబ్బంది పరచకూడదని నియమం.

**రాధా:** మా ఆవిడ ఒక నాయరమ్మాయి. సంగీతానికీ, నాట్యానికీ నాకు శిష్యురాలయింది. ఆ తర్వాత భార్య అయింది. కాని మన బ్రాహ్మణులకన్నా ఆచారాలే. మాంసం చూడలేదు, చేపవాసనే గిట్టదు. కోడిగుడ్డు కూడా పడదు.

**బుచ్చి:** మాకూ ఈ మాష్టారు పుణ్యమా అని చప్పటి భోజనమే అలవాటయింది.

**రాధా:** కాబట్టి తప్పకుండా రేపు రావాలి. మీ ఫోను నెంబరివ్వండి. ఫోనులో జ్ఞాపకంచేస్తాను. సెలవు. నమస్కారం మేష్టారూ.

రాధాకృష్ణ సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

## ④

రాధాకృష్ణ ఇంటిలో బుచ్చి వెంకట్రావూ, పద్మావతీ, నరసింహమూర్తి, రాధాకృష్ణ భార్య సుశీల చేరారు. నాయరు వంటలో పండితుడు, మధురమైన మలబారు శాకాహార భోజనమూ, పిండివంటలు వడ్డించగా భోజనాలు పూర్తి చేసి, తాంబూలాలు వేసుకుంటూ లోని హాలులో కూచున్నారు. రేడియో చక్కని సంగీతం పాడుతున్నది.

**పద్మా:** ఇప్పుడు వచ్చే సంగీతం అంతా వట్టి కాఫీ హోటలు సంగీతం మేష్టారూ!

**నర :** అవునమ్మా అవును. ఎవరికి కావాలి ఉత్తమమైన కర్ణాట బాణి?

**రాధా :** ఉత్తమమైన ఉత్తరాది బాణి కూడా ఉత్తరాది వారికే అక్కరలేక పోతోంది.

**సుశీ :** నాకు మాత్రం ఈనాటి సంగీతం చాలా అందంగా ఉంటుంది.

**బుచ్చి:** కొన్ని కొన్ని ఉత్తరాది సినిమా పాటలు సురయా పాడినవీ, కన్నన్‌బాల పాడినవీ లతామంగేష్కర్, షేంషెడ్‌బీగం పాడినవీ చాలా ఇష్టం నాకు. అలానే సైగల్, పంకజమల్లిక్, వసంతదేశాయిలు నాకు ఇష్టం.

అక్కడనుంచి అందరూ రాధాకృష్ణ గాంధర్వ మందిరానికి పోయారు. అక్కడ రాధాకృష్ణ మేళం వారు అంతా సిద్ధంగా వున్నారు.

రాధాకృష్ణ తన భార్యనూ, ముగ్గురు అతిథులనూ అక్కడున్న సోఫాలపై కూచోపెట్టి, తానువెళ్ళి తన మేళ వాయిద్యాల వారి మధ్య తన దర్శకాసనంపై అధివసించాడు.

అక్కడనుంచి అతడు గంభీరమైన తన కంఠమెత్తి నాలుగు పాటలు పాడాడు. ఆ తర్వాత సుశీల వెళ్ళి రాధాకృష్ణ ప్రక్కన కూచుని రెండు మలయాళపు పాటలూ ఒక తెలుగుపాటా పాడింది.

నరసింహమూర్తి మేష్టారు ఆనందంతో చప్పట్లుకొట్టి "చాలా ఆనందంగా ఉందయ్యా, ఇంక మా అమ్మాయి పద్మావతి పాట వినాలి నువ్వు. అమ్మా! ఏదీ ఒక్క పాట వినిపించూ. రాధాకృష్ణా! ఒక్క ఫిడేలూ, మృదంగమూ మాత్రమే మేళం. నా ఫిడేలు తెచ్చుకున్నాలే! దానితో నేనే వాయిస్తాను" అన్నాడు.

"పాడు పద్మా! భయమేమిటి? అంతా మనవాళ్ళే!" అని బుచ్చి వెంకట్రావు భార్యను కోరాడు.

పద్మావతి శ్రుతి చూచుకుని తన గురువు అందివ్వగా నెమ్మదిగా రాగం ప్రారంభించింది. రెండు మూడుసార్లు భయంచేత శ్రుతి తప్పింది. కాని వెంటనే అందుకుంది. నెమ్మది నెమ్మదిగా తనకు ఇష్టమైన ఆ తోడిరాగం సాగించింది. ఆ రాగంలో తన వర్ణంలోనికి ప్రసరించింది. ఆ వెంటనే త్యాగరాజకృతి అందుకుంది. ఆ కృతికి సరిపడిన స్వరకల్పనా వికాసంతో ఆ పాట పూర్తి చేసింది. అంతా పదిహేను నిమిషాలు పట్టింది.

ఆ పాట పాడినంతసేపూ అందరూ మంత్రముగ్ధులై విన్నారు. రాధాకృష్ణకు ఆ పాట వింటూ ఉంటే తాను ఒకనాడు సందర్శించిన ఉదకమండలం ప్రకృతి దృశ్యం ప్రత్యక్షం అయింది. ఒత్తుగా వివిధములైన ఆకుపచ్చని రంగుల చెట్లు నిండివున్న కొండచరియలు చిన్న చిన్న సెలయేళ్ళు, చెరువులు, లేళ్ళగుంపులు, పూవులు, నెమళ్ళు,

పక్షులు, మేఘాలు ఒక మహాశ్రుతిలో స్వరాలై దర్శన మిచ్చినట్లు అతనికి తోచింది. ఆ కంఠం అంత అమృతమయమని అతడు కలలోనైనా అనుకోలేదు. ఆ బాలికా, ఆమె గానమూ, చంద్రమూర్తీ, చంద్రికా అయి అతనికి ఎదుట లోచనగోచరమైనట్లయినది.

ఆమె వెంటనే రాగమాలికతో "కస్తూరి తిలకం" అన్న శ్లోకం పాడింది. శ్రీకృష్ణభగవానుడు నీలమేఘ శ్యామల కాంతిపూర్ణుడై, కోటిసౌందర్య – రాజిత హాసాంచిత వదనుడై, సదస్యులందరికీ గాంధర్వరూపంలో ప్రత్యక్షమైనట్లనిపించింది. క్షేత్రయ్య పదం ఆ వెంటనే ఎత్తుకొన్నది.

నరసింహమూర్తి ఆనందం వర్ణనాతీతం, అతడా ఆనందంతో అచేతనుడౌతూ తన ఫిడేలును వాయించడం మానుతూ ఉండేవాడు.

మేళంవారు ఆ పరమసౌందర్య గాంధర్వం వింటూ శిల్పాలే అయిపోయినారు. ఏమి భాణి! ఇది మానవమాత్రుల భాణియా అని బుచ్చి వెంకట్రావు, ఆమెను తప్ప సర్వమూ మరచిపోయాడు. సుశీలాదేవి కన్నురెప్ప వేయని అనిమిషత్వంతో పద్మావతిని చూస్తూ ఆమె గాంధర్వంలో మేళవించి పోయింది. ఇవన్నీ ఒక గంట పట్టాయి.

పద్మావతి పాట చాలించి అక్కడే తన తల వంచుకొని కన్నుల నీరు కారిపోగా వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. అది గమనించగానే సుశీలాదేవి ఒకగంతున ఆ బాలిక కడకు పరుగిడి ఆమెను పొదివి పట్టుకొని, లేవదీసి తన గదిలోనికి తీసుకుపోయింది. అక్కడ ఆమెను ఒక సోఫాపై కూర్చుండబెట్టి తానామె ప్రక్కన కూర్చుండి, "అంత సిగ్గయితే ఎలా అమ్మా!" అని తెలుగులోనే మాట్లాడుతూ, నీ సంగీతందా నేను వర్ణించ శక్తి చాలదే. జన్మకోసారి కూడా ఇందమాదిరి పరమసౌందర్య స్వరూపమైన సంగీతం దొరుకునో ఏమో!" అని అన్నది.

ఇంతట్లో నాయరును పిలిపించి "కోకోచేసి, వెంటనే తీసుకురమ్మని." ఆజ్ఞ ఇచ్చి, ఈలోగా తాను మలబారు నుంచి తెచ్చిన మంచి ఔషధం రెండు మాత్రలు మింగించి, మంచినీళ్ళు త్రాగిపించింది.

సుశీల పద్మావతిని గదిలోకి తీసుకువెడుతూ ఉంటేనే పద్మావతి తేరుకుంది. మందు బాగా పనిచేసింది. కోకో పద్మావతిని పూర్తిగా మామూలు మనిషిని చేసింది.

సుశీలాదేవి పద్మావతిని తన స్నానాల గదిలోకి తీసుకుపోయి, మొగం కడుక్కోమని, తుడుచుకొనే తువాలు ఇచ్చింది. ఆమెకు తలసర్ది, పౌడరు అవీ వ్రాసి, బొట్టుంచి, తన పూలబుట్టలోంచి జాజిమల్లియ దండనుతీసి ఆమె తలలో అమరించింది.

పద్మావతి జాజిమల్లియ దండను చూచింది. ఆమె మనస్సు తేటబారింది. ఆ దండతో తన తలను అలంకరించిన సుశీలను పద్మావతి సిగ్గుతో పలకరిస్తూ ఇంగ్లీషులో "వదినా! ఈనాటినుంచి మనమిద్దరం ప్రాణస్నేహితులం సుమా!" అంది.

# షష్ఠమ గుచ్ఛము

సంగీత దర్శకుడైన రాధాకృష్ణ ఇంట్లో, పద్మావతి సంగీత ప్రదర్శనమైన కొద్దిరోజులకు, ఒక సాయంకాలం, పద్మావతి స్నేహితురాండ్రతో చీనాబజారుకు వెళ్ళింది. ఫేసుపౌడరూ, తిలకాలూ, సబ్బులూ అలాంటివన్నీ కొనుక్కుందామని వారి ఉద్దేశం. హాస్టలుకు కావలసిన సరుకులు కొత్వాల్ సావిడిలో కొనడానికి వసతి గృహాధికారిణి శ్రీమతి కరుణామయిగారు వస్తూ వుంటే వారితో ఈ బాలికలందరూ వచ్చినారు. అచ్చట ఒక కొట్టులోనికి ఎగబడి ఏవో రంగు రంగుల చీరలూ, రవికల గుడ్డలూ బేరం చేస్తున్నారు. అక్కడికి రాధాకృష్ణా అతని భార్య సుశీలాదేవి చక్కావచ్చారు.

"నమస్కారం పద్మావతీదేవిగారూ! చీరలు కొంటున్నారా ఏమిటి?" అంటూ సుశీల, పద్మావతీ తక్కిన బాలికలూ ఉన్నచోటికి వచ్చింది.

"నమస్కారం సుశీలాదేవిగారూ! అదిగో రాధాకృష్ణగారూ కూడా వచ్చారు. నమస్కారం రాధాకృష్ణగారూ! వీరందరూ మా సభా పాఠశాలలో చదువుకుంటున్నారు. వీరు కరుణామయిగారు, మా హాస్టలు అధికారిణి! అక్కగారూ, వీరు రాధాకృష్ణగారు. వీరు వారి భార్య సుశీలాదేవి గారు! ఈమె మళయాళీలు. రాధాకృష్ణగారు తెలుగువారు. ఎంతో ప్రసిద్ధి పొందిన సంగీత దర్శకులు" అని తొందర తొందరగా మాట్లాడింది.

పద్మావతి మోము ప్రఫుల్లమవడమూ, ఆమె కళ్ళలో కాంతి శ్రీమతి చూసింది. శ్రీమతి కరుణామయికి ఏమి బుద్ధి పుట్టిందో కాని సుశీలను చూచి, "ఏమండీ సుశీలాదేవిగారూ, మీరు తెలుగు బాగా మాట్లాడుతున్నారే! కొంచెం మళయాళీయాస ఉందనుకోండి! మీరు తప్పక మా ఆంధ్ర మహిళాసభలో మెంబరు కాకూడదా?" అని అడిగింది.

**సుశీల :** తప్పక చేరుతానండి. రేపో ఎల్లుండో వీలు చేసుకుని వస్తాను.

**కరుణా :** మీరు మీ భర్తగారిచేత మా సభలో పదిహేను రోజుల తర్వాత జరిగే సభలో సంగీతం పాడించాలని ప్రార్థిస్తున్నాను.

**రాధా :** మా గృహలక్ష్మిగారిని ప్రార్థించనక్కరలేదు. కరుణామయిదేవిగారూ! మీరు ఎప్పుడు వచ్చి పాడమంటే అప్పుడు వచ్చి పాడడానికి సిద్ధం.

**పద్మావతి :** తప్పక రండి రాధాకృష్ణగారూ! ఆ సందర్భంలో సుశీలాదేవిగారూ కూడా పాడతారు.

**సు :** పద్మావతీదేవిగారూ పాడతారు.

**క :** చాలా బాగా ఉంది. ఆ సభ దివ్యంగా రక్తి కడుతుంది.

**పద్మా :** అమ్మో! నేను పాడడమే!

**సు :** నేను పాడితేదా చాలా బాగా ఉండునా ఏమీ? ఏమమ్మా నీవుదా చెబుతావు. నువ్వు పాడతానంటేనే నేను పాడటానికి మాట ఇస్తును.

క : మా పద్మావతి తప్పక వప్పుకుంటుంది లెండి.

**రాధా :** పద్మావతీదేవిగారి గురువుగారు నాకూ కొంతకాలం గురువుగారు సుమండీ! మా గురువుగారు నరసింహమూర్తిగారు ఫిడేలు వాయిస్తారు లెండి.

**పద్మా :** మా మేష్టారి అనుమతి పుచ్చుకోవద్దా రాధాకృష్ణగారూ!

**రాధా :** ఆయన అతి సంతోషపడతారు.

ఇంతట్లో చీరల బేరం సాగింది. సుశీల మంచిచీర ఒకటి తీసి "ఇది కొనుక్కో పద్మావతి వదినా! నీకు ఇది బాగా ఒప్పుతుంది!" అన్నది.

ఆ చీర కరుణామయికి నచ్చలేదు. అది అతి నవీన విధానంగా ముందు కుచ్చులకు వచ్చేభాగం ఎంతో పెద్ద లతలతో తక్కిన చీర రంగును భేదంగా ఉన్న రంగుతో ఉంది. చీర అతి పల్చన. అలాంటి చీరలు కొందరు సినీమా తారలూ, పెద్ద ఉద్యోగస్తుల తనయులూ కడుతున్నారు. అయినా పద్మావతి అలాంటి చీర కట్టుకుంటే, ఆమె మనస్సు ఏ ఏ రీతుల ప్రవహిస్తుందో అని కరుణామయి అనుకున్నది. ఒక్కొక్కరకం మనః ప్రవృత్తికలవారు ఒక్కొక్కరకం చీరనూ రంగునూ ఎన్నుకోడం ఉంది. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క చీరా, ఒక విచిత్రమైన లతలూ, నేతా, రంగులూ కలిగిన బ్లౌజు, స్త్రీలలో ఒక్కొక్క మార్పు కలుగజేస్తుంది. అని కరుణామయి అనుకున్నది. ఆ చీర కొనవద్దని చెప్పుదామని రెండుమార్లు అనుకున్నది. నాలుక చివరివరకూ మాట వచ్చింది. తాను మాటంటే పద్మావతి అది రాజాజ్ఞగా పరిపాలిస్తుంది. నిజమే! కాని లోన ఎంతో బాధపడుతుంది. ఎవరి జ్ఞానం వారే సంపాదించుకోవాలిగదా అని నిశ్చయానికి వచ్చి కరుణామయి మాట్లాడక వూరుకుంది. పద్మావతి ఆ చీర కొనుక్కుంది.

తక్కిన బాలికలకు చీరలూ, రవికగుడ్డలూ ఏరుతూ, కరుణామయీ, బాలికలూ ఆ పనిలో నిమగ్నులయ్యారు. సుశీలా, రాధాకృష్ణా, పద్మావతీ షాపులోనుండి వీధిలోనికి వచ్చి అక్కడ వున్న వారి కారులో కూర్చున్నారు. సుశీల తన కారు నడుపుకుంటుంది.

"నువ్వే కారు నడుపుతావా ఏమిటి వదినా?" పద్మావతి సుశీలను అడిగింది.

"అవును. ఇది నా కారు. మీ అన్నగారికి వేరే కారు ఉంది. నా కారు ఇంకోరు నడిపేందుకు అవసరం లేదు." అని సుశీల పకపక నవ్వుతూ జవాబు చెప్పింది.

రాధాకృష్ణ చూపులు ఇంతవరకూ పద్మావతి పైనే ఉన్నాయి. అతడు సిగరెట్టుమీద సిగరెట్టు వూదేస్తూనే వున్నాడు. ఆ అమ్మాయి దేహవిన్యాసము అతణ్ణి విపరీతంగా ఆకర్షించింది. శిల్పశాస్త్ర రీత్యా ఇంత మనోహరమైన శరీరం ఈ లోకంలో ఉండదు – అని అతడనుకొన్నాడు. ఆ రూపానికి తగినట్లు మోము, ఆ మోము సౌందర్యంలో ఆర్యజాతి వారి రేఖలు వుండకపోవచ్చుగాక. ఆ చామన ఛాయ ఎంత ఒప్పిందో? ఆ దేహం ఎంత స్నిగ్ధంగా ఉన్నదో. స్వచ్ఛమైన రంగు, ధనమూ, సంపదా రాగానే రంగు కూడా వచ్చింది. వీళ్ళు మాంసాదులు తినడం మానివేశారట. దానివల్ల మానసికంగా కూడా మార్పులు వస్తాయి కాబోలు!

ఆ బాలిక కళ్ళు విశాలంగా సోగలై, వెన్నెలకాంతులు పొదువుకొని ఉన్నాయి. చామనఛాయ కలవారిలో ఇంత అందం వుంటుందని అతడిదివరకు ఊహించుకోలేదు.

అలా అతని ఆలోచనలు ప్రవహించిపోతున్నవి.

ఆర్ద్రత కలిగిన అతని చూపులు తనపై పూర్తిగా ప్రసరించిపోవడం పద్మావతి గ్రహించింది. అతని హృదయంలో తన్ను గురించిన ఏవో ఆలోచనలు గుబాళించు కొంటున్నాయని ఆమె ఊహించుకుంది. ఇంత పేరు పొందినవాడు, ఇంత గాయకుడు తానంటె సమ్మోహపడడం తనకెంతో గొప్ప అనుకుంది. ఆమెకు ఏదో పట్టరాని ఆనందం కలిగింది. "మీరూ మా వదినా పాడేటట్లయితే నేనూ పాడతానండీ రాధాకృష్ణగారూ!" అని చటుక్కున పద్మావతి అన్నది.

రాధాకృష్ణ చకితుడై "ఆఁ ఏమిటీ? చాలా బాగుంటుంది. ఆ రోజు మనవాళ్ళందరికి దివ్యమైన సంగీతపు పిండి వంటలతో విందు చేద్దాము" అన్నాడు. ఇంతట్లో కరుణామయి తక్కిన బాలికలూ పైకి వచ్చారు. పద్మావతి వారందరితో కలసి ఆంధ్ర మహిళా సభకు వెళ్ళిపోయింది.

## ②

బుచ్చి వెంకట్రావు, రాధాకృష్ణ ఇంటిలో జరిగిన సంగీత ప్రదర్శనం వెనక పదిరోజులకు ఒక సాయంకాలం తన కారుమీద ఒంటిగా రాధాకృష్ణ మేడకు వచ్చినాడు. అతనికి ఇన్నాళ్ళూ మంచి స్నేహాలు దొరకలేదు. వ్యాపార సంబంధం కలిగినవారు పదిమందితో అతనికి పరిచయం కలిగిన మాట నిజమే. కాని అది పరిచయంగానే ఉండిపోయింది.

అతనికి అతి సన్నిహిత మిత్రుడు నరసింహమూర్తి మేష్టారే! ఇంతవరకూ భార్యా, తనూ సర్వతోముఖంగా జ్ఞానవంతు లవ్వాలన్న దీక్షే అతనికి స్నేహాలు అవసరం లేకుండా చేసింది. ఇప్పుడు భార్య దూరమైపోయింది. మదరాసులో నరసింహమూర్తి మేష్టారు నానాటికి తనకు తాబేదారయ్యాడు. స్నేహం చాకిరిగా మారిపోయింది.

ఇంక అతనికి తన వ్యాపారం తప్ప ఇంకో వృత్తి లేకపోయింది. సాయంకాలం ఏమీ తోచేదికాదు. బీచికి వెళ్ళటం మొదటి దినాల్లో కొంత కాలక్షేపం అయింది. సినిమాలు కొంత కాలక్షేపం తీర్చేవి. చివరికి రెండూ విసుగు పుట్టించాయి. కొన్ని దినాలు అలా కారు వేసుకొని మద్రాసంతా తిరిగేవాడు. అతడు వెళ్ళని పేటలేదు. తిరగని సందులేదు. అదీ విసుగు పుట్టింది.

అలాంటి బుచ్చివెంకట్రావుకు రాధాకృష్ణ మంచి స్నేహితుడు కావచ్చును అనిపించింది. ఆ ఆలోచనతో రాధాకృష్ణ ఇంటికి వచ్చాడు.

రాధాకృష్ణ ఇంటిలోలేదు. "ఏదో సినిమా చిత్రంలో ఒక పాట రికార్డు చేస్తూండడం వల్ల వారు వెళ్ళినారు" అని సుశీలాదేవి ఆయనతో చెప్పి. "రండి! కాస్త కాఫీ తాగుదురు గాని!" అని లోని హాలులోనికి ఆహ్వానించింది.

బుచ్చి వెంకట్రావు బలసంపద కళ్ళు తనివోవ సుశీల చూస్తూ అతడు కూచున్న సోఫాకు ఎదురుగా వున్న సోఫాలో కూచుంది.

"మీరు యుద్ధానికి వెళ్ళివచ్చారా వెంకట్రావుగారూ?"

"వెళ్ళివచ్చాను. కాని అది నాకు ఉపకారమే చేసిందో, అపకారమే చేసిందో?"

"అదేమిటి అలా అంటారు?"

"అవునండి! యుద్ధానికి వెళ్ళకముందు నేను వట్టి పల్లెటూరి పల్లెవాడిని. యుద్ధంనుంచి వచ్చాను. ఏదో పిచ్చి పిచ్చి ఆలోచనలు పుట్టాయి. చేపల వర్తకం పెట్టాను. రంగూనుకు, అలాంటి ఇతర దేశాలకూ రొయ్యపప్పు ఎగుమతీ. ఆ మూలాన బాగా లాభం వచ్చింది. వస్తూ వున్నది. ఇంక నాకు మా ఆవిడకూ జ్ఞానసముపార్జన తృష్ణ ఉద్భవించింది. నాగరికతా, చదువూ కావాలి. ఆవిడకుః సంగీతమూను, మేము నాగరికులమయ్యాము. కాని తృప్తి, ఆనందమూ మాత్రం మాయమయ్యాయి సుశీలాదేవిగారూ!"

బుచ్చి వెంకట్రావు మాట్లాడుతున్నంతసేపూ సుశీల అతనివైపు రెప్పవాల్చకుండా చూస్తుంది. ఎంత విచిత్రంగా వుంది బుచ్చి వెంకట్రావు కథ. పద్మావతిలోనూ ఏదో అసంతృప్తి వుంది. ఈతనిలోనూ ఏదో అనూహ్యమైన ఆవేదన బయలుదేరింది. తన జీవితమూ విచిత్రమైనదే, తనకు ఈ వివాహం కాకముందే పురుష సంబంధం వున్నది. స్కూల్ ఫైనల్ పరీక్ష అయి తిరువాన్కూరులో సంగీతమూ, నాట్యమూ కొంత నేర్చుకొన్నది. ఒక మలయా సినిమా చిత్రంలో వేషం వేయడానికి (ఏదో చిన్న నాట్య వేషమే అనుకోండి) తను మద్రాసు వచ్చింది. అంతట్లో తను, రాధాకృష్ణ దగ్గిర శిష్యురాలయింది. అతనితో నాట్య భాగస్వామిని అయింది. అతడు బ్రాహ్మణుడు, తను నాయరు బాలిక, అయినా తనకు అతడు సరియైన పురుషుడని తోచింది. అతని వల్ల తనకూ పేరు వచ్చింది. అతడు సంగీత దర్శకుడుగా, నాట్యదర్శకుడుగా ఉన్న ప్రతి చిత్రంలో తనకూ నాట్య వేషమో లేక రెండవ నాయిక వేషమో వస్తోన్నది. అతడు తన పేర ఒక ఇల్లు కొన్నాడు. కొంత డబ్బు బ్యాంకిలో వేస్తున్నాడు. తన జీవితం హుషారుగా ప్రవహించి పోయింది. ఇంతట్లో అతని పేరు హెచ్చిపోసాగిందది. అనేక కంపెనీల వారు ఇతర నాట్యకత్తెలు కావాలనేవారు. ఇంక రాధాకృష్ణ దూరమైపోతాడని ఊహించింది. వివాహ ప్రసక్తి తెచ్చింది.

"బుచ్చి వెంకట్రావుగారు! తృప్తి, ఆనందమూ అనేవి మనలో ఉన్నవి అంటారా, పైనుంచిదా వచ్చేవంటారా?"

"మనలోనే ఉన్నాయనుకోండి, కాని పైన మనకు సంధానమయ్యే పరిస్థితులనుబట్టి కదా మనకు ఆనందమూ, తృప్తి కలగడము!"

"అవునుదా! నిజమే కాని, మనకు ఏలాంటి పరిస్థితి సంఘటించినా, దానివల్ల మన మనః ప్రవృత్తి ఎందుకుదా మారాలి?"

"నిగ్రహం కలవారికి మారదనుకోండి. కాని ఎందుకు మనం ఈ పనులన్నీ చేస్తున్నామో తెలియని వారికి నిగ్రహం కలుగదు. జ్ఞానం వృద్ధి అయినకొద్దీ, మనస్సుకు నిలకడ తక్కువౌతుంది."

"సంపూర్ణ జ్ఞానం కలవారికి!"

"సంపూర్ణత అనేది జ్ఞానానికి వుందా!"

"కాబట్టి, జ్ఞానం సంపాదించడానికి అంతులేదు. జ్ఞానం సంపాదించే వారందరికీ అసంతృప్తి అన్న మాటేనని సెప్పండిమి!"

"ఈ విషయాలన్నీ ఆలోచించడానికి నాకు శక్తి ఎక్కడ ఉందండి!"

"కాబట్టి ఏమీ ఆలోచించకుండా ఉండరాదా అండి."

"అది ఎల్లా సాధ్యం! నేను యోగినా? ఉప్పూ, పులుసూ, కారం తినేవాడిని."

"అయితే ఆ ఆలోచనలవల్ల వచ్చే బాధలను, ఆవేదనలను భరించడం నేర్చుకోవలసిదా, ఉంటుంది. అసంతృప్తి వల్ల వచ్చే హృదయ బాధ భరించవలసిదా ఉన్నది."

"అందుకోసమే సర్వకాలమూ ప్రయత్నం చేస్తున్నాను!"

ఇంతట్లో నాయరు ఏవేవో ఫలహారాలు, "టీ కెటిల్" పాల "జగ్గూ", పంచదారభరిణా, చెంచాలూ, అన్నీ పట్టుకు వచ్చి, ఆ లోని హాలులో ఒక మూలగా ఉన్న టీ బల్లపైన వుంచాడు. సుశీల "రండి మీ వెంకట్రావుగారూ!" అని పిలిచి అతణ్ణి టీ బల్ల కడనున్న కుర్చీలో ఒకదానిలో కూచోమని కోరింది. వారిద్దరూ కూచుని ఉపహారం సేవింప సాగించారు.

"ఏమండీ వెంకట్రావుగారూ! మీకు తోచనప్పుడల్లా మా ఇంటికి రండి. మీరు ఎప్పుడు పడితే అప్పుడే రావచ్చును. అరవ సినీమా చిత్రాలలో, మళయాళ చిత్రాలలో, నా కంఠము కొందరు సినిమా తారలకు ఇస్తున్నాను. అందుకై పాటలు రికార్డింగుకు మాత్రందా వెడుతూ ఉంటాను. నాట్యకత్తెగా సినిమా చిత్రాలలో నటిస్తాను. గనుక, ఆ సమయాలలో తీరుబడి ఉండదు. మీరు ముందు ఫోనుచేసి, మా ఇద్దరిలో ఎవరన్నా ఉన్నారో లేరో కనుక్కొని, ఎవరున్నా తప్పకుండా రండిమీ. మీ ఆవిణ్ణిదా తీసుకువస్తూ ఉండండి"

"మా ఆవిడ ఆంధ్ర మహిళాసభ విద్యాలయంలో విద్యార్థిని. ఆవిడ ఆసభ విద్యాలయం, వసతి గృహాల క్రమశిక్షణకు బద్ధురాలు కదా! కాబట్టి ఎప్పుడు ఆవిణ్ణి వీలుగా తీసుకురావచ్చునో అప్పుడల్లా తీసుకువస్తాను."

"మీ రెప్పుడు ఇంటిదగ్గిరనా ఉందురు?"

## ③

"ఇల్లూ, ఆఫీసూ ఒక్కటేగనుక ఎప్పుడుపడితే అప్పుడే వుంటాను."

"అయితే చూస్తిరా? నేనుగాని, నేనూ మా ఆయనగాని, మా ఆయన ఒక్కరేగాని మీ ఇంటికి తరుచుగా వస్తూ వుంటుమే."

"అంతకన్న భాగ్యమేముందండీ!"

అంతకంతకు బుచ్చి వెంకట్రావుకు సుశీలతోనూ, రాధాకృష్ణతోనూ స్నేహం ఎక్కువయినది. ఈతడు వీరింటికి రావడమూ, వీరు బుచ్చి వెంకట్రావు ఇంటికి వెళ్ళడమూ, అందరూ కలిసి సినీమాకు వెళ్ళడమూ, వెంకట్రావుకు కాలం జరగడం లేదన్న ఆవేదన పోయింది.

అతనికి, సుశీలకూ స్నేహం ఎక్కువైంది. సుశీల అతణ్ణి ఒక్కణ్ణే కలుసుకునేది. అతణ్ణి కారుమీద ఈ ఊరు ఆ ఊరు ప్రయాణం చేయించేది. రాధాకృష్ణ "సుశీల మీ చెల్లెలనుకోండి, మీ రామెస్నేహంలో ప్రపంచజ్ఞానం పూర్తిగా అలవలరచుకొంటారు బావగారూ!" అనేవాడు.

సుశీల బుచ్చి వెంకట్రావుకోసం రాగానే అతని భుజాల మీద చేయివేస్తుంది. ప్రక్కనే కూచుంటుంది. అతని ఛాతీ మంచి విశాలమైనదని తడుముతుంది. దండలు ఉక్కుతో చేసివుంటాయని నొక్కుతుంది. తనకు బలమైన వాళ్ళను చూస్తే ఆనందమంటుంది.

సుశీల కలుపుగోరుతనమూ, ఆమె లేనిపోని పిచ్చి పిచ్చి ఊహలు పెట్టుకోకుండా తనతో సాయిలా ఫాయిలాగా ఉండడమూ అతనికి చాలా ఆనందం కలిగింది. అతని హృదయంలో ఏవో బరువులు కరిగిపోయినట్టయినది.

మధ్య మధ్య ఆంధ్రమహిళాసభ పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనుమతితోనూ, వసతిగృహాధికారిణి అనుమతితోనూ పద్మావతిని రాధాకృష్ణగారింటికి బుచ్చి వెంకట్రావు తీసుకువచ్చేవాడు. ఆ సమయంలో రాధాకృష్ణ ఆనందానికి మేరలేకపోయేది. పద్మావతీ అతడూ సంగీతం అని కూచునేవారు. రాగాలు, తాళాలు సినీమాలలో ఆనాడు ఎక్కువగా వాడుకలోకి వచ్చిన పాటలు, అవి విపరీతంగా ప్రజామోదం పొందటానికి హేతువులు, గట్టి సంగీతం ఎందుకు ప్రజలకు భరింపరానిదవుతుంది – ఈ విషయాలు ఆమెకు చెప్పేవాడు రాధాకృష్ణ, ఆమెకు ఉత్తరాది, మహారాష్ట్ర సినీమాల పాటలు గ్రామ ఫోనులో వినిపించేవాడు. తానిచ్చిన వరసలు ఉత్తరాది వరసలకన్నా దక్షిణాది వరసలకన్నా ఎందుకు బాగుంటాయో చెపుతూ, తన వరసలూ ఆయా పాటల వరసలూ పాడి వినిపించి ఆమెకు తెలియజేసేవాడు.

ఆ మేడలో సుశీలా వెంకట్రావు ఒక వైపునకూ పద్మావతీ రాధాకృష్ణ లొకవైపునకూ తేలుకు వెళ్ళేవారు. పద్మావతిని ఏదో వంకతో రాధాకృష్ణ స్పృశించేవాడు. ఆమె దేహం తన శరీరానికి తగులుతూ ఉండేటట్లు సోఫాలో కూచునేవాడు. నడుస్తూ ఉన్నప్పుడు, ఆమె నడుం చుట్టూ చేయి వేసేవాడు.

మొదట పద్మావతి భయపడింది. ఈ విధానం అతి నవీనం కాబోలు. ఇందులో తప్పులేదని సమాధాన పెట్టుకున్నది. అంతకంతకు రోజులు గడచిన కొద్దీ ఆ బాలికకు రాధాకృష్ణ స్నేహం అతి అవసరమైనది. సంగీతం విషయాలు నేర్చుకొనడం ముఖ్యమే! అంతకన్న ముఖ్యం రాధాకృష్ణ మాటలే! అతడు మాట్లాడేవన్నీ ఆమెకు తెలియవు. అతడు ఏవేవో చెప్పేవాడు. అతడు ప్రపంచంలోని అన్ని విషయాలు తెలిసికోలేదు. అతని చదువూ అంత పెద్దదికాదు. రోజూ వచ్చే దినపత్రికలు వార్తలిస్తాయి. కొన్ని ఉపన్యాసాలు ముద్రిస్తాయి. అవి విజ్ఞాన విషయాలేమి చెప్పగలవు? స్నేహితులైన సినీమావారు మాట్లాడుకునే మాటలూ, చప్పచప్పని ఆరణాల మాస, పక్షపత్రికలు ఏమంత జ్ఞానం ఈయగలవు?

అయినా ఇప్పుడిప్పుడే ప్రపంచజ్ఞాన వాతావరణంలో హృదయపుష్పపుటాలు విప్పుతూన్న పద్మావతికి అతడు ఏ విషయం చెప్పినా అవన్నీ అద్భుతంగా ఉండేవి. ఇంతకూ అతడు అదృష్టవంతుడూ, చాలా తెలివైన సంగీతదర్శకుడూ!

ఇటు పద్మావతికి ఏ రీతిగా ఏదో సంతృప్తి హృదయం నిండిపోయిందో, ఆ రీతిగా సుశీలాదేవి స్నేహంవల్ల బుచ్చి వెంకట్రావుకు వర్ణింపరాని తృప్తి కలిగింది.

అతని హృదయంలోనూ సుశీలాదేవి విషయంలో స్త్రీ పురుష సంబంధ విషయకమైన భావాలు కలుగలేదు. అలాంటి భావాలేమైనా పద్మావతీ వెంకట్రావుల హృదయ మూలాల స్పందనం అయివుండెనో ఏమో! కాని వారిద్దరి ఆవేదనలూ తగ్గిపోయాయి.

పద్మావతి ఇప్పుడు విద్యాలయంలో తృప్తిగా చదువుకుంటున్నది. తోటి బాలికలతో ఎక్కువ చనువును సంపాదించుకుంటున్నది. వారితో కలిసి తిరగడం ఆమెకు ఎక్కువ ఇష్టమైనది. అంతకంతకు శ్రీమతి కరుణామయిగారితో ఆమె స్నేహం వృద్ధి పొందింది.

కరుణామయికి పద్మావతి అంటే చెప్పలేని దయ కలిగింది. ఆమె ఎక్కువ శ్రద్ధ వహించి తానే ఎన్నో విషయాలు ఆమెకు బోధించేది. పద్మావతి సభలలో నిర్భయంగా సంగీతం పాడేట్లు చేసి, ఆమె సభా పిరికితనం మాయంచేసింది.

ఇంతలో దసరా ఉత్సవాలు వచ్చినవి. ఆ ఉత్సవాలలో ఒకరోజున రాధాకృష్ణ, సుశీల, పద్మావతిగార్ల సంగీతపు కచ్చేరీ జరిగింది. ఆ రోజున పద్మావతి అపర మీరాబాయిలా ప్రకాశించింది. సంగీతంలో సుబ్బులక్ష్మికి దీటనుపించుకుంది. పాడినపాటలలో ఒకటి మాత్రమే త్యాగయ్య కృతి. తక్కినవన్నీ ఈనాటి కవులలో ప్రసిద్ధికెక్కినవారి పాటలు, కృష్ణశాస్త్రిగారి ఊర్వశీ గీతమొక్కటీ, మురళీ గీతమొక్కటీ పాడింది.

"మోయింపకోయ్ మురళి మోయింపకోయ్!" అన్న పల్లవిలో రాధాదేవిలో ప్రతిభక్తునిలో, మురళీకృష్ణ దివ్యభావంవల్ల ఉద్భవించే పరమ మనోహరానందం రాగంలో అవరోహణంలో చూపించింది – "తీయ తేనియ బరువు మోయలేదీ బ్రతుకు" అని అనుపల్లవి ఎత్తుకొని, ఆ ఆనంద వివశత్వం, ప్రియా ప్రణయగాఢోత్కంఠితయైన రాధ ఆ విశ్వసౌందర్యంలో లయమూ కావాలి. లయము కాకుండా తన దివ్యపురుషునితో సాలోక్య, సారూప్య సామీప్యానందమూ పొందాలి.

ఆ పాట శ్రోతల హృదయాలు కరిగించినది. ఆనందంతో అనేకమంది స్త్రీల కన్నులనీరు జలజల ప్రవహించాయి.

❁ ❁ ❁

# సప్తమ గుచ్ఛము

"పద్మావతీదేవిగారికి గాయకులమైన మేమంతా 'గీతాదేవి' అని బిరుదు ఇస్తున్నాము." అని రాధాకృష్ణ ఆ సంగీతసభ అనంతరం, పద్మావతి సంగీతాన్ని మెచ్చుకుంటూ ఉపన్యాసం ఇచ్చి ముగించాడు. సభ అంతా కరతాళ ధ్వనులు నిండిపోయాయి.

అక్కడనుండి 'గీతాదేవి' సంగీత కచ్చేరీలు మద్రాసులో ఎన్నో జరిగాయి. కొన్ని ఆంధ్ర విద్యా సంస్థల పోషణార్థం ధనం వసూలు చేయడానికి గీతాదేవి సంగీత సభలు ఏర్పాటయ్యాయి. ఒక్కొక్క గానకచ్చేరీకి పదివేలు, పదిహేనువేల రూపాయలు రాబడి రాసాగింది. ఆంధ్ర తుఫాను నిధికీ, తమిళదేశం వరదలనిధికీ, ప్రభుత్వంవారు ఆ బాలికను కచ్చేరీలకు ప్రార్థించి ఒప్పించుకొన్నారు.

'గీతాదేవి' ప్రసిద్ధనామమయినది. గ్రామఫోను కంపెనీలవారు ఆమె పాటలు రికార్డు తీయ ఏర్పాట్లు చేసుకొన్నారు. ఒక ప్రసిద్ధ ఆంధ్ర సినిమా కంపెనీవారు ఆమెను తమ చిత్రంలో ఉపనాయికగా రమ్మనమని పిలిచారు. ఆమె రానని చెపితే, ఆమె కంఠం నాయికకు గాంధర్వ కంఠంగా బుక్ చేసుకున్నారు.

వీటి అన్నింటికీ కారణం రాధాకృష్ణ. రాధాకృష్ణ పద్మావతీ చరణచారణ చక్రవర్తి అయిపోయినాడు. ఒక్కరోజు పద్మావతిని చూడకపోతే అతనికి తోచదు. తాను ఆంధ్ర మహిళాసభకు సుశీలను పంపి పద్మావతిని తీసుకు రమ్మంటాడు. 'గీతాదేవి'కి చదువు సాగటంలేదు. పద్మావతికి మతిలేదు.

మహిళాసభ విద్యా సంస్థాధ్యక్షురాలు పద్మావతిని తన గదిలోనికి పిలిపించుకుంది. "ఏమమ్మా పద్మావతీ! నువ్వు సంగీతంలో అతి ప్రసిద్ధురాలివైపోయినావు, నువ్వు మా సభలో ఉండటం కీర్తే! కాని విజయం పొందదలచుకొన్న పరీక్షమాట ఏమిటి? ఇంతవరకూ చదువులో బాగా వచ్చావు. కాని, ఈ సంగీతం గొడవవల్ల కాబోలు మొన్న అర్ధసంవత్సరం పరీక్షలో చాలా తక్కువ మార్కులు వచ్చాయి. పరీక్షలు ఇంక నాలుగు నెలలే ఉన్నాయి. ఇప్పటినుండి గట్టిగా చదవకపోతే నువ్వు పరీక్షలకు వెళ్ళి లాభం వుండదు. నీకు సంగీతంలో పేరు రావడం, నీవల్ల లోకానికంతకూ ఉపకారం జరగడం మాకందరికీ ఎంతో ఆనందంగానే వుంది. అయితే మరి చదువుమాట?"

"అవునండీ. అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఇంతా కష్టపడి చదివి, పరీక్షకు వెళ్ళకపోతే ఏమిలాభం? ఈ ఏడు పరీక్షకు వెళ్ళకపోతే ఇంక జన్మలో పరీక్షకు వెళ్ళలేను."

"కాదుమరీ! కనుక బాగా ఆలోచించుకో. పరీక్షకు వెళ్ళడం మానివేస్తే నువ్వు హాస్టలునుంచి వెళ్ళిపోవాలి. నిరుడు పరీక్షలో నెగ్గని ఇద్దరు బాలికలు ఈ నాలుగు నెలలు ఇక్కడే వుండి చదవాలని, వస్తామని వ్రాసారు. వారిని నీ గదిలో ప్రవేశపెట్టగలను."

"నేను పరీక్షకు వెళ్ళితీరుతానండి!"

"అయితే సంగీతం? పేరు? సభలూ? రికార్డులూ? సినీమా?"

"ప్రస్తుతం అన్నీ మానేస్తాను!"

"రేపు రాధాకృష్ణగారు వచ్చి బలవంతం చేస్తారు. సుశీలగారు వచ్చి బ్రతిమాలుతారు!"

"అవన్నీ లెక్కచేయనండీ! పరీక్షకని సంకల్పంతో కదా ఇక్కడ చేరిందీ! అవి పూర్తిచేసుకుని తీరుతాను."

"ఇంక నేను చేసే ఏర్పాట్లు విను. నీ భర్తగాని, నరసింహమూర్తి మేష్టారుగాని సాయంకాలం వచ్చి మాట్లాడవచ్చును. సుశీలగారూ, రాధాకృష్ణగారు వస్తే నీకు తీరుబడి లేదన్న మాట! సంగీత బేరాలు ఏవీ ఒప్పుకోడానికి వీలు లేదు. ఏవైనా సరే! ఎంత గొప్పవాళ్ళయినా సరే! సాయంకాలం షికారు బందు! ఇవి ఇష్టమైతే పరీక్షకు దరఖాస్తు పెట్టిస్తాను. లేదంటావూ నువ్వు మీ ఇంటికెళ్ళవలసిందే!"

ఈ మాటలు ఖచ్చితంగా అధ్యక్షురాలు అంటూ వుంటే పద్మావతి ముఖం వెలవెలపోయింది. అది చూచి, "నేనింత నిష్కర్షగా అంటూ వుంటే మనస్సులో బాధపడకు తల్లీ! నీకోసమే చెప్పాను. ఏ విషయమూ వేళాకోళంగా చూడకూడదు. తర్వాత నీ ఇష్టము" అని అన్నది. పద్మావతి ఆలోచించుకుంటూ వెళ్ళిపోయింది.

## (2)

నరసింహమూర్తి మాష్టారుకు ఏదో ఆవేదన పట్టుకుంది. పద్మావతి విషయం చూస్తూవుంటే అతనికి మతిపోయింది. ఈనాడు ఆమె జీవితం తనకందని వేగంతో ప్రవహిస్తోంది. ఆ మహోఝంఝూమారుతంలో తానో మూలకు కొట్టుకొనిపోయినాడు. అతణ్ణి గమనించేవారేలేరు. రాధాకృష్ణ "ఓహో!" అంటాడు. "మేష్టారూ! ఎప్పుడు వచ్చారండోయ్!" అంటాడు. "సుశీల లోపల ఉందండీ!" అంటాడు; ఆ తర్వాత ఆ ముక్కలూ అనడం మానివేశాడు.

రాధాకృష్ణ గానమేళంలో, మొదట అతడు ఫిడేలు వాయించేవాడు. ఆ రోజుల్లో "మేష్టారూ! ఈ పాట ఈ రకంగా ప్రారంభిద్దాము" అనేవాడు. "గురువుగారూ, ఇప్పుడు ఆ ఫ్లూటు ఈ సంగతులు వేస్తే బాగుంటుంది కాదండీ!" అనేవాడు. నేడు అలాంటి సలహాలు అడగడు. ఆయన రాకపోయినా రాధాకృష్ణ మేళం సాగిపోతూనే వుంది. రమ్మనమనీ అడగడం తగ్గించాడు.

అప్పుడంత గౌరవం చేసిన రాధాకృష్ణ నేడింత ఉదాసీనం వహించాడేమిటి?

నరసింహమూర్తి మేష్టారి హృదయం కృంగిపోయింది. అటు బుచ్చి వెంకట్రావూ తనకు దూరమైపోయాడు. ఇటు పద్మావతీ చదువులో పడిపోయింది.

బుచ్చి వెంకట్రావు సుశీలాద్వితీయుడై లోకం అంతా తిరుగుతున్నాడు. ఇప్పుడంత త్రాగడానికి వీలులేదు. పట్టణంలో ప్రొహిబిషను వచ్చింది. రహస్యంగా ఏలాంటి బుడ్లయినా దొరుకుతాయి. కాని అతనికి ధైర్యం లేకపోయింది. త్రాగుడు అతనికి జీవితంలో భాగం కాలేదు. పైగా త్రాగుడు కన్న నిషాకలిగిన సుశీల స్నేహం దొరికింది. ఆ స్నేహంలో

బుచ్చి వెంకట్రావుకు పద్మావతి అవసరం లేదు. నరసింహమూర్తి మేష్టారూ అవసరంలేదు అనిపించింది.

రాధాకృష్ణకు సుశీల అంటే నమ్మకమే! మలబారు నాయర్లమ్మాయి. సంగీతమూ నాట్యమూ తిరువాంకూరులో నేర్చుకుని, మద్రాసులో భరతనాట్యంలో అందెవేసిన చేయి కావాలని ఆ మహానగరం వచ్చింది. మదరాసులో కామాక్షీశ్వర పిళ్ళైదగ్గిర తంజావూరి విధాననాట్యం నేర్చుకునే రోజుల్లో రాధాకృష్ణ కామాక్షీశ్వర పిళ్ళై ఇంటికి వచ్చినాడు. కామాక్షీశ్వరపిళ్ళైకు అతడు శిష్యుడు.

రాధాకృష్ణ తనగతి ఏమిటి అని పదేళ్ళ క్రిందట తటపటాయించే రోజుల్లో కొంతకాలం కూచిపూడి వెళ్ళి, నాట్యం నేర్చుకున్నాడు. కొన్నాళ్ళు వేదాంతం లక్ష్మినారాయణగారికి శిష్యుడయ్యాడు. అతడు ఆడవేషంవేసి నాట్యం చేస్తే ఆడవాళ్ళ నాట్యంకన్న, అతని నాట్యం బాగుంటుందంటున్నారు. "వేషము స్థానం నరసింహారావుగారి చిన్ననాటి ఆడవేషం అంత బాగుంటుంది." అని ఒక నాట్యకళా విమర్శకుడు వ్రాసినాడట. ఆ వెనుక తంజావూరి విధానంకోసం అతడు మదరాసు వచ్చి కామాక్షీశ్వరపిళ్ళైకు శిష్యుడయ్యాడు. అక్కడ తోటి శిష్యురాలైన సుశీలతో ఈతనికి పరిచయం గాఢమైనది.

సుశీలకు ఆమె ఇంటిదగ్గర కూచిపూడి నాట్యం నేర్పినాడు. ఆమెకు ఆంధ్ర సంగీతం నేర్పినాడు. వారిద్దరి స్నేహమూ ప్రేమగా మారింది. రాధాకృష్ణ సంగీత దర్శకత్వంలోకి ఉరికాడు. వివిధ వాద్య కుశలులైన వారిని చేర్చి, సంగీత మేళం ఏర్పాటు చేశాడు. ఎందులోనన్నా చొచ్చుకుపోయే జాతి గనుక అతడు మేళ విధానములో ప్రథమశ్రేణిలోకి వెళ్ళినాడు. వెంటవెంటనే ఒక సినిమా కంపెనీ అతన్ని సంగీత దర్శకుడుగా నియమించింది. వారు తీసే బొమ్మలో పాటలు దివ్యంగా, జనానురంజకంగా తయారై దేశమంతా మారుమ్రోగిపోయినవి. సుశీలాదేవి నాట్యమూ ప్రసిద్ధి వహించింది. రాధాకృష్ణ సుశీలలు రిజిష్టరు వివాహం చేసుకున్నారు. వారి వివాహానికి సినిమా ప్రపంచం, రసజ్ఞలోకం బంధుమిత్ర సమేతమై హాజరైంది.

బుచ్చి వెంకట్రావుకు సుశీలకు స్నేహం లతలా అల్లుకుపోయి వారిద్దరూ విడవకుండా ఉండడమూ నరసింహమూర్తి మేష్టారుకు భయం వేసింది. వీళ్ళిద్దరూ ఎంతవరకు వెళ్ళినారో ఈ అతి స్నేహంలోంచి ఏ విషాద పరిణామం ఉద్భవిస్తుందో? రాధాకృష్ణ ఉద్దేశ్యమేమిటి? రాధాకృష్ణ మనస్తత్వం ఎలాంటిది? అతనికి ఇతర స్త్రీలతో సంబంధాలున్నాయా?

ఏమిటీ సినిమా ప్రపంచం! నీతి నియమాలకూ ఈ ప్రపంచానికి ఎక్కడా చుట్టరికమే లేదా? సినిమాలోకం సుడిగాలి లోకం. అతి అనేది తప్ప ఇంకోటి కనపడదు. ఆ వాతావరణంలో స్త్రీ పురుష సంబంధాలకు ఒక దారీ మార్గమూ లేదు. ఇక హద్దూపద్దూ లేదు. ఈ సినిమా వాతావరణం ఇతరమైన జీవిత పథాలకు కూడా ప్రసరించి దైనందిన నిత్య జీవితాన్ని కూడా కల్మషం చేస్తున్నది. నరసింహమూర్తి మేష్టారు గడగడ వణికిపోయాడు.

ఈ ప్రళయంలో ఒంటివాడైపోయినాడు నరసింహమూర్తి మేష్టారు. అవతల బుచ్చి వెంకట్రావు ఇంటినిండా సినిమా తారలు, తారకులు నిండిపోసాగినారు. చిట్టిచిట్టి దర్శకులూ, మేరు పర్వతం దర్శకులూ కాఫీ వేళకూ, సినిమా వేళకూ, షికారు వేళకూ సిద్ధం. బుచ్చి వెంకట్రావుతో "మనం ఇలాంటి ఆదర్శరూపమైన చిత్రం తీయాలండీ వెంకట్రావుగారూ!" "మీరే నాయకులు, సుశీలాదేవి నాయిక. ఇంక చిత్రం పట్ట పగ్గాలుంటాయా?" ఇవి నిత్య సంభాషణలు.

ఇంక తనూ! "మేష్టారూ! కాస్త కాఫీ తయారు చేయండి." "ఏం మాష్టారూ కొంచెం వుండ్‌లాండ్సుకు ఫోనుచేసి, ఇన్ని ఫలహారాలు అవీ తెప్పించండి!" "ఇదిగో నిద్రా? మేష్టారూ, ఏమిటయ్యా వెళ్ళి నా కారుమీద సుశీలాదేవిని తీసుకురండి!" ఇలా మాష్టారు బుచ్చి వెంకట్రావుకు పెద్ద బంట్రోతైనాడు.

అన్నీ ఓపిగ్గా చేస్తున్నాడు! పెద్దవాడు! అయినా పూర్వకాలపు ఘటం కనుక కాస్త జబ్బపుష్టీ, శక్తీ కలవాడు.

బుచ్చి వెంకట్రావు చివరకు ఒక సినిమా తీయడానికి నిశ్చయించాడు. తను కంపెనీకి పేరు పెట్టమని సుశీలనే అడిగినాడు. నరసింహమూర్తి "నీ కెందుకు వెంకట్రావూ, ఈ సినిమా పిచ్చి? ఏదో రొయ్య పప్పు వ్యాపారం చక్కగా సాగుతోంది. నాలుగురాళ్ళు వస్తున్నాయి. సినిమా అంటే లక్షలమీద మాట. ఆ డబ్బంతా గంగపాలే కావచ్చును, లేకపోతే కూపంపాలే అనుకో," అని నరసింహమూర్తి మేష్టారు అన్నాడు.

"ఉండవయ్యా! నీ సలహా ఎవరికి? ఇందులో మంచి చెడ్డలన్నీ సుశీలకు తెలుసు." అన్నాడు బుచ్చి వెంకట్రావు. రామచంద్ర అనే ఒక డైరెక్టరు: ఊరుకోవయ్యా స్వామి! పానకంలో పుడకలా అడ్డం రాకు.

**సోమేశ్వరరావు అనే సినిమా నటుడు :** మాకు సంబంధించిన విషయాలలో మీ సలహా ఎందుకండీ! లక్షాధికారి వెంకట్రావుగారు బొమ్మ తీస్తామనడం ఏమిటి, వెధవ స్త్రీ దారిలో ఎదురుపడినట్టు మీరు అడ్డం రావడం ఏమిటి?

**సుశీల :** మేష్టారు సినిమా గొడవలు మీ కేమీ తెలియవు. మీరు వింటూ వూరుకోండి.

**వెంక:** మీ వంటపని మీరు చూసుకోండి బాబూ!

నరసింహమూర్తి మేష్టారుకు పిడుగు తాకినట్లయింది. అతడు తెల్లబోయి అలా నిలుచుండిపోయినాడు. గజ గజ వణికిపోయినాడు. అతని కళ్ళల్లో నీరు తిరిగింది. తూలుతూ అతడు లోపలికి వెళ్ళిపోయాడు.

## (3)

"అమ్మాయీ! ఆయన సంగతి శ్రుతిమించి రాగాన్ని పడింది." అన్నాడు పద్మావతితో.

"ఏమిటండి అది? నాకు పరీక్ష రోజులు వస్తున్నాయి" రాక్షసిలా చదువుతున్నాను. మొదటి తరగతిలో నెగ్గి తీరాలి!"

"నాకు చాలా సంతోషంగా వుంది. నువ్వు షికార్లు మానివేసి చదువులో పడ్డావు. ఆ రాధాకృష్ణ స్నేహం తగ్గించావు; కాస్త నాకు మనస్సు ఊరటపడింది."

"ఏం? రాధాకృష్ణ స్నేహానికి ఏమి వచ్చింది? పరీక్షలో నెగ్గాలనే పంతంతో చదువుతున్నాను. కనుక షికార్లు మానాను... అంతే. రాధాకృష్ణ గొడవ ఏమి వచ్చింది? రాధాకృష్ణగారు చాలా మంచివాడు. ఆయనవల్ల ఇంతపేరూ ప్రతిష్టా, స్వంత సంపాదనా వచ్చింది."

"అలాగా?"

"కాదుటండీ, మేష్టారూ, నా మనస్సంతా ఇప్పుడు పరీక్ష మీద లగ్నం అయివుంది. మీరు రాధాకృష్ణగారి మీద నేరాలు గీరాలు చెప్పి మనస్సు పుండు చేయకండి. మీరు ఈ రెండు మూడు నెలలూ నాకు కనపడకుండా వుంటే మంచిది. నేవెడ్తాను సెలవు."

పద్మావతి లోనికి వెళ్ళిపోయింది. నరసింహమూర్తి మేష్టారు దిగులుపడి పోయినాడు. అతని మనస్సు క్రుంగిపోయింది. కాళ్ళీడ్చుకుంటూ బస్సు దగ్గిరకు పోయినాడు.

అతనికి తాను అతివృద్ధుడైనట్లు తోచింది. రాధాకృష్ణ ఎందుకు దాపురించాడు? ఓ పార్శ్వం పండింది. తానింక ఎవరికి కావాలి? తన అవసరం ఎవరికింక? బుచ్చి వెంకట్రావు ఇంట్లో తాను వంటవాడు. తనబాణి పాతరకం. రాధాకృష్ణ సంగీతమేళానికి తానెందుకూ పనికిరాడు. తెలుగుతనం లేని పిచ్చిపాటలు కోరే లోకానికి కళాయుక్తమై, పరిపూర్ణ సౌందర్యరూపకమైన తన ఆంధ్రవాణి ఎవరికి అవసరం గనుకనూ? దేశం నీచస్థితిని పొందినప్పుడు కళ కూడా నీచస్థితిని పొందుతుంది. కవులు నీరసించారు. గాయకులు నీరసించారు. శమ్మంగుడి ముసిరి, సుబ్బులక్ష్మి, వెంకటస్వామి నాయుళ్ళను ఎవరు గౌరవిస్తారు? వారి గానం దేశంలో లక్షకు ఒకరు వింటారేమో! తప్పితే ఇద్దరు వినవచ్చును. కాదయ్యా పది మంది ఆంధ్రులైన హరినాగభూషణంగారు, పారుపల్లి వారు వారణాసి బ్రహ్మయ్య, బలరామయ్యగార్లు, మంత్రవాది వెంకటప్పయ్య కాంగ్రెసులో సిసలైన పెద్దలలా వెనకే ఉండవలసి వచ్చింది.

అతడు పెద్ద నిట్టూర్పు విడిచాడు. నల్లబజారు నాయకులు, మాయాబజారు సినిమాలు, మాయారంభలైన తారలు, గారడివాండ్రైన గాయకులు! చాలయ్యా మదరాసు!

ఏమిటి తన కర్తవ్యం, తానూ క్షేత్రయ్యలా తీర్థయాత్రలు సేవించి, "భగవాన్ నువ్వైనా విను, ఈ పౌరాణికమైన వాణి" అని ఆయన దగ్గిర పాటలు పాడుకోవచ్చును.

ఏమి బుద్ధి పుట్టిందో అతడు చటుక్కున లేచాడు. అర్ధరాత్రి దాటినా ఏదో ఉత్తరం వ్రాస్తూనే వున్నాడు. హాలు గడియారం రెండు కొడుతూ ఉండగా బుచ్చి వెంకట్రావు, సుశీలా కారులోంచి దిగి, పకపక నవ్వుకుంటూ, తలుపు తట్టినప్పుడు నరసింహమూర్తి మేష్టారు ఉత్తరం డ్రాయరులో దాచి వచ్చి వీధి తలుపు తెరిచాడు.

అతడున్నాడనైనా లేకుండా బుచ్చి వెంకట్రావు సుశీలను కౌగలించుకుని "ఇవాళ మనప్రోగ్రాం గ్రాండుగా సాగిందికదూ! ఏం ఇవాళ ఇక్కడ పడుకోరాదూ?" అని ఆ యువతి మోము తనవైపు త్రిప్పుకొని, పదిముద్దులామె పెదవులపై కురిపించినాడు.

సుశీల చల్లగా అతని ఆలింగనాన్నుండి చిత్రంగా తప్పుకొని, "అలాంటి విద్రోహాలులేవు మన జాతకంలో! ఇంతవరకూ, మన సరిహద్దు! సో! సో! సెలవు!

నరసింహమూర్తి మేష్టారు నిద్ర చెరిపాము! సెలవు గురువుగారి గురువుగారూ!" అంటూ తుర్రున వీధిలోనికి తేలిపోయింది. గుమ్మం దగ్గరనుంచి "బుచ్చీ! రేపు సాయంకాలం రా! మరచి పోకు" అని కారెక్కి బుర్రుమనిపించి మాయమైంది.

బుచ్చి వెంకట్రావుకు కోపం వచ్చింది. "ఈ ఆడవాళ్ళు వట్టి బ్రహ్మరాక్షసులయ్యా!" అంటూ సోఫాలో కూచుని సిగరెట్టు వెలిగించాడు.

"ఎంతవరకూ వెళ్ళింది ఈ వ్యాపారం?"

"ఎంతవరకూ వెళ్ళడమేంటి? చాలా దూరం వెడితే, ఆ అప్సరస రాక్షసి అలా పారిపోతుందటయ్యా వెర్రి బ్రాహ్మడా?"

నరసింహమూర్తి మేష్టారు ఒక్కనిమేషం బుచ్చి వెంకట్రావును తీక్షణంగా పరికించినాడు. సరే ఇంకా రాగాలాపన ప్రారంభం కాలేదనుకున్నాడు.

"ఏంది అట్టా చూస్తున్నావు. నేను రాక్షసునిలా కనపడుతున్నానా, లేక నేజెప్పింది అసత్యమనుకుంటున్నావా?"

బుచ్చి వెంకట్రావు మోము జేవురించింది. అతడు జర్రుమని లేచి తన పడకటింటిలోనికి పోయినాడు.

## (4)

మరునాడు చాలా పొద్దెక్కేవరకూ బుచ్చి వెంకట్రావు లేవలేదు. మామూలు అలవాటుగా నరసింహమూర్తి మేష్టారు లేవలేదు. పనివారు లేచి, ఇల్లంతా సర్దినారు. పనిమనిషి వచ్చింది. అంట్లువేసే నరసింహమూర్తి మేష్టారు కనబడలేదు. వంటగదిలోకి ఎవరూ వెళ్ళడానికి వీలులేదు. కాబట్టి పనివాడు లోపలికి వెళ్ళి చూడలేదు.

బుచ్చి వెంకట్రావుకు తొమ్మిది గంటలకు మెలకువ వచ్చింది. స్నానాలగదిలోనికి వెళ్ళి మొగం కదుక్కుని కాఫీ కనివచ్చి, "మేష్టారూ కాఫీ ఏదయ్యా?" అని పొలికేక పెట్టినాడు.

పనివాడు పరుగునవచ్చి, "పొద్దున్నుండీ ఆయన అలికిడి లేదు స్వామీ? ఏందో?" అని మనవి చేశాడు.

"ముసలివాడయిపోతున్నాడు! ఇంకోరెవర్నన్నా పెట్టుకోవాలి" అంటూ వంట ఇంటివేపుకు వెడితే, బుచ్చి వెంకట్రావుకు తలుపులు వేసే వున్నట్లు తెలిసింది.

"ఏడీ మేష్టారు" అని వెంకట్రావు గొణుగుకుంటూ మళ్ళీ మేడ యెక్కి నరసింహమూర్తి మేష్టారు గది దగ్గిరకు వెళ్ళితే ఆ తలుపు పైన గొళ్ళెంపెట్టి ఉంది.

"ఇదేంది చెప్మా!"

బుచ్చి వెంకట్రావు తలుపు గొళ్ళెం తీసి లోనికి వెళ్ళాడు. అన్నీ సర్ది ఉన్నాయి. బల్లమీద తనకు వ్రాసినట్లు కవరు వుంది. అతడా కవరు చింపి లోని ఉత్తరం చదవడం సాగించినాడు.

"చిరంజీవి నా పుత్రసమానుడైన బుచ్చి వెంకట్రావుకు దీర్ఘాయువుగా, ఆరోగ్యయుతునిగా బహు సంతానవంతునిగా ఆశీర్వదిస్తూ!

"నాయనా! చుక్కానిలేని నావలావున్న ఈ చీకు పడవకు నీ హృదయం అనే రేవులో ఆశ్రయం ఇచ్చావు.

"అరవైమూడు సంవత్సరాలు గడిచి, అరవైనాలుగో ఏడు జరుగుతో ఉంది. ఇంతవరకూ నా జీవితంలో అసత్యము, అధర్మమూ ప్రవేశించలేదు. నేను నీ దగ్గిర ప్రవేశించక మునుపు బ్యాంకిలో రెండువేలు దాచుకున్నాను. నువ్వు నా కిచ్చిన జీతాలు పదిహేను వందలవరకూ ఉన్నాయి.

"నువ్వూ, నీ భార్య - బిడ్డలు లేని నాకు బిడ్డలయ్యారు. మీమీద నా ఆశలన్నీ పెట్టుకుని, మీ ఆనందం నా ఆనందం అనుకుని, మీ వృద్ధి నావృద్ధి అనుకొని సంతోషంతో పొంగిపోయాను.

"కాని పరిస్థితులు ఈలా తారుమారు అవుతాయని అనుకోలేదు. పద్మావతి సినిమాతార సగం అయింది. తక్కిన సగమూ పూర్తిఅయిపోతుంది. నువ్వు తారలమధ్య చంద్రుడవు అయిపోతున్నావు. ఈ విధానం ఎంతవరకూ సాగిపోతోందో! నీ కంపెనీ ఆఫీసులో కనుక్కుంటే ఈ మధ్య నువ్వు చాలా ఖర్చుపెడుతున్నట్లు తెలిసింది. ఎందుకో నేను ఊహించదలచుకోలేదు.

"నేనూ నీకూ అవసరం లేదు. నీ భార్యకూ అవసరం లేదు. మీ జీవితాలు విచిత్ర పరిణామాలు పొందాయి. ఇంకా అనేక చిత్రవిచిత్ర పరిణామాలు మీ జీవితంలో రాగలవు! కాన ఆ పరిణామాలలో నాకు భాగంలేదు. నేను భాగం పంచుకొనే రకం కావు అవి!!

"నీకోసం పద్మావతీ, పద్మావతికోసం నువ్వూ ఉద్భవించారనీ, మీ ఆదర్శ జీవితం, హీనస్థితిలో వున్న కులాల వారికీ, జాతులకే కాకుండా ఉత్తమ కులాలవారికీ, జాతులకూ కూడా ఆదర్శం కాగలదనీ ఉప్పొంగిపోయాను. కాని మీరూ అందరితో పాటువారే అయ్యారు.

"ఈ సందర్భంలో నేను మీ దగ్గిరలేకుండా దూరదేశాలకు పోతే మీరు ఒకరికొకరు సన్నిహితులు అవుతారేమో!

"మీ ఇద్దరూ, నేను ఆశించే రీతి వృద్ధిపొంది తిరిగి కలియుదురుగాక. మీకు దీర్ఘాయురోగ్య ఐశ్వర్యాలూ, దాంపత్యప్రేమ సాఫల్యమూ, బహు సంతాన లాభమూ కలుగుగాక అని ఆశీర్వదిస్తూ,

గాఢానురాగంతో
నరసింహమూర్తి మేష్టారు."

ఈ ఉత్తరం చూడగానే బుచ్చి వెంకట్రావు మొదట చాలా ఆశ్చర్యం పొందాడు. "ఏడిశాడు వెఱ్ఱిబాగులవాడు! పోతేపోయాడు. శని విరగడైంది అనుకుంటాను. ఈ రోజుల్లో పెద్ద నీతినియమాలు రాస్తాడేమిటి? దేవుడుంటే నీతినియమాలూ; దేవుడేడి. గోపరాజు రామచంద్రరావు అనే ఆయన వాదించినట్టు? ఇతరులకు ఇబ్బంది లేకుండా ఉంటే చాలు. కాని నాకు నీతులు చెప్పవస్తాడేమిటి? అతని మోములో చిడిముడిపాటు కాంతులు ప్రసరించాయి.

"అయినా మంచివాడు. ఎంత చాకిరీ చేశాడు! ఎంత నమ్మకం. తనకూ పద్దాలుకు తల్లీదండ్రి అయ్యాడు. ఎంత ఓపిక, ఎంత నెమ్మది, ఎంత ఆపేక్ష! సరే ఎక్కడకు వెడతాడు? నాలుగురోజులు కాగానే వస్తాడు. ఈలోగా తిరిగిరానీ!"

ఆ మర్నాడు బుచ్చి వెంకట్రావు చూసుకున్న ఉత్తరం పద్మావతికీ వచ్చింది. ఏమిటీ ఉత్తరం అనుకుంటూ, పద్మ కవరు విప్పి చదవనారంభించింది.

ఉత్తరం సాగినకొద్దీ ఆమె గుండె దడదడ ఎక్కువ కాసాగింది. ఉత్తరం పూర్తిచేసి కాళ్ళు తేలిపోగా, పద్మావతి మంచంమీద కూలబడింది. ఏమిటి మేష్టారే! తమ్ము విడిచి వెళ్ళిపోవటమా? ఇంకేముంది! ఇంక తనకు సముద్రమే దిక్కు.

ఆమెకేదో భయం పట్టుకుంది. తాను తన భర్త దగ్గిరకు వెళ్ళడానికి భయం వేసింది. వెళ్ళి "ఏమిటి?" అని నరసింహమూర్తి మేష్టారును గురించి అడగాలని. కాని ఏమి అడుగుతుంది! ఆయన చాలా దూరమైపోయాడు.

తమను గురించి ఆయన అల్లా రాసినాడేమిటి? ఏమిటి? అలా వెళ్ళిపోయినా దేమిటి? తనగతి ఏమిటి?

ఆమెకు కళ్ళు తిరిగిపోయినాయి.

❀ ❀ ❀

# అష్టమ గుచ్ఛము

నరసింహమూర్తి మేష్టారు రాసిన ఉత్తరం చదువుకున్నప్పటినుండి పద్మకు ఉద్భవించిన ఆవేదన నానాటికి ఎక్కువైపోయిందీ. తనకెంత విసుగు ఉద్భవింపచేసినా, నరసింహమూర్తి మేష్టారు తన దగ్గిరకు రావడం మాయమైపోగానే, ఆ లోటామెకు రోజురోజుకూ ఆందోళన ఎక్కువ చేయసాగింది. సాయంకాలం కాగానే ఆయన వస్తాడన్న భావం అతడు రాకపోయేసరికి గుండె గుభేలుమనటమూ! నాలుగురోజులు గడిచేసరికి పద్మావతికి భరింపరాని బాధ కలిగింది.

ఏమయ్యాడు? ఎక్కడ బాధపడుతున్నాడో! సముద్రంలోనో ఏ రైలుకిందోపడి ప్రాణం తీసుకోలేదుకదా!

ఈమధ్య తాను సముద్రతీరానికి వెళ్ళినా, సముద్రంగాని, ఇసుకతిన్నెలుగాని, కెరటాలుగాని, నీరదూరాలుగాని కనపడడం మానివేశాయి. కారులూ, జనమూ, రేడియో సంగీతమూ, జనంఘోషా, వేషాలు, భాషలూ, ఒత్తుగా, ఘాటంగా కమ్ముకువచ్చి కనబడతాయి. అలాంటిది నేడు నరసింహమూర్తి మేష్టారు ఆమె జీవితంలోంచి మాయమై పోయినప్పటినుండీ, ఆమెకు సముద్రం ఎంతో దూరంగా చిన్న కెరటాలతో దృశ్యం కాసాగింది. సముద్రపు చేపలు నీటిలో ప్రాణరహితమై తేలిపోయి కనబడినవి. ఎక్కడ చూచినా మండిపోతూ ఇసుక ఎడారిలా సముద్రమూ, ఇసుక తీరాల బయళ్ళూ ఆమె మనోనేత్రాలకు గోచరించినవి.

ఆమె కన్నులు మూసుకోలేదు. కన్నులు తెరచి ఉంచుకోలేదు. నిద్దర ఎండిపోయింది. నుదురు మండిపోతున్నది. ఒళ్ళు సలసల కాగిపోతున్నది.

ఆమె ఆంధ్ర మహిళా సభలో ఉండలేకపోయింది. భర్త దగ్గిరకు వెళ్ళలేదు. సుశీల కడకు పోలేదు.

ఏమవుతుంది తన బ్రతుకు? ఎందుకు ఈ ఆవేదన? అందరికీ ఈలాంటి పరిస్థితులు సంభవిస్తాయా? వారికీ ఏదో సంఘటనలు జీవితంలో ప్రత్యక్షం అవుతూనే ఉంటాయి. ఊహించుకోలేని కష్టాలు వారికీ కలుగుతున్నాయి. అవ్యక్తమైన ఆశయాలు, వ్యక్తావ్యక్తమైన ఆశలూ వారికీ ఉన్నాయి. తనకింత బాధ ఏమి? తన మనస్సుకు ఇంత కుదురులేదేమి?

శ్రీమతీ దేవిని తనతో రమ్మని పద్మ ఆహ్వానించింది.

"ఎక్కడకు పద్మా?"

"రండి అక్కా! నన్ను మీ రెక్కడకైనా నాలుగురోజులపాటు తీసుకుపొండి!"

"మనం ఇద్దరమే!"

"ఆ!"

"ఏమిటీ అసలు విషయం?"

"నన్నెక్కడకైనా సరే తీసుకువెళ్ళండి. నాలుగురోజుల పాటు ఈ స్థితే నాకు ఉంటే నన్ను మోదవాకం పిచ్చి ఆస్పత్రిలో చేర్పించవలసిందే!"

"నీ చదువుమాట?"

"తిరిగి వచ్చి ఆలోచిద్దాము అక్కా! నా ప్రార్థన అంగీకరించండి. నా హృదయంలో ఉన్నది అంతా మీతో ఏమి చెప్పుకోగలను."

"సరే పద్మా! హంపీయాత్ర చేసి వద్దాము. లేపాక్షి, పెనుగొండ, బేలూరు, హాలెబీడు, శ్రావణ బెలగోలా, మైసూరు, శివసముద్రం ఇవి మనం చూసి వచ్చేవి."

"చాలా బాగుంది. మనం ఇద్దరమే! ఇంకెవ్వరూ వద్దు."

"కాని నాకీ పనుల్లో తీరిక ఏది పద్మా!"

"ఏలాగో తీరిక చేసుకోండి. ఖర్చంతా నాదే. నాకు అతిథిగానే, గురువుగా మీరు రావాలి!"

"సరే. ప్రిన్సిపాలుగారి సెలవు తీసుకుని బయలుదేరుదాము. రేపు శనివారం బాగుంటుంది."

"అచ్ఛా!"

ప్రిన్సిపాలుగారికి తన సంగతి అంతా చెప్పుకొని, పద్మావతి ఆమె కడ సెలవు తీసుకుని, శ్రీమతితో బయలుదేరి యాత్ర ప్రారంభించింది.

పాఠశాలలో ఇతరులెవ్వరికీ ఈ యాత్ర విషయం తెలియదు. వీరిరువురూ చల్లగా వచ్చి సెంట్రల్లో బొంబాయి మెయిల్ యెక్కి గుంటకల్ చేరుకున్నారు. అక్కడనుండి రైలుమారి హాస్పేటచేరి, హంపీ చేరుకున్నారు.

హంపీలో డాక్ బంగళాలో మకాంపెట్టి, మూడు రోజులపాటు శిధిలాలన్నీ చూచారు.

"శ్రీకృష్ణదేవరాయల భువనవిజయం ఇవాళ ఎల్లావుందో చూడు! ఈలా ఒక మహానగరం శిధిలం కాకపోతే మనకు ఈ మహాద్భుత ప్రదర్శనశాల ఉండేదా పద్మా?"

"అదేమిటండీ అల్లా అంటారు? ఆనాడు తల్లికోటలో జరిగిన భయంకర పరాభవం ఆంధ్రుల చరిత్రనే కాకుండా, భారతీయ చరిత్రనే మార్చెయ్యలేదండీ అక్కా!"

"అవునమ్మా! నేను చరిత్రలో అలా జరగడమే మంచిదనే మతిలేనిదాన్ని కాదు. ప్రతి చెడ్డలోనూ మంచి కూడా ఉందని."

వారు హజారు రామస్వామి, విఠలనాథకోదండస్వామి, విరూపాక్షస్వామి వారల దేవాలయాలన్ని దర్శించారు.

సరిగమ పదనిస అని పాడే సంగీత స్తంభం పరిశీలించారు. రాతిరథం ఆనందాశ్చర్యాలతో దర్శించారు. విజయనగర శిల్పంలో మనుచరిత్రలాంటి కావ్యసౌందర్యం ఉందని శ్రీమతి కరుణామయి పద్మకు బోధించింది.

హంపీనుండి బయలుదేరి పెనుగొండ లేపాక్షి వెళ్ళా . విజయనగరం తర్వాత పెనుగొండే ఆంధ్రసార్వభౌముల రాజధాని. అంతకుముందు చక్రవర్తులు వేసవికాలాలు పెనుగొండలో ఆ చల్లటి ప్రదేశాలలో గడిపేవారు. పెనుగొండలోనూ విజయనగర సామ్రాజ్య చిహ్నాలు హృదయాలకు ఏవో ఆవేదనలను కలుగజేస్తాయి.

లేపాక్షి క్షేత్రానికి సంబంధించిన పూర్వగాథలు తెలుసుకుంటూ ఆ విచిత్ర దేవాలయాన్ని, అందున్న అద్భుత శిల్పాన్ని, విచిత్ర చిత్రలేఖనాలనూ గమనిస్తూ వారిరువురూ జగత్తును మరిచిపోయారు.

అక్కడనుండి మైసూరు రాష్ట్రంలో హోయసాల శిల్పుల సంపూర్ణాలంకార స్వరూప మహాభావ విన్యాస దార్శనికాలైన దివ్యశిల్పాలను, బేలూరు, హాలేబీడులలో వారు దర్శించారు.

అక్కడనుండి శ్రవణ బెలగోలాలో గోమతేశ్వరుని దర్శించారు.

"ఎందుకు అక్కా, మనుష్యుడు కొండలలాంటి ఈ మహాశిల్పాలను సృష్టిస్తాడు?" అని పద్మావతి ప్రశ్నించింది.

"చెల్లీ! మనలో అతిసూక్ష్మ శరీరమూ ఉంది అతి స్థూలమైన ప్రపంచమూ ఉంది. అతి సూక్ష్మభావాలే పారలౌకిక విశ్వంలో విశ్వస్వరూపాలైన భావాలు, వానికి రూప కల్పన చేసేటప్పుడు, ఈ పర్వతాలలాంటి శిల్పాలను సృష్టిస్తారు."

మైసూరులో వారు బృందావన వన సౌందర్యం, గరిసెప్ప జలపాతం, అద్భుత ప్రకృతీదేవి ఆనంద తాండవం చూచినారు.

ఈ తాండవభావం ప్రత్యక్షం చేసుకొనడానికి వారు చిదంబరం చేరినారు.

శ్రీమతి పద్మావతికి నటరాజభావం వర్ణించి చెప్పింది. సృష్టిస్థితి లయాత్మకమైన లీల లీనాట్యభావములు. అందుకనే,

**"ఆంగికం భువనం యస్య**
**వాచికం సర్వవాఙ్మయం**
**ఆహార్యం చంద్రతారాది**
**తన్నమ స్సాత్వికం శివం"**

ఆనంద తాండవాదులు, గౌరీశంకర మహాభావ రూపాలు. శంకరాచార్యులు సౌందర్య పరమావధి దేవీ భావంలో, ఆనంద పరమావధి శైవభావంలో దర్శించినాడని శ్రీమతి అన్నది.

జగల్లీల మహాభావయుక్త సంధ్యానాట్యము. ప్రళయాలు, కల్పాంతాలు, నూత్న తారాజన్ననాలు, నిత్య నూతన విశ్వోద్భవాలు, ఆనందనాట్యము, తారకల కాంతి, కాలభావసముద్భవ రహస్యము లాస్యనాట్యము. ఈ మహాభావం వెనకాల శక్తిలీల, నృత్తము అని శ్రీమతి అరమూత కన్నులతో ఏవేవో మాట్లాడింది.

## (2)

పద్మావతి యాత్రకు వెళ్ళిందని బుచ్చి వెంకట్రావుకు తెలిసేసరికి అతనికి ఆశ్చర్యమూ, కోపమూ, ఏదో భయమూ కలిగాయి.

ఎందుకు వెళ్ళింది? తనతో చెప్పలేదే! ఇంత స్వతంత్రించిందే! ఆంధ్ర మహిళాసభ కళాశాల ముఖ్యాచారిణీ, తాను పద్మావతిని చూడడానికి వెళ్ళినప్పుడు తనతో కొంచెం గట్టిగా మాట్లాడింది.

"ఎందుకండీ మీ భార్యను చదివించాలని పూనుకొన్నారు. ఆవిడ నరాలు ముద్దవుతున్నవి? ఆవిడకు పేరూ ప్రఖ్యాతులూ వచ్చేశాయి. చదువుమీద శ్రద్ధ తగ్గింది. మొన్న జరిగిన పరీక్షలలో ఆ అమ్మాయికి చాలా తక్కువ మార్కులు వచ్చాయి. అంతకుముందు వచ్చిన మార్కులను బట్టి ఆలోచించడానికి వీలులేదు."

"ఈ మధ్య ఎక్కడా సంగీత సభలు ఒప్పుకోలేదుకదా అండి!"

"నిజమేనండి. సంక్రాంతి ముందునుంచి అలాగనే చదువు సాగించింది. కాని జీవితం అంతా సంగీతం పొదివి వున్న ఆ బాలికకు చదువుకు తావులేదు. చదువుకోసం సంగీతం మానుకునేసరికి, ఆ అమ్మాయికి నరాలు పట్టుతప్పిపోతున్నవి. మతి తారుమారవుతున్నది."

"మీ సలహా ఏమిటండీ?"

"చదువు మానిపించి ఒకసారి ఇంటికి తీసుకువెళ్ళండి."

"పరీక్ష రోజులు మూడు నెలలే కాదండీ ఉంటా!"

"ఏమి లాభం?"

బుచ్చి వెంకట్రావు తల వాల్చుకొన్నాడు. అధ్యక్షురాలికి నమస్కరించి, వచ్చి కారులో కూచున్నాడు. కారును తానే నడుపుకొని వచ్చినాడు. ఎక్కడకు పోవాలో అతనికి తెలియలేదు.

అతనికి సుశీలాదేవిని సలహా అడుగుట ఇష్టంలేదు. తాను తన భార్యంటే చాలా ఆపేక్షగా ఉంటాడని ఆమె అనుకుందేమో! అనుకుంటే తప్పేమి? అని మళ్ళీ అనుకున్నాడు. కాదు. ఆమెతో ఈ విషయం చర్చించకూడదని అతడు నిశ్చయం చేసుకున్నాడు. అతడు వెంటనే సుశీల దగ్గిరకు కారు పోనిచ్చినాడు.

సుశీలకు పద్మావతి హంపి మొదలైన క్షేత్రాల యాత్రకు వెళ్ళిందని బుచ్చి వెంకట్రావు చెప్పగానే "మంచి పనిదా చేసింద"ని ఆమె వెంటనే అన్నది.

"అదేమిటి? ఈ యాత్ర మంచిదే నంటావు సుశీలా?"

"తప్పక! తిరగనీ దేశాలు. ఏమయ్యా యాత్రవల్ల వచ్చే జ్ఞానం జన్మంతా చదివినా రాదే!"

"వెళ్ళితే వెళ్ళనీ, నాకేమి గాని–"

"నీ భార్య సంగతి నీకుదా అక్కరలేదా?"

"భార్య అని ఒళ్ళో పెట్టుకుని తిరుగుతారా?"

"ప్రేమ ఉంటే అంతేదా!"

"ప్రేమ ఉంటే కూడా, ముభావంగా ఉన్నట్లు కనబడే భార్యాభర్తలు లేరా?"

"కాబట్టి నీకు నీ భార్యా అంటే బాగా ప్రేమ అన్నమాట ఆపిడి!"

"ప్రపంచం సంగతి చెబుతున్నానుగాని."

"చిత్రంగా వుంది నీ సంగతే! ఇంతకూ నీకు నీ భార్యమీద బాగా ప్రేమ వుందా లేదా సొల్లు!"

బుచ్చి వెంకట్రావుకు సుశీల అనే మాటలకు చాలా కోపం వచ్చింది.

"మీ ఆయన పెద్దమేడ తీసుకున్నాడు. శుభ ముహూర్తం చూసి అందులో ప్రవేశించాలి. త్వరలో సినిమా పని ప్రారంభించాలి. మీ ఆయన నాకు అప్పగించిన సోమేశ్వరరావు అచ్చుపనులన్నీ చేస్తున్నాడు. ఏమి కథో మనం ఆలోచించలేదు సుశీ!"

సుశీల బుచ్చి వెంకట్రావును సోఫాలో కూచోపెట్టి అతని పక్కగా, దగ్గిరగా కూచుంది. అతని మెడచుట్టూ చేయివేసి, కుడిచేత్తో జుట్టు సవరించసాగింది.

"నువ్వేగా నాకుదా నాయకుడవు?"

"నువ్వేగా నాకు నాయికవు?"

ఇద్దరూ పకపక నవ్వుకున్నారు. వారిద్దరూ అలా కూచుని ఉండగానే, అక్కడకు రాధాకృష్ణ ఏదో కూనిరాగం తీస్తూ వచ్చాడు.

"ఏవైనా సినిమా సీను రిహార్సులు చేస్తున్నారా?" అన్నాడు రాధాకృష్ణ.

సుశీల నెమ్మదిగా దూరంగా జరిగింది.

బుచ్చి వెంకట్రావు కంగారుపడ్డాడు. తెల్లబోయాడు. నెమ్మదిగా సంబాళించుకొని వెండి సిగరెట్టు కేసు జేబులో నుండి తీసి, మీటనొక్కి తెరచి, అందులో స్టేటు ఎక్స్‌ప్రెస్ 555 సిగరెట్టు రాధాకృష్ణను తీసుకొని కాల్చమన్నట్లు అతని ఎదుట చాచినాడు.

"నేను త్రీ కాజిల్సు తప్ప ఇంకోరకం కాల్చను కాదటయ్యా! ఒక్కొక్క గొంతుక్కు ఒక్కొక్కరకం చక్కగా సరిపోతాయి!" అని రాధాకృష్ణ తన సిగరెట్టు కేసు తాను తీసుకొని ఒక సిగిరెట్టు వెలిగించాడు.

రాధాకృష్ణకు కోపం వచ్చిందనీ బుచ్చి వెంకట్రావు అనుకున్నాడు. ఏమిటి ఈతని ఉద్దేశం? సుశీలను తన కౌగిలింతలలోనికి పురికొల్పింది అతడే! తమరిద్దర్నీ వదలి ఎన్నిసార్లో రాధాకృష్ణ వెళ్ళిపోయాడు. సుశీల కూడా తన మనస్సు కరిగించి ఆమె అంతట ఆమె తన ఒడిలోనికి ఏలా చేరింది! చిత్రచిత్ర విలాసాలెన్నో సుశీల తనచుట్టూ భర్త ఎదుటె సుళ్ళుచుట్టి వేస్తూంటే, ఆ భర్త ఏమీ అనకుండా, చూచీ చూడనట్లున్నప్పుడు సుశీల తన పురుషత్వానికి స్త్రీ కావడం వారి కిష్టమనుకున్నాడు బుచ్చి వెంకట్రావు. అతడింతవరకూ పరస్త్రీ సంగమ దోషానికి పాల్పడలేదు. ఈ మధ్యే ఏ దుష్టపు గడియలు ఆవేశించాయో తనకూ తన భార్యకూ మధ్య దూరాలు ఉద్భవించుకు వచ్చాయి. ఆ సమయంలోనే శ్రీ శుకుణ్ణి కూడా మనసు మురిపించే సుశీల తన జీవితంలో ప్రవేశించింది. ఆ ప్రవేశంలో ఉన్న భావం పూర్తి కాకుండా రాధాకృష్ణ అడ్డం వచ్చేటట్లయితే వీళ్ళు తన్ను మోసం చేస్తున్నట్లే అయిందిగా! అందుకనే ఆ పిచ్చి బ్రాహ్మణుడు నరసింహమూర్తి అంత గోలపెట్టాడు.

రాధాకృష్ణ బుచ్చి వెంకట్రావుకు తెలియకుండా అతని మోము పరిశీలించి అతని హృదయంలో సుడిగాలై తిరిగే భావాలు గ్రహించాడు.

"సుశీ! మా ఇద్దరికీ ఏవైనా ఫలహారం కాఫీలు ఏర్పాటు చేయి." అని సుశీలవైపు బుచ్చి వెంకట్రావు గమనించకుండా తీక్ష్ణమైన చూపు బరపి కంటిసైగ చేసినాడు.

సుశీల బుచ్చి వెంకట్రావు దగ్గిరకు వచ్చి అతని భుజం మీద చేతులువేసి "అయిదు నిముషాలలోగా దుస్తులు మార్చుకుని వస్తుంటిని. మనం ముగ్గురం చూస్తివా, చాలా

మాట్లాడుకోవలసి ఉందే. కాఫ్యాదులకు ఆర్డరుదా ఇస్తున్నాను." అని గబగబ లోనికి వెళ్ళిపోయింది.

## 3

ఆమె లోనికి వెళ్ళిపోగానే రాధాకృష్ణ బుచ్చి వెంకట్రావు దగ్గిర కూర్చుండినాడు.

"వెంకట్రావుగారూ, మీ మోములో ప్రసరించిన ఛాయలను చూచి, మీరు నన్ను గూర్చి తప్పభిప్రాయాలు పడుతూవున్నట్లనుకుంటున్నాను."

"అవన్నీ ఇప్పుడెందుకులెండి?"

"నన్ను పూర్తిగా చెప్పుకోనివ్వండి. నాకు పూర్వ కాలపు ఛాందసపు భావాలేమీ లేవు. స్త్రీలు ఎవరిని ప్రేమించారో వారితో కులాసగా ఉండవచ్చునని నా నిశ్చయమైన అభిప్రాయం. కాని వివాహం చేసుకొన్నాక ఆ భర్తకు విడాకులు ఇచ్చి, తాను మళ్ళీ వివాహం చేసుకోవాలి. అంతే. వివాహం చేసుకొని ఆ భర్త వెనక పరపురుషునితో సాంగత్యం చేయడం నా ధర్మశాస్త్రం ప్రకారం అధర్మం. తన భర్తను తాను పురుషునిలా ప్రేమించి, స్నేహంలో ఇతర పురుషులతో అతి చనువుగా ఉండవచ్చును. అంతే! మీరు సుశీల నడవడి యొక్క గమత్తు చూచి, ఆమె మిమ్ము ప్రేమిస్తున్నదని తప్పభిప్రాయ పడుతున్నారని అనుకుంటున్నాను. నా జీవితం వదులు అయినదే! కాని అధర్మం, అసత్యం, నా బ్రతుకుకు నూరుగజాల దూరానికైనా రానివ్వను. నేను సుశీలను కనుక్కుంటాను. ఆమె మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తే, వెంటనే ఆమెకు విడాకులు ఇస్తాను. నేను సుశీలను గాఢంగా ప్రేమించవచ్చును. కాని నా ప్రేమ ఆమె జీవితానికి అడ్డం రాకూడదు. ఈ విషయమే చెప్పితే మీరు నన్ను గురించి తప్పభిప్రాయాలు పడరని అనుకుంటాను. ఈ సంఘటనలు స్నేహానికి అడ్డం రాకూడదు. దొంగస్నేహం అయితేనే స్నేహంకాదు. అది శత్రుత్వానికన్న అధమాధమం!"

రాధాకృష్ణ మాటలు వింటూ వుంటే, బుచ్చి వెంకట్రావు మనస్సు క్రుంగిపోయింది. రాధాకృష్ణ మాటలలో దాపుడు లేదని మాత్రం అతనికి తట్టింది. అవును తాను సుశీలను వాంఛించినమాట నిజం. ఆమె ఉద్దేశమేదో! తాను పద్మావతిని వదలి, ఆమెకు విడాకులు ఇచ్చి సుశీలను పెళ్ళి చేసుకోవాలా?

అతనికి హృదయం ఎక్కడికో జారిపోయినట్లయినది. బుచ్చి వెంకట్రావు మాటలాడలేదు. అతడు చటుక్కున లేచి వీధిలోనికి వెళ్ళి తన కారు ఎక్కి ఇంటికి వెళ్ళిపోయినాడు. రాధాకృష్ణ ఆశ్చర్యముపొంది, కదలక అట్లానే నిలుచుండిపోయినాడు. అతని సిగరెట్టు చేతిలో కాలుతూనే ఉంది.

ఇంతట్లో సుశీల చీరమార్చి మంచిరకం సిగరెట్టులా వచ్చింది.

"ఎంగె మన బుచ్చి వెంకట్రావు?" ఆమె మాటలు తీక్షణంగా ఉన్నాయి.

"ఇంటికి వెళ్ళిపోయినట్లున్నాడు!"

"నువ్వు పంపి వేస్తివా?"

"నేను వెళ్ళమనలేదు, వెళుతోంటే ఉండమనలేదు."

"కారణం?"

"కారణం ఏమిటి నీ మొగం! కాస్త స్పష్టంగా చెప్పాను, అతడు మారిపోయినాడు. దిగాలుపడిన హృదయంతో చక్కాబోయి ఉంటాడు."

"నీతినియమాలు చెప్పడం సాగిస్తివి కదా కాబోలు. నీ దొంగనీతి, నీ పద్ధతీ నాకుదా తెలియవా? నీ సుగుణగుణాలు మన స్నేహములో నాకుదా అర్థం కాలేదా? మన సినిమా జాతివారికి నీతినియమాలు కూడా ఉండునా ఏమి? ఒక బాలికను ఒకడు పెళ్ళిచేసుకుంటానని ఆశపెట్టి తీసుకుపూడుస్తుడు! ఆవిడ ఒక గొప్పతార! అయినా వెఱ్ఱిబాగుల్ది. ఆ పిచ్చిది వాణ్ణి నమ్మి వాడితో పెళ్ళి అవుతుందని నమ్మకంతో వాడితో కాపురం చేస్తుందే? ఎన్న! ఆమెకు గర్భం ఆవరిస్తుంది! తన అవసరం తీరగానే అతడు ఆమెను వీధిలోనికి త్రోసి తలుపు వేసుకుంటాడు. ఆడవాళ్ళు మీ కళ్ళకు పశువులు. బజారు వస్తువులు. చూడు ఈ బుచ్చి వెంకుల్ని! వీడుదా పంది. చక్కనిది, ప్రజ్ఞావంతు రాలు - అలాంటి భార్యనుదా సరీగా చూడలేక తన ఇంటిలోనించి తరిమివేస్తే ఆ అమాయకురాలు ఆంధ్ర మహిళా సభలో వెళ్ళిచేరిందే! ఆనందం పడుతోంది పాపం! ఆవిడ ఏదో బాధపడుతూ దక్షిణాది యాత్రలకు బయలుదేరిందట!"

"ఓసి ఫూల్! నేను ఎప్పుడైనా నీ విషయంలో అనౌచిత్యంగా ప్రవర్తించానా? మనం ఇద్దరం వివాహం చేసుకొనే ముందు నేను సంబంధం కల్పించుకొన్న స్త్రీలు వట్టి జారిణులు. నేనా వివాహంముందు నా చరిత్ర అంతా నీతో చెప్పినాను. పోనీ నువ్వు మాత్రం 'అనాఘ్రాత పుష్పం'లా ఉంటివి గనుకనా? కాని మన వివాహం ఐన దగ్గరనుండీ నా చరిత్రలో ఏ విధమైన దోషమైనా చూపించగలవా? ఒకటే చెపుతున్నాను. బాగా మనస్సుకు ఎక్కించుకో! నీకూ యీ బుచ్చి వెంకట్రావుకూ ఎంతవరకూ వెళ్ళిందో నాకు తెలియదు. నీకు అతనితో గాఢసంబంధం ఏర్పాటు చేసుకోవాలని ఇష్టం పుడితే నా చాటున మాత్రం ఆ విధమైన నడవడిక సుతరామూ వీలులేదు. అంతటితో నీకూ నాకూ బంద్. ఈ ఆస్తి అంతా తీసుకుని వెళ్ళిపో - నేను మళ్ళీ కొత్తగా నా జీవితం ప్రారంభించుకుంటా."

ఎప్పుడూ ఏడుపంటే ఏమిటో ఎరుగని సుశీల అక్కడ సోఫాపై కూలబడిపోయింది. వెక్కి వెక్కి ఏడుపు ఆమెను ముంచుకొచ్చింది. సోఫాలో పడిపోయి, దిండులో ముఖము దూర్చుకొని సముద్రము పోటులా రోదించింది.

❀ ❀ ❀

# నవమ గుచ్ఛము

"కంచిలో నాయనాపిళ్ళై, పుదుక్కోటలో దక్షిణామూర్తిపిళ్ళై, తిరుచునాపల్లి గోవిందస్వామిపిళ్ళై, అలహనంబి, కోయంబత్తూరు తాయి, బెంగుళూరు నాగరత్నం, వీణధనం, కంచి ధనకోటి, బందరు సుసర్ల దక్షిణామూర్తిగారు వీరందరూ కొద్ది సంవత్సరాల క్రితం వరకూ సర్వదక్షిణాపథమూ రసవాహినులతో నింపిన మహాగాయకులు. ఆంధ్రలో సంగమేశ్వరుడు, వీణ రమణయ్యగారు, ఆదిభట్ల నారాయణదాసు" అని, శ్రీమతి తిరుచునాపల్లిలో విఘ్నేశ్వరుని కొండ ఎక్కుతూ పద్మావతికి చెప్పింది.

"ఓహో, ఆనాటివారి అదృష్టం అక్కా! ఈనాడు అరియకుడి, శెంబంగుడి, మధురమణి, పాపా వెంకట్రామయ్య, బాలసుబ్రహ్మణ్యం మొదలయిన వారున్నూ ఉన్నారు. ద్వారంవారు, హరినాగభూషణంగారు, పారుపల్లి రామకృష్ణయ్య జగత్పూజ్యులు."

"మనం ఎప్పుడూ ఏ విద్య విషయంలోనన్నా విద్యార్థులుగా ఉండాలి చెల్లీ! ఈ విశ్వ రహస్యము, మన నిత్య విద్యార్థిత్వంలో కొంచెం కొంచెంగా, తెరవీడుతూ దర్శనమిస్తుంది. ఆ ప్రత్యక్షమే మనకు ఆనందం సమకూరుస్తూ ఉంటుంది."

"ఆనందమేనా ఈ ప్రపంచానికి కావలసిన వస్తువు అక్కా?"

"అవును! సేవ ఇతరులకు ఆనందం సమకూర్చడానికి. జ్ఞానం ఆనందంకోసం. సర్వకృషీ ఆనందంకోసం. కళలు ఆనందంకోసం!"

"వైద్యమూ, వ్యవసాయమూ, చేపలు పట్టడమూ ఆనందంకోసమా ఏమిటి అక్కా!"

"ఆ! ఇతరులు జబ్బుతో బాధపడుతూ ఉంటే, వైద్యం వల్ల జబ్బుకుదిర్చి ఆనందం సమకూరుస్తాముకాదా? వ్యవసాయం తిండిగింజలు వగైరాలవల్ల ఆకలి తీరితే ఆనందం. అందుకే చేపలు పట్టడమూనూ!"

ఈలా అనేక విషయాలు చర్చించుకుంటూ పద్మావతీ, శ్రీమతీ తీర్థయాత్రలు సాగిస్తున్నారు. అనేక మానవ ప్రకృతులు ఈ యాత్రలో పద్మావతికి శ్రీమతి బోధవల్లనైతేనేమి, తాను గాఢంగా పరిశీలించడంవల్లనైతేనేమి అవగతం కాసాగినవి.

మనుష్యుడు తనకు లోటైన శక్తీ, సంపదా, ఇతరులలో ఉంటే చూచి ఓర్వలేడు. ఓర్వలేనితనం జగత్సంక్షోభానికి కారణం అవుతుంది. దక్షిణాది సంగీతనిధులు కర్ణాటక బాణీని అద్భుతంగా కాపాడుకుంటూ వస్తే, నీరసులై పరిశ్రమ చేయక తపస్సు చెడగొట్టుకుని తెలుగువారు అరవడం ఎందుకు! ద్రావిడ కజగం అని బ్రాహ్మణద్వేషంతో దక్షిణాది బ్రాహ్మణేతరులు అరవదేశానికి స్వాతంత్ర్యం కావాలనడానికి కారణమూ ఈ ఓర్వలేని తనమే!

**శ్రీమతి** : 'కజగం' – 'సంఘం' అన్న సంస్కృత మాటకు తద్భవం. 'పేశం' – 'భాష' అన్న పదానికి తద్భవం. ఇంక మణిమేఖలై, శిలప్పాధికారం సంస్కృత సమాసాలే. వారి తొలిక్కాప్యయంలో 'కాప్యం' అన్నమాట 'కావ్యం' అన్న మాటకు తద్భవం.

**పద్మావతి:** మనకు ఏది మంచో, ఏది చెడ్డో ఎల్లా తెలుస్తుంది అక్కా!

**శ్రీమతి :** మన జీవితంలోని సామ్యశక్తే అది నిర్ణయించగలదు.

అన్ని క్షేత్రాలలోని గుళ్ళూ, గోపురాలూ చూపిస్తూ, వానిలోని శిల్ప సౌందర్యం వర్ణిస్తూ, మధుర, రామేశ్వరమూ మొదలయిన క్షేత్రయాత్రలు సంపూర్ణం కావించి, తిరువనంతపురం చేరుకున్నారు మన ఇద్దరు యాత్రికులు.

తిరువనంతపురంలో అనంత పద్మనాభుడి దర్శనం చేసుకుని కన్యాకుమారి అగ్రం చేరుకున్నారు వారు.

## (2)

కన్యాకుమారి అగ్రం దగ్గిర, ఎదుట ఆకాశంలోనికి పోయి పోయి విశ్వానితో లీనమైపోయిన మహాసముద్ర గంభీరభావం దర్శించి పులకించిపోయినారు మన యాత్రికులిద్దరూ!

*"ఈ సముద్రము కలియు*
*ఏ విశ్వరూపాన!*
*ఈ జీవితము మెలయు*
*ఏ దివ్య భావాన*
*నిత్యయాత్రాంకిత పు*
*నీతమగు నాతరగ"*

అంటూ తీయగా పాడుకొన్నది శ్రీమతి.

"ఈ దృశ్యానికి, ఈ పాటకూ సంబంధం ఏమిటి అక్కా!"

"ఓసి వెట్టిదానా! ఒక పవిత్రదృశ్యం సంఘాతమై ఒక మహాభావం ఉదయిస్తుంది. అది కావ్యరూపంగా వచ్చినప్పుడు ఆ దృశ్యానికీ, ఆ కావ్యానికీ ప్రత్యక్ష సంబంధమేమీ కనబడదు నిజమే! కాని ప్రతి కావ్యానికీ విశ్వమే హంగవుతుంది.

ఆ పాట ఎంత అర్థమైనదో, ఆ మాటలూ అంతే అర్థమయ్యాయి పద్మావతికి. అయినా పద్మావతి శ్రీమతి ఆలోచనాపథం కొంచెం కొంచెం అవగతం చేసుకొంటున్న కొలదీ ఆమెకూ ఏవేవో నూతనమైన పొలిమేరలు గోచరిస్తున్నాయి. మానవజీవిత వైచిత్రి సర్వశ్రుతియుక్తమై ఆమెకు దర్శనమిస్తున్నది. సామ్యతలు ఉండవు. ఒక్కొక్కప్పుడు తాళం తప్పుతుంది. గమకము మాయమౌతుంది.

ఈ నిత్యయాత్రలో మనుష్య డొకప్పుడు అటూ ఇటూ పడిపోతాడు. జీవితం దుర్భరమౌతుంది. కాలం అప్పుడు చౌకగా ప్రసరిస్తుంది. సంతోష సమయాలు ధృతంగా ప్రవహించిపోతాయి. అందుకనే నా పదాలలోని విరహబాధ విలంబితమౌతుంది? కవులు బాధాపూర్ణమైన క్షణాలను యుగాలుగా వర్ణిస్తారు. ఆనంద స్పందితమైన సంవత్సరాలు క్షణికాలై గడచిపోయినాయంటారు.

కాలగర్భంలోనుండి ఉద్భవించి కాలాతీతమౌతుంది రాగం. మానవకాంక్షా రూపమైన రాగమే సంగీతంలో రాగమైనది. కాబట్టే అనంతమైన సంపూర్ణ, ఔడప,

షాడపరాగాలు అనురాగ, కరుణ, క్రోధాది రాగాల రూపాలు కాబోలు, ఆమెకు తల తిరిగినది. ఆమెలోనుండి బరువైన నిట్టూర్పు వెలువడింది.

ఆ నిట్టూర్పు విని శ్రీమతి ఆమెవైపు తిరిగింది. "ఎందుకు తల్లీ నీకు నిట్టూర్పు?"

"ఎందుకేమిటి? ఈ సముద్రం ఎంతవరకు? ఏ తీరాలు చేరుస్తుంది! ఆ తీరాల భూమి ఎంతవరకు, ఏ సముద్రాలవరకూ! ఆ సముద్రాలు?"

"అలాగే ఆలోచనలు సముద్రంలోని కెరటాలవుతాయి... స్వప్నాలు లోతులు!"

"ఎంత లోతులు?"

"మనం మునగలేనివి!"

"అప్పుడా లోతులకు సార్థకత?"

"తెలుసుకోగలిగినవారికి!"

"ప్రతి విషయమూ సముద్రమేనా?"

"కాక!"

"ఆకాశమంత అనంతమా సముద్రము లోతు!"

"ఆ లోతూ అనంతంలోనే లీనమవుతుంది!"

"అంటే?"

"పసిఫిక్ మహాసముద్రం ఆరుమైళ్ళ లోతు అనుకో! అక్కడ భూమి, ఆ భూమి తవ్వుకుంటూపోతే, కొన్నివేల మైళ్ళవతల ఆవలప్రక్క సముద్రం ఆ సముద్రంపై అంచు ఆకాశంలో!"

ఇద్దరూ మౌనం వహించారు.

అలా వారు రెండురోజు లాగినారు.

మూడవదినం ఉదయం ఆ అగ్రసముద్రంలో స్నానం చేసి, కన్యాకుమారి గుడిలో పూజలుచేసి, వచ్చి భోజనానికి ఇంకా రెండు గంటలు వ్యవధి ఉండడంవల్ల సముద్రం ఒడ్డునే వచ్చి కూచున్నారు. ఇంకా యాత్రికులు స్నానాలు చేస్తూనే వున్నారు. కుడివేపుగా సూర్యుడు ఆకాశంలోనికి చొచ్చుకుపైకి సాగిపోతున్నాడు. చల్లని గాలి వీస్తూంది. ఆకాశంలో మేఘాలులేవు. సముద్రం కెరటాలు ఎక్కడ ఉద్భవించాయో, వస్తూ ఒడ్డున విరుగబోయే రేకలు తాల్చి వయ్యారంగా తలలు వంచి నురుగులతో, బుడగలతో విరుగుతున్నాయి. ఆ విరుగుడులోనుంచి చిన్న తరంగాలు ఉద్భవించి ఒడ్డుకు గుసగుసలతో నివేదిస్తున్నవి.

## ③

అప్పుడు పద్మావతి సముద్రం హోరుకు తన కంఠం శ్రుతి కలిపి, తోడిరాగంలో, ఆదితాళంలో –

> ***"కోటి నదులు ధనుష్కోటిలో నుండగ***
> ***ఏటికి తిరిగెదవే? ఓ మనసా*** ***॥కోటి॥***
> ***సూటిగ శ్యామసుందరమూర్తిని***
> ***మాటిమాటికి జూచు మహారాజులకు*** ***॥కోటి॥***

*గంగ నూపురంబునను జనియించెను*
*రంగని గని కావేరి రాజిల్లెను.*
*పొంగుచు శ్రీరఘునాథుని, ప్రేమతో*
*బొగడు త్యాగరాజు మనవి వినవే ॥కోటి॥*

అన్న త్యాగరాజు కీర్తన పాడింది.

కోటి నదులు అనగానే గంగా, యమునా, గోదావరీ, కృష్ణా, మహానది, సింధు, నర్మదా, తపతీ, కావేరీ మొదలయిన భారతీయ నదీ నదాలు వివిధ దేశాలలో మస్సోరీ, అమెజాన్, నీలవోల్గా, ఒరోనికో, జాంబేసీ వోల్గాది నదులు అన్నీ వివిధ రాగాలు పాడుకుంటూ శ్రీరామచంద్రుని పాదాలకడకు ప్రవహించి వస్తూన్నట్లు ప్రత్యక్షమైనది శ్రీమతికి. శ్రీమతి తన్మయురాలైనది.

తాము దర్శించిన ధనుష్కోటేనా రామాయణకాలపు ధనుష్కోటి! అక్కడనుండేనా శ్రీరామప్రభువు లంకకు వారధి నిర్మించినది? ఈనాటి సింహళమేనా ఆనాటి లంక?

"ఈ కన్యాకుమారీ అగ్రమూ ఈ సముద్రమూ చూచేనా ఆ కీర్తన జ్ఞాపకం వచ్చింది నీకు గీతాదేవి?"

"అదేమిటక్కా నన్ను అలా పిలుస్తున్నావు?"

"నిజంగా నువ్వు గీతాదేవివే! ఈ పాట నా చిన్ననాడు నాయనా పిళ్ళే పరమ గాంధర్వ స్వరూపంగా పాడినాడు."

"నాయనా పిళ్ళే అనే పేరేమిటి?"

"అసలు పేరు సుబ్రహ్మణ్య పిళ్ళె. నలుగురు అక్క చెల్లెళ్ళు ధనకోటి సోదరీమణులు. ధనకోటి, కామక్షమ్మ అమ్మా పొన్నమ్మ, చినకుట్టెమ్మ. కామాక్షమ్మ కుమారుడు నాయనా పిళ్ళె. పేరు సుబ్రహ్మణ్యం అయినా తల్లులు నలుగురూ 'నాయనా' అని పిలవడంచేత 'నాయనాపిళ్ళె' అయినాడు!"

"పిళ్ళెలు గొల్లవారా?"

"ఈ పిళ్ళెలు భోగంవారు. అందులో వీరు తెలుగు భోగంవారు. ధనకోటి మహోన్నత సంగీత విద్వాంసురాలు. ఆ కుటుంబంలో ఈయన పుట్టాడు."

"చిన్నతనాన్నుంచి సంగీతంలో లయమైపోయి ఉంటారు."

"ప్చ్! వట్టిమాట ముప్ఫై ఏళ్ళవరకు రౌడీ! అల్లారుముద్దుగా పెరిగిన బాలుడు! ఇంకేమి, ఏ కృషీ పట్టుబడలేదు. రౌడీల సావాసం, సామూ, కసరత్తూ, ఓ జట్కాబండి ఉండేది. ఆయనకు ముప్ఫై ఏళ్ళు వచ్చినప్పుడు, కంచికి ఒక మహాయోగి విచ్చేసినాడు. ఆయన 'కైలాసనాథాలయం'లో విడిది చేశారు. ఆయన తేజస్సు చూచి నగరమంతా ఆయన్ను దర్శించి పునీతులయ్యారు. ధనకోటి చెల్లెళ్ళతో ఆయన దర్శనం చేసింది. తన చెల్లెలి కుమారుని సంగతి చెప్పుకొన్నది. "రేపు ఉదయం నేను రమ్మన్నానని చెప్పి ఆ యువకుని తీసుకొనిరండి." అని స్వామీజీ ఆదేశించారు.

**ధనకోటి:** వాడు ఎంత బ్రతిమాలినా రాదండీ!

**స్వామి:** నేను రమ్మన్నాను అంటే వెంటనే వస్తాడు.

## 4

నిజంగా స్వామీజీ చెప్పినట్లే అన్నీ జరిగినవి. నాయనా పిళ్ళే స్వామీజీ పాదాలకడ వాలినాడు.

స్వామివారు ఏదో మంత్రముపదేశించి తామే స్వయంగా ఆ యువకునకు సంగీతం చెప్పినారు. ఎవరీ స్వామి? నారదుని అవతారమా అని ధనకోటీ వారూ అనుకున్నారు.

ఒకరోజున ఆ స్వామి మాయమైపోయినాడు. నాయనా పిళ్ళే దుఃఖం ఏడు సముద్రాలైనది. గురువుగారిని స్మరిస్తూ ఆ త్యాగరాజు అపరావతారం. ఆనాడు భారతీయ గాయకులలో నాయకమణి అయినారు. మహాభక్తుడు ధనానికి ఆశించలేదు. నిత్య నాదబిందు కళారాధనమే!

"ఆయన తమ నలభైరెండవ ఏట గాన తేజస్సులో లీనమైపోయినారు. చెల్లీ! ఆయన శిష్యుడే చిదంబరపిళ్ళేగారు. నా చిన్నతనంలో కాకినాడ గానసభలో ఆయన కచ్చేరి విన్నప్పుడు నా ఆత్మ నన్ను వీడి ఆయన పాదాలకడ వాలింది."

"అక్కా ఆయన రికార్డులు ఏమీ కనబడవే?"

"ఆయన రికార్డులే ఇవ్వలేదు. లక్షలు ఇస్తామన్నారు ఒప్పుకోలేదు. ఇంతకన్న ఛాందసుడు తుమురాడ సంగమేశ్వరశాస్త్రిగారు. ఈ యుగంలో వీణా పరమేశ్వరుడు, ధనాన్ని దోసి, తన జీవితం నాదబిందు కళారాధనకు అర్పించినాడు. ఇద్దరూ బీదవారుగానే పోయినారు."

"ఎంత చక్కని కథ చెప్పావు అక్కా?"

"ఇది కథకాదు చెల్లీ, చరిత్ర!"

"ఆ చరిత్రలో నువ్వూ భాగస్వామివే. ఎంత అదృష్టవంతురాలవు!"

"తల్లీ! నీ జీవితం సంగీతాంకితం చేయి. సుబ్బలక్ష్మి పట్టమ్మాళులను మరపింపచేయి. ఇదీ నీ తపస్సు. నీ భర్త ఉత్తముడు. అతని హృదయం నలిపివేయకు, భగవంతుని పూజా పుష్పంలా చూచుకో!"

ఈ మాటలు అంటూ ఉంటే అక్కడకు నరసింహమూర్తి మేష్టారు నడిచి చక్కా వచ్చారు.

❀ ❀ ❀

# దశమ గుచ్ఛము

నరసింహమూర్తి మేష్టారును చూడటంతోటే పద్మావతి తెల్లబోయింది. అపరిమితాశ్చర్యంతో నిశ్చేష్ట అయింది! "మేష్టారూ!" అంటూ గబగబా ఆయన దగ్గిరకు పరుగెత్తి పోయి పాదాలకు నమస్కరించింది. "ఎల్లా వచ్చారు? మేము ఇక్కడ ఉన్నామని తెలిసిందా? ఇన్నాళ్ళూ ఎక్కడ ఉన్నారు? మీరు లేకపోవడం నాకు మతిపోయినట్లే అయింది". ఇలా ఏవేవో మాటలు అంటూ మోము ప్రఫుల్లమైపోగా, బొమ్మలా నిలుచుండిపోయింది.

ఇది అంతా శ్రీమతి కరుణామయీదేవి చిరునవ్వుతో గమనిస్తూ అలా నిలుచుండినది.

నరసింహమూర్తి మేష్టారు ఆశ్చర్యంతో పద్మావతిని చూస్తూ మ్రాన్పడి అలాగే నిలుచుండిపోయినాడు. ఈమె పద్మావతేనా? అవును. అదిగో ఆమె వసతి గృహాధికారిణి శ్రీమతి కరుణామయి. పద్మావతి! పద్మావతే! అవును ఎలా వచ్చింది! "మీరు – మీరు – మీరిద్దరూ ఇక్కడకు ఎలా వచ్చారు?"

**శ్రీమతి:** అమ్మాయికి దక్షిణాదిలోని దివ్య శిల్ప క్షేత్రాలన్నీ చూడాలని బుద్ధి పుట్టింది. మేము ఇద్దరం కలిసి వచ్చాము. మీరు మమ్మల్ని ఇక్కడ కలుసుకోడం ఆశ్చర్యమే!

**నర:** నేనూ దక్షిణాదియాత్ర చేస్తూ, అయిదారు రోజులు తిరువాంకూరులో ఉండి, కన్యాకుమారిదేవిని అర్చించడానికి వచ్చాను.

వారందరూ కలిసి బసకు వెళ్ళారు. పద్మావతికి ఒకవైపు ఆనందమూ, ఇంకొకవైపు ఏదో ఆవేదనా? ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది. ఆ రాత్రి చీకట్లో ఆమె నిద్రరాక పక్కపై కదలకుండా పడుకుని ఉన్నప్పుడు చటుక్కున ఓ ప్రబంధ కావ్యంలోని కథలా తన కథ ప్రత్యక్షమై జరిగిపోసాగింది.

తాను తప్పుచేసిందా? తనకు భర్త అంటే ప్రేమే లేదా? తన సంగీతం ఏమయింది? ఎందుకు తనకీ చదువు! ఈ శ్రీమతిగారూ, నరసింహమూర్తి మేష్టారూ ఎవరు? ప్రపంచంలో తనకింక పని ఏమి ఉంది?

ఉన్నట్టుండి ఆమె కన్నీరులో కరిగిపోయి, నరసింహమూర్తి మేష్టారు పాదాలకడ వాలిపోయి, ఆయన పాదాలమీద మోముంచి వెక్కి వెక్కి రోదించినది. నరసింహమూర్తి మేష్టారూ కూలబడి కూలబడి, పట్టలేని దుఃఖంలో మునిగి భుజాలు ఎగిరిపోతూ ఉండగా గొల్లుమని ఏడ్చినారు.

శ్రీమతి కిది ఏమీ అర్థంకాలేదు.

"ఏమిటండీ ఇది? మీ కిద్దరికి మతిపోయిందా? లెండి" అని అంటూ వారిద్దరినీ ఆమె కేకలు వేసింది.

నరసింహమూర్తి మేష్టారు త్వరగా సంబాళించుకొని, తాను లేచి పద్మావతిని లేవదీసి, తన హృదయానికి అదుముకొన్నాడు.

"తల్లీ నువ్వే నాకు కన్నకూతురువు. బిడ్డలులేని లోపం నీ భర్త సహచర్యం నీ సహచర్యంవల్లా తీర్చుకొంటున్నాను. ఏదో మన దురదృష్టవశాత్తూ ఈనాటికి ఏవేవో సంఘటనలు వచ్చాయి" అని అతడు శ్రీమతివైపు చూచి, "అమ్మా పదండి!" అన్నాడు.

వారందరూ నెమ్మదిగా నడకసాగించారు.

శ్రీమతి "ఏమిటండీ నరసింహమూర్తి మేష్టారు, ఈ కన్యాకుమారి అగ్రాన్ని గూర్చిన విశేషాలు?" అని ప్రశ్నించింది. ఆమె తమలోని ఈ ఆవేదన ఉపశమనం అయ్యేందుకు ఈలా ఏదేని విషయాన్ని గూర్చి సంభాషణ ప్రారంభించిందని పద్మావతీ, నరసింహమూర్తి మేష్టారూ గ్రహించారు. పద్మావతి త్వరగా ఉపశమనం పొందలేకపోవచ్చును. తన విధి శ్రీమతిగారిని మద్దతుచేయటమే కదా! అమ్మాయి దుఃఖంచూచి, తానూ కరగిపోయాడు. కాని తాను ఈ లోక సంబంధం మానుకుని, భగవచ్చరణారవిందాలలో మనస్సు లగ్నం చేసుకోడమే తనకు విధి అనుకున్నాడు.

"శ్రీమతిగారూ! ఈ అగ్రం ఏవేవో విచిత్రభావాలను ఉద్భవింపచేస్తోన్నదండీ. ఇది భారతదేశానికి దక్షిణపు కొన. రవివర్మగారు ఈ అగ్రాన్నే - నిలుచున్న ఒక దివ్య మాత పాదాలుగా చిత్రించారు. సముద్ర హృదయాంతర దివ్యభావ మహోతరంగాలలో స్పందనమయ్యే భారతవీణ శ్రుతితీగ మీటి కనబడింది నాకీ అగ్రం. కన్యాకుమారీ భావం సంపూర్ణంగా అర్థం కాలేకపోయినా, అనన్య పరమభావాలేవో నన్ను కదిపివేస్తున్నవి. విరిగిపోయిన శాంతి తిరిగి హృదయంలో చేరుకుంటున్నది."

"నరసింహమూర్తి మేష్టారూ! పద్మావతికి పరీక్షలు దగ్గిరకు వచ్చినాయి. ఇంతవరకూ బాగానే చదివింది కాని, ఇకముందు ఏమి చేస్తుందో అని కొంచెం భయంగానే ఉంది నాకు. అసలు పద్మావతికి పరీక్షలో విజయం పొందవలసిన అవసరం ఉందని కాదు. ఆమెకు పరీక్షలో నెగ్గడం గౌరవ సంబంధం మాత్రమే అనీ నాకు తెలుసు. అయినా చిహ్నామాత్రమైన పరీక్ష నెగ్గడం నెగ్గకపోవడాలలో, ఈరోజులలో మానవ మానసిక ప్రవృత్తి సంపూర్ణ బాంధవ్యం సంపాదించుకుంది. పరీక్షలు నెగ్గి పైకి వెళ్ళడం అనే ప్రయత్నంలో, మానవునకు జ్ఞానం పాలసముద్రంలా వెల్లివిరుస్తుంది."

"పద్మావతి నాలుగు కచ్చేరీలు చేసుకుంటే పదివేలు సంపాదించుకుంటుంది. అయినా మీరన్నట్లు ఈనాడు ఈ పరీక్షలకు, మానవజీవితానికీ ముఖ్యమైన సంబంధం ఉంది సుమండీ!"

"బాలసుబ్రహ్మణ్యంగారు ఎం.ఎ. ఆయన మొదటి శ్రేణి గాయకోత్తముడు. ఆ ఎం.ఎ. డిగ్రీ ఆయనకు ఇంకో లక్షగౌరవం తెచ్చి పెడుతూ ఉందికదా!"

"అందుకనే కాదండీ కవిత్వంవల్ల ప్రసిద్ధనామం సంపాదించుకున్న వారికి డిగ్రీ ఉంటే, లేనివారికన్న ఎక్కువ గౌరవం చేస్తాము. అలాగే సినిమా తారల విషయంలోనూ!"

"అయితే మీ ఉద్దేశం పద్మావతి పరీక్షలో కృతార్థతను పొందడమే మంచిదని."

"కాదండీ మరి!"

"అయితే ఫిబ్రవరి వచ్చింది. ఈ నెల అంతా గట్టిగా చదివితే చాలు. మార్చి రెండవవారంలో కాశీ వెడతాను. అప్పటికి అమ్మాయి ఫస్టుగా ప్యాసవడానికి సరియైన స్థితికి వస్తుంది."

"మీరిద్దరూ అన్ని క్షేత్రాలూ చూచారుగా"

"ఓ! ఇంక ఇంటికి మళ్ళడమే!"

అప్పటికి పద్మావతి హృదయం ఊరట చెందింది వినీ వినబడని కంఠంతో.

"నరసింహమూర్తి మేష్టారూ! మీరు కూడా మీ యాత్రలు ఇంతటితో మానివేసి మదరాసు రావాలి. మీరు రాకపోతే నేను మదరాసు వెళ్ళగానే ఎవరికీ కనబడకుండా ఎక్కడికైనా వెళ్ళిపోతాను. ఆ పాప పుణ్యాలు మీవే!" అన్నది.

నరసింహమూర్తి మేష్టారు పద్మావతిని తన పక్కకు నొక్కుకుని "తల్లీ! నీ కోర్కె నాకు రామాజ్ఞ. పద అందరం కలిసే మదరాసు పోదాం" అన్నాడు.

## ②

రాధాకృష్ణ తనతో ఏమి మాట్లాడాడు? అతడు తన ఉద్దేశం గ్రహించాడు. అతని మాటల్లో మరేమీ ఘాటు లేకపోయినా, భావం ఘాటుగానే ఉంది. వెంకట్రావుకు ఆ మాటలతో నాలుగురోజులు తిన్నగా తిండి సహించలేదు. నరసింహమూర్తి మేష్టారు వెళ్ళిపోగానే సుశీల వెంకట్రావుకు ఒక నాయరు వంటమనిషిని ఏర్పాటు చేసింది. అతని వంట కొన్నాళ్ళవరకూ వెంకట్రావుకు రుచించలేదు. తర్వాత అదే అలవాటయింది.

"వెంకట్రావుగారూ మనది 'ఫ్రీ లవ్' సంఘంకాదు! కాని అలాని ముసలమ్మ ఛాందసాలు కలవాణ్ణి కాదు. వివాహం చేసుకున్న స్త్రీ భర్త విషయంలో సత్యమైన నడవడి చూపించాలి. అంతకన్నా దిట్టంగా భర్త వర్తించాలి. ఇష్టంలేదూ, భార్యాభర్తల తనం రద్దు చేసుకోవాలి! ఏమంటారు! వెనక ఒకటీ, ముందు వేరొకటీ ఉంటే న్యాయమా చెప్పండి!" అని రాధాకృష్ణ అన్నాడానాడు.

ఆ మాటలకు వెంకట్రావు కించపడిపోయాడు. ముచ్చెమటలు పోశాయి. ఒకనిమేషం అక్కడ ఉండలేకపోయినాడు. వెంటనే అతడు "రాధాకృష్ణగారూ! నాకు చాలా అర్జంటు పని ఉంది. నేను వెడుతున్నాను. సుశీలగారితో చెప్పండి!" అని వెళ్ళిపోయినాడు.

ఇంటికి వెళ్ళే దారిలోనే అతనికి మతిపోయింది. కన్నీరు లేని దుఃఖం అతనికి పొర్లి వచ్చింది. వక్షము వేడినిట్టూర్పుతో నిప్పురాజేయ తోలుతిత్తిలా ఎగసిపోయింది. ఇంటికి పోయి పక్కమీద వాలిపోయినాడు. ఆ పూట అతడు భోజనం చేయలేదు. నాయరు పిలిచినా వంట్లో బాగుండలేదని వంక పెట్టినాడు.

ఆ మర్నాడూ, ఆ మర్నాడూ ఆఫీసుకు వెళ్ళలేదు. తన చీకు హృదయం అందరికీ తెలిసిపోయిందని అతడు సిగ్గుపడి కృంగిపోయినాడు. చివరికి నాయరుకూ తన మొగం చూపించలేకపోయినాడు. అతని జీవితం ప్రాథమికావస్థలోనే పెరిగింది. ఈ నాటికి బహుళ భావ సంఘాతంతో క్లిష్టమైంది. పరస్త్రీ గమనం మహా దోషమనిగాని, కాదనిగాని అతనికి ఎప్పుడూ ఆలోచించవలసిన అవసరం లేకపోయింది. అలాగే పరస్త్రీ గమనం చేయాలని కాంక్షా ఉద్భవించలేదు. ఆ రకమైన రంగులు అతని జీవిత చిత్రంలో సన్నిహితం కానేలేదు. పద్మావతే అతనికి సర్వమై బ్రతుకు నిండి ఉండేది. నేడా నిండుతనం వెలికి తాల్చింది. బహుముఖమైన పూర్ణ మానవ జీవితంలోని ఘాటువాసనలూ, పులుముదు రంగులూ, రకరకాల చీకట్లూ, వెలుగులూ, చిత్రవిచిత్రాలైన జీవితాలూ, భావాలూ,

రాజకీయాలు, మతాలు, ఆదర్శాలూ, కాంక్షలూ వివిధ మానవ హృదయ వికారాలూ అతని జీవితాన్ని పొదివికొని పోయినవి.

అడవిలో పెరిగిన పక్షిలావున్న అతడు ఉద్యానవనాల్లో చేరిన మయూరంలా అయ్యాడు. ఈ ధ్వనులూ, ఈ వాసనలూ, యీ గుంపులూ వేరు. అక్కడ ప్రకృతి, ఇక్కడ మానవారణ్యము.

నాలుగవరోజున సుశీలా రాధాకృష్ణ లిద్దరూ అతని ఇంటికి వచ్చినారు. అతడు తెల్లబోయినాడు. అతనికి విపరీతమైన కోపం వచ్చింది. వారితో ఎంతకాలంవరకో అతడు మాట్లాడలేదు. పౌదరు పూసుకున్న సుశీల ముఖాన్ని ఫెళ్ళుమని చెంపపెట్టుతో వికారం చేయాలని అతని మనస్సు గాంఢ్రించింది. సెంట్లురాసుకుని, లాలిత్యంగా దుస్తులు వేసుకుని ఫ్రేములేని కంటిఅద్దాలు ధరించిన రాధాకృష్ణుని ముక్కలుచేసి అతడెక్కి వచ్చిన కారులోనే పోలీసుస్టేషనుకు తానే ఆ కారు తీసుకువెళ్ళి అప్పగించాలన్న తీవ్రక్రోధం వెంకట్రావును ఊపివేసింది.

"వెంకట్రావుగారూ! ఏమిటీ స్థితి? క్షవరం అన్నా చేసుకోలేదు. మా రకం జీవితం మీకు అర్థంకాక కంగారు పడిపోతున్నారు" రాధాకృష్ణ అన్నాడు.

"మీకు మాకూ గాఢమయ్యే స్నేహంలో మొహమాటంలేక రాధాకృష్ణగారన్న మాటలకు మనస్సు చీకాకు పెట్టుకున్నారా?" అని సుశీల అడిగింది.

వెంకట్రావు మండిపోయాడు. మీ ఇద్దరి స్నేహం నేను కోరలేదు. మీరే నా స్నేహం చేసి నన్ను గడబిడ చేశారు. మీ ఉద్దేశాలు నాకు తెలియవు. మీ విధానాలు నాకు అర్థం కాలేదు. దగ్గిరకు వచ్చినా మీరే, అపార్థాలు చేసుకున్నా మీరే? మీకూ నాకూ స్నేహం లేకపోవడమే మంచిది" అని అతడంటూ పడకగదిలోనికి వెళ్ళి, పక్కమీద మేనువాల్చినాడు.

పది నిమిషాలయిన తర్వాత రాధాకృష్ణ ఒక్కడూ లోనికి వచ్చాడు "వెంకట్రావుగారూ! మీరు ఏది కోరితే అది చేస్తాను, సుశీలను ఇక్కడ వొదిలి పొమ్మంటే వెడతాను. కాని నన్ను గురించి తప్పభిప్రాయం పడవద్దని ప్రార్థన" అన్నాడతను.

వెంకట్రావు తెల్లబోయాడు. అతడు లేచి రాధాకృష్ణ భుజాల మీద చేయివైచి ఒక్కనిమేషం నిల్చివుండి నిట్టూర్పు విడిచి, మళ్ళీ వెళ్ళి మంచంమీద వాలినాడు. రాధాకృష్ణ మోము ప్రఫుల్లంకాగా, మంచం దగ్గిరకు వచ్చి "నేను రేపు వచ్చి కనబడతాను!" అని ఆవలకు వెళ్ళిపోయినాడు.

సుశీల లోనికి వచ్చినది ఆమె తలవాల్చుకుని గుమ్మం దగ్గిర నిలుచున్నది. వెంకట్రావు గుండె గబగబ కొట్టుకుంది. ఆమె రావడమే? అతడు రివ్వున లేచి నిలుచున్నాడు. అతని గుండె రెండు క్షణికాల కాలం ఆగిపోయింది. కళ్ళు మైకం కమ్మినాయి. తల వాల్చుకున్నాడు.

"సుశీ! నువ్వు నాకు చెల్లెలవు. నువ్వు ఇంటికి వెళ్ళు! ఒకరి కొకరం మనం పూర్తిగా అర్థంకాక ఈలా అయింది. ఇద్దరూ ఎల్లుండి రండి" అన్నాడు. సుశీల నెమ్మదిగా వెళ్ళిపోయింది.

ఇదివరకే తన భార్య ఏ యాత్రకైనా వెళ్ళవచ్చునని బుచ్చి వెంకట్రావు అనుమతి పత్రం వ్రాసి విద్యాలయాధికారిణికి ఇచ్చి ఉన్నాడు. ఆ విషయం తాను బయలుదేర బోయేముందు, పద్మావతి భర్తకు కవరు వ్రాసి పోష్టులో వేయించింది. ఆ ఉత్తరం అతడు రెండురోజులు చూడకుండ అలాగే ఉంచాడు. తర్వాత చూచుకొని ఆశ్చర్యం పొందినాడు.

ఈ యాత్ర ఎందుకు వెళ్ళినట్లు?

తాను యాత్రలకూ ప్రయాణాలకూ వెళ్ళకుండానే ఎక్కడకు చేరుకున్నట్లు?

తనకూ! ఏమి కావాలీ?

అనేకులు ధనం సంపాదించుకొనడమే ఆశయంగా పెట్టుకుని, కుమిలి కూలిలి. దొర్లి దోరి, ఆ ధనం సంపాదించుకుంటారు. అలా వారి జన్మంతా ఆ భయంకరయోగంతో నిండిపోతుంది. కాని తనబోటి వాళ్ళకు వ్యక్తంగాని ఏవో కాంక్షలూ, ఆశయాలూ నిండిపోతాయి. వాని స్వరూప జ్ఞానం లేక తాము ఆవేదనలో క్రుంగిపోవడం రోజూ జరిగే నిత్య నాటకం.

తనకు సుశీల కావాలా? ఆమే తనకు దక్కితే తనకు ఏదో ఆనందం కలుగుతుందా? అంతకన్న అందమైన మలయాళభామినులు ధనం చూపిస్తే తనతో వచ్చి ఉండగలరే! మలయాళీలేమిటి? ఏ దేశస్థులైనాసరే ధనానికి వచ్చేవారు, అప్సరసలవంటివారు మదరాసులో ఉన్నారు.

"బ్రాతెలు" శాసనం అమలులో ఉన్నా అమలులో లేనట్లే! ఎంతమంది రహస్యంగా ఈ వృత్తి సాగించడంలేదు, అయినా అతి పురుషవాంఛ జీవితానికి ముఖ్యంకాదే! అలాంటి ఆలోచనలే కలుగలేదే! ఈ సుశీల ఏదో అతి విచిత్రమైన బాలిక. ఆమెలో ఏదో అద్భుతమైన ఆకర్షణ ఉంది.

బహుముఖ్యమైన కారణాలవల్ల స్త్రీ పురుషులలో ఆకర్షణ ఉద్భవిస్తుంది. రూప సౌందర్యమూ, అవయవసౌష్ఠవమూ, ఆకారపుతీరూ, కంఠమాధుర్యము, గుణగణాదులు, చేష్టలు ఇంకా ఎన్నో కారణాలుండవచ్చును. సుశీల తనలో పశుత్వభావాలకు దోహదమిచ్చింది.

ఆలోచనలు సముద్రతరంగాలై, పోటు పాటులై ముంచెత్తుకు వచ్చాయి బుచ్చి వెంకట్రావుకు.

తాను సినీమా కంపెనీ పెడుతున్నట్లు పద్మకు తెలియదు. ఆ పెట్టబోయే కంపెనీతో చక్కని చిత్రం తీయాలి. అందులో పద్మ భాగం పుచ్చుకోవాలనికదా తనకోర్కె! కాని సినిమా కంపెనీని స్థాపించి పూనుకోడం ప్రత్యేకం సుశీలకోసం. సుశీల తనకు ఇంకా దగ్గిరగా వస్తుంది. సుశీల కథానాయకురాలు కావాలి. కాని తన భార్య కంఠం ఆ కథలో భాగం కావాలి.

బుచ్చి వెంకట్రావు అనేక సినిమా కంపెనీలు పరిశీలించి చూచాడు. అనేక సినిమా సంస్థలు కుక్కగొడుగుల్లా ఉద్భవించి మరునాడు మాయమైపోతున్నాయి. కొన్ని ఏదో రకంగా తంటాలు పడుతున్నాయి. కొన్ని చచ్చి చెడి చేయంగల విన్నపాలై ఒక బొమ్మ తీసి మాయమైపోతున్నాయి. ఆ బొమ్మ లాభం తెస్తే డిస్ట్రిబ్యూటరు గుంజుకుంటాడు.

విజయవంతమైన చిత్రం కాకపోయినా, ఆ చిత్రంవల్లనే డబ్బుగుంజుకోగలడు డిస్ట్రిబ్యూటరు.

ఒక కంపెనీ పెట్టి చిత్రం తీయడం ప్రారంభిస్తే ఎంత మహోత్సవంలా అయిపోతుందో! వేలకొలది జనులు చిత్రం నిర్మించడానికి కావాలి. అందరూ నిర్మాతకు దాసానుదాసులవుతారు; కారులు, రిహార్సల్సు, తారలు రావడం, పోవడం, చిత్రంలో ఒక్కొక్కసంఘటన తీయడం! దానికై సెట్టింగులు, ఆ వెనుక దర్శకుడూ, ఛాయాగ్రాహకుడూ, శబ్దగ్రాహకుడూ కార్యక్రమానికి ఉపక్రమించడం. అంతకుముందు నగలు, నాణ్యాలు, దుస్తులు, సేకరించి సిద్ధం అవడం, స్త్రీ పురుష తారలకు వేషాలు వేయడం, సెట్టింగులలో దీపాలు అమరించడం, ఆ దీపాలతో పగటిలా చేయడం, ఆర్పేస్తూ ఉండడము! ఒక్కొక్క సెట్టుకు సంబంధించిన రంగాలన్నీ తీయడం! ఎంత గడబిడ! ఈ గడబిడకంతకూ అతడు తాను నాయకుడు. అందరూ అతని చుట్టూ మూగాలి అతన్ని కొలవాలి. పొగడాలి. గౌరవించాలి. అతడు సంపూర్ణాధికారి.

ఇదీ బుచ్చి వెంకట్రావు హృదయాంతరాన ఉదయించిన గాఢమైన కాంక్ష.

పద్మావతి యాత్రకు వెళ్ళిన అయిదవరోజున సుశీల, రాధాకృష్ణలు ఇద్దరూ బుచ్చి వెంకట్రావు దగ్గిరకు వచ్చారు. రాధాకృష్ణ తానే తన కారును నడుపుకొంటూ వచ్చాడు.

"రండి. దయచేయండీ!" అంటూ వచ్చి వెంకట్రావు వారిని లోని హాలులోనికి తీసుకొనిపోయినాడు.

**రాధాకృష్ణ:** వెంకట్రావుగారూ, త్యాగరాజ నగరంలో మొదటిరకం మేడ ఒకటి కుదిర్చాను. శుభముహూర్తం చూచి మనం పని ప్రారంభించడమే!

**వెంకట్రావు:** ఫష్టు! శుభముహూర్తం చూడండి!

**రాధాకృష్ణ:** మీ దగ్గర ఇప్పుడు ఎంతడబ్బు సిద్ధంగా ఉంది చెప్పండి?

**వెంకట్రావు:** ఇరవై అయిదు వేలున్నాయండి.

రాధాకృష్ణ తెల్లబోయినాడు. "ఇరవై అయిదు వేలతో మనం ఏం చేయగలం బుచ్చి వెంకట్రావుగారూ? పని ప్రారంభించిన పది రోజులకుకూడ సరిపోదే!" అని అతడు కాలుస్తున్న సిగరెట్టు సగంపైగా ఉందనగానే బూడిదరాల్చు గిన్నెలో పారవేసినాడు. "ఒక లక్షైనా పెట్టుబడితో ప్రారంభిస్తారనుకున్నాను!" అని అతడు కుర్చీలో కూలబడ్డాడు.

"నా దగ్గిర లక్ష ఎక్కడున్నాయి రాధాకృష్ణగారూ! నా వ్యాపారానికి అవసరమైన సొమ్ము అరవైవేలు. ఆ సొమ్ము మారుతూ వుంటుంది. ఏర్పరచుకొన్న జీతమూ, నావంతు లాభమూ, ఖర్చులుపోను మిగిలింది ఇరవై అయిదువేలున్నాయి. అదిపెట్టి మాత్రమే సినిమా ప్రారంభించగలను. మీరు ఇతర భాగస్వాములను తీసుకువస్తామన్నారు కదా?" అని వెంకట్రావు రాధాకృష్ణను పృచ్ఛచేసినాడు.

సుశీల నెమ్మదిగా వారిరువుర దగ్గిరకు వచ్చింది. ఇంతవరకూ ఆమె ఇటూ అటూ పచారుచేస్తున్నది. "నా పేర వేసిన ఆరువేలూ వేసి నేనూ భాగస్వామిని నవుతాను. రాధాకృష్ణగారి దగ్గిర అయిదువేలున్నాయి. అంతవరకూ ఆయన వేస్తాడు. నా జీతమూ రాధాకృష్ణగారి జీతమూ నిర్ణయించి అది కూడా కంపెనీ వాటాలు చేయవచ్చును." అని ఆమె గోడకు కట్టిన ఒక నవీనచిత్రం చూస్తూ నిలబడింది.

"మీ ఇద్దరిదబ్బూ వేయడం అన్యాయం. అదీకాక మీకు ఈయబోయే జీతాలు కూడా వాటాగా చూసుకోడం మరీ అన్యాయం. నా తంటాలు నేను పడతాను. ముహూర్తం పెట్టించండి. మనం ఏర్పాటు చేసుకొన్న మేడలో పని ప్రారంభిద్దాము." అంటూ వెంకట్రావు లేచి "రండి, ఆ మేడ చూచి వద్దాము." అని పూర్తిచేశాడు.

## (3)

సినీమా కంపెనీ ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికే మూడువేలయింది. తారలకూ, తారకులకూ ప్రారంభ రుసుములు ఎనిమిది వేలయ్యాయి. స్టూడియోకు అడ్వాన్సు అయిదువేలిచ్చారు. రాధాకృష్ణ దర్శకుడు. తెలుగు చిత్రాలకు ఎవరు దర్శకులు కాలేరుగనుకా. చిత్రంకూడా గీయలేని ఒక చిత్రకారుడు, కళాదర్శకుడు. సంగీత దర్శకుడు రాధాకృష్ణే!

పెళ్ళుమని ప్రారంభమైంది బుచ్చి వెంకట్రావు "నవీన చిత్రా ఫిలిమ్సు" కంపెనీవారి 'దేవాలయం' అనే చిత్రం. 'మందాకిని' స్టూడియోలో తీయడం ఏర్పాటయింది. మొదటి రోజు షూటింగు ఒక మంత్రిగారు 'మీట' నొక్కి ప్రారంభిస్తారుట.

కథకు పేరు పెట్టారు. కథ ఏమిటో ఎవరికీ తెలియదు. ముందర రాధాకృష్ణ పాటల వరసలు నిశ్చయం చేశాడు. మూడు డాన్సులన్నా ఉండాలన్నాడు రాధాకృష్ణ!

"కాదయ్యా! మొన్న లక్షలు ఆంధ్రదేశంలో గణించిన 'కొట్టడా' అనే అరవచిత్రంలో ఎనిమిది డాన్సులు, పదహారు పాటలు ఉన్నాయి. మన చిత్రంలో ఆఖరికి ఆరు డాన్సులు, పధ్నాలుగు పాటలన్నా ఉండకపోతే ఎట్టాగూ?" అని అసిస్టెంటు డైరెక్టరు రామచంద్ర అన్నాడు.

"కథ రాయడం ఎవరు? వాటికి మాటలూ పాటలూ రాయడం ఎవరు?" అని బుచ్చి వెంకట్రావు అడిగినాడు.

"కథ నేనే ఇంగ్లీషులో రాస్తాను. డైలాగ్సుకూడా నేనే ఇంగ్లీషులో రాసిపారేస్తాను. అవి తెలుగులోకి మార్చడమేగా? కాస్త కథలు దిట్టంగా రాస్తున్నాడు మా మేనల్లుడొకడు. ఈ మధ్య ప్రతి పేపరులోనూ వాడి కథే! వాడు రాసిన 'గజ్జెలచప్పుడు', 'మ్యావు మ్యావు', 'పైటకొంగు', 'కుచ్చెళ్ళు!', 'రాత్రివేళ!' అనే కథలు మా రంజుగా ఉన్నాయి. వాడే నా డైలాగ్సు తెలుగులో పెడతాడు." అని రాధాకృష్ణ అన్నాడు.

"కథలో మూడు ప్రేమ దృశ్యాలు, రెండు ఆకాశంలో ఎగరటాలు, అయిదన్నా కత్తియుద్ధాలు, రెండు గుఱ్ఱంస్వారులు, నాలుగు విరహతాపాలు ఉండాలి. లేకపోతే రక్తికట్టదు." అని రామచంద్ర అన్నాడు.

"ఒక రాజభవనం, మూడు పల్లెటూళ్ళు. రెండు అడవులు. రెండు పడవసీనులు, నాలుగు పల్లెటూరి ఇళ్ళు" ఉండితీరాలని కళాదర్శకుడన్నాడు.

❀ ❀ ❀

# ఏకాదశ గుచ్ఛము

ప్రత్యూష శీతల మధుర పవన బాలికలులా పద్మావతీ, శ్రీమతి కరుణామయీ ఎగ్మూరు స్టేషనులో దిగినారు. వారితో నరసింహమూర్తీ దిగినాడు. అందరూ టాక్సీమీద ఆంధ్రమహిళా సభా కేంద్రానికి వచ్చారు. పద్మా, శ్రీమతులక్కడ దిగిపోయినారు. నరసింహమూర్తి మేష్టారు మైలాపురంలో ఒక హోటలులో దిగినారు.

ఆ సాయంకాలం పద్మావతి భర్త సినిమా కంపెనీ పెట్టిన విషయం, ఆ ప్రారంభ మహోత్సవం అన్ని పత్రికలలో చదువుకొన్నది, ఇంక ఆ ఊళ్ళో నిలవలేక, ఆ రాత్రి విద్యాలయ ప్రధానాచారిణిగారితో సమాలోచించినది. ఇంక వారం దినాలకు బాలికలను తీసుకొని శ్రీమతిగారు కాశీ వెడతారు. అంతవరకు తాను మదరాసులో ఉండడం భావ్యం కాదనీ ఆ మరునాడే నరసింహమూర్తి మేష్టారుని తీసుకొని తాను కాశీ వెళ్ళిపోతానని మనవి చేసుకున్నది. ప్రిన్సిపాల్‌గారు అందుకు ఒప్పుకొన్నది.

ఆ మరునాడుదయం గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ బండిలో రెండవ తరగతిలో పద్మ, తన్ను తండ్రికన్న యెక్కువగా సంరక్షించే నరసింహమూర్తి మేష్టారితో బయలుదేరింది.

భర్తంటే ఎందుకో తనకీ భయం? తనకు తన భర్తపై ప్రేమ నశించిపోయిందా?

స్టేషనులో జాజిమల్లి మొగ్గలదండలూ చేరులూ అమ్మకానికి వచ్చాయి. ఆ బాలిక మతిపోయినట్లు అమ్మకానికి వచ్చిన జాజిమల్లె పూలన్నీ కొన్నది. తానున్న ఆడవాళ్ళ సెకండుక్లాసు కంపార్టుమెంటంతా ఘుమఘుమలాడిపోయింది. ఏనాటినుండో తన జీవితంలోనికి ప్రసరించి వచ్చి చేరిన ఆలోచనలు, కళలు, ఆశలు, ఆశయాలు, సంతోషాలు దుఃఖాలు ఒక్కసారిగా ఆ మధురసుగంధాలతో కలిసి పైకి పొంగివచ్చాయి. తన బావ తనకు అవతారపురుషుడుకాదూ! తన బావ తనకు వీరాధివీరుడు కాదూ! తన చిన్నతనంలో తన బావకోసం తిండీ నిద్రా మాని ఎదురు చూడలేదూ! తన బావకు వేరు వేరు సంబంధాలు వస్తే, అంత చిన్నతనంలో, తనకు బాలికల బ్రతుకులో వున్న గుబాళింపులు అర్థంకాని రోజుల్లోనే ఎంత బాధపడిపోయింది! తన బుచ్చి వెంకులు బావ, తన సముద్ర దేవుడు. తన జాజిమల్లెల పొదరింటికాడు, తన పూర్ణిమల చంద్రుడు తనకు దూరం అయిపోతే తాను బ్రతికి లాభం ఏమిటి?

ఈ రైలు ఎక్కేసరికి తనకు ఈ విచిత్రమైన ఆలోచనలు ఏమిటి? అవును కొత్తగా కావలిలో తానూ తన భర్తా కాపురం చేసే రోజుల్లో, ఏటిలో పడవమీద కలిసి వెళ్లిన ప్రతి నిమేషమూ, తనకు ఏవో మధుర మధురమైన ఆలోచనలు కలిగేవి. పక్కనే శ్రీకృష్ణునిలా తన బావ! తాను రెండెడ్ల బండిపై బావతో కలిసి తమ ఊరు వెడుతూ ఉన్నప్పుడూ ఈ రీతిగానే ఆలోచనలు. మద్రాసులో తామిద్దరూ కొత్తగా కాపురంపెట్టిన దివ్యముహూర్తాలలో తానూ తన భర్తా వెనక సీటులో, డ్రైవరూ, నరసింహమూర్తి మాస్టారు ముందు కూచుని కంచి, కాళహస్తి, తిరుపతి వెళ్ళినప్పుడు, అలా అలా కారు మహావేగంలో వెళ్ళిపోయే సమయములో, తాను తన బావవళ్ళో తలపెట్టుకొని, ఆకాశంలా గంభీరమైన అతని

మోము చూస్తూ ఏవేవో అద్భుతమైన ఆలోచనలలో మునిగిపోయింది. తన బావ! తన బావ! జాజిపూవులు, సన్నజాజులు, జాజిమల్లెలు! తన బావ సినీమా కంపెనీ పెట్టినాడని నరసింహమూర్తి మేష్టారన్నారు.

ఎందుకు సినీమా కంపెనీ?

ఎందుకు ఆ గొడవంతా నెత్తిమీద పెట్టుకొన్నాడు తన బావ!

ఎన్ని లక్షలో ఖర్చు?

తాను తనకు ప్రాణమూ ఆత్మ అయిన బావను వదిలి అలా దూరంగా వెళ్ళిపోతే తన బావ సినిమాలు పెడతాడు. నాటకాలూ పెట్టవచ్చును. ఇదంతా తన తప్పు.

తనకు 'గీతాదేవి' అని బిరుదు. తాను సంగీత కళానిధిగా పేరు సంపాదించింది. అంతకూ ఎవరు కారణం? ఎవరమ్మా తనకీ పెద్ద ఆలోచనలు ఆలోచించే శక్తి నిచ్చింది? బావ! తన బావ!

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ అతివేగంగా వెళ్ళిపోతోంది. కొత్తరకం కెనడా రైలు ఇంజను అతివేగం.

ఈనాడు జీవితమే అతివేగం. ఎన్ని జన్మలకో కలగవలసిన సంస్కారం ఈనాడు తనకు ఈ కొద్ది సంవత్సరాలలోనే చేకూరిందే.

రైలు గూడూరు వచ్చింది. పక్క మగవారి సెకండు క్లాసులో ఉన్న నరసింహమూర్తి మేష్టారు వచ్చి "భోజనం వస్తుంది. భోంచేయి తల్లీ!" అన్నాడు.

"మేష్టారూ! బావగార్ని నేను చూడకుండా బయలుదేరాను!"

"నిజమే! అంత తొందరగా బయలుదేరాం మనం మరి!"

"మీరైనా నాకు గట్టిగా చెప్పలేదేమండీ!"

"నేనా! నేనా!"

"పోనీలెండి. మీకుమాత్రం ఏం తెలుసు నా మనసు? ఏమిటో ఇంత తొందరపడి పోయాను!"

నరసింహమూర్తి మేష్టారు మౌనంగా ప్లాట్‌ఫారంలో చూడని చూడని చూపులతో ఎవరికొరకో చూస్తున్నాడు.

"బావగారని నన్ను ఏరోప్లేనులో వచ్చి కలుసుకోమంటే!"

"వస్తాడా?"

"ఇక్కడే ఒక టెలిగ్రాం ఇవ్వండి!"

"ఏమని?"

"నాకు చూడాలని బెంగగా ఉందనీ, ఇద్దరం కలిసి కాశీ, ప్రయాగా, బృందావనం. మధుర, గోకులం మొదలైనవి చూడాలనీ!"

"పరీక్షలైనవరకూ చూడడం ఎలా పడుతుందీ? అప్పుడే వస్తానంటే?"

"మీరు టెలిగ్రాం ఇవ్వండి మేష్టారూ!"

"నువ్వు మదరాసులో అతణ్ణి చూడకుండా వచ్చేశావు! ఇప్పుడు చూడాలని అంటే, అతడు–"

"ఎందుకండీ ఈ కుళ్ళంకలూ? నిజంగా నాకు ఆ బుద్ధి పుట్టింది. మదరాసులో ఉన్నదేలేదు. పైగా సినిమా కంపెనీ పేరు వినగానే కడుపులో దిగులుపుట్టి కదా బయలుదేరాను!"

"సరే సరే!"

నరసింహమూర్తి మేష్టారు టెలిగ్రాం ఇవ్వడానికి వెళ్ళిపోయాడు.

## ②

"కళకు ప్రధానాశయం ఆనందం. ఆనందం చేకూర్చుకోడానికే సంగీతం. చిత్రలేఖనం, శిల్పం, కవిత్వం, నాట్యం, సినీమా, నాటకం మొదలైనవన్నీ!" అని సంగీత దర్శకుడు రాధాకృష్ణ అన్నాడు.

"సరేనయ్యా! కాని మా నరసింహమూర్తి మేష్టారు కళలన్నీ భక్తిరూపాలనీ, కవిత్వం సాలోక్యమనీ, చిత్రమూ శిల్పమూ సారూప్యమనీ, సంగీతం సామీప్యమనీ, నాట్యం సాయుజ్యమనీ అనేవారు. ఆ మాటలు నాకు నచ్చాయి. అట్టాగే మన కథ కొంచెం లోకానికి ఏదయినా ఉపకారంగా ఉండొద్దామరి!" అంటూ బుచ్చి వెంకట్రావు, కాల్చే సిగరెట్టు ఆఖరుకాగా బల్లపై బూడిద గిన్నెలో వేసినాడు.

"ఇప్పుడు వచ్చే సినిమాలు భక్తితో కూడుకొని ఉన్నాయనా మీఉద్దేశం?"

"భక్తిలేదూ బండలులేవు! చచ్చు ఫిల్ములు చూడడానికి తాము సంపాదించుకొనే నాలుగురాళ్ళూ పారేసి వెడుతున్నారు. ఎంత డబ్బు బుగ్గిపాలవుతోందో."

"ఇవాళ మనం తీసేబొమ్మ నీతిదాయకంగా ఉండాలనీ మీ వుద్దేశం వెంకట్రావుగారూ? అయితే మన లక్షా బుగ్గిపాలయిందన్న మాటే"

"అది కాదండీ! మనం అల్లేకథ అందంగా వుండాలి. మనలో అనేక ఉత్తమ విషయాలను గురించి పరివర్తనం వచ్చేటట్లూ వుండాలి. అలాంటి కథ చాలా గొప్పది. నేను ఈ మధ్య చాలా ఇంగ్లీషు సినీమాలు చూస్తున్నాను. వాటిలో కొన్ని ఎంతో బాగున్నాయి. పైగా ఈ కథలు ఎన్నాళ్ళవరకో నన్ను పట్టుకు వదలందే! అదీ విజయం? అట్టాంటికథ అల్లాలి."

"నేను రాసిన కథ ఎల్లా ఉందంటారు?"

"బాగానే వుందనుకోండి. కాని, అందులో అన్ని రుచులూ-"

"లేవంటారు. అదేమిటండీ! ఆ రాచకొడుకు దేశం చూడ్డానికి బయలుదేరాడు, దారిలో..."

"అబ్బబ్బా! ఏమిటండీ ఈ రాచకొడుకులూ వాళ్ళూ!-

"అనగా, అనగా' అని మా అవ్వకథలు చెప్పేది. ఆ కథలో రాచకొడుకులు దేవతల్లా తోచేవారు. ఇప్పుడు వచ్చే సినిమాల్లో రాచకొడుకులు నాగేశ్వర్రావులే కాదండీ! రాచకొమరితలు అంజలీలూ దేవతా కన్నెలు వరలక్ష్ములు! అబ్బా విని ప్రాణం విసిగిపోతోంది."

"మనం విసగడం కాదుగదా ఆలోచించవలసింది? ప్రజలందరూ విరగబడి చూడడం, వాళ్ళకు నాగేశ్వరరావు వీరాధివీరులే. వాళ్ళ కర్రకత్తులు నిశితమైన వీరఖడ్గాలూ!"

"అదేమిటండీ రివాల్వరు పెట్టుకొని కత్తి యుద్ధాలూ, ముష్టి యుద్ధాలూ చేస్తారు. పైగా ఆ వేషాలేమిటి? లాగులు, కోట్లు - ఆ డ్రెస్సులు గవర్నరుగారి కోచీలుతోలే ప్యూనుల వేషాలు, ఆ డ్యాన్సు లేమిటి. ఆ పాటలేమిటి? ఛా ఛా! భాషలో కూడా స్త్రీ పురుషుల సంబంధాలు అర్థమిచ్చే మాటలూ, పాటలూ రామచంద్రా మా కులం వాళ్ళ తిట్లు కూడా అంత ఛండాలంగా ఉండవు!"

"టెలిగ్రాం సార్!" అని వీధిలోనుండి కేక వినబడింది.

బుచ్చి వెంకట్రావు, రాధాకృష్ణా వెంకట్రావు మేడమీద పద్మావతి కాశీ ప్రయాణం చేసేరోజున సాయంకాలం నాలుగు గంటలకు సినిమా విషయాలు చర్చించుకునేందుకు కలుసుకొన్నారు. అప్పుడే ఈ తంతివార్త వచ్చింది. అది రాధాకృష్ణ అందుకొని, కాగితం తీసి, మడత విప్పి చదివినాడు. "పద్మావతి... పరీక్ష... కోసం... కాశీ... వెడుతున్నది... నిన్ననే.. రామేశ్వరం... నుండి రాక... నేను కూడా వెడుతున్నాను... నిన్ను... చూడాలని... ఆదుర్దాపడుతున్నది... అక్కడ... చూడటం... వీలు... లేకపోయింది... వెంటనే... విమానంలో... బయలుదేరి... ఢిల్లీలో... కలుసుకో... నరసింహమూర్తి అని ఉంది. "తంతి గూదూరు రైల్వేస్టేషనునుండి ఇచ్చినట్లున్నది వెంకట్రావుగారూ!"

"మీరు వెంటనే బయలుదేరి వెళ్ళడం మంచిది!" అని రాధాకృష్ణ అన్నాడు.

"ఎక్కడికి?"

"ఢిల్లీ."

"ఇప్పుడు వెళ్ళమంటారా."

"ఆ. ఢిల్లీలో కలుసుకొనే మీరు ఒకటీ రెండు రోజులు అమ్మాయితో ఉండి వెంటనే రావచ్చును. కాశీవరకూ వెళ్ళి దిగబెట్టిరండి!"

"ఇదో దండగా?"

రాధాకృష్ణ మాటాడలేదు. పదినిమిషాలాగి. "నేను ఇంటికి వెడతాను ఇంటిదగ్గిరే ఉంటాను, మీరు వెళ్ళదలచుకొన్నదీ లేనిదీ. నాకు 'ఫోను' చెయ్యండి!"

"సరేలెండి!"

రాధాకృష్ణ వెళ్ళిపోయినాడు.

ఒక్కసారిగా విరుచుకుపడే సముద్ర కెరటాలులా ఆలోచనలు విరుచుకు పడ్డాయి - వెంకట్రావు హృదయంలో, ఏమిటి! ఎప్పుడు వచ్చింది యాత్రనుంచి పద్మావతి? ఎందుకు తన్ను చూడలేదు? ఆ వెంటనే ఎందుకు కాశీ వెళ్ళినట్లు! తక్కిన పిల్లలందరూ కూడా వెళ్ళినారా?

అతడు టెలిఫోను తీసి ఆంధ్ర మహిళాసభను పిలిచినాడు. ఎవరో పలికినారు. కాశీకి పరీక్షకు వెళ్ళే బాలికలు ఇంకా వారం రోజులలోగాని బయలుదేరరని తెలిసింది.

కృతజ్ఞత తెల్పి, అతడు ఫోను పెట్టివేసినాడు.

అతనికేదో ఆవేదన ముంచెత్తుకు వచ్చినది. ఎంత అద్భుతంగా పాడుతుంది తన పద్మ! తనదేనా పద్మ? పద్మ భర్త తానేనా? చిన్ననాడు తనతో ఆడుకున్న, వయ్యారాలతో కులికిపోయిన పడుచేనా ఈనాటి పద్మ? పద్మను ఈనాటి స్థితికి తీసుకురావడమే తన

కానాడు తపస్సు. ఆ పిల్లది, తన ఇల్లాలు, తమ చిన్నతనంలో దేవతలా ఉండేది. ఇప్పుడు దేవతకాదా?

అతడు ఒక సోఫాలో చతికిలబడినాడు. ఆ బాలిక కోసం కాదూ తాను కావలిలో కాపురం పెట్టింది? తన పద్మకోసం కాదూ తాను లక్షాధికారి కావాలని పట్టుబట్టి చివరకు జయము పొందినాడు! ఎందుకు తాను మదరాసు వచ్చింది! ఆమెకు సంగీతం చెప్పించడం, ఆమెకు చదువు చెప్పించడం తనకు ఏ కవులూ వర్ణించలేని ఆనందం కలిగేది. ఆమెకు ఎన్నో ముద్దినుసు మురిపాల చీరలూ కొన్నాడు. ఆ చీరలు ధరించుకొని తలదువ్వుకొని, నగలు అలంకరించుకొని, పౌడరు రాసుకొని, వాలుకన్నులతో, ఇంచక్కటి చక్కటి రూపంతో గుళ్ళోబొమ్మలా తన ఎదుటికివచ్చి "నేను నీకు తగినట్లు ఉన్నానా బావా!" అని తన్నడిగినప్పుడు తానా బాలికను నడుంపట్టి పైకి పువ్వును ఎత్తినట్లు ఎత్తేవాడు.

పద్మే తనకు భార్య కాకపోతే తాను తన వాళ్ళందరి మల్లేనే గోచీపెట్టుకొని వట్టితల పాగాచుట్టుకొని తెప్పమీద సముద్రంలోకి చేపలకోసం వెళ్తూ ఉండవలసినవాడేకదా! సంగీతం చెప్పిస్తే అందులో ప్రపంచంలో అందరి ఆడవాళ్ళ కన్న అద్భుతంగా పాడగలిగిందే! చదువు చెప్పిస్తే అన్ని తరగతులలోను మొదటిగా వచ్చింది. చదువు లక్షాధికారులకేనా సొత్తూ?

అతడు చివుక్కున లేచినాడు.

ఆ పద్మ విషయంలో తానిట్టా బొత్తిగా పిచ్చివానిలా అయిపోయినాడేమిటి?

"జాజిమల్లిప్", "జాజిమల్లిప్" అని వీధిలో పూలవాడు కేక వేసినాడు. పిడుగుపడినవానిలో బుచ్చి వెంకట్రావు మ్రాన్పడిపోయినాడు.

## (3)

పద్మావతికి పూలంటే ప్రాణం కదా! అందులో జాజిమల్లి పూలంటే చెప్పలేని ఇష్టం. తన తోటలో ఎన్నో జాజిమల్లి పందిళ్ళు పెంచింది. గులాబీలు, దాలియాలు, చేమంతులు, కార్నేషన్సు, ఆరురకాల బోగైన్ విల్లాలు, కనకాంబరాలు ఎన్ని రకాల పూవులో!

ఎవరో నేర్పినట్లు ఆ పూలూ ఆకులూ గుత్తులు కట్టి కళాశాలలో బల్ల లలంకరించేది.

తల్లో పూలచేరులు ఆమే అలంకరించుకోవాలి. ముడి వేసుకుంటే అర్ధచంద్రంగా, జడవేసుకుంటే మధ్య కనకాంబరపు సూర్యబింబం, చుట్టూ రెండువరసల జాజిమల్లెలు.

కొందరు పూలు తోరణాలులా అసహ్యంగా ముడుచుకుంటారు. పద్మావతి దేవతా స్త్రీలా అలంకరించుకుంటుంది.

చిన్ననాడు కాడమల్లెలు ఎంత సొంపుగా దండలు కట్టేది, 'పువ్వులదానా' అని తాను పద్దాలును పిలిచేవాడు.

పద్దాలుకు తనపైన ప్రేమేలేదా?

పద్దాలు! పద్దాలు!!

* * * *

రైలు కొత్తరకపు కెనడా ఇంజనుతో లోకాలు పడిపోయినట్లు ముందుకు సాగిపోతోంది.

తన రైలుపెట్టెలో తనతో ప్రయాణం చేస్తున్న ఇద్దరు అరవ స్త్రీలు పద్మావతిని అరవంలో ఏవో అడిగినారు. ఏవో నాలుగు ముక్కలు పట్టుబడ్డాయి కాని పద్మావతికి అరవమేమీరాదు. ఆ పెట్టెలో ఐదు సీట్లే ఉన్నాయి. అయిదుగురు పద్మావతితోపాటు ప్రయాణం చేస్తున్నారు. ఒక అమ్మాయి మారువాడీ అమ్మాయి. ఒక అమ్మాయి పంజాబీ యువతి. వారు నలుగురూ కూడా ఢిల్లీకి ప్రయాణం. పద్మావతి మొదట ఢిల్లీకి పోయి, అక్కడనుండి వెనక్కు కాశీ వెళ్ళడానికి నిశ్చయించుకొని బయలుదేరింది.

అరవస్త్రీలలో ఒకతె ఇరువదిరెండేళ్ళ పడుచు. ఆ యువతి పద్మావతి సంగీత కచేరీ ఒకదానికి హాజరయింది. ఈ గీతాదేవిగానం పరమాద్భుతం అని ఆమె అప్పుడే అనుకుంది. రేడియోలో ప్రోగ్రాం వచ్చినప్పుడు ఎప్పుడూ ఆ బాలిక అతిసంతోషంగా వినేదీ. వసంత కుమారీ, పట్టమ్మాళూ ఒక వైపూ, గీతాదేవీ, సుబ్బలక్ష్మీ ఇటువైపూ, వీరు నలుగురూ స్త్రీ గంధర్వరాజ్యాలకు మహారాణులు అని ఆ బాలిక అనుకొన్నది. ఎంత అరవబాణికి శిష్యురాలైనా ఈ గీతాదేవిలో నిజమైన తెనుగుబాణీ యొక్క మహామంత్రిత మాధుర్యం ఏదో ఉంది అనుకొన్నది. ఈనాడు ద్రవిడ ప్రజాలోకం ఈ తెనుగు బాణీకి ముగ్ధులవుతున్నారు. అది సంగీత సంప్రదాయ సభాసంఘం కాకపోవచ్చుగాక, కాని అరవ సినీమాలలో పాడే భానుమతి, సూర్యకుమూరి, కన్నాంబ, బాలసరస్వతి, లీల ద్రావిళ్ళను మాయ కమ్మినట్లు తమ తీయని పాటల మంత్రాలతో కట్టివేశారు.

నిజమైన సంప్రదాయం దెబ్బతింటున్నది సత్యమే! అయినా గాలి ఎటు వీస్తోందో తెలియటం లేదూ!

"ఏమండీ మీ పేరు గీతాదేవి కాదూ?" అని ఆ మీనాక్షి అమ్మాళ్ ఇంగ్లీషులో పద్మావతిని ప్రశ్నించింది.

"అవునండీ, మీ పేరు?"

"మీనాక్షి, ఈవిడ మా వదినగారు, పర్వతవర్ధనమ్మాళ్, ఆవిడ భర్త మా అన్నా, మా వారూ, ఢిల్లీ సెక్రటరేట్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు."

"నేను కాశీకి మెట్రిక్యులేషన్ పరీక్షకు వెడుతున్నాను."

"చాలా సంతోషం."

"నా పేరు మీ కెట్లా తెలిసిందీ?"

"మీ కచ్చేరీకి ఓ దానికి వచ్చాను. ఎంత గొప్ప పాటండీ మీది!"

"తెలుగువారి సంగీతం మీకు నచ్చిందా!"

తెలుగువారి సంగీతమూ, అరవవారి సంగీతం అని, అద్భుతమైన సంగీతాలకు తేడాలు ఉంటాయా! బాణీలు తేడాలు ఉంటాయి, మీ వేషం వేరు, అయినా మనం ఇద్దరం భారత స్త్రీలమే కాదండీ!"

ఇంతలో ఆ పంజాబీ అమ్మాయి వీరిద్దరి దగ్గిరకు వచ్చి కూర్చుని "మాది ఒకనాడు లాహోరు. ఈ రోజు మదరాసు కాపురం, ఢిల్లీలో మా నాయనగారు మిలిటరీలో ఉన్నారు. కెప్టెన్! మావారు ట్రిప్లికేనులో కొత్తగా బట్టల దుకాణం పెట్టుకున్నారు. బాగా లాభం వస్తోంది. మేం త్యాగరాజ నగరులో ఉంటున్నాము. మదరాసు వచ్చి రెండేళ్ళపైన అయింది.

అరవ బాలికలు, తెలుగు బాలికలు మాతో **ఎంతో** ఆప్యాయంగా కలిసి ఉంటున్నారు. అందరమూ భారతీయాంగనలము అన్నమాట ప్రతి అక్షరమూ నిజం" అన్నది.

"పాడండి" అని రెండవ అరవ అమ్మాయి కోరింది. రైలు వేగంగా బిట్రగుంట దాటి వెళ్తోంది.

పద్మావతి రైలు హోరున శ్రుతికలిపి తోడిరాగము ఆలాపన ప్రారంభించింది. ఆ రాగం అరగంట పాడింది. తరువాత తానం ఎత్తుకుంది. తానం ఇరవై నిమిషాలు సాగింది. ఆ వెనుక పల్లవి ప్రారంభించింది.

వంగోలు దాటిపోయింది.

పల్లవి ఒక అరగంట సాగింది.

స్టేషన్లు వెళ్ళిపోతున్నాయి.

రైలు మహావేగంతో సాగిపోతూంది.

❁ ❁ ❁

# ద్వాదశ గుచ్ఛము

రైలు వేగంగా సాగిపోతోంది. పద్మావతి హృదయంలో ప్రత్యూషం ఉదయించేటట్లే లేదు. తన భావ ఢిల్లీ రాకపోతే? తన బావకు తానేమీ పనికిరాకపోతే? పురుషునకు స్త్రీగాని, స్త్రీకి పురుషుడుగాని ఒక్క స్త్రీ పురుష సంబంధార్థానికేనా ఉద్భవించింది! అయితే పండువలె, ఋషి దంపతులవలె జీవించే వృద్ధులైన భార్యాభర్తల గతి?

బ్రహ్మచారిణులై, నిధవాత్వాన యోగినులై జీవిస్తూ, జాతి సేవచేసే ఉత్తమ స్త్రీల జీవితాలు అర్థములేనివేనా? మానవ జీవితం తీగెలల్లుకుపోయిన నికుంజమువంటిది. బహుళ లతాపూర్ణ నికుంజములో ఏ తీగను విడిగా పరిశీలించగలమూ అని పద్మావతి భావించుకొన్నది.

రైలులో తనతోటి ప్రయాణీకులైన ఈ నూత్న స్నేహితురాండ్రు తన్ను సంగీతం పాడమని ప్రార్థించినప్పుడు, తాను పాడుటకు సందేహించలేదు. వారా పాట విని ఆనందంలో ఏవో లోకాలకు తేలిపోయామని ఉప్పొంగిపోతూ తన్ను మెచ్చుకొన్నారు. భగవంతుడు తనకా గాంధర్వ మహిమను ప్రసాదించింది ఏదో ఉత్కృష్ట సేవ జగానికి అర్పించమనేకదా! ఎంతకాలం తాను నీడలను చూచి భయపడి పారిపోవడం? తన బావ ఢిల్లీలో తన్ను కలుసుకుంటాడా సరేసరి అతనికి నిజమైన సైదోడై, అతని నీడనుండే సంఘసేవలో మానవజాతికి సాష్టాంగమవుతుంది. తన్ను కలుసుకోలేదూ – తాను ఒంటిగానే బ్రతుకుదారుల ప్రయాణిస్తూ జాతికి పరిచర్య చేస్తుంది. చదువు పూర్తి చేస్తుంది. సేవచెయ్యాలనే అనుకుంటే, చేసే దీక్ష కలవారికి మార్గాలూ ఉన్నాయి. మార్గాలలో మహోత్తమమైనవీ ఉన్నాయి.

ఇంక తన బావను దూరంనుండే ఆరాధించుకుంటూ తన సేవామార్గాన్ని అనుసరించిపోతుంది.

మనుష్యులెంత దగ్గిరవారైనా వారి హృదయాలు ఇనుపగోడల వెనక ఉన్నట్టు ఉంటాయి. ఆ హృదయాలు తామన్న ప్రేమార్ద్రతా పూర్ణములై కరిగిపోతాయని నమ్మినంతసేపూ ఆ హృదయాలు ఆ రీతిగానే ప్రత్యక్షమవుతూ ఉంటాయి. ఎదుటి జీవితాలలో అర్థములేని ఏదో ఒక సంఘటన జరిగేసరికి, ఆ సంఘటన ఇవతలి హృదయాలపై కోటి క్రీనీడలుగా ముసురుకొని దర్శనమిస్తుంది. ఇంక వీరికీ వారికీ ఇంతవరకూ ఉన్న సామరస్యం మాయమై, కాకోలంవంటి విషం ఉద్భవిస్తుంది. తాము గరళకంఠులై ఎవరా విషం ఆస్వాదించగలరు?

తన బావ తన్ను ప్రేమించడంలేదని తానెందుకు నిర్ధారణ చేసుకోగలిగింది? పద్మాలు నిట్టూర్చింది. రైలు స్టేషనులో ఆగుతూనే ఉంది. యోజనాలను అంగుళాలు చేస్తూ సాగిపోతూనే ఉంది.

తాను మాత్రం తన బావను అంతు ఎరగని గంభీర ప్రేమతో ప్రేమించి ఉంటే, తనకెందుకు బావంటే విసుగు జన్మించింది? బావంటే ఏదో భయంవేసి ఏదేని సాకుతో

బావను విడిచి పారిపోయింది! ఎట్లు విడిచి ఉండగలిగింది తాను? ప్రేమకోసం సర్వమూ ఆహుతిస్తారన్నమాట వట్టిది. గాఢంగా కోరిన ఏ సంఘటన కోసమైనా మనుష్యుడు తన జీవితం కొంత ఆహుతిస్తాడు, ధనం, పదవి కోరినవాడు తన గౌరవం, తనలోని ఉత్తమ మానవత్వం నాశనం చేసుకొంటూనే ఉన్నాడు.

ఇప్పుడు పద్మావతిలో బాలికాత్వము జారిపోయింది. ఆమె మనస్సులోని మంచులు దెసలకు ప్రవహించి మాయమైనాయి. చిన్ననాటినుండి తన నాయకుడు బుచ్చి వెంకులు బావే! అతడు తనకై, అతనికై తాను మెట్లెక్కుతూ పైకి నడిచివచ్చారు. తాము చిన్ననాడు ఆడుకొన్న సముద్రానికి మేరలు చిన్నవి. ఈనాడవి విస్తరించి కడపలను దాటి పోయాయి.

ప్రతి జీవితమూ ఇంకో జీవితంతో చేయి అంది పుచ్చుకొని మెట్టెక్కిపోవలసిందే, అదే మానవుని నిత్యలీల! అదే భగవంతుని నిత్యఖేల? అనుకుంది ఆమె చిన్న బిడ్డలా, ఆమె హృదయం శాంతి పొందింది.

రైలు వేగంగా సాగిపోతూ ఉంది.

## (2)

బుచ్చి వెంకట్రావు ఆకాశపథంలో మహావేగంగా ఉత్తరానికి ఎగిరిపోతున్నాడు. నరసింహమూర్తి మేష్టారి టెలిగ్రాం అందిన వెంటనే కారుమీద విమాన కార్యాలయానికి పోయి, వెంకట్రావు ఢిల్లీకి టిక్కెట్టు కొనుక్కున్నాడు. ఆ మర్నాడు ఉదయమే విమానం అందుకొని ప్రయాణం సాగించాడు.

క్రింద ఎన్ని పట్టణాలు, నదులు, కొండలు వెనక్కు పరుగిడుతున్నాయో! పొలాలూ అడవులు జిల్లాలు, రాష్ట్రాలు, వెనకనే ఉండిపోయాయి. అలాగే తన బ్రతుకులో ఎన్నో కాంక్షలు, బాధలు, ఆనందాలు, సంఘటనలు వెనక్కువెళ్ళినా, అవన్నీ ప్రయాణమార్గంలో ఉండనే ఉన్నాయి. అదేరీతి తన జీవితంలోని సంఘటనలూ అలాగే ఆ వెనక సంవత్సరాలలో ఉండిపోయాయో ఏమో? మనుష్యుడు వెనక్కు వెళ్ళడం నేర్చుకుంటే, ఆ జీవితయానంలో మళ్ళీ ఆ సంఘటనలన్నీ సంభవిస్తాయా? తన తల్లిదండ్రులు వెనకటి ప్రపంచాన్ని ప్రత్యక్షంచేస్తూనే ఉన్నారు కదా!

తాను తన గ్రామంలో తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు చక్కని పెంకుటిళ్ళు కట్టించి ఇచ్చాడు. మామగారికీ, చాలామంది చుట్టాలకూ తన రొయ్యపప్పు, ఎండుచేపలూ ఎగుమతి కంపెనీలో వాటాలు ఇచ్చాడు. తన కంపెనీలో వాటాలుగల వారందరి దగ్గర కొద్దోగొప్పో సొమ్ము నిల్వ వుంది. ఆ వాటాదార్లందరూ చిన్న చిన్న పెంకుటిళ్ళు కట్టుకున్నారు. కాని వారందరూ ఇంకా పల్లీయులే. ఇంకా పుట్టగోచీలు పెట్టుకుని తన చుట్టాలు పెద్దలూ చిన్నలూ అందరూ సముద్రం వేటకు వెడుతూనే యున్నారు. అలా పల్లీయులు సముద్రం వేటకు వెళ్ళకపోతే తన కంపెనీ దివాలా తీసిందన్న మాటే!

తన పల్లెవారిలోనుండి ఇంగ్లండులోవలె ఉత్తములైన నావికులు తయారుకావాలి. చదువులు లేకపోవడంచేతనే కదా తన వాళ్ళని ప్రభుత్వం యుద్ధనౌకా నావికులుగా చేర్చుకొనకపోవడం. కులమత వైషమ్యపూరితమైన ఈ నికృష్ట జీవితానికంతకూ చదువు

లేకపోవటమే కారణం. తన పద్మ చదువుకొన్నది. చదువుకుంటుంది. తాను చదువు కొంటున్నాడు. ఈ పరీక్షలు చదువులో ముందుకు ప్రయాణం చేయించగల మజిలీలవంటివి. తన పద్మ బి.ఏ. ప్యాసవుతుంది. తానూ తన పద్మా దేశాలు తిరుగుతారు – తన కంపెనీ బాగా ఏర్పాటుచేసి, తానూ తన పద్మా అమెరికాకో, ఇంగ్లాండుకోపోయి అక్కడ చేపల విషయమూ అందుకు సంబంధించిన సముద్రజ్ఞానమూ, సముద్రయాన ప్రావీణ్యమూ అలవరచుకుని రావాలి. అప్పుడే తన దేశానికి తానేదైనా సేవ చేయగలడు. తనకు ఉద్యోగాలు అవసరం లేదు. తన కంపెనీ మంచి లాభాలు తెస్తున్నది. తాను ఇదివరకు కంపెనీల వారివలె పల్లెవారి దగ్గిర అతిచవకగా కొని, అతి లాభంగా అమ్మటంలేదు. తానన్ని కంపెనీ కన్న ఎక్కువ ఖరీదులకు కొంటున్నాడు. లాభసాటికి పరదేశాలకు ఎగుమతి చేస్తున్నాడు. చీనాకు, జపానుకు, బర్మాకు, మలయాకు, సింహళానికి, జావాకు తన సరకు రవాణా అవుతోంది. తాను ప్రభుత్వానికి లెక్కలన్నీ సరిగా చూపించి, ఇవ్వవలసిన పన్ను సకాలంలో ఇస్తున్నాడు. తనకు రాజకీయాలు అనవసరం.

ఏమిటీ తనకీ ఆలోచనలు? ఈలాంటి ఆలోచనలే తనకీ మధ్య, వీటి అన్నింటికీ కారణం పద్మాలు. తనకు చిన్నతనంనుండీ ఓ దేవకన్యలా దర్శనం ఇచ్చేది. ఆమెకు తగిన భర్త కావాలని తాను యుద్ధానికి పోయినాడు. యుద్ధం వారికి అన్నీ సప్లయిచేసే కంపెనీలవారి విషయం అంతా చూసి, తాను యుద్ధంనుంచి రాగానే రొయ్యపప్పు, ఎండుచేపల ఎగుమతి కంపెనీ పెట్టినది, పద్మాలును లక్ష్మీదేవిని చేయదానికే. తన పద్మాలు సౌందర్యదేవత. తన పద్మాలు సంగీత సరస్వతి. తన పద్మాలు తన జీవితానికి ఆరాధ్యదేవి.

ఏ తిక్క పుట్టిందో తనకు మదరాసు నగరంలో తన పద్మాలు వట్టి పల్లెపిల్ల అనిపించింది. తనతోపాటు తన పద్మాలు ముందుకు సాగి రావడం లేదనిపించింది. ఈ సినీమా తారలు, ఈ బీచి సుందరులు తన్నేదో మైకంలో ముంచారు. కాస్తయితే తన పద్మాలు తనకు దూరమైపోయి ఉండును. ఆమె గీతాదేవి. తాను వట్టి మొరకుడు. ఆమె సంగీతం పాడుతూ ఆ సభలలో వేదికపైన కూర్చుని ఉంటే, తనకు ఆకాశంనుంచి దిగి వచ్చిన దేవతామూర్తిలా కనబడింది. తాను బజారుల వెంట వెడుతూ ఉంటే, ఆమె రికార్డులు విన్నప్పుడు, రేడియోలో ఆమె పాడినప్పుడు దివ్యమైన ఆ గాంధర్వం విన్నప్పుడు, తనకప్పుడామె వెలిగిపోయే శరీరంతో ఎదుట నిలుచున్నట్లే అయ్యేది.

పద్దులూ! సౌందర్యాలరాణీ! దివ్య గాంధర్వాలు లోకాలను ఉప్పెనలుగా ముంచే గీతాదేవీ! మూర్ఖుడైన తాను తన్నే మర్చిపోయే స్థితికి వచ్చాడా?

తానట సినీమాకంపెనీ పెడతాడట. సుశీల మాత్రం సీతాకోకచిలకల్లే తనదే. నర భరత పక్షులను కొన సాహసించాడట! ఎంత దౌర్భాగ్యము. ఏనాటికైనా పతితుడు కాబోయే పురుషునికి స్త్రీయే చేయి అందిస్తుంది. స్త్రీ వట్టి బిడ్డలుకనే పశువు అనుకొన్న ప్రతి పురుషుడూ కూవం నదివంటి పరమ దౌర్భాగ్య కూపంలో కూలిపోతాడు.

విమానం హైదరాబాదులో ఆగి మళ్ళీ బయలుదేరింది. నాగపురంలో ఆగింది. అతనికి ప్రయాణంలో పలకరించేవారే లేరు. ఆలోచనలే అతని తోటి యాత్రీకులయ్యాయి.

విమానం మహావేగంతో రెక్కలు చాచి వింధ్యపర్వతాలు దాటింది.

## 3

పద్మావతి న్యూఢిల్లీలో దిగగానే ఎదుటకు వచ్చి బుచ్చి వెంకట్రావు నిలుచుని వున్నాడు. పద్మావతికి తక్కిన సర్వమూ మాయమైనవి. ఠీవిగా రూపమెత్తిన దివ్యత్వంలా ఆమెకు బుచ్చి వెంకట్రావు కనిపించినాడు. రైలులో ప్రయాణం చేసిన తోటి మహిళలు, ఒక దేవికి నమస్కారం చేసినట్లు పద్మావతికి నమస్కరించి, ఆమెను కౌగలించుకొని, కరస్పర్శ చేసి ఢిల్లీనుండి వెళ్ళబోయే ముందు తమ తమ ఇండ్లకు ఆమెను రమ్మని ఆహ్వానించారు.

పద్మావతి సర్వమూ మరచిపోయింది. వారేమంటున్నారో ఆమెకు వినబడలేదు. ఏదో చిరునవ్వు! ఏదో నిర్వచింపరాని ఆనందం.

ఇంతట్లో ఆమెకు చటుక్కున జ్ఞప్తికి వచ్చి, ఆ స్నేహితురాంద్రకు బుచ్చి వెంకట్రావును కళ్ళతో చూపి, సిగ్గుతో "వారే! వారే!! నన్ను కలుసుకోడానికి విమానంమీద ఢిల్లీ వచ్చారు" అని చెప్పింది. వారాతనికి నమస్కరించారు. అతడూ సిగ్గుపడుతూ వారికి ప్రతి నమస్కరించాడు. ఎవరి మగవారు వారి కడకు వచ్చారు. మగవారిని ఒకరికొకరు ఆడవారే పరిచయం చేశారు. ఒకరికొకరు నమస్కరించుకొన్నారు.

అందరూ ఒకరి దగ్గిర ఒకరు సెలవు పుచ్చుకొని మళ్ళీ కలుసుకుందామనుకొని ఎవరి దారిన వారు వెళ్ళిపోయినారు.

ఆమె ఏర్పాటు చేసుకొన్న వారింటికిగాక బుచ్చి వెంకట్రావు తానేర్పాటు చేసిన హోటలుకు పోదామన్నాడు.

నరసింహమూర్తి మేష్టారుకు తన బిడ్డలిద్దరూ ఈ విధముగా కలుసుకోవడం వైకుంఠం అబ్బినట్లయినది. సర్వపవిత్ర క్షేత్రాలు ఒక్కసారిగా దర్శించినట్లు అతని ఆత్మ పొంగిపోయినది.

నరసింహమూర్తి మేష్టారి జీవితం సంగీతమయం. విశ్వమే గాంధర్వంలోనుంచి ఉద్భవించిందని అతని నమ్మకం. అతడు కలలు కన్న పరమ సంగీతమూర్తి తన శిష్యురాలైన ఈ కైవర్తక బాలికయై ఉద్భవించింది. అతడు ధనంకోసం ఆదినుంచి ఈ కుటుంబాన్ని నమ్ముకొని మదరాసు రాలేదు. పద్మావతి సంసారమోహంలోపడి ఎక్కడ సంగీతం మరచిపోతుందో అన్న భయంతో వారు అడగగానే వారి వెంటబడి వచ్చాడు. తానింత వండుకొన్నాడు. వారికింత పెట్టాడు. వారు తనకోసం మాంసాహారమే మానివేశారు. బుచ్చి వెంకట్రావుకు మాంస భక్ష్యాలపై మనస్సుపోతే మిలిటరీ హోటలులో మంచి దానికి పోయి తిని వచ్చాడు. స్త్రీలకున్న పట్టుదల పురుషుల కుండదు. పద్మావతి మాంసం మానవేసిందంటే తన జన్మలో మాంసాహారమే ఎరగనిదిగా అయిపోయింది. అందుకనే నరసింహమూర్తి మేష్టారు పద్మావతిని కన్నకూతురుకన్న ఎక్కువగా ప్రేమించుకొన్నాడు.

వారు ముగ్గురూ టాక్సీమీద, బుచ్చి వెంకట్రావు ఏర్పాటు చేసిన ఉత్తమమైన ఒక హోటలుకు వెళ్ళారు.

రైలు స్టేషన్ ప్లాట్ ఫారంమీదగాని, కారులోగాని, హోటలులో దిగి తమ భాగంలోనికి పోయినప్పుడుగాని పద్మావతి భర్తతో ఏమీ మాట్లాడలేకపోయింది. బుచ్చి వెంకట్రావూ భార్యతో ఏమీ మాటలాడలేకపోయినాడు.

నరసింహమూర్తి మేష్టారు మాత్రం ఏదో గ్రహించినట్లు దారి పొడుగునా మాట్లాడుతూనే ఉన్నాడు. ప్లాట్ ఫారం మీద.

"ఏమయ్యా బుచ్చి వెంకట్రావూ! మాకన్న ముందు వచ్చేశావే?" అన్నాడు అందుకు వెంకట్రావు.

"అవును!" అన్నాడు.

"అక్కడ మాయమై ఇక్కడ తేలినావా?"

"అవును!"

కారులో డ్రైవరు పక్క ముందు సీటులో కూర్చుని ఉన్నప్పుడు నరసింహమూర్తి మేష్టారు వెనక్కు తిరిగి చూడకుండానే "నిన్ననే వచ్చేసేయగలిగావన్నమాట బుచ్చి వెంకట్రావూ?" అని ప్రశ్నించాడు.

"అవును!" అని అన్నాడు బుచ్చి వెంకట్రావు.

"విమానంలో భయం వేయదూ?"

"వేయలేదు!"

"రెండు మూడు గంటలలో విమానం రాగలిగిందన్నమాట."

"ఊం!"

హోటలులో "సామానెక్కడ పెట్టించమన్నావయ్యా, బుచ్చి వెంకట్రావూ?" అని నరసింహమూర్తి మేష్టారు ప్రశ్నించాడు.

"అది నీ గది. ఆ గది..."

"సరే సరే!" అన్నాడు మేష్టారు.

ఇద్దరి గదులమధ్య తన గది ఏర్పాటు చేశాడేమిటి? అని నరసింహమూర్తి మేష్టారు దిగులుపడిపోయినాడు. తన కొద్ది సామాను తన గదిలో పెట్టించుకొని, పద్మావతి సామాను పద్మావతి గది అని సైగచేసి చూపించిన గదిలో పెట్టించాడు. గది, గది వెనుక పడకగది ప్రక్కన స్నానాల గది. అందులో వేడినీళ్ళ కుళ్ళాయి, చన్నీళ్ళ కుళ్ళాయీ ఉన్నాయి. పడక గదులలో, పందిరిమంచం, పరుపూ, శుభ్రమైన రంగుల దుప్పటీ. బీరువా, అద్దం ఉన్న బల్లా, సోఫా, ఓ మంచికుర్చీ.

అందమైన వస్తువులు అలంకరించి ఉన్నాయి. ఇవన్నీ చూచి నరసింహమూర్తి మేష్టారు ఓ నిట్టూర్పు పుచ్చి "నా కెందుకయ్యా ఇవన్నీని?" అని అనుకున్నాడు. పది నిమిషాలు ఏమిటిది? అని తలపై చేయి పెట్టుకొని ఆలోచిస్తూ సోఫాలో కూలబడి కూచుని ఉన్నాడు. ఏదో జ్ఞాపకం వచ్చిన వానిలా తువాలూ, నలుగుపిండీ, నూనె తీసుకొని స్నానాల గదిలోనికి పోయాడు.

రమ్మని టెలిగ్రాం యివ్వగానే వచ్చాడు బుచ్చి వెంకట్రావు. మనస్సు మారింది అని నరసింహమూర్తి మేష్టారు పొంగిపోయాడు. 'హా! వారిరువురకు ఈ విడిగదుల ఏర్పాటేమిటి? వచ్చినప్పటినుండి ఇంతవరకూ వారిరువురకూ మాటలే లేవే? పూర్ణమైన ఆనందంలో మాట్లాడుకోలేకపోయారా? మొదట ఒకరిని ఒకరు చూడగానే వారిరువురి ముఖాలు వికసించాయి. తాను చూడనట్లు నటిస్తూ జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉన్నాడు.

బుచ్చి వెంకట్రావుకూ, సుశీలకూ ఎంతవరకూ సాగింది? సంబంధం హద్దు దాటితే ఎందుకు వచ్చినట్లు ఈతడు? భార్య గనుక అధికారం చెలాయించడానికా? అయితే భార్యను పరీక్ష పూర్తిచేసుకోనీయకుండా తీసుకుపోతాడా? అయితే ఇంత ఖర్చయ్యే ఈ హంగామా ఎందుకు? ఆడవారి మనస్సు బ్రహ్మకే అర్థం కాదన్నారుగాని మగవారి మనస్సులు వారికే అర్థంకావు. తాను భగవంతుని ప్రార్థన చేయడం తప్ప గత్యంతరం ఏముంది?

## (4)

తన గదిలోకి వెళ్ళింది పద్మావతి. స్టేషన్ ప్లాట్ ఫారంపై తన బావను చూడగానే ఆమెకు పట్టరాని ఆనందం కలిగింది. చిన్నతనంలో ఒకసారి తన బావ సముద్రానికి బలి అయిపోయాడు అన్నప్పుడు తన ప్రాణమే పోయినట్లయి, తనకీ ప్రపంచమే లేదనుకొని, తాను కూడా సముద్రానికి బలి అయిపోదామని నిశ్చయించుకొన్నప్పుడు, బావ దొరికాడు. బ్రతికి ఉన్నాడు. రెండు రోజులలో వస్తాడు అని వార్త విన్ననాటి అద్భుతానందంకన్న ఈనాడు తన కెక్కువ ఆనందం కలిగిందే! ఆ వెంటనే బావ ఏదో విధంగా ఉంటే తాను మాట్లాడలేకపోయింది. ఏదో అధోలోకాలకు క్రుంగిపోతున్నట్లు తనకు ఆపరాని నిస్పృహ కలిగింది. తనకు ఈలా విడిగా గదీ! బావకు తనపై ప్రేమే పోయిందా? బావ తన్నిక ప్రేమించడా? తనకీ సంగీతం ఎందుకు? ఈ చదువులూ, పరీక్షలు ఎందుకూ? రమ్మనగానే వచ్చాడే! ఎందుకు? కళ్ళ నీళ్ళు తుడవడానికా? ఆమెకు వెక్కి వెక్కి ఏడ్పు వచ్చింది. పందిరి మంచముపై వాలిపోయింది.

అటు బుచ్చి వెంకట్రావుకు ఆశ్చర్యం కలిగింది. పద్మావతికి తనపై కోపం తీరలేదని అతడనుకున్నాడు. ఆమె మాట్లాడదు - అంత మౌనం! తాను సిగరెట్టు అవీ కాలుస్తూ ఉంటాడుగదా అనీ, ఆమెకు ప్రత్యేకగదీ అవీ ఏర్పాటు చేశాడు. ఒక్కమాట మాట్లాడదు. తనకెందుకు రమ్మని టెలిగ్రాం ఇచ్చినట్లు? తన దేవి పద్మావతి ఇక దూరమైపోతుందా! ఇకనుండి తన బ్రతుకు తెల్లవారిపోతుందా? ఇతడు సిగరెట్టుపైన సిగరెట్టు కాలుస్తున్నాడు. ముందు గదిలో ఒక సోఫాపై చతికిలబడి కన్నుమూశాడు.

ఒకసారి మహామారిలా ఎక్కడనుండో తప్పు అభిప్రాయం కలిగినప్పుడు, ఆ తరువాత అందుకు సంబంధించిన వారి వర్తనమంతా ఆ భావానికి శ్రుతి అయిపోతుంది. ఆ తప్పు అభిప్రాయం ఇంకా గాఢమైపోతుంది.

ఆ ముగ్గురూ ఆ రోజూ, ఆ మర్నాడూ ఎలా గడిపారో? ఆ మహానగరంలోని, ఆ చుట్టుప్రక్కల విచిత్రాలు ఏలా సందర్శించారో? కుతుబ్‌మినార్, లాల్‌ఖిల్లా, జుమ్మామసీదు, ఫత్తేపూర్ సిక్రీ పైత్యరోగి నోట భక్ష్యాలయ్యాయి. మహాత్మాజీ చైత్య ప్రదేశమైన రాజ్‌ఘాట్ దివ్యక్షేత్రం కడ పద్మావతి గుండెలవియగా రోదించింది. బుచ్చి వెంకట్రావునకు కన్నుల నీరు తిరిగింది. నరసింహమూర్తి మేష్టారు ఆడదానిలా వాపోయినాడు.

మహాత్ముడు అవతారపురుషుడు. దుఃఖార్తులైన సర్వమానవుల బాధలూ హరించి తన బ్రతుకులో ఆస్వాదించుకొన్నాడు. బీదతనంవల్ల, కడుపునకు ఒక కణమైనా లేని

దౌర్భాగ్యంవల్ల ఒక కన్ను నుండైనా ఒక్క బాష్పబిందువైనా రాలిననాడు తక్కినవారి బ్రతుకులు వృధా అనీ. ఆ బ్రతుకులు హింసాపూరితాలనీ, ఆయన బోధించాడు. ఆయన శిష్యులే నేడు రాజ్యభారం వహించి దీన మానవుల కళ్ళనుండి రక్తాశ్రువుల మహోఝురులుగా ప్రవహింప చేస్తున్నారని నరసింహమూర్తి మేష్టారు గజగజ లాడిపోయినాడు.

ఈ అవతారము, ఈ దైవస్వరూపుడు, కోరి అవతారం చాలించింది మనుష్యుల కర్కశహృదయాలు చూచేకదా! ప్రేమలు ఉద్భవించని ప్రేమలు ఎండిపోయిన మనుష్యులే మహాత్ముని గుండెలో రివాల్వరు పేల్చినాడు. "ఓ ప్రభూ! నువ్వు ప్రేమ సముద్రానివి! ఓ పరమకరుణామూర్తీ! నీ బ్రతుకే ఒక ధర్మవిశ్వం!" అని వెంకట్రావు వివశుడై ఆ పవిత్రభూమి ముందు సాష్టాంగపడినాడు.

వారందరూ లేచి ఈవలికి వచ్చినప్పుడు వెంకట్రావు భార్య దగ్గరకుపోయి "పద్మా! నాపైన ఇంకా కోపం తీరలేదా?" అని ప్రశ్నించినాడు. పద్మావతి కన్నుల నీరుతోనే అతని మోము ఒకసారి ఆశ్చర్యంతో చూచి "కోపం ఏమిటి బావా?" అన్నది.

"వచ్చినప్పటినుండీ ఏదోలా ఉన్నావేమి?"

ఆ బాలిక కన్నులు గంగా, యమున లయ్యాయి. "బావా! బావా! నిన్ను... నిన్ను... ఓ నిమిషమైనా... వదిలి ఉండలేను. నాకీ పరీక్షలూ వద్దు... ఈ... ఈ... సంగీతమూ వద్దు!... నీకింత చాకిరీ చేసుకుంటూ... ఉంటాను."

"అదేమిటి పద్మా!"

"బావా! నువ్వే... నువ్వే... నాకు... మహాత్ముడవు నాపైన నీకు... నీకు... ప్రేమ... పూర్తిగా పోయింది... అని... అని"

"ఓసి వెఱ్ఱిపిల్లా! నీకోసం నేను బ్రతికివున్నాను. సముద్రంలో నా పడవ అలా దరీ, అంచు లేకుండా కొట్టుకుపోతూ నీ మూర్తి... అందాలనీ, నువ్వు... నా ఎదుట ప్రత్యక్షం అవుతూ... నాకు సరియైన దారి చూపించింది. నీకోసం యుద్ధానికి వెళ్ళాను. ఆ యుద్ధంలో నీ ఆలోచన. నువ్వు నాకోసం కనిపెట్టుకొని ఉన్నావన్న ఆలోచన నాకు ఏనుగుబలం, సింహశక్తీ ఇచ్చినాయి. నువ్వే నన్నెప్పుడు కాపాడుకొంటున్నావు అన్న గాఢమైన నమ్మకంతో ముందుకు చొచ్చుకు వెళ్ళేవాడిని."

"నా... నా... మీద నీ ప్రేమ ఏమీ పోలేదూ?"

"ఎలా పోతుంది. పోలేదుకదా. మరీ కోటిరెట్లు పెరిగిపోయింది. నువ్వు కోరితే అన్నీ మాని ఊరు ప్రయాణం కడ్తాను."

ఆమె కన్నులు వెలిగిపోయాయి. అప్పుడే పాలసముద్రంలో దివ్యకమలంతో ఉద్భవించిన లక్ష్మిలా ఆమె తేజరిల్లిపోయింది. ఆమె పదిమందీ చూస్తున్నారని సిగ్గయినా లేకుండా భర్త పాదాలకడ మోకరిల్లి నమస్కరించింది. వెంకట్రావు ఆమెను లేవనెత్తి హృదయాని కదుముకొన్నాడు. సంధ్య చీకట్లు ఆవరిస్తున్నాయి. రాజఘాట్ పవిత్ర చైత్యంపై సాయం సంధ్యాదేవి అరుణకాంతులు వెలిగించింది.

నరసింహమూర్తి మేష్టారు తనలో ఒక నూతనానందం పాలవెల్లువలా పొంగిపోగా, ఆ దంపతులను యమునానది తీరాన్నే వదలి తాను రాజఘాట్ కడ ప్రార్థిస్తూ కూర్చున్నాడు.

చీకట్లు ఆవరించాయి. జగమంతా దీపావళిలా దీపాలతో నిండింది.

"పద్మా!"

"బావా!"

"నువ్వు బి.ఏ. కూడా పూర్తి చేయాలి!"

"మీరు తలపెట్టిన సినీమా పూర్తి చేయండి!"

"మన కథే కొంచెం మార్చి, పేరులు మార్చి తీయిద్దాము."

"ఛా! సిగ్గుకాదండీ!"

"నా గీతాదేవీ! నా ఆత్మలో అధివసించి ఉన్న పద్మా!"

ఆమె అతని ఒడిలో తలనుంచి అతని పాదాలు హృదయానికి అదుముకొంది. జాజిపూల పరిమళాలు జగమంతా నిండిపోయాయి.

**ఓం అసతోమా సద్గమయ!**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ.**

# అడివి బాపిరాజు జీవిత సువర్ణ రేఖలు

| | | |
|---|---|---|
| అక్టోబరు 8, 1895 | : | జననం (భీమవరం, ప.గో. జిల్లా) |
| 1903 | : | ప్రాథమిక విద్య, కొవ్వూరు |
| జూన్ 5, 1915 | : | వివాహం, కూల్డ్రేగారి శిష్యత్వం ప్రారంభం |
| 1917 | : | ఇంటర్ |
| 1920 | : | బి.ఎ., జాతీయ కాంగ్రెస్‌లో సభ్యత్వం |
| 1921 | : | (సహాయ నిరాకరణోద్యమంలో) అరెస్టు, పుత్ర వియోగం. |
| 1922 | : | సత్యాగ్రహం, అరెస్టు |
| 1923 | : | చిత్రకళా విద్యార్థిగా ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోదకుమార ఛటోపాధ్యాయ శిష్యత్వం |
| 1924 | : | "గయా కాంగ్రెస్"లో పాల్గొన్నారు |
| 1931 | : | బి.ఎల్ |
| 1934 | : | ఆంధ్ర విశ్వకళాపరిషత్ నిర్వహించిన నవలా పోటీలో 'నారాయణరావు' నవలకు శ్రీ విశ్వనాథవారి "వేయి పడగలు"తో పాటు ప్రథమ బహుమతి |
| 1935 | : | బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాల్ పదవి |
| 1936 | : | భార్య సుభద్రమ్మ గారికి అనారోగ్యం ప్రథమ పుత్రిక రాధా వసంత గారికి పోలియో |
| 1949 | : | కుమార్తెలు రాధా వసంత, ప్రేమకుమారి గార్ల వివాహం. |
| 1950 | : | కనకాభిషేకం; మద్రాసు తెలుగు భాషా సమితి ఆధ్వర్యాన తయారైన తెలుగు విజ్ఞాన సర్వస్వానికి, సాహిత్యం, భాష, కళలు, విద్య మొదలైన విషయాలకు సంబంధించిన సంపుటం తయారు చేసే ఉపసంఘంలో సభ్యత్వం. |
| 1951 | : | సింహళంలోని సిగిరియా గుహల్లో గల కుడ్య చిత్రాల ప్రతిరూపాల చిత్రణకై పరిశీలన యాత్ర. |
| సెప్టెంబరు 22, 1952 | : | మరణం. |

**జననం : 8-10-1895 :: మరణం : 22-9-1952**

# అడివి బాపిరాజు సృజనా వైజయంతిక

## నవలలు :

**సాంఘిక :** నారాయణరావు (1934), తుఫాను (1945), కోనంగి (1946), నరుడు (1946), జాజిమల్లి (1951).

**చారిత్రక :** హిమబిందు (1944), గోన గన్నారెడ్డి (1945), అడవి శాంతిశ్రీ (1946), అంశుమతి (1951).

**అముద్రితాలు :** మధురవాణి (పూరణ : దిట్టకవి శ్యామలాదేవి), శిలారథం (అసంపూర్ణం), కైలాసేశ్వరుడు (అసంపూర్ణం).

**కథా సంపుటాలు** : అంజలి (6), తరంగిణి (7), తూలికా నృత్యం (3),
**(వాటిలో కథల సంఖ్య)** భోగీర లోయ (6), రాగమాలిక (9), వింధ్యాచలం (4).

**మొత్తం కథలు 41 :** (ఆరు సంపుటాల్లో - 35, లభ్యం అయిా అముద్రితం - 1, అసంపుటీకృతం - 1, అసంపూర్ణం - 1, రేడియో కోసం రాసింది - 1, నారాయణరావు నవలలో పాలేరు చెప్పిన కథ - 1, అలభ్యం (పంజరం అనేది) - 1).

## కవితా సంపుటాలు :

**ప్రచురణ అయినవి :** తొలకరి (1922), గోధూళి (1938), శశికళ (1954)

**ప్రచురణ కానివి :** అంజలి (19), చిగురుటాకులు (21), జ్యోతి (32), బాపు (43), ఆంధ్ర (51), దీపమాల (44), శిల్ప బాల (23), సుషమా చంద్రికలు (63), బాపిరాజు వచనాలు (13), గడ్డిపూల పళ్లెము (32), ఇతర గేయాలు (42) జానపద గేయాలు (27), జంగం కథలు (6).

## నాటికలు :

**రేడియో నాటికలు :** భోగీర లోయ, నారాయణరావు, శైలబాల, ఉషాసుందరి, పారిజాతం, నవోదయం, దుక్కిటెద్దులు, ఏరువాక.

**ఏకాంకికలు :** ఆంధ్ర సామ్రాజ్ఞి (1944), కృతి సమర్పణం (1944), బొమ్మలు (1946), గుడ్డిపిల్ల (1954 - మరణానంతర ప్రచురణ).

## వ్యాసాలు :

ముద్రితాలు - తెలుగు (57), ఇంగ్లీషు (3)
అముద్రితాలు - తెలుగు (8), ఇంగ్లీషు (2).

**రేడియో ప్రసంగాలు :** 7

**పత్రికలు, సంపాదకత్వం :** తెలుగు : అభినవాంధ్ర సాహిత్యం (1915 - రాజమండ్రి), మీజాన్ (1944-1947), హైదరాబాదు;
ఇంగ్లీషు : త్రివేణి (మచిలీపట్నం - సబ్ ఎడిటర్)

**అనువాద గ్రంథం** : "నా పడమటి ప్రయాణం"

**సాహిత్య లేఖలు** : సుమారు 50

## చిత్రకళాకేళి :

**చలనచిత్ర "కళాదర్శకత్వం" :** సతీ అనసూయ - ధ్రువ విజయం (1935), మీరాబాయి (1940), పల్నాటి యుద్ధం (1944).

**జలవర్ణ చిత్రాలు** (47), **తైలవర్ణ చిత్రాలు** (2), **రేఖా చిత్రాలు :** విశ్వనాథ సత్యనారాయణ- కిన్నెరసాని పాటలు - **ముఖచిత్రం :** లోపలి చిత్రాలు (4), శృంగార వీథి (1), నండూరి సుబ్బారావు - ఎంకి పాటలు (2), **పత్రికలలో కథలకు :** నాగరాజు (భారతి - జనవరి 1927), అతిథి దేవుడు (భారతి - మే 1927), హిమాలయరశ్మి (భారతి - జనవరి - 1937), నాగలి (భారతి), భోగీర లోయ (భారతి), తూలికానృత్యం (భారతి), **పెన్సిల్ స్కెచ్‌లు :** కడలూరు జైలులో ఉన్నప్పుడు వేసినవి, ఫిడేలు నాయుడుగారి కచ్చేరి, రామప్ప గుడిలోని "నాగినీ నృత్యం" చూసి, సాలార్‌జంగ్ మ్యూజియంలోని "నవాబుల హుక్కా" చూసి (ఇంకా చాలా ఉన్నాయని రాధా వసంత గారు తెలియజేస్తున్నారు).

### బాపిరాజు రచనలు విషయంగా పిహెచ్.డి., ఎమ్.ఫిల్. వ్యాసాలు

డా॥ ధనిరెడ్డి విజయలక్ష్మీదేవి (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) 1980, డా॥ వి. తిరుపతయ్య (ఉస్మానియా విశ్వవిద్యాలయం) 1982, డా॥ మన్నవ సత్యనారాయణ (నాగార్జున విశ్వవిద్యాలయం) 1984, డా॥ వి. సిమ్మన్న (ఆంధ్ర యూనివర్సిటీ) 1985, శ్రీ శెట్టి వెంకట నారాయణ (కాకతీయ విశ్వవిద్యాలయం) 1987, శ్రీమతి వి. వనజ (కాకతీయ విశ్వవిద్యాలయం) 1984, శ్రీమతి రమారాణి (కాకతీయ విశ్వవిద్యాలయం) 1986.

### బాపిరాజు సంస్మరణ సంచికలు

1. కులపతి (1954) : సంపాదకత్వం - శ్రీ రావులపర్తి భద్రిరాజు, 2. చుక్కాని (1962) : సంపాదకత్వం - శ్రీ కంచి వాసుదేవరావు, 3. నాదబిందు శశికళ (1985) సంపాదకత్వం - డా॥ దిట్టకవి శ్యామలాదేవి, 4. అడివి బాపిరాజు - శతవార్షిక కళా-సాహిత్య ప్రత్యేక సంచిక (1995), సంపాదకత్వం - భ.రా.గో.

* * *

## మీరు చదివారా!

# అడివి బాపిరాజు గారి రచనలు 7 సంపుటాల్లో...

| | | | |
|---|---|---|---|
| 1. మొదటి సంపుటం | : | నారాయణరావు (సాంఘిక నవల) | రూ. 160 |
| 2. రెండవ సంపుటం | : | హిమబిందు (చారిత్రాత్మక నవల) | రూ. 150 |
| 3. మూడవ సంపుటం | : | తుఫాను (సాంఘిక నవల) | రూ. 150 |
| 4. నాల్గవ సంపుటం | : | గోన గన్నారెడ్డి (చారిత్రాత్మక నవల) | రూ. 125 |
| 5. అయిదవ సంపుటం | : | కోనంగి (సాంఘిక నవల) | రూ. 150 |
| 6. ఆరవ సంపుటం | : | అడవి శాంతిశ్రీ, అంశుమతి (చారిత్రాత్మక నవలలు) | |
| 7. ఏడవ సంపుటం | : | నరుడు, జాజిమల్లి (సాంఘిక నవలలు) | రూ. 100 |

మనవి : అడివి బాపిరాజు గారి – **కథా సంపుటాలు** : తరంగిణి, తూలికా నృత్యం, భోగీర లోయ, వింధ్యాచలం, **కవితా సంపుటాలు** : అంజలి, చిగురుటాకులు, జ్యోతి, బాపు, ఆంధ్ర, దీపమాల, శిల్పబాల, సుషమా చంద్రికలు, గడ్డిపూల పళ్ళెం, గోధూళి, తొలకరి, శశికళ, జంగం కథలు, జానపద గేయాలు – ఇతర గేయాలు మాకు లభించలేదు. కావున వారి మిత్రులు, అభిమానుల వద్ద వుంటే పంపి సహకరించప్రార్థన.

– ప్రకాశకులు

Blank Page

Blank Page

# సాహితీ హిమాలయోత్తుంగ శృంగం

హిమాచల శిఖరాలవలె, గంగా యమునా నదులవలె శాశ్వతత్వం పొందిన ఉత్తమ సాహిత్య స్రష్టల్లో అడివి బాపిరాజు గారు అగ్రశ్రేణిలోని వారు.

బాపిరాజుగారిది విశిష్టమైన వ్యక్తిత్వం. త్రివేణి సంగమంవలె, సంగీత, సాహిత్య, చిత్రలేఖనాలు బాపిరాజులో కలగలిసిపోయాయి.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు బాపిరాజుగారిని గురించి చెప్పిన పంక్తులు కొన్ని చదివితే చాలు బాపిరాజుగారి వ్యక్తిత్వం అర్థమవుతుంది.

"అతడు గీసిన గీత బొమ్మై
అతడు పలికిన పలుకు పాటై
అతని హృదయములోని మెత్తన
అర్థవత్కృతియై

అతడు చూపిన చూపు మెఱుపై
అతడు తలచిన తలపు వెలుగై
అతని జీవికలోని తియ్యన
అమృత రసధునియై"

ఈ పంక్తులు బాపిరాజుగారి హృదయ స్వరూపాన్ని మన కన్నుల ముందు నిలబెడతాయి.

"హృదయములోని మెత్తన" "జీవికలోని తియ్యన"

ఈ రెండు మహాగుణాలు బాపిరాజుగారిని మహా మానవునిగా తీర్చిదిద్దాయి.

ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఏ నవలైనా తీసుకుని చదివితే ఆయనకు ఎన్నెన్ని విషయాలు తెలుసో అర్థమవుతుంది. తలస్పర్శిగా తెలిసిన వ్యక్తి ఆయన.

"హిమాలయోత్తుంగ శృంగం
నీ బ్రతుకు
ఉమాపతి నాట్యరంగం"

అని గాంధీజీని గురించి గానం చేస్తుంటే తన్మయులమై వినేవాళ్ళం. శరత్ పూర్ణిమా చంద్రికా ధవళమైన బాపిరాజుగారి హృదయం నభూతో నభవిష్యతి.

దాశరథి కృష్ణమాచార్యులు

---

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435,
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.

NARUDU ☆ JAJIMALLI (Novel's) - by Adivi Bapiraju